ఎమెస్కో

# భగవద్గీత మనకేం చెబుతోంది?

డా॥ కె.అరవిందరావు



# భగవద్గీత మనకేం చెబుతోంది?

డా॥ కె. అరవిందరావు

ఎమెస్కో

**BHAGAVADGITA MANAKEEM CHEBUTOONDI?**
**Dr. K.AravindaRao**

**భగవద్గీత మనకేం చెబుతోంది?**
**డా॥ కె. అరవిందరావు**

సంపాదకులు
**డా. డి.చంద్రశేఖర రెడ్డి**

ప్రథమ ముద్రణ
**మే, 2012**
ద్వితీయ ముద్రణ
**ఫిబ్రవరి, 2013**

మూల్యం: రూ. **90/-**

కవర్ డిజైన్
**జి.పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్
**సాయిలిఖిత ప్రింటర్స్**
హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500 029.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028.
e-mail : emescobooks@yahoo.com
www.emescobooks.com

పంపిణీదారులు
**సాహితి ప్రచురణలు**
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ - 2.
ఫోన్ : 0866-2436643
0866-6460633
e-mail : sahithi.vja@gmail.com

# అంకితం

నాకు విద్యాబుద్ధుల్ని
నేర్పడమే లక్ష్యంగా శ్రమించిన
మా తండ్రి
**శ్రీ లక్ష్మీనారాయణరావుగారి**
స్మృతికి అంకితం

# ముందుమాట

భగవద్గీతపై వందలాది పుస్తకాలుండగా మరొకటెందుకు అని ప్రశ్న.

భగవద్గీతపై మూడు రకాల పుస్తకాలు చూస్తాం - 1) సంస్కృత వ్యాఖ్య, ఇంగ్లీషు లేదా తెలుగు అనువాదాలతో విస్తారంగా ఉండేది, పండితులకు మాత్రమే ఉపయోగకరంగా ఉండేది. 2) గీతాసారంగా కొందరు ప్రముఖ రచయితలు, స్వామీజీలు వ్రాసినవి. వీటిలో శాస్త్ర విషయాన్ని దాదాపు వదలి స్థూలంగా దైనందిన జీవితానికి సంబంధించిన ధార్మిక విషయాలు, నైతిక విలువలు మొదలైనవి ఉంటాయి. 3) గీతలో ఆధునిక మేనేజ్‌మెంట్, సైకాలజీ మొదలైనవాటిని గూర్చి చెప్పేవి. వీటిలో శాస్త్రవిషయాల ప్రస్తావన అసలు ఉండదు. సంస్కృతంలో అవగాహన అంతో ఇంతో ఉండి ఆధునిక పాఠకులను ఆకర్షించడానికి వ్రాసిన గ్రంథాలు.

ప్రస్తుత గ్రంథం సంస్కృతంలోని వ్యాఖ్యల ఆధారంగా సిద్ధాంత విషయాలను తెలుసుకొనగోరే పాఠకుడికి ఉపయోగకరంగా ఉండేట్లు వ్రాయబడింది. అందుకే ఈ పుస్తకాన్ని **'భగవద్గీత - మార్గదర్శి'** అంటూ ఆంగ్లభాషలో guide అనబడే ప్రక్రియలో వ్రాయాలని నా ఉద్దేశం. భగవద్గీతను చదువుదామనే ఉద్దేశంతో చాలామంది జిజ్ఞాసువులు ఒక లావుపాటి గ్రంథాన్ని తీసుకొని కష్టపడి కొంత చదివి, పారిభాషిక పదాల జోరుకు భయపడి, మళ్లీ చదువుదాం అంటూ భక్తిగా ప్రక్కన ఉంచుతారు. చాలాయేండ్లు నేనూ అదే చేశాను. మిగతా ఎన్నెన్నో ఆధునిక గ్రంథాలు చదవగలిగిన వాళ్లందరూ భగవద్గీతను చదవడంలో క్లేశమనుభవిస్తారు. ఆ క్లేశాన్ని తొలగించడానికే ఈ చిన్న ప్రయత్నం.

భగవద్గీత అనాదిగా పారాయణ గ్రంథం. పరం = శ్రేష్ఠమైన, అయనం = మార్గం, అనగా శ్రేష్ఠమైన మార్గం ఇదే అనే భావనే పారాయణం. జీవితానికి సంబంధించిన గ్రంథం కాబట్టి మన పూర్వీకులు దీన్ని ప్రతిరోజూ కొంత చదివేవారు. ఆ రోజుల్లో అందరికీ సంస్కృతం వచ్చేది కాబట్టి రోజూ చదవగా విషయం కొంత ఒంటబట్టేది. సంస్కృతభాష రానందున మనం మాతృభాషలో చదువుకున్నా తప్పులేదు.

ఏ శాస్త్రంలోనైనా పారిభాషికపదాలు (technical terms) ఉన్నట్లే వేదాంతశాస్త్రంలో కూడా కొంత పరిభాష ఉంది. ఈ పుస్తకంలో సాధ్యమైనంతవరకూ అనేక పారిభాషిక పదాల వ్యుత్పత్తి ఇస్తూ వివరించాను.

దాదాపు 15 సంవత్సరాలక్రితం మహామహోపాధ్యాయ పద్మశ్రీ శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడిగారివద్ద భగవద్గీతాభాష్యం చదివే భాగ్యం నాకు కలిగింది. నేటికీ వారివద్ద శుశ్రూష చేస్తూండడం నా అదృష్టం. వేదాంతశాస్త్రంలో తప్పటడుగులు వేస్తున్న నన్ను అడుగడుగునా సరిదిద్దుతూ, సంస్కరిస్తూ ఉండడం వారి శిష్య వాత్సల్యానికి నిదర్శనం. తర్వాత శ్రీ తత్త్వవిదానంద స్వామివారి శుశ్రూషవల్ల, ప్రసంగాలవల్లనూ, కీ.శే. ముదిగొండ వేంకటరామశాస్త్రిగారి ప్రసంగాలవల్లనూ శాస్త్రంలోని కొన్ని విషయాలు అర్థం చేసుకోగలిగాను. ఆ తర్వాత కొన్నిమార్లు మళ్లీ ఆ విషయాలని మననం చేసుకోవడం మిగతా కొన్ని వ్యాఖ్యలు చదవడం జరిగింది. ప్రస్తుత గ్రంథంలో ప్రాచీన వ్యాఖ్యల్లో ఉన్న విషయాన్ని యథాతథంగా పాఠకునికి అందించడం ముఖ్యోద్దేశం. ఆధునికులు భగవద్గీతలో సైకాలజీ, మేనేజ్‌మెంట్ మొదలైనవి ఉన్నాయని కూడా ప్రముఖంగా విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత గ్రంథం అలాంటివి చేపట్టలేదు.

వేదాంతం అతి సున్నితవిషయం. ఏ చిన్న పదం తేడా వచ్చినా అర్థం తేడా వస్తుంది. ఈ పుస్తకంలో ఏవైనా మంచి గుణాలు ఉంటే అవి నా గురువులవే. దోషాలు నా అవగాహన లోపానికి సంబంధించినవే అని మనవి.

**దుగ్ధం గీతామృతం మహత్** అని అంటారు. గీతామాధుర్యాన్ని కొంతవరకునైనా ప్రస్తుత గ్రంథం అందించగలిగితే నేను నా ప్రయత్నంలో కృతకృత్యుణ్ణైనట్లు భావిస్తాను. ప్రాచీన ఆచార్యులే దీనిని దుర్విజ్ఞేయార్థం అంటే చాలా కష్టపడి అర్థం చేసుకోవాల్సిన గ్రంథమని వ్రాశారు. అట్టి గ్రంథాన్ని నేను పాఠకునికి అందిస్తాననడం దుస్సాహసమే. అయినా విజ్ఞులవల్ల విన్నంత, అర్థమైనంతవరకూ సాధకుడిగా ఈ పుస్తకాన్ని మీ ముందుంచుతున్నాను. గీతామృతాన్ని మరింత ఆస్వాదించదలచిన పాఠకులు తెలుగులో లభ్యంగా ఉన్న వ్యాఖ్యల్ని చదివి ఆత్మతత్త్వాన్ని, అంటే మనిషియొక్క తత్త్వాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోగలరు. దానిద్వారా వ్యక్తిగత స్థాయిలో శాంతి, సమాజంలో శాంతి సాధించబడతాయి.

ఈ పుస్తకాన్ని పాఠకులకు అందజేస్తున్న మిత్రులు 'ఎమెస్కో' అధినేత **శ్రీ విజయకుమార్**గారికి, వారి బృందానికి, ఈ పుస్తకానికి అందంగా అక్షరాలకూర్పు చేసిన **ఆరవేటి వెంకటసుబ్బయ్య**గారికి, నన్ను పుస్తకం వ్రాయాల్సిందిగా ప్రోత్సహించిన నా సతీమణి **శ్రీమతి రమాదేవి**కి, మా పుప్పాలగూడ మిత్రులు **ధనుంజయరావుగారు, చంద్రమౌళి**గారికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

**- కె అరవిందరావు**

# ప్రస్తావన

ప్రాచీన భారతీయ గ్రంథాల్లో భగవద్గీత మహోత్కృష్టమైనది. ఈ గ్రంథానికి ఆదిశంకరులనుంచి నేటివరకు అనేకులు వ్యాఖ్యానాలు రచించారు. భారతీయ తాత్త్విక ధారకు మూలాధార గ్రంథంగా దీనిని అనేకులు భావిస్తారు.

ఈ గ్రంథం ఇద్దరు స్నేహితుల మధ్య సంవాదం. ఒక స్నేహితుడు మరొక స్నేహితునికొరకు పలికిన హితవాక్యం. ఆ హితవాక్యం పలికిన స్నేహితుడే ఈ గ్రంథాన్ని భారతీయ జ్ఞానసంపదైన వేదాలు, ఉపనిషత్తుల సారంగా పేర్కొన్నాడు.

భగవద్గీత కుల వ్యవస్థను, హింసను ప్రేరేపించిందని, అణచివేతకు భగవద్గీతను సవర్ణ హిందువులు ఓ ఆయుధంగా వాడుకుంటున్నారని ఈ మధ్య విస్తృతమైన ప్రచారం జరుగుతోంది. దానికి సమాధానం చెప్పవలసిన బాధ్యత విజ్ఞులైన పండితులపై వుంది.

అసలు భగవద్గీతే కాదు, ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని మూలనిష్ఠంగా, యథాతథంగా వివిధ ప్రాంతీయ భాషల్లోకి తీసుకువస్తేనే ఇలాంటి అపవాదులు పోతాయి. సాహిత్యం సమకాలిక సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఉద్భవిస్తుంది.

భారతీయులుకాని, భారతీయతపట్ల గౌరవం లేని పాశ్చాత్య పండితులు భారతీయ సాహిత్యాన్ని వక్రీకరిస్తూ ఆంగ్ల భాషలో వ్యాఖ్యానాలు రాయడం, మూలనిష్ఠమైన చక్కని ఆధార గ్రంథాలు ఆంగ్లంలోనూ, ప్రాంతీయ భాషల్లోను లేకపోవడంవల్ల భారతీయ సమాజంలో అలజడి బయలుదేరడం నేనొక ప్రచురణకర్తగా గమనిస్తున్నాను.

అత్యంత విద్యావంతులైన మేధావులు కూడా మన సాహిత్యాన్ని మూలం చదవకపోవడం వల్ల అపార్థం చేసుకోవడం నేనెన్నో సందర్భాల్లో గమనించాను. ఇదే పరిస్థితి కులవ్యవస్థపై, మత స్వరూప స్వభావాలపై అవగాహనలోను నేను అనేక చోట్ల గమనించాను. ఈ విషయాన్నే మాన్యమిత్రులు శ్రీ అరవిందరావుతో నేను అనేకసార్లు ప్రస్తావించడం, స్వతహాగా ప్రగతిశీల స్వభావంగల ఈ సంస్కృత పండితునికి కూడా అదే అభిప్రాయం ఉండటం ఈ గ్రంథం మీకు చేరడానికి దోహదం చేసింది. భారతీయ సాహిత్యానికి సంబంధించి ఇలాంటి పరిచయగ్రంథాలు అనేకం రావలసిన అవసరం ఉంది. ప్రాచీన భారతీయ సాహిత్య వాచకాలను యథాతథంగా అర్థం చేసుకోవడానికి భారతీయ సమాజం ప్రయత్నించాలి. అందుకు పండిత మేధావర్గం సహకరించాలి.

**ఎమెస్కో విజయకుమార్**

॥ ఓం శ్రీ గణేశాయ నమః ॥

॥ శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః ॥

# పుస్తక పరిచయం

భగవద్గీత 700 శ్లోకాల గ్రంథం. సంస్కృతంలో వేదవ్యాసుడు వ్రాసిన మహాభారతములోని భీష్మపర్వంలో భారతయుద్ధము ప్రారంభం కావడానికి ముందు కృష్ణుడు, అర్జునుడి మధ్య సంభాషణరూపంలో కనిపిస్తుంది. లక్ష శ్లోకాలున్న మహాభారతంలోని అతి చిన్న భాగం భగవద్గీత. గీత మూలగ్రంథం కేవలం 50 పేజీలలో ఇమిడిపోతుంది.

భగవద్గీతలోని వర్ణనలు అన్నీ తీసివేస్తే సుమారు 600 శ్లోకాలు కృష్ణుడికీ, అర్జునుడికీ జరిగిన సంభాషణల రూపంలో మిగులుతాయి. ఈ సంభాషణపై ఇంత పెద్ద గ్రంథాలెందుకు? దీన్ని అర్థం చేసుకోవడానికి ఇద్దరు శాస్త్రవేత్తల మధ్య సంభాషణను ఊహించుకుందాం. ఆ సంభాషణలో ఎన్నో శాస్త్రీయ విషయాలు, పారిభాషిక పదాలు, సామాన్య శ్రోతకు అర్థంకానివి ఉంటాయి. గీతలోని ప్రస్తుత సంభాషణ ఐదువేల ఏండ్ల క్రితం ఆనాటి సంస్కృతిలో ఇద్దరు విద్యాధికులమధ్య జరిగిన చర్చ. ధర్మసంబంధమైన, వేదాంతసంబంధమైన గంభీర విషయాలపై చర్చ. అర్జునుడు, కృష్ణుడు ఇద్దరూ రాజ్యం చేసినవారు, ఇద్దరూ వేదాధ్యయనం, శాస్త్రాధ్యయనం చేసినవారు. ఆనాడు రాజుల విద్యాప్రణాళికలో **“ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతిశ్చ శాశ్వతీ”** అనే నాలుగు అంశాలు ఉండేవి. అంటే తర్కశాస్త్రం, వేదాధ్యయనం, వాణిజ్యశాస్త్రం, దండనీతి - ఇవన్నీ రాజ్యపాలనకు అవసరమైన అంశాలు. ఇందులో త్రయీ అంటే మూడు వేదాలు (ఆ రోజుల్లో మూడింటినే పరిగణించేవారు). ఇవి ధర్మాన్ని అనగా వ్యావహారిక ధర్మం, పారమార్థిక ధర్మం అనే రెంటినీ తెలిపేవి. కృష్ణుడు, అర్జునుడు ఇద్దరూ ధర్మశాస్త్రనిపుణులే. అకస్మాత్తుగా అర్జునుడిలో తన ధర్మాన్ని గురించిన సందేహం మొలకెత్తింది. దానికి సమాధానం ఇవ్వడం కృష్ణుడు చేసినపని. తర్వాతి కాలాలనాటి పాఠకులకు భారతకాలంనాటి ధర్మశాస్త్రంలోని సూక్ష్మమైన అంశాలు తెలియవు కాబట్టి పండితులు, వ్యాఖ్యలు వ్రాయడం జరిగింది.

ఈనాడు మనకున్న వ్యాఖ్యల్లో శ్రీ శంకరాచార్యుల వ్యాఖ్య చాల ప్రాచీనమైనది. కానీ తమకు పూర్వమే అనేక వ్యాఖ్యలు ఉన్నట్లు తమ ఉపోద్ఘాతంలో వ్రాశారు. అవి కాలక్రమేణ లుప్తమయ్యాయి. శంకరుల తర్వాత శ్రీరామానుజులు, శ్రీమధ్వాచార్యులు ఇంకా ఆయా సంప్రదాయ అనుయాయులనేకులు దీనిపై వ్యాఖ్యలు వ్రాశారు.

అర్జునుడి ధర్మసందేహానికీ, శోకానికీ కారణం తాను తన బంధువులతో యుద్ధం చేసి వారిని చంపవలసివస్తుందన్న బాధ. యుద్ధం చేయడంకన్నా సంన్యసించి భిక్షాటన చేయడం ఉత్తమమని అతడు భావిస్తాడు. అంతకుపూర్వం పాండవులే తమ మిత్రరాజులతో మంతనాలు జరిపి యుద్ధానికై సైన్యాన్ని సమకూర్చుకుంటారు. అర్జునుడు స్వయంగా కృష్ణుడి దగ్గరకు వెళ్ళడం, ఆయన్ను యుద్ధంలో తన సారథిగా ఉండాలని కోరడం చూస్తాం. అందువల్లే కృష్ణుడు అతనితోపాటు రావడం జరిగింది. అలాంటి సందర్భంలో అర్జునుడే శోకంలో పడడం శ్రీకృష్ణుడికి ఆశ్చర్యం కలిగించింది. అందువల్ల అతనికి తన ధర్మాన్ని గుర్తు చేయాల్సివచ్చింది. కేవలం క్షత్రియధర్మాన్ని గుర్తు చేస్తే అర్జునుడు వినే పరిస్థితిలో లేనందున పారమార్థికస్థాయిలో ఆత్మస్వరూపం, భగవత్స్వరూపం అన్నీ ప్రసంగవశాత్తు చెప్పవలసి వచ్చింది. ఒకవిధంగా చెప్పాలంటే కృష్ణుడి బోధన ఒక కౌన్సెలింగ్ లాంటిది. తన కర్తవ్యాన్ని విస్మరించిన అర్జునుడికి ఒక విశాలమైన దృష్టికోణం నుంచి అతని పరిస్థితిని విశ్లేషించి చూపించాడు శ్రీకృష్ణుడు.

భగవద్గీతలో కృష్ణుడు హింసను ప్రేరేపించాడనీ, అర్జునుడిని యుద్ధానికి పురిగొల్పాడనీ అనడం సరైనవాదన కాదు. గీతాభాష్యంలో శంకరులు స్పష్టంగా **"న చ అత్ర యుద్ధ కర్తవ్యతా విధీయతే"** అని స్పష్టంగా వ్రాశారు. అంటే ఇక్కడ యుద్ధం చేయమని పురిగొల్పడంలేదు, స్వధర్మాన్ని మరచి పరధర్మమైన (భిక్షాటనమనేది బ్రాహ్మణుడి ధర్మం) భిక్షాటనాన్ని తీసుకుంటాననడం తప్పు అని కృష్ణుడి భావం అని శంకరులు వివరించారు. మంచికీ, చెడుకూ జరుగుతున్న సంఘర్షణ భారతయుద్ధం. అందులో ధర్మాన్ని నిలబెట్టడం క్షత్రియుడి కర్తవ్యం. అందువల్లనే ఈ ఉపదేశం. ఈ సందర్భాన్ని మనం సరిగా అవగాహన చేసుకోవాలి.

భగవద్గీతపై శంకరుల తర్వాత కూడా అనేకులు భాష్యాలు వ్రాశారు. వారి భాష్యాలను వివరించడానికి మరికొన్ని వ్యాఖ్యలు వచ్చాయి. ఇలాంటివన్నీ కలిపి వేయిపుటల గ్రంథంగా మనకు కనిపించినప్పుడు ఇంతపెద్ద సంభాషణ యుద్ధానికి సైన్యాలు మోహరించినపుడు జరగడం హాస్యాస్పదం అని మనం అనుకుంటాం. కానీ సంభాషణ కాలం సుమారు 2 గంటలు మాత్రమే. పైన చెప్పుకున్నట్లుగా ఆనాటి ధర్మశాస్త్రాల వివరణకై ఈ వ్యాఖ్యలు అవసరమని పైన గమనించాం.

భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయం చివర **"భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే"** అనే పదాలు ఉన్నాయి. వీటి అర్థం తెలుసుకోవాలి.

గీత అంటే పాడబడినది అని అర్థం. భగవంతునిచే పాడబడినది. కృష్ణుడు పాటలాగా పాడాడని అర్థంకాదు. శ్రేష్ఠమైన, ప్రశంసనీయమైన ఉపదేశం అని అర్థం. గీత అనే పేరిట ఇతిహాసపురాణాల్లో అనేక గ్రంథాలున్నాయి. ఉదాహరణకు ఉద్ధవగీత, దత్తాత్రేయగీత, అష్టావక్రగీత, పరాశరగీత, హంసగీత ఇలాంటివెన్నో.... వీటన్నింటిలోనూ పరిమాణంలోనూ, విషయవిశ్లేషణలోనూ పెద్దదైన గ్రంథం 'భగవద్గీత'. దీనికి పండితులు ఇలాగ అర్థం చెప్పారు.

**భగవతా గీతా ............** భగవంతునిచే చెప్పబడినది.

**భగవతః గీతా ............** భగవంతుని స్వరూపాన్ని గూర్చి చెప్పబడినది.

**భగవతీ గీతా ............** పూజనీయమైన సందేశం.

గీతను బోధించేదెవరు? వినేదెవరు? బోధించేవాడు రాజ్యపాలన చేసినవాడు, గృహస్థుడు. వినేవాడు కూడా అట్టివాడే. చెప్పిన స్థలం యుద్ధభూమి. యుద్ధం అంటే శత్రుసైన్యాలు చంపుకోవడాలు అని మాత్రమే అర్థంకాదు. ఒక మానసిక సంఘర్షణ సమయంలో సరైన అవగాహన కల్పించడంకోసం చెప్పిన ఉపదేశం. కాబట్టి ఇది అందరూ చదవదగినది, సంన్యాసులకై నిర్దేశించబడిన గ్రంథంకాదు. మానవమాత్రుడైన ప్రతి ఒక్కరికీ వర్తించే గ్రంథం.

గీతలో శ్రీకృష్ణుడు ఎవరు? కేవలం యాదవవంశానికి చెందిన రాజప్రముఖుడు, అర్జునుడి బావ మాత్రమేనా? శ్రీకృష్ణుని బోధలో వందసార్లకు పైగా 'నేను' (అహం) అనే మాట వస్తుంది. ఈ 'నేను' అనేది పరబ్రహ్మను సూచించే పదం. అంతేకానీ ద్వాపరయుగంనాటి కృష్ణుణ్ణి సూచించేపదం కాదు. కొన్ని సందర్భాల్లో సృష్టికర్తయైన భగవంతుణ్ణి సూచిస్తుంది. దీన్నే ముమ్మందు వివరించడం జరుగుతుంది.

ఉపనిషత్సు ........ అంటే ఉపనిషత్తులయందు. అంటే ప్రతి శ్లోకమూ ఒక ఉపనిషత్తులాంటిది. ఉప+ని+సత్ అనే శబ్దాల కలయికతో 'ఉపనిషత్' అనే పదం ఏర్పడింది. గురువువద్దకు శ్రద్ధతో చేరిన శిష్యుడికి బ్రహ్మతత్త్వాన్ని బోధించడం అని అర్థం. ఈశావాస్యోపనిషత్, కేనోపనిషత్ మొదలైన 108 ఉపనిషత్తుల్లో ఇదే తత్త్వం బోధింపబడింది. ఉపనిషత్తుల్లో చెప్పిన విషయాన్నే భగవద్గీతలోని ప్రతి శ్లోకంలోనూ చెప్పారని అర్థం. గీతపై వచ్చిన వ్యాఖ్యానాలు చూస్తే ఇది స్పష్టంగా తెలుస్తుంది. ప్రతి శ్లోకానికీ మూలభూతమైన ఉపనిషద్వాక్యం కన్పిస్తుంది. అందుకే ఒక ప్రసిద్ధశ్లోకముంది.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**

అంటే ఉపనిషత్తులన్నింటినీ ఆవులతో పోలిస్తే, శ్రీకృష్ణుణ్ణి గోపాలకుడిగా భావిస్తే, అర్జునుడు లేగదూడ స్థానంలోనివాడు. ఉపనిషత్తుల సారమే గీతామృతమనే పాలు. దూడకు చేపు వదిలిన తర్వాత మనం పాలు పితుక్కున్నట్లే మనలాంటి సుధీః అంటే జిజ్ఞాసువులందరూ భోక్తలు, ఆ అమృతం గ్రోలటానికి అర్హులు. ఇంపుగా ఉంది కాబట్టే అమృతం అని కాదు. అజ్ఞానం వై మృత్యుః అంటే అజ్ఞానం మృత్యువన్నారు. దానినుండి కాపాడడానికి జ్ఞానం కావాలి. ఆ జ్ఞానమే అమృతం. ఇది వేదాంతశాస్త్రంలో పరిభాష. పారిభాషికపదం.

**బ్రహ్మవిద్యాయాం ......** బ్రహ్మ అంటే మనం త్రిమూర్తులని చెప్పుకునే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలోని బ్రహ్మకాదు. త్రిమూర్తులలో బ్రహ్మ శబ్దం పుంలింగం. అంటే చతుర్ముఖ బ్రహ్మ అనే వ్యక్తి, సరస్వతీదేవి భర్త. సంస్కృతంలో దీనిని 'బ్రహ్మా' అని దీర్ఘంలో వ్రాస్తారు. బ్రహ్మవిద్య అనే పదంలోని బ్రహ్మలో 'బ్రహ్మ' పదం నపుంసకలింగ శబ్దం. అంటే 'బ్రహ్మ' అనేది పురుషుడు, స్త్రీ, నపుంసకుడు కాదు. ఇదొక శుద్ధచైతన్యతత్త్వం. దీనినే పరంబ్రహ్మ, పరబ్రహ్మ అంటారు. త్రిమూర్తుల్లో చెప్పబడే బ్రహ్మ ఈ పరబ్రహ్మలో వ్యక్తమయ్యే ఒక చైతన్యస్వరూపం మాత్రమే. ఈ పరబ్రహ్మమే ప్రతి వ్యక్తిలో చైతన్యరూపంగా విశ్వమంతా చైతన్యరూపంగా భాసించేది. ఇలాంటి శుద్ధచైతన్య తత్త్వాన్ని తెలిపే గ్రంథం కావున బ్రహ్మవిద్యాయాం అన్నారు.

**యోగశాస్త్రే......** యోగం అంటే కలయిక. యుజ్ అనే సంస్కృత ధాతువు నుండి వచ్చిన శబ్దం. లేనిదాన్ని పొందడం 'యోగం'. ఉదాహరణకు ఫలానా వ్యక్తికి రాజయోగం, లక్ష్మీయోగం వచ్చిందని వ్యవహరిస్తుంటాం. భగవద్గీతలో కర్మయోగం, సాంఖ్యయోగం, భక్తియోగం లాంటి పేర్లతో అధ్యాయాలు కనిపిస్తాయి. సాంఖ్యం అంటే జ్ఞానం. జ్ఞానం పొందడమే జ్ఞానయోగం. కర్మను సరైన దృష్టితో ఆచరించడం కర్మయోగం. ఇలాగే మిగతా అధ్యాయాలు కూడా. జీవుడు, బ్రహ్మలు ఒకటే అని చెప్పడంకూడా గీత ఉద్దేశం కావున ఆ అర్థంలో కూడా ఇది యోగశాస్త్రం.

**శ్రీకృష్ణార్జున సంవాదే.....** సంవాదమంటే విషయంయొక్క స్వరూపాన్ని తెలుసుకోవడానికై చేసే చర్చ. ఇద్దరు సమానస్థాయి పండితులమధ్య జరిగే చర్చను వాదం అంటారు. గురుశిష్యులమధ్య జరిగే సంభాషణను సంవాదం అంటారు. ఇది

ప్రశ్నలు – జవాబుల రూపంలో వుంటుంది. సీతారామాంజనేయ సంవాదం మొదలైనవి ఉదాహరణలు. గీతలో శ్రీకృష్ణుడు గురువు, అర్జునుడు శిష్యుడు. అర్జునుడిని నిమిత్తంగా చేసుకొని ప్రపంచానికి తత్త్వాన్ని బోధించాడు గనుక కృష్ణుణ్ణి ఉద్దేశించి **'కృష్ణం వందే జగద్గురుం'** అంటాం.

**సకలవేదార్థ సారసంగ్రహభూతం .....** గీతాశాస్త్రం అని మరొక విశేషణం వాడతారు శ్రీశంకరులు. వేదంలో ముఖ్యంగా కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ అని మూడు విభాగాలు/అంశాలు ఉంటాయి. కర్మకాండలో యజ్ఞయాగాదులు చెప్పబడతాయి. మనుషులందరూ కోరుకొనే విషయాలు నాలుగు. వీటికే పురుషార్థాలని పేరు. ఇవి ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే పేరుగలవి. ధర్మం అంటే సంఘంలోని వ్యక్తిగా, శిష్టవ్యవహారం, తద్వారా సుఖప్రాప్తి కలుగుతుంది. అర్థం అంటే ఉన్నదానికంటే ఎక్కువగా అభ్యున్నతి. కామం అంటే కోరిక. అన్నివిధాల కోరికలు ఇందులో చెప్పబడతాయి. మొదటి మూడింటిని సాధించడానికి చేసేవి యజ్ఞాలు, యాగాలూ మొదలైనవి. ఉపాసనాకాండలో కూడా అర్థకామాలను గురించి ఏదైనా దేవతను ఉద్దేశించి చేసే ఉపాసనలు చెప్పబడతాయి. జ్ఞానకాండ కేవలం తత్త్వబోధ చేసే గ్రంథభాగం. కర్మలతో సంబంధంలేని విచారణ. కోరికలున్న దశలో చేసేవి యజ్ఞ, యాగాదులు. కేవలం తత్త్వం గూర్చి చేసే విచారణ (ఆలోచన) జ్ఞానకాండ. అన్ని వేదాలకూ చివరలో ఈ విచారణ కనిపిస్తుంది. ఈ భాగాలకే ఉపనిషత్తులని పేరు. వేదాల అంతంలో (చివరలో) ఉండడంవల్ల వేదాంతం అని కూడా అంటాము. ఈ ఉపనిషత్తులసారమే భగవద్గీత.

**వేదం - కర్మలు**

ఏ ధర్మశాస్త్రగ్రంథమైనా వ్యక్తినీ, సమాజాన్నీ దృష్టిలో ఉంచుకొని నిర్మింపబడుతుంది. మొదట కావలసింది సమాజభద్రత. సమాజంలో సన్మార్గప్రవృత్తి. దీనినే లోకసంగ్రహం అని రెండుసార్లు కృష్ణుడు గీతలో చెప్పారు. సమాజంలోని వ్యక్తిని ఒక క్రమశిక్షణలో నడపడానికి కొన్ని నియమాలు అవసరం. ఇవే వేదంలో చెప్పిన కర్మలు. వీటిలో భాగంగానే దానము, తపస్సు, అహింస మొదలైనవి ఉంటాయి. ఇవి చిత్తశుద్ధికి తోడ్పడతాయి. చిత్తశుద్ధి కలిగిన తర్వాతనే తత్త్వాన్ని గూర్చి ఆలోచించడం. మలినంగా ఉండే అద్దంపై వస్తువు ప్రతిబింబం ఎలా ఏర్పడదో అలాగే అనేకవిషయాల చింతనలో మలినంగా ఉన్న మనస్సును తత్త్వంపై నిలపలేం. అందుకే చిత్తశుద్ధి గురించి కర్మలు అందరికీ చెప్పబడ్డాయి. కర్మమార్గం అనుసరిస్తూ దానివల్ల పొందిన చిత్తనైర్మల్యంవల్ల

కర్మలో సారం లేదనీ, దీనికంటే ఉన్నతమైన సత్యం ఉన్నదనీ గ్రహించే స్థితిలో జ్ఞానమార్గం చెప్పబడింది. లోకసంగ్రహం కోసం చెప్పబడిన ధర్మానికి ప్రవృత్తిధర్మం అని పేరు. తత్త్వజిజ్ఞాస చేసేవాడి విషయంలో చెప్పబడిన ధర్మానికి నివృత్తిధర్మం అని పేరు. ఈ రెండు ధర్మాలని వివరించే గ్రంథం భగవద్గీత. మనిషిని వ్యక్తిగానూ, సంఘజీవిగానూ రెండు దృష్టికోణాల్లో సంస్కరించే గ్రంథం.

**వేదాంతం - మతం**

మతగ్రంథాలు విశ్వాసం (నమ్మకం)పై ఆధారపడేవి. శివునిలోకం కైలాసమనీ, ఆయన సామ్రాజ్యం ఇలా వుంటుందనీ శైవపురాణాల్లో చెబుతారు. అలాగే విష్ణులోకం వైకుంఠమనీ, ఆయన సన్నిధి ఫలానావిధంగా ఉంటుందనీ విష్ణుపురాణాల్లో చెబుతారు. అట్లానే బ్రహ్మకు సత్యలోకం, కృష్ణుడి గోలోకం మొదలైనవి విశ్వాసానికి సంబంధించిన విషయాలు. అన్నిమతాల్లోనూ ఇలాంటి నమ్మకాలే ఉంటాయి. వేదాంతశాస్త్రంలో ఇలాంటి నమ్మకాలపై చర్చ తక్కువగా ఉంటుంది. దీనిలో ముఖ్యంగా బ్రహ్మతత్త్వం, శుద్ధచైతన్యం అని మనం పైన చెప్పుకున్న తత్త్వం విచారింపబడుతుంది. అందుకే దీనిని 'దర్శనం' అన్నారు. అంటే సరైన దృష్టి, సరైన అవగాహన. ఇది అన్ని విశ్వాసాలకూ అతీతమైనది. ప్రతీ సాధకుడు తన మనస్సుతో విచారించి తెలుసుకొనే సత్యం. మతం ఒక set of beliefs. దర్శనం ఆలోచించి అనుభవంలోకి తెచ్చుకొనే విషయం.

అన్ని దేశాల్లో, అన్ని కాలాల్లో సామాన్యంగా ఉండేది మనిషి, అతనిలోని మనస్సుయొక్క నిర్మాణం, అందులోని రాగద్వేషాలు, సత్త్వరజస్తమోగుణాలు మొదలైనవి. కాబట్టి ఎవరు అంగీకరించినా, అంగీకరించకున్నా అందరికీ అన్వయించే విషయాలు ఇందులో ఉంటాయి. అందుకే మనల్ని పాలించడానికి వచ్చిన పాశ్చాత్యులు చాలామంది దీనిని అద్భుతమైన గ్రంథంగా ఆదరించారు. ఈనాడు ప్రపంచ మేధావులు అందరు గీతాప్రాశస్త్యాన్ని గుర్తిస్తున్నారు. మనదేశంలో శైవులు, వైష్ణవులు, శాక్తేయులు (శక్తిని ఆరాధించేవారు) ఇలా అనేకమతాలు ఉన్నప్పటికీ అందరికీ ప్రమాణ గ్రంథమైంది. వేదప్రామాణ్యాన్ని అంగీకరించిన అందరూ (ఆస్తికదర్శనాలు అనుసరించినవారు) వేద సారమైన గీతను స్వీకరించారు. అందువల్లనే అన్ని మతాలవారి వ్యాఖ్యలు దీనిపై కనిపిస్తాయి.

గీతలో సాంఖ్యయోగం, కర్మయోగం, భక్తియోగం, సంన్యాసయోగం ఇలా పెక్కు పేర్లు కనిపిస్తాయి. ఇవన్నీ ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడానికి విభిన్నమార్గాలు, స్వతంత్ర మార్గాలు అని భావిస్తే అది పెద్దపొరపాటు. మొదట్లో చెప్పిన సాంఖ్యయోగం, ఒకటే

జ్ఞానాన్ని గూర్చి చెప్పిన మార్గం. మిగతావన్నీ కర్మయోగంయొక్క వివిధరూపాలే. కర్మ అంటే మనిషి బుద్ధిపూర్వకంగా (నేను అనే భావనతో) చేసేది. కర్మయోగంలో ఈశ్వరార్పణబుద్ధితో చేయడం అభ్యాసం చేస్తాడు. ఆత్మసంయమయోగంలో మనస్సును అదుపులో పెట్టుకోవడానికి రకరకాల అభ్యాసాలు చేస్తాడు. సంన్యాసయోగంలో కేవలం కర్మల్ని వదిలేస్తాడు. ఇవన్నీ మనసును శుభ్రపరచుకొనే కర్మలే. కావున కర్మయోగంలో భాగాలే. **జ్ఞానాదేవ తు కైవల్యం** అంటే జ్ఞానంవల్లనే మోక్షం అని ఉపనిషత్తులు పదేపదే చెబుతాయి. మోక్షం ఏదైనా కర్మ చేస్తే వచ్చేదికాదు. కర్మవల్ల వచ్చే అన్ని ఫలాలు తాత్కాలికాలు, నశించిపోయేవి. మోక్షం నశించేదికాదు.

ఈ చింతన వ్యక్తి స్వంతంగా చేయడానికి వీల్లేదు. వేదాంతవాక్యాలను (ఉపనిషత్తులు) వినాలి. వాటిని సరైన గురువువద్ద సరిగా అర్థంచేసుకొని మననం చేయాలి. అలా ఒకవైపు చేస్తూ మరోవైపు మనస్సును నిగ్రహిస్తూ ఉంటే అది జ్ఞానానికి దారితీస్తుంది.

**ప్రస్థానత్రయం**

ప్రస్థానత్రయం అనే పదాన్ని కూడా మనం ఇక్కడ తెలుసుకోవాలి. ప్రస్థానమంటే మార్గం. ప్రస్థానత్రయమంటే మూడు మార్గాలు. ఈ మూడు మార్గాలు పై చెప్పిన నిర్గుణబ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవడానికే. ఇవే 1) ఉపనిషత్తులు 2) బ్రహ్మసూత్రములు 3) భగవద్గీత. వీటిలో ఉపనిషత్తులు మూలగ్రంథాలు. అనేక ఋషులు సమస్తాన్నీ త్యజించి అరణ్యాల్లో తపస్సు చేస్తూ దర్శించిన విషయాలు. వివిధ ఋషులు వివిధప్రాంతాల్లో దర్శించిన విషయాలు కావున వారు చెప్పిన విధానంలో కొంత తేడా వున్నట్లు పైకి కన్పించినా సరిగా విచారిస్తే అభేదమే గోచరిస్తుంది. వివిధ ఉపనిషద్వాక్యాలమధ్య ఏకవాక్యత (unity of thought) సమన్వయం, చూపడానికే బ్రహ్మసూత్రాలు ఏర్పడ్డాయి. వీటిని బాదరాయణుడనే మహర్షి వ్రాశాడు. బాదరాయణుడే భారతం వ్రాసిన వ్యాసుడని, వ్యాసుడు కాదని వాదాలున్నాయి. అవి అప్రస్తుతం. ఈ రెండు గ్రంథాలు పండితులకూ, వేదవిజ్ఞానం ఉన్నవాళ్లకూ సులభంగా ఉంటాయి.

భగవద్గీత, భారతం అనే ఇతిహాసంలో చెప్పబడిందని తెలుసుకున్నాం. భారతం మొదటి అధ్యాయంలో ఒక వాక్యం ఉంది. **ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।** అంటే వేదంలో చెప్పిన ధర్మాన్ని ఇతిహాసాలు (రామాయణ, భారతాలు) పురాణాలద్వారా (విష్ణుపురాణం, శివపురాణం మొదలైనవి) విస్తరింపచేయాలి అని అర్థం. వేదంలో చెప్పిన దానిని సులభశైలిలో జనసామాన్యానికి అందించడం

వీటిపని. పై మూడు మార్గాలకు ఒకటే గమ్యం. భగవంతుని తత్త్వం తెలుసుకోవడం. ఈ ప్రస్థానత్రయం భారతీయ ధర్మానికి మూలభూతమైన గ్రంథాలు.

మనిషి పరిపూర్ణుడు. తనలో పరిపూర్ణత లేదనే భావంతో ఆ పూర్ణత్వం బయటి వస్తువులతో లభిస్తుందనే ఆశతో బాహ్యవస్తువుల కోసం వెంపర్లాడుతుంటాడు. ఆ వెంపర్లాట దుఃఖానికి దారితీస్తుంది. దీనివల్లే రాగద్వేషాలు. అంటే ఒక వస్తువుపై మక్కువ, మరొకదానిపై ద్వేషం. ఇది మనిషి స్వభావం. ఈ రాగద్వేషాల విశ్లేషణే గీత మొత్తంలో మనకు కనిపిస్తుంది. మనిషి స్వభావాన్ని పరిశీలించి మనిషి పరిపూర్ణుడు అని తెలపడం, దానిద్వారా శోకాన్ని తొలగించడం భగవద్గీత ఆశయం.

భగవద్గీత కేవలం బుద్ధితో అర్థం చేసుకొని దానితో ఆగిపోయే గ్రంథంకాదు. ఇది సాధనకు సంబంధించిన విషయం. ఇందులో చెప్పిన సాధనలు సాధకుడు స్వయంగా అభ్యాసం చేసి తనలో మార్పు తెచ్చుకోవడానికై ఉద్దేశించిన గ్రంథం. ఇది ఇతరులను మార్చడానికి కాదు, తన్నుతాను మార్చుకోవడానికి ఉద్దేశించినది. సాధకుడు బ్రహ్మభావంలో ఉండడం ముఖ్యలక్ష్యం. అది చేయలేనివాడు సమాజానికి ఉపయోగపడే విధంగా కర్మలు చేస్తూండాలి. ఇది గీత లక్ష్యం.

❖ ❖ ❖

## మొదటి అధ్యాయము

# అర్జున విషాదయోగము

అర్జునుడి విషాదాన్ని తెలుపుతుంది కావున ఈ అధ్యాయానికి **'అర్జున విషాదయోగం'** అని పేరు. ఈ అధ్యాయాలపేర్లు వ్యాసభారతంలో లేవు. తర్వాతి వ్యాఖ్యాతలు అధ్యాయంలోని విషయాన్ని పాఠకులకు సులభంగా తెలపడానికి పెట్టినపేర్లు. ఈ అధ్యాయంలో 47 శ్లోకాలు వున్నాయి.

అర్జునుడి విషాదానికి కారణం మనకు తెలిసిందే. కౌరవులు - పాండవులు అన్నదమ్ముల పుత్రులు. పాండవులకు రావలసిన రాజ్యం వారికివ్వకుండా అన్నివిధాలా అడ్డుకున్నాడు కౌరవ యువరాజు దుర్యోధనుడు. రాజ్యమిప్పించడానికై శ్రీకృష్ణుడు చేసిన రాయబారము నిరుపయోగమైంది. అందువల్ల రెండుపక్షాలవారూ వారివారి మిత్రరాజుల సహకారంతో సైన్యాన్ని ప్రోగుచేసుకున్నారు. అర్జునుడు, దుర్యోధనుడు స్వయంగా శ్రీకృష్ణుడివద్దకు వెళ్లి యుద్ధంలో అతని సహాయాన్ని కోరడంతో శ్రీకృష్ణుడు తన సైన్యమంతా ఒకవైపు, యుద్ధం చేయకుండా ఊరక సలహా ఇచ్చు తాను మరొకవైపు అని విభజించి చెప్పాడు. దుర్యోధనుడు సంతోషంగా సైన్యాన్ని కోరుకుంటే అర్జునుడు సంతోషంగా శ్రీకృష్ణుడిని కోరి తెచ్చుకున్నాడు. ఒకానొక నిర్ణీత సమయంలో యుద్ధానికి రెండు సేనలూ సర్వసన్నాహాలు చేసుకున్నాయి. యుద్ధస్థలం పేరు కురుక్షేత్రం.

పదిరోజుల భారతయుద్ధం తర్వాత భీష్ముడు అంపశయ్యపై వాలగా ఆ సమాచారాన్ని సంజయుడు ధృతరాష్ట్రుడికి తెలియజేస్తాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు అతణ్ణి పూర్తి వివరాలడుగుతాడు. ప్రారంభంనుండీ జరిగిన విషయాలన్నీ సంజయుడు చెప్పడం ప్రారంభిస్తాడు. వ్యాసమహర్షి వరంవల్ల సంజయుడికి దివ్యదృష్టి కలగడంతో సంజయుడు పూసగుచ్చినట్లుగా యుద్ధభూమిలోని విషయాలను తన జ్ఞాననేత్రంతో దర్శించి తెలియజేయడం గీతాసన్నివేశం.

### మన బుద్ధియే కురుక్షేత్రం

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే** అనే శ్లోకంలో ధృతరాష్ట్రుడి ప్రశ్నతో గీత ప్రథమాధ్యాయం ప్రారంభమవుతుంది. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో నా వారూ, పాండవులు ఏమి చేశారని ప్రశ్న. నా వారు అన్నమాటతోనే పాండవులు నా వారు కారని చెప్పకనే చెప్పాడు ధృతరాష్ట్రుడు. కౌరవవంశ మూలపురుషుడైన కురుమహారాజు అనేక ధర్మకార్యాలు చేసిన పుణ్యస్థలం కురుక్షేత్రం. అక్కడ ధర్మానికే విజయం అనే మాట

ధ్వనిస్తుంది. సంస్కృతంలో 'కృష్' అనే ధాతువుకి కర్మ చేయడమని అర్థం. కురు శబ్దం దీనినుండి వచ్చినదే. కర్మకు క్షేత్రం శరీరమే. శరీరంలోని జీవుడు కర్మను ఆచరించేవాడు. మనస్సనేదే పగ్గం. బుద్ధియే సారథి. జీవుణ్ణి బాహ్యవస్తువులవైపు పరుగులెత్తించే ఇంద్రియాలే గుఱ్ఱాలు.

ఈ రూపకం (metaphor) మనం తెచ్చిపెట్టుకున్నది కాదు. కఠోపనిషత్తులో ఈ విషయం ఇంకా చక్కగా చెప్పబడింది.

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు ।**
**బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥** (కఠోపనిషత్తు)

శరీరమే రథం. అందులో ఉండే రథస్వామి లేదా యజమాని జీవుడు. అతణ్ణి నడిపించే బుద్ధి సారథి. మనస్సే ప్రగ్రహం, అంటే పగ్గం. కన్ను, ముక్కు, చెవి మొదలైన ఐదు జ్ఞానేంద్రియాలే గుఱ్ఱాలు. ఇవి తాము గ్రహించే విషయాలవైపు మనిషిని లాగుతుంటాయి. వాటిని అదుపులో పెట్టాల్సింది మనస్సు. విజ్ఞానవంతమైన బుద్ధి రథికుణ్ణి అతని గమ్యానికి చేరుస్తుంది. దీనినే మరో మంత్రంలో వివరిస్తూ అలాంటి విజ్ఞానసారథి గల రథస్వామి **పరమం పదం** అంటే పరమాత్మ తత్త్వాన్ని పొందుతాడని చెబుతుంది ఉపనిషత్తు.

కృష్ణుడికి నారాయణుడనీ, అర్జునుడికి నరుడనీ కూడా పేర్లున్నాయి. నరుడంటే జీవుడు. నారాయణుడు **నరాణాం అయనం** అంటే నరులకు గమ్యస్థానం. అదే జీవులు సాధించవలసిన మోక్షావస్థ. ఆత్మను తెలుసుకోవడమే మోక్షం. అది ఎక్కడో ఆకాశంలో పొందవలసిన స్థలంకాదు. ప్రతివ్యక్తీ తన అంతఃకరణను విశ్లేషించి తన కోరికలు, రాగద్వేషాలు మొదలైనవాటిని పరిశీలించి ఈ మనస్సును, బుద్ధివృత్తుల్నీ ప్రేరేపిస్తున్న చైతన్యశక్తి ఏమిటి? అని పరిశీలించడం, అంటే ఆత్మవిచారం చేయడం ముఖ్యం. గాయత్రీ మంత్రంలో **ధియో యో నః ప్రచోదయాత్** అంటారు. అంటే మన బుద్ధివృత్తుల్ని, అంటే బుద్ధిలో మెదిలే ఆలోచనలను ప్రేరేపిస్తున్న చైతన్యశక్తి ఏదో అదే తన స్వరూపమని తెలుసుకొని రాగద్వేషాలకు అతీతుడిగా ఉండడమే మోక్షం.

ఈ జ్ఞానంలోనే నిలిచివుండి ప్రాపంచిక విషయాలకు దూరంగా వుండే స్థితి సంన్యాసం. దీనిలో వ్యక్తి తనకున్న సమాజ బాధ్యతలనుండి పూర్తిగా తొలగిపోయి కేవలం బ్రహ్మజ్ఞానంలో నిలిచివుంటాడు. అలాంటివాడిని బ్రహ్మనిష్ఠుడు అంటారు. అంటే ఏవిధంగా ఎలాంటి సంగము (attachment) లేకుండా జ్ఞానస్వరూపం వుంటుందో అలాంటి జ్ఞానస్వరూపంలో బ్రహ్మగా ఉంటాడు అని అర్థం.

ఈ స్థితి సమాజంలో అందరికీ అనవసరం. సాధకులందరికీ లభించదు. ఈ జ్ఞానంయొక్క స్వరూపాన్ని సైద్ధాంతికంగా తెలుసుకొని సమాజం తనకప్పగించిన బాధ్యతలని, రాగద్వేషాలు లేకుండా నిర్వహించడం రెండవస్థితి. అంటే కర్మ చేస్తూ ఉండడం. దీనినే 'కర్మయోగం' అంటారు. దీని గురించి 2,3,4,5 అధ్యాయాల్లో వివరంగా తెలుస్తుంది. భారతంలో అర్జునుడికి జ్ఞానస్వరూపాన్ని పూర్తిగా వివరిస్తాడు శ్రీకృష్ణుడు. కానీ అతను సంన్యసించాలనే ఉద్దేశంతోకాదు. తత్త్వాన్ని సరిగా తెలుసుకొని తన కర్తవ్యాన్ని మరింత శ్రద్ధతో నిర్వహించాలనే ఉద్దేశం. సమాజంలో మనందరము అర్జునుడి స్థానంలో ఉన్నవాళ్లం. మనందరికీ ఉపదేశం.

**శ్రీకృష్ణుడు ఎవరు?**

అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణుణ్ణి కేవలం ద్వాపరయుగంలోని ఒక వ్యక్తిగా భావించరాదు. వాసుదేవుడంటే కేవలం వసుదేవుని పుత్రుడు అనే అర్థంకాదు. అందరిలో వసించేవాడు, అందరిలో ఉన్న ఆత్మస్వరూపం వాసుదేవుడు. గీతలో **అహం, మమ** (నేను, నాయొక్క) అని శ్రీకృష్ణుడు వందసార్లకుపైగా చెబుతాడు. అన్నిచోట్లా ఆ శబ్దానికి నిర్గుణబ్రహ్మ అనే అర్థం చెప్పారు పండితులు. గురువు బ్రహ్మస్వరూపంలో ఉన్నప్పుడే శిష్యుడికి సరైన ఉపదేశం చేయగలడు. అందుకే

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥**

అనే శ్లోకంలో మొదటివాక్యంలోని బ్రహ్మ త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఒకడైన చతుర్ముఖ బ్రహ్మ. రెండవ వాక్యంలో చెప్పిన బ్రహ్మ ఈ ముగ్గురికి పైన ఉన్న పరతత్త్వం. వేదాంతశాస్త్రంలో బ్రహ్మజ్ఞానాన్ని కలిగించే గురువుకు, బ్రహ్మకు అభేదం చెప్పడం సంప్రదాయం. అందువల్ల గీతలో శ్రీకృష్ణుడు అహం అని వాడిన సందర్భంలో నిర్గుణబ్రహ్మతత్త్వాన్ని గ్రహించాలి. అందువల్లనే వ్యాసులవారు శ్రీకృష్ణుడు మాట్లాడినప్పుడల్లా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు అని అనకుండా **శ్రీ భగవానువాచ** – శ్రీ భగవానుడిలా అన్నాడు అని చెప్పారు.

భగవానుడు ఎక్కడనుండి వచ్చాడు, అంటే అవతారమన్నారు. ఈ అవతారతత్త్వాన్ని నాల్గవ అధ్యాయంలో వివరంగా చూస్తాం. అవతారం లేదా అవతరణం అంటే క్రిందికిదిగడం అని అర్థం. శుద్ధబ్రహ్మచైతన్యంలో వ్యక్తమయే ఒకానొక శక్తియే త్రిమూర్తులకు మూలభూతమైన శక్తి. సృష్టిలో ఒక్కొక్క కార్యక్రమానికి ఒక్కో శక్తిగా

భావించి మనం పెట్టుకున్న పేర్లే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. వీరిలో ప్రపంచస్థితికి కారణమైన శక్తిని విష్ణువు అన్నారు. ఈ విష్ణువుకు ఒక లోకం, సామ్రాజ్యం అన్నీ భావనారూపాలే కానీ నిజానికి ఆకాశంపైన విష్ణులోకం ఉన్నదని ఉపనిషత్తులు వివరించలేదు. తర్వాత వచ్చిన పౌరాణికులు మనిషిని సన్మార్గంలో ఉంచడానికై విష్ణులోకం, శివలోకం మొదలైన లోకాలను గురించి వివరించారు. ప్రపంచంలో అధర్మం పెరిగినప్పుడల్లా ప్రపంచస్థితికి కారణమైన శక్తి దాన్ని నిరోధిస్తుంది. ఆ శక్తి అంశయే శ్రీకృష్ణుడు. భగవంతుని అంశ అనేక విధాలుగా లోకంలో కన్పిస్తుంది. దీనినే పదవ అధ్యాయంలో తెలుసుకుంటాం.

**అర్జునుడి మానసిక స్థితి**

సరే గ్రంథంలోకి వద్దాం. ధృతరాష్ట్రుడి ప్రశ్నను పైన చూశాం. సంజయుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు. దుర్యోధనుడు తమ సైన్యాధ్యక్షుడు, కౌరవ పాండవుల గురువు, అయిన ద్రోణుడి దగ్గరకు వెళ్లి సైన్యాన్నంతా పరిశీలించి చూపించాడు. నీ శిష్యుడైన (నీ నిర్వాకంవల్ల) ధృష్టద్యుమ్నుడు సైన్యాన్ని ఎంత బాగా నిలిపాడో చూడు. మనవాళ్లలో ముఖ్యుల్ని చూడు. మీరు, భీష్ముడు, కర్ణుడు అంటూ వీరులందరినీ చూపించాడు. అలాగే పాండవసైన్యంలోని వీరుల్ని చూపించాడు. యుద్ధ హుంకారాలు, శంఖధ్వనులమధ్య అర్జునుడికి తాను ఎవరెవరితో యుద్ధం చేస్తున్నాడో చూడాలనే ఆలోచన వచ్చింది. **సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత** – రెండు సేనలమధ్య రథాన్ని నిలుపు అని రథస్వామి స్థానం నుండి సారథియైన కృష్ణుడిని కోరాడు. కృష్ణుడలాగే చేశాడు. యుద్ధభూమిలో తనకెదురుగా నిలుచున్న కురువీరులు, గురువులు, వృద్ధులు, బాంధవులు అనేకులు కన్పించారు. భీష్మద్రోణాదులు వారి వృత్తిధర్మానికి కట్టుబడి కౌరవసైన్యంలో ప్రతిపక్షులుగా ఉన్నారు. కానీ అర్జునుడికి ప్రీతిపాత్రులైనవాళ్లు. వారిని చూడగానే **సీదంతి మమ గాత్రాణి.... రోమహర్షశ్చ జాయతే** – నా శరీర అవయవాలు చతికిలబడుతున్నాయి, నోరు ఎండిపోతున్నది, శరీరంలో గగుర్పాటు కలుగుతున్నది, గాండీవం చేతినుండి జారిపోతున్నది, అంటూ తనకు వాళ్లపైగల ప్రీతి, వాళ్లతో యుద్ధం చేయాలనే శోకం, తర్వాత వీళ్లను సంహరిస్తే నాకు పాపం కలుగుతుంది అనే భయం ఈ మూడింటిని ప్రదర్శిస్తాడు.

అర్జునుడి మానసిక స్థితి గమనించడం ముఖ్యం. మున్ముందు చెప్పబోయే రాగ, శోక, మోహాలు ఇక్కడ మనం చూస్తాం. భీష్మద్రోణాదులు నా వాళ్లు. వీరు లేకుండా నేను జీవించలేను అని వారిపై ప్రీతి. ఈ ప్రీతి పేరే రాగం లేదా అనురాగం. తన

ఇష్టమైనది లభిస్తే సుఖం. అది నశిస్తుందని భావిస్తే శోకం. శోకం అన్నది రాగంనుంచి పుట్టేదే. తన సుఖానికి భీష్మద్రోణాదులందరూ అవసరమని అర్జునుడి భావన. ఈ శోకం కలిగిన తరువాత దానికి అనుబంధంగా వచ్చినదే మోహం. మోహమంటే ఒకదానిని మరోరకంగా చూడడం. మోహం ఉన్నవాడిని మూఢుడు అంటాం. ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా చూడడం అర్జునుడి మోహానికి నిదర్శనం. ఈ స్థితిలో ఈ ఆతతాయుల్ని హతం చేస్తే మనకు పాపమే చుట్టుకుంటుంది (శ్లో. 36) అంటాడు. ఇంటికి నిప్పుపెట్టేవాడు. విషమిచ్చేవాడు. మారణాయుధాలు ధరించేవాడు. ధనం, భూమిని అపహరించేవాడు. స్త్రీలను పీడించేవాడు. వీళ్లందరినీ ఆతతాయులు అంటారు. కౌరవులు ఇవన్నీ చేశారు. వధార్హులు. ఒకవైపు ఆతతాయి అంటూనే మరోవైపు పాపం మూటగట్టుకుంటాననడం, ధర్మం ఏమిటి, అధర్మం ఏమిటి అనే విచక్షణ కోల్పోవడానికి ఉదాహరణ.

రాగము (విషయంపట్ల ప్రీతి) అది లభించనపుడు శోకం, శోకం వల్ల మోహం ఈ మూడూ దైన్యానికి దారితీస్తాయి. క్షత్రియుడుగా తన ధర్మం వదలివేయడం పాపం. దీనినే **అకరణే ప్రత్యవాయః –** the sin of omission అంటారు. నేరం చేసినవాడిని శిక్షించకపోయినా నేరం చేయనివాడిని శిక్షించినా రాజు నరకానికి వెడతాడని ధర్మశాస్త్రం. నేరస్థుణ్ణి శిక్షిస్తే పాపం వస్తుందని న్యాయస్థానం తలపోసినట్లుగా ఉంది అర్జునుడి వాదన.

తన మానసిక స్థితిని సమర్థించుకోవడానికై యుద్ధంలో జరిగే నష్టంవల్ల కులక్షయం జరుగుతుందనీ, కులస్త్రీలు ధర్మాన్ని వదలివేస్తారనీ వాదిస్తాడు అర్జునుడు. ఈవిధంగా తాపం చెంది రథంపై చతికిలబడ్డాడు. ఇది విషాదంతో యోగం. ప్రతి మనిషికీ తనకు ప్రీతిపాత్రమైంది పోతుందని భావిస్తే వచ్చే మానసికస్థితి.

❖ ❖ ❖

# రెండవ అధ్యాయము

# సాంఖ్యయోగము

ఈ అధ్యాయం పేరు సాంఖ్యయోగం. 72 శ్లోకాలుగల పెద్ద అధ్యాయం. దీనిలో గీతలోని ముఖ్యవిషయాల దిగ్దర్శనం కన్పిస్తుంది. సాంఖ్యం అనే పదానికి **సమ్యక్ ఖ్యాయతే ఆత్మతత్త్వం అనేన ఇతి సాంఖ్యం** – అంటే ఆత్మతత్త్వం దీనివల్ల చక్కగా తెలియబడుతుంది కావున సాంఖ్యం అని అర్థం (భారతీయుల షడ్దర్శనాల్లో కపిలమహర్షి ప్రతిపాదించిన సాంఖ్యదర్శనం అని మరో దర్శనశాస్త్రముంది. ఆ శాస్త్రంతో ఇక్కడ ప్రసక్తిలేదు. గీతలో సాంఖ్యం అంటే జ్ఞానమని అర్థం). ఆత్మ ఏమిటి? ఆత్మ కానిది (అనాత్మ) ఏమిటి? నిత్యమైనది ఏది? అనిత్యమైనది ఏది? అని వివరించి చెప్పేదే సాంఖ్యం.

ఈ అధ్యాయాన్ని నాలుగు భాగాలుగా చూడవచ్చు. మొదట అర్జునుడి శరణాగతి (శ్లో. 10వరకు). రెండవ అంశం జ్ఞానయోగం (శ్లో. 11–30). దీనిలో భాగంగానే లోకదృష్ట్యా అర్జునుడికి కర్తవ్యబోధ (శ్లో. 31–38). మూడవ అంశం కర్మయోగం (శ్లో. 39–53). చివరగా స్థితప్రజ్ఞుడి లక్షణాలు (శ్లో. 54–72).

మొదటి అధ్యాయంలో అర్జునుడు దాదాపు మొండిగా తన వాదమే సరైనదనే ధోరణిలో చెప్పాడు. ఇక్కడ మళ్లీ **శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే** (శ్లో. 5) అంటాడు. అంటే భిక్షాటనద్వారా జీవించడం ఉత్తమమని అంటాడు. (సంన్యాసాశ్రమంగానీ, భిక్షాటనంగానీ బ్రాహ్మణుడికి విధించిన ధర్మం. మిగతావారికి ఇవి చేసే అర్హతలేదు. పాండవులు ఏకచక్రపురంలో బ్రాహ్మణవేషాల్లో ఉన్నపుడు భిక్షాటన చేశారు.) ఈ మాట అనినవెంటనే అతని అంతఃకరణలో ఎక్కడో తను తప్పుకావచ్చనే భావన ఉన్నట్లు కన్పిస్తుంది. అందుకే

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసంమూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥**

తనది కార్పణ్యదోషం అంటున్నాడు. కార్పణ్యమంటే దైన్యం. ఏమీ చేయలేని స్థితి. అందువల్లనే **ధర్మసమ్మూఢచేతాః**, అంటే ధర్మం విషయంలో మోహం చెందిన మనస్సు కలవాడిని అంటున్నాడు. అంటే ధర్మం ఏది? అధర్మం ఏది? అని గ్రహించలేకపోవడం. తర్వాత శ్రేయస్సు కలిగించేదేదో చెప్పమంటున్నాడు. వేదాంతశాస్త్రంలో శ్రేయస్సు, ప్రేయస్సు అని రెండు పదాలున్నాయి. ప్రేయస్సు మనిషికి ప్రపంచంలో అభ్యున్నతికి

కారణమయ్యే మార్గం. శ్రేయస్సు అంటే ఆత్మచింతన, మోక్షమార్గం. కఠోపనిషత్తులో నచికేతుడు యముడిని శ్రేయోమార్గాన్ని మాత్రమే తెలుపమంటాడు. అర్జునుడు ఈ శబ్దాన్నే వాడడం గమనార్హం. తర్వాత **శిష్యస్తేఽహం –** నేను నీ చేత శాసించదగిన వాడను అని తన్నుతాను శ్రీకృష్ణుడికి సమర్పించుకోవడం. **ప్రపన్నమ్** అంటే ప్రపన్నుడైన నన్ను **శాధి** అంటే శాసించు అని అర్థం. ప్రపత్తి అన్నది బోధకు చాలా ముఖ్యం. నిజంగా విషయాన్ని తెలుసుకోగోరేవాడికే బోధించాలని శాస్త్రం. ఈ శ్లోకం శరణాగతి శ్లోకం అని భావిస్తారు. శరణాగతి పొందినవాడికి ధర్మసందేహాన్ని నివారించడం ఆచార్యుడి కర్తవ్యం.

**జగద్గురువు**

ఇంతవరకు అర్జునుడు రథస్వామి, శ్రీకృష్ణుడు రథసారథి. ఇదివరకు అర్జునుడు మిత్రుడు. ఇప్పుడు శిష్యుడు. శ్రీకృష్ణుడు గురువు. అర్జునుడికేకాదు జగత్తుకంతా. అర్జునుణ్ణి నిమిత్తంగా తీసుకొని ప్రపంచానికి తత్త్వబోధ చేశాడు కావున జగద్గురువు– జగత్తుకే గురువయ్యాడు. అందుకే **కృష్ణం వందే జగద్గురుం** అంటాం. జగత్తంటే **గచ్ఛతీతి జగత్** అనగా ఎప్పుడూ మారే స్వభావంకలది (always in a state of flux). అలాంటి జగత్తును అర్థం చేసుకొని దానికి దిశా నిర్దేశం చేయగలిగి జగత్తును పరిపాలించే ధర్మాన్ని చెప్పగలవాడు జగద్గురువు. వేదవ్యాసుడు అలాంటి జగద్గురువు. (వ్యాసజయంతిని గురుపూర్ణిమ అంటాం). అందుకే మహాభారతాన్ని గూర్చి **"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని అధ్యాత్మవిదులు వేదాంతమనియు"** ఇలాగ అధ్యాత్మశాస్త్రం, ధర్మశాస్త్రం, సామాజికశాస్త్రం, రాజనీతి, కావ్యశిల్పం ఇలాంటివన్నీ ఉన్న గ్రంథం భారతం అన్నారు. అదే అధ్యాత్మశాస్త్ర సంగ్రహాన్ని గీతలో మనం చూస్తున్నాం.

ఈ అధ్యాయంలో రెండవభాగం జ్ఞానయోగం. అర్జునుడు వేదశాస్త్రాలు చదివినవాడని పైన గమనించాం. అందువల్లనే నేరుగా శ్రీకృష్ణుడు ఆత్మతత్త్వాన్ని తెలపడానికి ప్రారంభించాడు.

**ఆత్మ అంటే ఏమిటి?**

మొదలుగా ఆత్మ అనే పదాన్ని మామూలుమాటల్లో తెలుసుకోవడం అవసరం. లోకంలో ప్రతి వస్తువునకు దానికి మూలకారణమైన ఒక పదార్థముంటుంది. ఉదాహరణకు ఒక పాత్రకు మూలకారణం లేదా ముడిపదార్థం లోహం లేదా మట్టి. లోహం కూడా

మనం పంచభూతాల్లో ఒకటిగా చెప్పుకునే భూమియొక్క మరోరూపమే. దీన్ని కారణం అంటాం. పాత్రను కార్యం అంటాం. ఈ మట్టికి కార్యం ఏమిటి? అంటే తైత్తిరియోపనిషత్తులో ప్రపంచంలోని ప్రతి వస్తువుకు మూలకారణం ఏమిటి? అని ఒక కార్యకారణ సంబంధం చెప్పారు. **తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః ఆగ్నే రాపః అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీ భ్యోఽన్నమ్ అన్నాత్పురుషః -** అంటే ఆత్మనుండి మొట్టమొదట ఆకాశం ఉద్భవించిందనీ, ఆ ఆకాశంనుండి వాయువు ఉద్భవించిందనీ, ఆ వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటిలో ఘనపదార్థం గట్టిపడి భూమి, భూమినుండి ఓషధులు మిగతా సృష్టి ఏర్పడిందని ఒక వాక్యముంది. సృష్టి గురించి చెప్పే ఈ వాక్యం ఆధునిక భౌతికశాస్త్రం చెప్పే Nebular Theoryకి చాలా దగ్గరలో ఉంటుంది. దీన్ని సృష్టిని వివరించే వాక్యంగా ద్వైతసిద్ధాంతాలు అంగీకరించాయి. అద్వైత దర్శనం దీన్ని మరోవిధంగా వ్యాఖ్యానించింది. ప్రపంచమంతా బ్రహ్మస్వరూపమే అని చెప్పడానికి ఈ వాక్యము ప్రమాణమని అద్వైత వేదాంతులు చెబుతారు. పైన మనం తీసుకున్న పాత్రకు కారణం భూమి. దానికి కారణం నీరు. ఇలా వెతుక్కుంటూ వెడితే చివరి కారణం ఆత్మ. ఆ ఆత్మకు కారణం ఏమీలేదు.

పై ఉదాహరణలో జడపదార్థమైన పాత్రను తీసుకున్నాం. ఇప్పుడు మరొక ఉదాహరణలో చేతనుడైన 'నేను' అనే వ్యక్తిని తీసుకుందాం. నేను ఎవరు? అన్నదే వేదాంతశాస్త్రంలో ముఖ్యమైన ప్రశ్న. నేను అంటే మొదట కనపడేది స్థూలమైన శరీరం. నేను లావుగా ఉన్నాను, సన్నగా ఉన్నాను, సుఖంగా ఉన్నాను అనుకునేది స్థూలదేహం. దేహం కేవలం పంచభూతాల కలయిక. కొంత మట్టి, కొంత నీరు, కొంత గాలి, అగ్ని, ఆకాశం అన్నీ కలిసిన ఆకారం. మరణించడం అనే సంఘటన జరిగినపుడు స్థూలశరీరమున్నా దీనిలో 'నేను' లేదు. కావున నేను అనుకునేది శరీరంకాదు. మేలుకున్నా, కలలో ఉన్నా, గాఢనిద్రపోయి మళ్లీ లేచినా అన్ని అవస్థలలోనూ ఉండే చైతన్యం ఏదో ఉన్నది.

ఇంద్రియాలే నేను అనే వాదన మరొకటుంది. మనం బాహ్యప్రపంచాన్ని ఇంద్రియాలద్వారానే తెలుసుకుంటాం. కానీ ఒక ఇంద్రియం పనిచేస్తున్నపుడు మరో ఇంద్రియం విషయాలను గ్రహించదు. కంటితో వస్తువును చూస్తున్నపుడు మనస్సులో ఆ రూపం కనిపిస్తుంది. శబ్దం, స్పర్శ, గంధం (వాసన) మొదలగునవి ఒకదాని తర్వాత ఒకటి మనస్సుచే గ్రహింపబడతాయి. అన్నీ ఒకసారికాదు. కాబట్టి

ఇంద్రియాలకంటే సూక్ష్మమైనది మనస్సు. ఇంద్రియాలద్వారా విషయాలను గ్రహించే స్థాయిని మనస్సు అంటారు. గ్రహించిన విషయాన్ని ఇది ఫలానా అని చెప్పేస్థాయిని బుద్ధి అంటారు. ఇదికాక మనస్సులో నేను అనే భావన ఒకటుంది. దీనినే 'అహంకారం' అంటారు. (అహంకారమంటే వాడుకభాషలో గర్వమని అర్థం. కానీ శాస్త్రంలో 'నేను' అనే భావం.) దీని తర్వాత ఒక విషయాన్ని గురించి ఆలోచించి గుర్తుకు తెచ్చుకునే స్థాయిని 'చిత్తం' అంటారు. ఇలాగ మనం మనస్సు ఆంగ్లభాషలో mind అనేదానిని మనవాళ్లు మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం అని నాలుగుస్థాయిల్లో విశ్లేషించారు. ఈ నాల్గింటికి కలిపి అంతఃకరణమని పేరు. పోనీ ఈ అంతఃకరణమే 'నేను' అవుతుందా అని తర్వాతి ప్రశ్న. దీనినే 'జీవు'డని, 'నేను' అని కొందరు దార్శనికులు చెప్పారు. కానీ అంతఃకరణం కూడా జడమే. దీనికి భిన్నమైన చైతన్యాంశ (conscious principle) ఏదో ఉండాలి. కావున అంతఃకరణాన్ని ప్రకాశింపచేసే, లేదా భాసింపచేసే చైతన్యమేదో అదే 'నేను'గా మిగులుతుంది. దీనినే శ్రీశంకరులు దశశ్లోకిలోని మొదటి శ్లోకంలో **న భూమిర్న తోయం** అంటూ ఈ పంచభూతాలు నేను కాదు, అంతఃకరణం నేను కాదు, వీటన్నింటికీ అతీతమైన చైతన్యం 'నేను' అంటారు. ఈ చైతన్యం పేరే 'ఆత్మ' లేదా 'బ్రహ్మ'. ఈ శుద్ధచైతన్యమే 'నేను' అని తెలుసుకోవడం ఆత్మజ్ఞానం.

పై రెండు ఉదాహరణల్లో ఒకటి జడమైన వస్తువు, రెండోది చేతనమైనది. దేనిని తీసుకొని మనం కార్యకారణ విచారణ చేసినా చివరకు మిగిలేది ఆత్మ. ఆత్మదగ్గర అన్నివిచారణలు అంతమవుతాయి. జడము, చేతనము రెండూ ఆత్మవద్ద ఆగిపోతాయి. చైతన్యం లేకుంటే మనం చూసే స్థావరజంగమాలేవీ లేవు. మనం జడం అనుకునే పదార్థం కూడా చైతన్యంలో భాగమే.

**పరమార్థస్థాయిలో చూడడం**

ఈ ఆత్మను గురించి చెప్పేదే సాంఖ్యం. ఇంత బోధ ఇక్కడ ఎందుకవసరమైనది అని ఆశ్చర్యం కలిగించవచ్చు. సామాన్యంగా ఒక సైనికుడు నేను యుద్ధం చేయనంటే అతన్ని శాసించి యుద్ధం చేయమని చెప్పవచ్చు. ఇక్కడ అర్జునుడు కృష్ణుడితో సమానంగా ధర్మశాస్త్ర విచారణ చేసినవాడు. ధర్మవిషయమైన చర్చ చేశాడు. కావున రోగినిబట్టి వైద్యమన్నట్లు ఇతనికి తత్త్వం మొత్తం చెబితే తప్ప, ఆత్మజ్ఞానం కలిగిస్తే తప్ప, తన స్వరూపమేమిటి, తన కర్తవ్యమేమిటి అని గ్రహించలేడనే ఉద్దేశంతో శ్రీకృష్ణుడు ఇదంతా చెప్పవలసి వచ్చింది. దీనినే శ్రీశంకరులు "ఈవిధంగా ధర్మవిషయంలో మోహం చెంది గొప్ప శోకసాగరంలో మునిగిపోయిన అర్జునుడిని కర్తవ్యబోధ చేయాలంటే

ఆత్మజ్ఞానం తప్ప మరొక ఉపాయంలేదని గ్రహించిన వాసుదేవుడు అతన్ని ఆత్మవిజ్ఞానంలో ప్రవేశపెడుతూ ఇలా అన్నాడు" అని **అశోచ్యా నన్వశోచస్త్వం** (11వ శ్లోకం) అవతారికలో వ్రాశారు.

"ఎవరిని గూర్చి దుఃఖించకూడదో వారిని గూర్చి దుఃఖిస్తున్నావు. తెలివైన వాళ్లు మాట్లాడే మాటలు మాట్లాడుతున్నావు. మరణించినవాళ్లని గురించిగానీ, జీవించి వున్నవారినిగూర్చిగానీ పండితులు దుఃఖించరు" అని పై శ్లోకానికర్థం.

అర్జునుడు మూఢత్వం, పాండిత్యం రెండూ చూపుతున్నాడు. ఈ శ్లోకంలో పండితుడు అనే శబ్దం చూడాలి. పండా అంటే ఆత్మజ్ఞానం. అది కలవాడు పండితుడు (శంకరుల వ్యాఖ్య). భీష్మద్రోణాదులందరూ లోకవ్యవహారంలో మాత్రమే మరణిస్తున్నారు. నిజానికి, అంటే పారమార్థికదృష్టిలో ఎల్లప్పుడూ జీవించేవున్నారు.

అది ఎలాగ? ఎలాగైతే మానవునికి ఈ శరీరంలో కౌమారావస్థ, యవ్వనం, ముసలితనం వస్తుంటాయో అలాగే మరో దేహం కూడా వస్తుంది. బుద్ధిమంతుడు మోహం చెందడు (శ్లో. 13). సుఖము, దుఃఖము, శీతోష్ణాలు మొదలైనవన్నీ వచ్చిపోయేవే. వాటి తత్త్వం అంతే అని గ్రహించాలి. ఎందుకంటే జీవుని అసలు స్వరూపం సత్, అంటే ఎల్లప్పుడూ ఉండేది (శ్లో. 16). ఎల్లప్పుడూ అంటే భూత, భవిష్యద్వర్తమానాల కాలాల్లో ఉండేది. ఎలాగ?

పైన మనం కార్యకారణ విచారణ చూశాం. ఏ వస్తువుకు ఏది కారణం (cause) ఏది కార్యం (effect) అని. కుండకు కారణం మట్టి. ఒక కుండ నశించినా మట్టిగానే మిగిలి ఉంటుంది. అంటే కారణం నశించలేదు. కారణంయొక్క ధర్మాలు (properties), గుణాలు (qualities) కార్యంలో ఉంటాయి. మట్టిని సత్ అంటాం. అంటే ఉన్నది అని. అది కుండరూపంలో కాకుంటే మరోరూపంలో కనిపిస్తుంది. ఒక వస్తువు నశించినా, మరొక వస్తువులో సత్ అంటే ఉన్నదిగా కనిపిస్తుంది. ఈ ఉనికిని కాదనలేం. అన్నిటికీ మూలకారణమైన బ్రహ్మ అంటే ఆత్మ అన్ని పదార్థాల్లో ఉంటుంది.

వచ్చీపోయే సుఖదుఃఖాలు, శీతోష్ణాదులు ఇవి తాత్కాలికాలు. పుట్టడం, పెరగడం పరిణామం చెంది వార్ధక్యం రావడం, మరణించడం ఇవన్నీ అన్ని ప్రాణుల్లో ఉన్న మార్పులు (మార్పును వికారం అని శాస్త్రపరిభాషలో అంటారు). ఈ వికారాలు లేనిది సత్, కేవల ఉనికి. నీ రూపం సత్ కావడంవల్లే వచ్చీపోయే శీతోష్ణాలని సహించు అంటుంది గీత. **(తాంస్తితిక్షస్వ భారత)** (శ్లో. 14) తితిక్ష అంటే శరీరదుఃఖాల్ని

సహించి ఉండడం. అంటే బలవంతంగా బిగబట్టి ఓర్చుకొని ఉండడంకాదు. వివేకంతో ఆలోచించి ఇవి కేవలం వస్తూపోతూ ఉంటాయి. ఎప్పటికీ మారని తత్త్వం నేను అని సుఖానికీ, దుఃఖానికీ సాక్షిగా ఉండడం.

శరీరము, మనస్సు, బుద్ధి ఇవన్నీ నేను అనుకుంటే జీవభావంలో ఉన్నట్లు. అలాకాకుండా శరీరం, బుద్ధి వచ్చిపోయేవి, ఎల్లప్పుడూ ఉండే సత్ స్వరూపం నేను అంటూ బుద్ధికి సాక్షిగా ఉంటే (బుద్ధిని తననుండి వేరుచేసుకొని చూస్తే) ఆత్మభావంలో ఉన్నట్లు. నేను దేనిని చూడగలనో అది నాకంటే భిన్నం. శరీరాన్ని చూడగలం. అలాగే ఇంద్రియాన్ని చూడగలం. మనస్సును చూడగలం. ఈ మనస్సును చూసే చైతన్యమే మన నిజస్వరూపం. ఏది చూస్తుందో అది దృక్ అంటారు. చూడబడేది దృశ్యం. దృశ్యాలనన్నిటినీ వేరుచేసి దృక్ రూపంగా ఉండడమే ఆత్మజ్ఞానం.

**అవినాశితు** (శ్లో. 17) అనే శ్లోకంలో ఏదైతే సత్‌గా ఉంటుందో అది అవినాశి. అది అవ్యయం అంటే ఎలాంటి మార్పూ లేనిది. (immutable, unchangeable) వ్యక్తిలో మార్పు రావచ్చు కానీ ఉనికిలో మార్పులేదు. 18వ శ్లోకం ఇంకా స్పష్టంగా జీవుని తత్త్వం తెలుపుతుంది.

**అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।**
**అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥**

నిత్యమై, అవినాశియై, అప్రమేయమై ఉన్న జీవుడికి ఈ నశించిపోయే దేహాలు కేవలం ఉపాధులు[1] అని అర్థం. ఇక్కడ నిత్యమై, అవినాశియై అని ఏకవచనంలో చెప్పి దేహాలు అని బహువచనంలో చెప్పడంతో దేహాలు వేరైనా పరమాత్మచైతన్యం ఒక్కటే అని చెప్పబడింది. అందుకే జీవుడిని శరీరీ అన్నారు. అంటే శరీరం గ్రహించినవాడు అని అర్థం. అనగా ఈ శరీరం వస్తూపోతూ వుంటుంది. చైతన్యం మాత్రం నిత్యమని, శాశ్వతమని అర్థం. **అంతవంతః** అనేది మరోపదం. అంతముకలవి అంతవంతములు. ఎప్పుడో ఒకప్పుడు నశించేవి అని మామూలుగా అర్థం. కానీ రజ్జు-సర్పభ్రాంతిలాగా (తాడును చూసి పాము అనుకుంటాం. కానీ నిజం తెలిసిన

1. ఉపాధి అంటే సమీపంలో ఉంటూ తాత్కాలికంగా ఒక వస్తువు ధర్మాన్ని వేరుగా చూపించే మరో వస్తువు. ఉదా: ఒక స్ఫటికం ప్రక్కన ఎర్రని పువ్వు ఉంచితే స్ఫటికం ఎర్రగా కనిపిస్తుంది. స్ఫటికంలో లేని ఎరుపుదనాన్ని చూపించే పువ్వు స్ఫటికానికి ఉపాధి. అలాగే ఆత్మలో లేని నశించడం మొదలైన ధర్మాలని ఆత్మధర్మాలుగా చూపించే దేహాలు ఉపాధులు.

వెంటనే పాము తొలగిపోతుంది) అజ్ఞానం తొలగిన వెంటనే తొలగిపోయేది అని మరొక అర్థం. అందుకనే నిత్యస్య = నిత్యమైన చైతన్యానికి అన్నారు. నిత్యమన్నా, సత్యమన్నా ఒకటే. మూడుకాలాల్లోనూ ఉండేదని అర్థం.

**అప్రమేయం** అన్నది మరొక విశేషణం. ప్రమ అంటే సరైన జ్ఞానం. (right knowledge) ప్రమను కలిగించేది ప్రమాణం. ఏదైనా విషయాన్ని మనం ఇంద్రియాలతో నేరుగా తెలుసుకొంటే ప్రత్యక్షంగా తెలుసుకోవడం అంటాం. (ప్రతి + అక్షం = ప్రత్యక్షం. అక్షమంటే ఇంద్రియం.) ప్రత్యక్షం మనకు సరైన జ్ఞానాన్ని ఇస్తుంది కాబట్టి అదొక ప్రమాణం. ప్రత్యక్షంగా చూసినదానివల్ల ఊహించేది మరొకటి. దూరంగా పొగను చూసి అక్కడ అగ్నిని చూడకపోయినా దాని ఉనికిని తెలుసుకుంటాం. దీన్ని అనుమానం (inference) అంటారు. ఇలా దార్శనికులు అనేకప్రమాణాలు చెప్పారు. ఈ ప్రమాణాలద్వారా తెలుసుకోగలిగింది ప్రమేయం అంటారు. అంటే మన బుద్ధితో తెలుసుకోగలిగినది, బుద్ధికి విషయమైనది ప్రమేయం. అలా కానిది అప్రమేయం. బుద్ధిని ప్రేరేపించి బుద్ధిని ప్రకాశింపచేసేది ఈ చైతన్యం. దీన్ని బుద్ధిద్వారా తెలుసుకొనలేం. కావున ప్రమాణాలు ఇక్కడ పనిచేయవు. అందువల్ల అప్రమేయం అన్నారు. ప్రమాణాలచే తెలియలేనిది అప్రమేయం.

ఈ శ్లోకంలో **యుద్ధ్యస్వ** – అంటే యుద్ధం చేయి అని ఆదేశించినట్లుగా ఉంది. బహుశా తన కాలంలోనే దీన్ని అపార్థం చేసుకొనే అవకాశం ఉందని భావించి శ్రీశంకరులు **"నహి అత్ర యుద్ధ కర్తవ్యతా విధీయతే...... తస్య కర్తవ్య ప్రతిబంధాపనయనమాత్రం భగవతా క్రియతే"** అన్నారు. అంటే నీవు యుద్ధం చేయి అని కొత్తగా ఉపదేశం చేయడంలేదు. యుద్ధం చేయడానికి పూనుకొన్నవాడై మధ్యలో శోకమోహాలనే ప్రతిబంధం (అడ్డంకి)తో తన ధర్మాన్ని మరచి ఊరకుండిపోయాడు. అతని కర్తవ్య విషయంలో ప్రతిబంధాన్ని తొలగించడం మాత్రమే భగవంతుడు చేశాడు, యుద్ధానికి పురిగొల్పలేదు అని అర్థం.

తర్వాత మళ్లీ జీవస్వరూపం గురించి చెబుతూ **య ఏనం వేత్తి** (శ్లో.19) అనే శ్లోకంలో ఈ జీవాత్మ ఎవరినీ చంపదు, చంపబడదు, శరీరం హతమైనా హతంకానిది అని చెప్పబడింది. ఇక్కడ ఒక ప్రసిద్ధ శ్లోకం

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోऽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22**

మనిషి ఎలాగైతే చిరిగిన వస్త్రాలను వదలి నూతన వస్త్రాలను స్వీకరిస్తాడో ఈ జీవాత్మకూడా ఒక శరీరాన్ని వదలి మరో శరీరాన్ని ధరిస్తూ ఉంటుంది. ఇది అవిచ్ఛిన్నంగా జరుగుతూ ఉంటుంది. జీవుని సుకృతం (మంచికర్మ) వల్ల, మంచి గురువు ఉపదేశంవల్ల అజ్ఞానం తొలగినపుడే జీవుడికి జీవభావం పోయి ఆత్మభావంలో మిగులుతాడు. అప్పుడిక శరీర గ్రహణం లేదు. అంతవరకూ సంసరణం (ఒక శరీరం నుండి మరో శరీరంలోనికి వెళుతూ ఉండడం) లేదా సంసారం. సంసారమంటే భార్యా, పిల్లలు అని రూఢిలో ఉన్న అర్థం. సరైన అర్థం పైన చెప్పినట్లు గ్రహించాలి.

24, 25 శ్లోకాల్లో మరికొన్ని జీవాత్మ విశేషణాలు చెప్పబడ్డాయి. ఈ ఆత్మ ఛేదింపశక్యం కానిది, కాల్చశక్యంకానిది, తడపటానికి శక్యంకానిది అంటూ చెప్పడంవల్ల పంచభూతాలకు అతీతమైనది అని చెప్పబడింది. అలాగే **నిత్యం** అంటే ఎల్లప్పుడూ ఉన్నది. **సర్వగతః** = అంతటా వ్యాపించివున్నది. **సనాతనః** = అన్ని కాలాల్లో ఉండేది. (ప్రాచీనమైనది అని అర్థంకాదు). అలాగే **అవ్యక్తం** = వ్యక్తం కానిది అంటే ఏ ఇంద్రియంవల్ల తెలియబడేది కాదు. అందుకే **అచింత్యం**. ఇంద్రియాలకు గోచరమైతే ఆలోచించగలం. అలా కానిది అచింత్యం. ఆత్మ **అవికార్యం**. వికారం అంటే మార్పు. ఎలాంటి మార్పూ లేనిది అవికార్యం. ప్రతి జీవికీ ఆరు వికారాలు చెబుతారు. పుట్టడం, పెరగడం, పరిణామం చెందడం, నశించడం మొదలగు వికారాలు చొక్కాలాంటి శరీరానికేగానీ దేహంలో ఉన్న దేహి (జీవుడు)కి కాదు. ఎంతో ప్రయత్నంతో కానీ మానవుడు దీనిని గమనించలేడు. అందుకే **ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనం** అంటూ (శ్లో. 29) ఈ ఆత్మను చాలా ఆశ్చర్యకరమైనదానిగా చూస్తాడు. ఆశ్చర్యంగా ఉన్నట్లు చెబుతాడు. అలాగే వింటాడు. విన్నా ఏ ఒక్కడికో అర్థమవుతుంది. దేహం నేననే భ్రాంతి ప్రపంచంలో అందరికీ ఉంది. నిన్నెందుకు తప్పుపట్టాలి అని భావం.

**మూడు శరీరాలు**

ఇక్కడ ఒక విషయం మనం తెలుసుకోవచ్చు. వేదాంతశాస్త్రంలో 1. స్థూలశరీరం, 2. సూక్ష్మశరీరం, 3. కారణశరీరం అని మూడు రకాల శరీరాలు చెబుతారు. స్థూలశరీరం పంచభూతాల పరిణామఫలితంగా రక్తమాంసాదుల రూపంలో ఏర్పడిన శరీరం. ఈ పంచభూతాల మరోరూపమే మన ఇంద్రియాలు. ఆకాశానికి మరోరూపం శ్రోత్రేంద్రియం. భూమి (గంధం–వాసన)కి మరోరూపం ఘ్రాణేంద్రియం. ఇలా ఐదు భూతాల రూపాలే ఐదు ఇంద్రియాలు. అందుకే **యథాపిండే తథా బ్రహ్మాండే** (పిండ శరీరంలో ఎలాగో బ్రహ్మాండంలో అలాగే) అన్నారు. ఈ స్థూలశరీరంలో ఐదు

జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ప్రాణాపానాది ఐదు వాయువులు, మనస్సు, బుద్ధి అని పదిహేడు అంగాల స్థూలరూపాలు ఉన్నాయి. రెండవది సూక్ష్మ శరీరం. దీనినే లింగశరీరం అంటారు. దీనిలో పై చెప్పిన 17 అంగాల సూక్ష్మరూపాలు ఉంటాయి. కారణ శరీరమంటే స్థూల, సూక్ష్మదేహాలకు కారణమైన (ఇవి ఎక్కడినుండి వచ్చాయో అది) మాయ (అవిద్య) అనే శక్తి. ఈ మాయ ఎలాంటిది అని ఏడవ అధ్యాయంలో చెప్పబడుతుంది.

జీవుడు ఒక దేహంనుండి ఇంకొక దేహానికి వెళ్లినపుడు లింగశరీరంతో వెళతాడని వేదాంతశాస్త్ర ప్రతిపాదన. లింగ శరీరానికి కూడా వెనుకనున్న చైతన్యం జీవుడు. కాబట్టి ఈ అధ్యాయంలో 'దేహీ' (దేహం కలవాడు) అంటే లింగశరీరంకాదు. ఈ అధ్యాయం జీవాత్మ స్వరూపం చెప్పడానికి ఉద్దేశించినది. అంతేగానీ స్థూల, సూక్ష్మశరీరాలను చెప్పడానికి ఉద్దేశించినదికాదు.

**లోకదృష్టి**

శ్లో. 31 నుండి 39 వరకు లోకవ్యవహారాన్ని అనుసరించి అర్జునుడి పరిస్థితి విశ్లేషిస్తున్నాడు **స్వధర్మమపిచావేక్ష్య** అంటూ. స్వధర్మం అంటే స్వాభావికమైన ధర్మం. క్షత్రియుడి స్వభావం తేజస్సు, ధైర్యం మొదలైనవి. బ్రాహ్మణ, క్షత్రియాది వర్ణాల గురించి నాల్గవ అధ్యాయంలో చెప్పబోతున్నారు. వర్ణం అనేది స్వభావాన్నిబట్టి అని ఇక్కడ గమనించాల్సిన విషయం. అర్జునుడి స్వభావం క్షత్రియస్వభావం. దాన్ననుసరించి అతనికి యుద్ధమే కర్తవ్యం. ఆ యుద్ధం ధర్మాన్ని, ప్రజలను రక్షించడానికే కావున అది అతని విధి.

అంతేగాక ఇలాంటి ధర్మసమ్మతమైన సంగ్రామం చేయకుంటే అతణ్ణి శత్రువీరులు పరిహసిస్తారు. లౌకికదృష్ట్యా కూడా యుద్ధం అవసరమే. యుద్ధభూమి నుండి పలాయనం చేశాడని శత్రువులు భావిస్తారు. ఇన్నాళ్లూ వాళ్ల ఆదరాన్ని, మన్ననలని పొందిన అర్జునుడు వారి దృష్టిలో చులకనవుతాడు. ఇదంతా లౌకికపరమైన వాదన (శ్లో. 32-35).

**కర్మయోగం**

శ్లో 39 మొదలు 53 వరకూ కర్మయోగం చెప్పబడింది. దీనివల్ల లభించే ఫలం ఏమిటి? అని 39వ శ్లోకంలో **కర్మబంధం ప్రహాస్యసి** అంటే కర్మబంధం నుండి వైదొలగుతావు, కర్మబంధంలో చిక్కుకొనవు అని చెప్పారు. కర్మలకీ, బంధాలకీ సంబంధం ఏమిటి అని తెలుసుకోవాలి.

కర్మ అంటే మామూలుగా మనం చేసే దైనందినచర్య కాదని చెప్పుకున్నాం. ప్రొద్దున్నే లేవడం, కాఫీ త్రాగడం ఇలాంటివి కావని అర్థం. ప్రతిమనిషికీ అతని వర్ణాశ్రమాలను అనుసరించి శాస్త్రం విధించిన (prescribe) కర్తవ్యం. కర్మను శాస్త్రీయకర్మ, అశాస్త్రీయ కర్మ అని విభజించవచ్చు. అశాస్త్రీయ కర్మ అంటే శాస్త్రం నిషేధించిన కర్మ (హత్య, దొంగతనం లాంటివి). నిషిద్ధకర్మ అంటారు. దీనివల్ల నరకం ఫలితం.

శాస్త్రీయమైన కర్మ నాలుగు రకాలు – నిత్య, నైమిత్తిక, కామ్య, ప్రాయశ్చిత్త కర్మలు. నిత్యకర్మ అంటే తప్పక చేసితీరాల్సినవి. సంధ్యావందనం, పంచమహాయజ్ఞాలు (అతిథులను ఆదరించడం, ప్రాణులకు ఆహారమివ్వడం, దేవతలను పూజించడం మొ॥). నైమిత్తిక కర్మ అంటే ఏదో ఒక నిమిత్తాన్ని (సందర్భాన్ని) బట్టి చేయాల్సిన కర్మ. పుత్రజనన సమయంలో జాతకర్మ, వివాహం, గ్రహణం, శ్రాద్ధకర్మ..... లాంటివి. ఇవి తప్పక ఆచరించాల్సినవే. కామ్యకర్మ అంటే కోరిక (కామం)తో చేసే పనులు. అంటే స్వర్గం కావాలని సోమయాగం చేయడం, పుత్రులు జన్మించాలని పుత్రకామేష్టి చేయడం, విష్ణులోకం, సత్యలోకం కావాలని సోమయాగం లాంటివి చేయడం మొదలైనవి. వీటిని వేదాల్లోనూ, స్మృతుల్లోనూ చెప్పారు. వీటివల్ల స్వర్గం రావచ్చు కానీ ఆ ఫలితం అనుభవించాక మళ్లీ పుట్టుక, మళ్లీ జననమరణచక్రం. ప్రాయశ్చిత్తకర్మ అంటే ఉపవాసాదులు, దీక్షలు, దానాలు మొ॥ పాపం తొలగించుకోవడానికి చేసే కర్మలు.

ఏ వర్ణాశ్రమాలకు ఏయే కర్మలు విధింపబడ్డాయనేది మున్ముందు (18వ అధ్యాయంలో) చెప్పబడుతుంది. ఈ విధింపబడిన కర్మ ఆయా వ్యక్తులు తప్పక చేయాల్సిందే. ఉదా: బ్రాహ్మణుడు, వేదాధ్యయనం, అధ్యాపనం, సత్యం, దానం, శౌచం, క్షమ మొ॥. క్షత్రియుడికి శౌర్యం, తేజస్సు, చిత్తస్థైర్యం, యుద్ధంలో పలాయనం చేయకుండా ఉండడం మొ॥ విధులు (అ.18 శ్లో.42/43). ఇవి విధిగా చేయాల్సిన పనులు. ఇలాగే మిగతావారికి కూడా.

ఈ కర్మలన్నీ మనిషికి బంధం కలిగించేవే. బంధం దేనికి అంటే జీవుడికి. ఒక శరీరం పోతే మరొక శరీరాన్ని గ్రహించాలి. ప్రతికర్మకూ ఒక ఫలం ఉంటుందని శాస్త్రం. ఆ కర్మఫలాన్ని ఒక జన్మలో అనుభవించకుంటే మరోజన్మ ఎత్తవలసి వుంటుంది. మరి ఈ బంధం పోవాలంటే, అనగా ఆ కర్మఫలం మనకు రాకూడదు అంటే ఆ కర్మను ఇంకేదో పద్ధతిలో ఆచరించాలి. ఆ పద్ధతి పేరే కర్మయోగం. అదే కర్మయోగం ఇక్కడ వివరింపబడుతుంది. శ్రీకృష్ణుడు దాని గొప్పతనం మొదలుగా చెబుతున్నాడు.

**ఏషాతేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ॥**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి ॥ 39**

ఇంతవరకూ నీకు జ్ఞానం గురించి చెప్పాను. ఇప్పుడు కర్మయోగం విను. ఈ యోగబుద్ధిలో ఉంటే నీకు కర్మలవల్ల వచ్చే బంధం తొలగిపోతుంది. తర్వాతి శ్లోకంలో ఇదే వివరిస్తూ **స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్** అంటే ఈ ధర్మాన్ని కొంత ఆచరించినా భయం తొలగిపోతుంది. భయమంటే ఏమిటి? జన్మమరణాది భయం. దీనినుంచి రక్షిస్తుంది అని అర్థం.

**నిష్కామకర్మ**

ఇప్పుడు నిష్కామకర్మ అనే విషయం వివరింపబడుతుంది. కర్మలు చేసినా ఫలం అంటకూడదంటే దాని ఫలితాన్ని కోరకూడదు. ప్రతివ్యక్తి నేను చేసేవాడిని, నేను అనుభవించేవాడిని అనే భావనతో కర్మను చేస్తుంటాడు. దీనినే కర్తృత్వ, భోక్తృత్వభావన అంటారు. నేను అన్న భావనతో చేస్తే కర్మఫలం అంటుతుంది. నేను అన్న భావన లేకుంటే భోక్తృత్వభావన లేదు. నేను అన్న భావన పోవాలంటే కేవలం కర్మఫలం వద్దు అని భావిస్తే చాలదు. 'నేను' స్థానంలో సత్త్వరజస్తమోగుణాలతో కూడిన ఈ ప్రకృతి ఈ కర్మను చేస్తున్నది అనే భావనలో బలంగా ఉండాలి. ఇది జ్ఞానంవల్ల సాధ్యమవుతుంది. అంటే కర్మఫలం నాకు వద్దు అని కేవలం అనుకుంటే చాలదు, దానికితోడు తననుతాను తెలుసుకొని 'నేను' అనేదానిని కర్మనుండి (delink) తీసివేయాలి. పై శ్లోకంలో కృష్ణుడు నిష్కామకర్మవల్ల జన్మబంధం తొలగిపోతుంది అన్నాడు. ఇది రెండు దశల్లో అర్థం చేసుకోవాలి. ఒకటి సాధకుడిగా నిష్కామకర్మ చేయడం. దీనివల్ల క్రమేణా చిత్తశుద్ధి కలగడం, దానివల్ల జ్ఞానం, దానివల్ల జన్మరాహిత్యం. రెండోదశ జ్ఞానియై కర్మ చేయడం. జ్ఞాని అయినందువల్ల ఎలాగూ నిష్కామకర్మనే చేస్తాడు, అంటే నేను అనే భావన లేకుండా చేస్తాడు. అలాంటప్పుడు అతనికి సాక్షాత్తూ జన్మబంధంనుండి విముక్తి.

దీనినే ఇంకా వివరిస్తూ వేదాలస్వరూపమేమిటి అని **త్రైగుణ్య విషయా వేదాః** అనే మాటలో చెప్పారు. త్రిగుణాలు అంటే సత్త్వము, రజస్సు, తమస్సు అని తెలిసినదే. వీటి సమాహారమే త్రైగుణ్యం, అనగా త్రిగుణాలతో సంబంధించిన ప్రపంచం. వేదాలన్నీ ఈ ప్రపంచాన్ని గూర్చి తెలుపుతాయి. నీవు వాటికి అతీతంగా ఉండు. నిర్ద్వంద్వః – ధర్మం, అధర్మం అనేవి ద్వంద్వాలు (dualities). నిత్యసత్త్వస్థః – అంటే సత్త్వగుణంలో

ఉండు. నిర్యోగక్షేమః – యోగమంటే లేనిదానిని పొందడం. క్షేమమంటే ఉన్నదాన్ని రక్షించుకోవడం. ఈ రెండూ లేకుండా ఉండు. నిజంగా జ్ఞానికి వేదంలో చెప్పిన యజ్ఞాలు, వాటిఫలాలు మొదలైనవన్నీ చాలా అల్పమైనవిగా కన్పిస్తాయి. ఆత్మజ్ఞానం అంతకంటే చాలా గొప్పది. దీనినే ఒక ప్రసిద్ధమైన శ్లోకంలో చెప్పారు.

**యావానర్థ ఉదపానే సర్వతఃసంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46**

చుట్టూ నీళ్లున్న ప్రదేశంలో ఉన్నవాడికి బావినీళ్లు అతిస్వల్పంగా కన్పిస్తాయి. అలాగే ఆత్మతత్త్వం తెలుసుకొన్న జ్ఞానికి వేదాలు చాలా అల్పప్రయోజనాలుగా కన్పిస్తాయి. అందుకే జ్ఞాని తనకుగా కర్మలు ఆచరించడు (ఈ శ్లోకంలో బ్రాహ్మణస్య అనే మాటలో బ్రాహ్మణుడు అంటే పరమార్థం తెలిసినవాడు, జాతి బ్రాహ్మణున్ని చెప్పలేదు).

మరి కర్మయోగం ఎందుకు చెప్పబడింది? జ్ఞానికి మాత్రమే మోక్షం అన్న పక్షంలో వేలాదిమందిలో ఏ ఒక్కడో కర్మసంన్యాసం చేసి జ్ఞానమార్గంలో ఉండగలడు. మిగతావాళ్లందరూ కర్మచక్రంలో తిరుగుతూ ఉండాల్సిందే. వారికి మోక్షానికి అర్హతే లేకపోతుంది. అందుకనే కర్మయోగులైన జనకమహారాజు మొదలైనవాళ్లని ఉదాహరణగా తీసికొని అందరికీ ఆచరణయోగ్యంగా కర్మయోగం చెప్పబడింది. అందరూ సంన్యాసం తీసుకొనే పక్షంలో ప్రపంచ వ్యవహారమే ఉండదు. అందువల్ల మనిషి తన కర్మను చేస్తూ మోక్షం కూడా సాధించేమార్గం కర్మయోగం. నిష్కామకర్మ గూర్చి ఒక ప్రసిద్ధమైన మాట ఇక్కడ కృష్ణుడు చెబుతాడు.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి ॥ 47**

ఈ శ్లోకం నిష్కామకర్మకు నిర్వచనం లాంటిది. దీనికి ప్రాచీనులవ్యాఖ్యలు చాలా స్పష్టంగా ఉన్నా లోకంలో చాలా తప్పుగా అర్థం చేసుకోవడం చూస్తున్నాం. కృష్ణుడి వాక్యాన్ని నా చేతిలో ఏమీలేదు అంతా దేవుడిదే అనే కర్మవాదంలోకి దిగజార్చే అవకాశముంది. ఇలా అర్థం చేసుకొని మనిషి ఒక దైన్యభావంతో నిష్క్రియాత్మకంగా ఉండే ప్రమాదం ఉంది. దీనినే fatalism అంటారు. ఇదే మెట్టవేదాంతం. గీత ఉద్దేశం అదికాదు. ప్రాచీనుల ఉద్దేశంకూడా అదికాదు.

పై వాక్యం అర్జునుణ్ణి ఉద్దేశించి చెప్పినమాట. అంటే సంన్యాసం స్వీకరించకుండా గృహస్థాశ్రమంలో ఉంటూ కర్మలు చేసే మనందరినీ ఉద్దేశించి చెప్పినమాట. అందుకే

నీకు కర్మయందే అధికారం. సంన్యాసంలో అధికారంలేదు. అందువల్ల నీవు కర్మలు చేస్తూ మోక్షాన్ని సాధించాలంటే ఫలంపైన ఆశలేకుండా కర్మ చేయి అని. **కర్మఫలహేతుః** అంటే కర్మఫలం ప్రాప్తించడానికి కారణం కావడం. జన్మబంధమే కర్మఫలం. ఇది రాకూడదంటే దానికి మనం కారణం కాకూడదు. కారణం కాకూడదంటే నాకు ఫలం కావాలనే భావన ఉండకూడదు. కర్మఫలం ధర్మం కావచ్చు, అధర్మం కావచ్చు. ఈ రెంటివల్ల పునర్జన్మ లభిస్తుంది. కర్తృత్వభావన లేకుండా కర్మలను ఆచరించు అని అర్థం.

మరి ఏమీ పనిచేయకుండా ఉండవచ్చుకదా! అంటే అలా ఉండకూడదు. **మా తే సంగో౽స్త్వకర్మణి** అంటే లోకవ్యవహారం నడవడానికై పనిచేయాల్సిందే కానీ సంగం (ఆసక్తి) లేకుండా పనిచేయాలి. నేను పనిచేయడంలేదు అని భావించడంలో కూడా 'నేను' ఉన్నది.

ఈ శ్లోకానికి ప్రాచీనులు చెప్పే అర్థానికి ఆధునిక పండితులు చెప్పే అర్థానికి కొంత తేడా వుంది. వేదాంతశాస్త్రం ప్రకారం మనిషి ప్రధానలక్ష్యం జననమరణ చక్రంనుండి బయటపడడం. అంటే ధర్మం, అధర్మం ఎలాంటిది అంటించుకోకుండా ఉండడం. ఇది కర్మ చేయకపోవడంవల్ల సాధ్యమవుతుంది. పని చేయకపోవడం రెండు రకాలు. ఒకటి అసలు పని చేయకపోవడం, రెండు, పనిచేస్తూ దాని ఫలితం అంటించుకోకుండా ఉండడం. మొదటిదానిలో కర్త ఉన్నాడు. రెండో పద్ధతిలో కర్త లేడు. జ్ఞానియై కర్మలు చేస్తుండడంవల్ల కర్మ చేసేవాడిని నేను కాదు, ప్రకృతిసిద్ధమైన గుణాలు ఈ పనిచేస్తున్నాయి, ఈ పని చేయడం లోకహితం అనే భావనతో పనిచేస్తుంటాడు. దీనివల్ల కర్మఫలమైన పునర్జన్మ అతనికి కలగదు. కర్మఫలాన్ని జ్ఞానంతో త్యజిస్తాడు.

ఆధునికులు దీనిని మరోరకంగా వ్యాఖ్యానిస్తారు. కర్మఫలం ఆశించకుండా ఎవరూ పనిచేయరుకదా! అందువల్ల అలా పనిచేయమని శ్రీకృష్ణుడి భావనకాదు అనే అర్థం చెబుతారు. **మా కర్మఫలహేతుర్భూః** – అనే పదానికి నేనే కర్మఫలానికి కారణం అని భావించవద్దు అని వ్యాఖ్యానిస్తాడు. అంటే ఏ కర్మను చేయాలి అని ఎంపిక చేసుకొని చేయడంవరకూ నీకు అధికారం లేదా ఛాయిస్ ఉంది. దాని ఫలంపై నీకు అధికారం అనగా నియంత్రణ లేదు. కర్మఫలానికి ఇతర పరిస్థితులు, దైవం అనుకూలించాలి. మనం చేసే పని ఫలితం ఎన్నో పరిస్థితులపై ఆధారపడి వుండవచ్చు. అవి నీ చేతిలో లేవు. ఆశించిన ఫలితం రానప్పుడు దానిని నీ అపజయం కింద భావించవద్దు అనే అర్థంలో వివరిస్తారు.

కర్మఫలాన్ని త్యాగం చేయడం అని గీతలో చెప్పింది జ్ఞానం కోరుతూ కర్మ చేసేవాడి గురించి. జ్ఞానం కోరేవాడికి మనోభావన ఇలా ఉండాలి అని శాస్త్రం చెబుతుంది. జ్ఞానంతో సంబంధం లేకుండా కేవలం జీవితంలో అభ్యున్నతి అనే మార్గంలో ఉన్నవాడికి శాస్త్రవిషయాన్ని కొంచెం వక్రీకరించి చెప్పడం సరైనది కాదని నా భావన.

కర్మకు, కర్మయోగానికి ఉన్న తేడా ఈ క్రిందివిధంగా గమనించవచ్చు.

| కర్మ | కర్మయోగం |
| --- | --- |
| – ఫలాన్ని ఆశించడం | – ఫలాన్ని ఆశించకపోవడం |
| – మోక్షం ప్రస్తావనలేదు. | – లోకహితంకోసం పనిచేయడం క్రమేణ చిత్తశుద్ధిద్వారా మోక్షం |
| – అభ్యుదయం కోసం కర్మ | – మోక్షసాధనగా కర్మ |

ఇక్కడ పాశ్చాత్య దర్శనశాస్త్రాల్లో చెప్పే ఒక విషయం గమనించాలి. మనిషికి కర్మఫలం (destiny) ఎప్పుడో నిర్ధారింపబడినట్లయితే అతనికి కర్మను ఎంపిక చేసుకోవడంలోకూడా అధికారం ఉండదు. ఒక యంత్రంలో ప్రోగ్రామ్ అయిన పద్ధతిలాగా వ్యవహరిస్తూ ఉండాలి. కర్మను ఎంచుకోవడానికి మనిషికి స్వేచ్ఛ ఉన్నదా? లేదా అనే విషయంలో పాశ్చాత్య వేదాంతులు free will and determinism అనే పదాలను వాడతారు. వేదాంతశాస్త్రం మనిషికి కర్మను ఎంపిక చేసుకోవడంలో స్వేచ్ఛను అంటే free willను అంగీకరిస్తుంది. దాని ఫలితం కర్మ చేసేవిధానాన్నిబట్టి ఉంటుంది. కేవలం స్వార్థంకోసం కర్మను ఆచరిస్తే ఫలితం అతనికి లభిస్తుంది. కర్మయోగంగా చేస్తే ఫలితం లభించదు. అంటే కర్మఫలానికి హేతువు కాదు కనుక. కేవల కర్మవాదం అనేది పై శ్లోకాన్ని తప్పుగా అర్థం చేసుకోవడంవల్ల దౌర్భాగ్యవశాత్తూ ప్రచారంలోకి వచ్చిన వాదం.

ఈ మొత్తం విశ్లేషణలో తేలినదేమంటే మూడు రకాల వ్యక్తులుంటారు. 1) జ్ఞానమార్గంలో ఉంటూ కర్మలను సంన్యసించి మోక్షం సాధించేవారు. 2) కర్మయోగి. ఇది మళ్లీ రెండు రకాలు. ఎ) జ్ఞానియై నిష్కామకర్మ చేస్తూ జనకమహారాజువలె మోక్షాన్ని పొందేవాడు. బి) జ్ఞానంకోసం ప్రయత్నిస్తూ నిష్కామకర్మ చేస్తూ క్రమేణ ముక్తిని సాధించేవాడు. 3) మోక్షంజోలికి పోకుండా కర్మయోగంలోకి పోకుండా కేవలం స్వంత అభ్యున్నతికోసం పనిచేసేవాడు. ఇతడు జననమరణచక్రంలో తిరుగుతూ ఉంటాడు. అర్జునుడికి మొదటి రెండు మార్గాలను గురించి చెప్పి నీ స్వభావానికి అనుకూలించేది రెండోమార్గం అని కృష్ణుడు చెప్పడం జరిగింది.

కర్మయోగాన్ని ఇంకా వివరిస్తూ 48వ శ్లోకంలో **యోగస్థః కురు కర్మాణి** అన్నారు. అంటే యోగంలో ఉంటూ కర్మలను ఆచరించు. కేవలం ఈశ్వరార్పణబుద్ధితో సంగాన్ని విడిచి కర్మలు చేయి. ఫలం సిద్ధించినా సిద్ధించకపోయినా సమానంగా చూడు, దుఃఖం చెందకు అని అర్థం. **సమత్వం యోగ ఉచ్యతే** అంటే సమబుద్ధితో ఉండడమే యోగం. దీనిని చెప్పడం సులభం. ఆచరించడం కష్టం. అందువల్ల దీన్ని గురించే ప్రయత్నంలో ఉండు అంటూ – ఈ సమత్వబుద్ధితో ఉండేవాడే సుకృతము, దుష్కృతము రెండింటినీ వదలివేస్తాడు. **యోగః కర్మసు కౌశలమ్** కర్మలను ఆచరించడంలో నేర్పరితనం అంటే అదే అని అర్థం. నేర్పరితనమంటే కర్మలు ఆచరిస్తూ కర్మఫలాన్ని తప్పించుకుంటూ ఉండడం. కర్తృత్వ, భోక్తృత్వ భావన లేకుండా కర్మఫలాన్ని తప్పించుకోవడం. బంధహేతువైన కర్మను మోక్షహేతువుగా మార్చడం (క్రమేణా చిత్తశుద్ధి, జ్ఞానోత్పత్తిద్వారా) కౌశలం, అంటే నేర్పరితనం.

ఈవిధంగా కర్మలు చేయడంవల్ల ఏమౌతుంది అని మళ్లీ 51వ శ్లోకంలో **జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్** అంటే జన్మమనే బంధంనుండి ముక్తులై ఎలాంటి కష్టంలేని స్థానాన్ని పొందుతారు అని కూడా చెప్పారు.

వేదమార్గాలే వ్యసనంగా ఉన్నవాళ్లగురించి ఈ క్రిందిశ్లోకం –

> **శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
> **సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥ 53**

శృతుల్లో చెప్పిన అనేక సాధ్యాలు, సాధనాలు[1] వీటన్నింటివల్ల మీ మనస్సు విక్షేపం చెందివుంటుంది. వేదాల్లో కర్మకాండ మొత్తం స్వర్గాదిఫలాలని గురించే తెలుపుతుందిగానీ మోక్షాన్ని గురించి తెలుపదు.

### స్వర్గం - మోక్షం - తేడా

ఇక్కడ మరోవిషయం గమనించాలి. వేదాంతశాస్త్రం స్వర్గం గురించి చెప్పదు. మోక్షం గురించి చెబుతుంది. యజ్ఞము, దానము, ఇంకా పుణ్యకార్యాలవల్ల దొరికేది స్వర్గం. ఆత్మవిచారంవల్ల లభించేది మోక్షం. మోక్షం కొత్తగా లభించేది కాదు. మనలో ఉన్న పూర్ణత్వాన్నే గ్రహించడం. స్వర్గమంటే పుణ్యకర్మఫలితాన్ని అనుభవించే భోగస్థానం (నరకానికి వ్యతిరేకమైనది). దేవేంద్రుడు, రంభ, ఊర్వశి, మొదలైనవారు, మంచి

---

1. సాధ్యమంటే సాధించవలసినది, స్వర్గంలోకం, సత్యలోకం మొదలైనవి. సాధనాలు అంటే దానికి అనుసరించాల్సిన మార్గాలు, అంటే క్రతువులు, యజ్ఞాలు మొదలైనవి.

పానీయాలు, సుఖాలు ఉన్న స్థలం. ఇవికాక శివలోకం, వైకుంఠం మొదలైన స్థలాలు. ఇవన్నీ మామూలుగా మతం (religion) స్థాయిలో చెప్పుకునే విషయాలు. మనం చేసుకున్న పుణ్యపాపాల మూటపై ఆధారపడతాయి. పుణ్యం తరిగిపోయిన తర్వాత మళ్లీ ఏదొక జన్మలో భూమికి రావడం, అలాగే పాపం తరిగిపోయిన తర్వాత ఏదొక జన్మలో భూమికి రావడం జరుగుతుంది.

మోక్షంలో రంభాదులు ఉండరు. కోరికలే లేని స్థితి. స్వర్గనరకాల జోలికిపోని కేవల ఆనందస్థితి. ముఞ్చ్ అనే ధాతువుకు వదలివేయడం అని అర్థం. మోక్షమంటే పుణ్యంగానీ, పాపంగానీ అంటనిస్థితి. అంటే కర్మఫలం, కర్మబంధం లేనిస్థితి. ఈ స్థితి జ్ఞానంద్వారా సాక్షాత్తుగానూ, కర్మయోగంద్వారా కొంత ఆలస్యంగానూ లభించేది.

స్వర్గాన్ని మాత్రమే కోరుకొనేవాళ్లని ఇదివరకే శ్రీకృష్ణుడు అపహాస్యం చేశాడు కూడా. **వేదవాదరతాః** (శ్లో. 42) అంటే వేదాల్లో చెప్పిన యజ్ఞాల్లో మునిగితేలుతున్నవారు, **కామాత్మానః** అంటే కోరికలే స్వభావంగా కలవారు, **స్వర్గపరాః** అంటే స్వర్గమే గొప్పది అనుకునేవాళ్లు అని అపహాస్యం చేశాడు. అలాంటివారికి జ్ఞానయోగంలోగానీ, కర్మయోగంలోగానీ బుద్ధి కుదరదు అని కూడా చెప్పాడు. (శ్లో. 44)

పై సాధ్యాలు, సాధనాలవల్ల మనిషి మనస్సు విక్షేపం (confused state) చెందివుంటుంది. దీనిని ఎప్పుడైతే ఆత్మజ్ఞానంలో నిలుపుతావో అప్పుడు నీకు కర్మయోగం కలుగుతుంది. (శ్లో. 53) దీనివల్ల కర్మయోగం ప్రారంభదశలో జ్ఞానం ఉండకపోయినా పరిపాకదశలో జ్ఞానం లభించడంవల్ల మోక్షమనే ఫలం ఇస్తుంది అని చెప్పబడింది. ఇక్కడితో కర్మయోగం గూర్చి సంక్షిప్తపరిచయం ముగిసింది.

**స్థితప్రజ్ఞుని లక్షణం**

వేదవాదరతుడు కాకుండా మనస్సును స్థిరంగా ఉంచు అని మళ్ళీ మళ్ళీ కృష్ణుడు చెప్పడంతో అలాంటి స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు, అతని లక్షణాలేమిటి? అని అర్జునుడు అడిగాడు. ఇదొక ప్రసిద్ధ శ్లోకం –

**స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥ 54**

స్థిత అంటే స్థిరంగా నిలిచిన, ప్రజ్ఞ అంటే ఆత్మజ్ఞానం కలవాడు స్థితప్రజ్ఞుడు. **అహమస్మి పరంబ్రహ్మ ఇతి ప్రజ్ఞా యస్య సః** అంటే నేను బ్రహ్మను, అని ఎవరి జ్ఞానం స్థిరంగా ఉంటుందో అతడు స్థితప్రజ్ఞుడు అని వ్యాఖ్యాతలు అర్థం చెప్పారు. (స్థితప్రజ్ఞుడు,

ఆత్మజ్ఞాని, బ్రహ్మవేత్త, కర్మయోగి ఇవన్నీ పర్యాయపదాలు.) అతనిని ఇతరులు ఎలా గుర్తిస్తారు, అతని ప్రవర్తన ఎలాగుంటుంది అని కూడా అర్జునుడి ప్రశ్న.

సమాధానం కొంత చిత్రంగా ఉంటుంది. అర్జునుడు స్థితప్రజ్ఞుని లక్షణాలు అడిగితే భగవానుడు **ప్రజహాతి యదా కామాన్** ఇత్యాది శ్లోకాలతో సాధనాలగురించి చెప్పాడు. లక్షణాలు అడిగితే సాధనాలు ఎందుకు చెప్పారు. అంటే వేదాంతశాస్త్రంలో ఏవి సాధనములో అవే లక్షణాలు అని వ్యాఖ్యాతలు వివరించారు. బ్రహ్మజ్ఞాని శమం, దమం, అహింస, కోరికల్లేకుండుట మొదలైన లక్షణాలు కలిగివుంటాడు. జ్ఞానానికి సాధనాలు కూడా ఇవే. నిరంతర అభ్యాసంవల్ల మనిషిస్వభావాన్ని మెల్లగా మార్చుకోవచ్చు అనేదే ఇక్కడ సూత్రం. శ్రీకృష్ణుడు చెప్పిన సాధనాలు / లక్షణాలు ఇవి.

1) కోరికలను వదలి ఆత్మయందే సంతుష్టిగా ఉండడం. **ఆత్మన్యేవాత్మనా తుష్టః.** (శ్లో. 55) ఇతనినే ఆత్మారాముడని అంటారు.

2) సుఖదుఃఖాలలో సమంగా ఉండువాడు. సుఖాన్నిగానీ, దుఃఖాన్నిగానీ పొందక సాక్షిగా సమదృష్టితో చూచువాడు. (శ్లో. 56) సంతోషం, దుఃఖం లేవు గనుక ప్రేమ, ద్వేషము రెండూ లేనివాడు.

3) కూర్మవృత్తి – అంటే తాబేలు తన అవయవాలన్నీ తనలోకి ఇముడ్చుకొన్నట్లు తన ఇంద్రియాలను విషయాలనుండి వెనుకకు మరల్చువాడు. (శ్లో. 58) ఇలా ఇంద్రియ నిగ్రహంలో ఉన్నవాడికి జ్ఞానం కలగగానే బీజావస్థలో ఉన్న విషయాసక్తి కూడా తొలగిపోతుంది. (శ్లో. 59) అంటే నిర్బీజంగా తయారౌతుంది.

4) ఇలా ఇంద్రియాలను నిగ్రహించి పరబ్రహ్మయందే మనస్సు ఉంచినవాడు స్థితప్రజ్ఞుడు. (శ్లో. 61) ఈ శ్లోకంలో **మత్పరః** – అనే పదంలో 'నేను' అనే పదం పరబ్రహ్మను సూచిస్తుంది. శ్రీకృష్ణుడిని కాదు.

5) ఎంతటి విద్వాంసుడైనా, ఎంత ప్రయత్నం చేసినా ఇంద్రియాలు అతన్ని విషయాలవైపు లాగుతుంటాయి. ఒకసారి మనస్సు వాటిపైకి వెళితే వాటిపట్ల సంగం (ఆసక్తి) పుడుతుంది. సంగం వల్ల అవి కావాలనే కోరిక, ఆ కోరికకు ఏదైనా అడ్డంకి కలిగితే దానిపై క్రోధం (శ్లో. 22) ఇలా పరంపరగా కామము, క్రోధము వస్తాయి. క్రోధంవల్ల వస్తుజ్ఞానం నశిస్తుంది. దీనినే మోహం అంటారు. సమ్మోహం వల్ల స్మృతినాశం. దానివల్ల మనిషే నశిస్తాడు. (శ్లో. 63) కాబట్టి వస్తువులనుండి ఇంద్రియాలను నిగ్రహించడమే సాధకుడు చేయాల్సిన పని. అదే జ్ఞాని లక్షణం.

6) ప్రసాదబుద్ధి కలవాడు. రాగద్వేషాలు లేకుండా ఇంద్రియాలని ఆత్మవశంలో ఉంచుకొని కర్మలు చేసేవాడు ప్రసాదం పొందుతాడు. (శ్లో. 64) ప్రసాదమంటే ప్రసన్నత, స్వాస్థ్యం అని అర్థాలు చెప్పారు. స్వస్థః అంటే తన స్వరూపంలో తాను ఉన్నవాడు. తన స్వరూపమైన పరబ్రహ్మలో ఉన్నవాడు.

7) ప్రసాదబుద్ధిలో ఉన్నవాడికి వెంటనే స్థితప్రజ్ఞత్వం సిద్ధిస్తుంది. (శ్లో. 65)

8) అందరికీ చీకటిగా ఉన్నది, ఇతనికి పగలుగా కనిపిస్తుంది. అందరికీ పగలు ఇతనికి చీకటిగా కనిపిస్తుంది. ఆత్మజ్ఞానం అందరికీ కలగనిది. అంటే చీకటిలా ఉండేది. అది ఇతనికి స్పష్టంగా తెలుస్తుంది. అందరికీ కనిపించే ప్రపంచం, విషయవాంఛలు ఇతనికి చీకటిగా కనిపిస్తాయి. అజ్ఞానమార్గాలుగా కనిపిస్తాయి. (శ్లో. 69) అజ్ఞానంలో లోకులు మేల్కొనివున్నప్పుడు ఇతనికి అది చీకటి. దానికి దూరంగా ఉంటాడు.

9) ఎన్ని నదుల నీరు వచ్చి చేరినా సముద్రం నిశ్చలంగా ఎలాంటి మార్పు లేకుండా ఉన్నట్లు సమస్తమైన కామాలు ఇతనిలో విలీనమవుతాయి. అలాంటివాడు స్థితప్రజ్ఞుడు. (శ్లో. 70) స్థితప్రజ్ఞుడు పరిపూర్ణుడు, అకామహతుడు, బయటివస్తువుల నుండి ఆనందం కోరనివాడు.

10) అహంకారం – నేను అనేభావన, కర్తృత్వభావన లేనివాడు. కోరికలను వదలి ఉండువాడు, శాంతిని పొందుతాడు.

పై చెప్పిన గుణాలు ఉన్నవాడే స్థితప్రజ్ఞుడు. అతని స్థితియే **బ్రాహ్మీస్థితి**. (శ్లో. 72) బ్రహ్మయందు నిలిచియుండే స్థితి. అట్టివానికే మోక్షం. అంటే సకలదుఃఖాలనుండి విముక్తి, జన్మబంధం నుండి విముక్తి. ఈ స్థితిలో మోహానికి తావులేదు (ఒకదాన్ని మరోవిధంగా చూడడం మోహం). దీనియందున్నవాడు బ్రహ్మనిర్వాణం పొందుతాడు. (శ్లో. 72) వానం అంటే గమనం. నిర్వాణం అంటే చలనరహితస్థితి. ఇదియే జీవన్ముక్తస్థితి అన్నిటికన్నా ఉత్కృష్టస్థితి.

ఇలాగ భగవద్గీతలో అతిముఖ్యంగా ప్రతిపాదింపబడే జ్ఞానయోగం, కర్మయోగాల గూర్చి సంక్షిప్తంగా ఈ అధ్యాయంలో చెప్పబడింది.

❖ ❖ ❖

# మూడవ అధ్యాయము

# కర్మయోగము

కర్మయోగమంటే కర్మను ఈశ్వరార్పణబుద్ధితో అనగా ఫలంపై ఆసక్తి లేకుండా చేయడం అని తెలుసుకున్నాం. దానినే వివరంగా ఈ అధ్యాయంలో చెబుతారు.

ఈ అధ్యాయంలో 43 శ్లోకాలున్నాయి. దీన్ని స్థూలంగా మూడు విభాగాలుగా చూడవచ్చు.

మొదటి 20 శ్లోకాలు కర్మయోగాన్ని మరింత వివరించాయి.

21–35 శ్లోకాలు ఉత్తమపురుషుని ప్రవర్తన. ఆదర్శమైన వ్యక్తి ఎలా వ్యవహరిస్తాడు.

36–43 శ్లోకాలు కామక్రోధాదులగురించి చర్చ.

ఇలా ఈ అధ్యాయం మొత్తం కర్మయోగం చెప్పడానికే ఉద్దేశించబడింది.

రెండవ అధ్యాయంలో చెప్పిన విషయాన్ని విని అర్జునుడికి ఒక సందేహం కలిగింది. కర్మయోగంకంటే జ్ఞానయోగం శ్రేయస్కరమైనది అని చెప్పావు కదా మరి నన్నెందుకు కర్మయోగంలో ఉండమంటున్నావు అంటూ ఏది శ్రేయస్కరమైనదో దాన్ని చెప్పు (శ్లో. 2) అని కృష్ణుణ్ణి ప్రార్థించాడు. శ్రీకృష్ణుడిలా అన్నాడు.

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3**

అంటే సాంఖ్యులకు (సంన్యాసులకు) జ్ఞానయోగం, యోగులకు (కర్మ చేయవలసిన వారికి) కర్మయోగం అని రెండు పద్ధతులున్నాయి. ఊరకే కర్మలను సంన్యసించడంవల్ల (అంటే ఆత్మజ్ఞానంలేని సంన్యాసంవల్ల మాత్రమే) మోక్షం కలుగదు. మధుసూదన సరస్వతి అనే పండితుడు దీన్ని వివరిస్తూ ఇవి నిజానికి రెండు నిష్ఠలు కావు, ఒకే నిష్ఠలో రెండు దశలన్నాడు. ఒకటి సాధనదశ. రెండవది సాధ్యదశ. కర్మయోగం సాధనదశ. చిత్తశుద్ధికలిగి జ్ఞానోత్పత్తి అయిన తర్వాత అదే సాధ్యదశగా మారుతుంది. అందువల్లనే భగవానుడు మున్ముందు సాంఖ్యం, యోగం ఒకటే అని పదేపదే చెప్పడం చూస్తాం.

కేవలం కర్మయోగంవల్ల మోక్షం రాదు. కానీ దానివల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. యజ్ఞాలు, యాగాలు మొదలైనవాటిలో అంగంగా ఉన్న దానధర్మాదులవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తం నిర్మలంగా లేకుంటే జ్ఞానప్రాప్తి లేదు. ఇదెలాగంటే మలినమైన అద్దంపై ప్రతిబింబం కనబడదు. అందుకని మాలిన్యాన్ని తొలగించాలి. అది తొలగించినంతమాత్రాన ప్రతిబింబం ప్రతిఫలించదు. దానిపై దీపపు వెలుగు పడాలి.

అర్ధాన్ని శుభ్రపరచడం వరకు కర్మ. దీపం వెలిగించడం అంటే వేదాంతవాక్యాలను అర్థం చేసుకొని వాటిని జీర్ణించుకోవడం. ఇది సరైన ఫలితాన్నిస్తుంది. అంటే కర్మలద్వారా కర్మశూన్యత సాధించడం.

కర్మలను అసలే ప్రారంభించకపోవడంవల్ల నైష్కర్మ్యం (కర్మలు లేకపోవడం) కుదరదు. జ్ఞానంలేనివాడు కేవలం కర్మత్యాగంచేత కర్మయోగం ఇచ్చే ఫలాన్ని పొందలేడు (శ్లో. 4). కర్మలు వదలివేసినవాడు 'నేను కర్మలను వదలేశాను' అంటూ నేను అనే భావన (కర్తృత్వభావన)లో ఉంటాడు. వదిలేయడంకూడా ఒక కర్మయే. అందువల్ల అతనికి నైష్కర్మ్యం (actionless state) కుదరదు. అంతేగాక మనిషి ఎల్లప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటాడు. **న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్** (శ్లో. 5) మనిషి ఊరకుందామన్నా ప్రకృతి, అంటే సత్త్వరజస్తమోగుణాల ప్రభావం అతణ్ణి ఊరుకోనివ్వదు (శ్లో. 5). ఒకవేళ ప్రయత్నపూర్వకంగా బాహ్యేంద్రియాలను నిగ్రహించి కూర్చున్నా లోపల ఇంద్రియమైన మనస్సు ఊరుకోదు. అది విషయాలపై వెళుతూనే ఉంటుంది. అలాంటివాణ్ణి మిథ్యాచారుడు (hypocrite) అంటారు (శ్లో. 6). అందువల్ల ఇంద్రియాలను మనస్సుతోపాటు నియమించి ఆ తర్వాత ఆసక్తి లేకుండా రెండవ అధ్యాయంలో చెప్పినవిధంగా కర్మలు చేసినా ఫరవాలేదు అది కర్మయోగమవుతుంది. కాబట్టి ప్రతివ్యక్తీ తన స్వభావాన్ని అనుసరించి వచ్చిన కర్మను తప్పక చేయాలి (శ్లో. 8). యోధుడు యుద్ధం చేయాలి, మంత్రి మంత్రాంగం నెఱపాలి. న్యాయస్థానం వారిపని చేయాలి. ఈ శ్లోకంలో నియతకర్మ అనే పదం వాడబడింది. అంటే ఎవడు ఏ పని చేయడానికి అధికారం ఉన్నవాడో అది నియతమైనకర్మ. అంటే తప్పక చేయాల్సిన కర్మ. కర్మలే ఆచరించకపోతే జీవిక కూడా అసాధ్యం (శ్లో. 8).

### యజ్ఞం కోసం కర్మ

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం చెప్పబడింది. కర్మ ఎట్టి సందర్భంలో బంధకం (binding nature) అవుతుంది, ఏ పరిస్థితిలో బంధించదు అని చర్చ. యజ్ఞంకొరకు చేసే పని బంధకంకాదని సిద్ధాంతం (శ్లో. 9). యజ్ఞమంటే ఏమిటి? మామూలుగా ఋత్విక్కులు, యజమాని, అనేక యజ్ఞసంభారాలు సేకరించి వివిధ వేదమంత్రాలను ఉచ్చరిస్తూ అగ్నిలో ఆహుతులివ్వడం అని మనం చూస్తుంటాం. దీనికీ, కర్మయోగానికి సంబంధం ఏమిటి? అని ఈ అధ్యాయంలో చర్చ. ఈ అధ్యాయంలోనూ తర్వాతిదయిన జ్ఞానయోగ అధ్యాయంలోనూ శ్రీకృష్ణుడు యజ్ఞశబ్దానికి విస్తృతమైన అర్థాన్ని చెప్పాడు.

ప్రస్తుత శ్లోకం

**యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబన్ధనః।**
**తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసంగః సమాచర ॥ 9**

యజ్ఞం అంటే భగవానుడు అని అర్థం చెప్పారు **యజ్ఞో వై విష్ణుః** అనే శ్రుతినిబట్టి. **విష్ –** అనే ధాతువువల్ల అంతా వ్యాపించి వున్నవాడు అని అర్థం. యజ్ఞంకొరకు కర్మ అంటే ఈశ్వరార్పణబుద్ధితో చేసే కర్మ. అంటే ఫలంపై ఆసక్తి లేకుండా చేసే కర్మ. అందుకే **ముక్తసంగః –** కర్మఫలంపై ఆసక్తిలేనివాడవై కర్మను ఆచరించు అన్నారు.

**ప్రకృతి చక్రం**

తర్వాతి శ్లోకాల్లో (10–16) యజ్ఞమనే పదాన్ని సాధారణంగా మనం గమనించే అర్థంలో వాడారు. అంటే వేదంలో చెప్పబడిన వాజపేయం, జ్యోతిష్టోమం మొదలైన యజ్ఞాలు. దేవతలను ఉద్దేశించి చేయబడేవి. వీటివల్ల జగత్తు పరిపుష్టి చెందుతుంది. సృష్టిలో అన్ని వస్తువులకు ఉన్న పరస్పర ఉపకార్య – ఉపకారకభావం (principle of interdependence) , ఒకదానిపై ఒకటి ఆధారపడివుండడం ఇక్కడ చెప్పబడింది. సృష్టికర్త ప్రజలతోపాటే యజ్ఞాన్ని సృష్టించాడు (శ్లో. 10). మనిషిని అందులో భాగంగా చేశాడు. సృష్టిలో ఇతర శక్తులతో సహకరించినప్పుడే ఇతనికి మనుగడ. సృష్టినియమాలకు వ్యతిరేకంగా వెళ్ళినప్పుడు ఇతనికి మనుగడ లేదు. దీనినే ః

**దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వః।**
**పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ ॥ 11**

దేవతలు, ఇంద్రాదులు. వర్షానికి కారణభూతులైనవారు. యజ్ఞంద్వారా దేవతలను సంతృప్తిపరచాలి. అంటే దేవతలు అనే సృష్టిలోని శక్తులను మనం గౌరవించాలి. అప్పుడే అవి మనకు సహకరిస్తాయి. ఇక్కడ యజ్ఞశబ్దాన్ని సంప్రదాయార్థంలో దేవుళ్లు అని అనుకోవచ్చు. లేదా ఒక రూపకంగా (metaphor) గ్రహించి ప్రకృతిశక్తి అని కూడా గ్రహించవచ్చు. ప్రకృతినుంచి గ్రహించడమేకాదు ప్రకృతికి ఇవ్వాలి అనే అర్థం. యజ్ఞంలో భాగంగా దానం, తపస్సు మొదలైనవి లోకులకు ఉపకరించేవి. ఈవిధంగా పరులకుపయోగించే (యజ్ఞం) చేస్తున్నవాడు పాపాలనుండి ముక్తుడవుతాడు. ఇతరులకు సహకారం చేయనివాడు పాపాన్ని పొందుతాడు (శ్లో. 13).

యజ్ఞమనే కర్మకు వేదమే ఉత్పత్తిస్థానం. **కర్మ బ్రహ్మోద్భవం** (శ్లో. 15) అన్నారు. ఈ వేదం పరబ్రహ్మనుండి పుట్టింది. అనగా ప్రకృతినియమాన్ని తెలిపే గ్రంథం వేదం. అందుచేత పరబ్రహ్మతత్త్వమే యజ్ఞంలో ఉందని గ్రహించాలి (శ్లో. 15).

అన్నంవల్ల జీవులు జీవించడం, ఆ అన్నం మేఘంవల్ల పుట్టడం, ఆ మేఘం యజ్ఞంవల్ల పుట్టడం, ఆ యజ్ఞం మనిషి అనుష్ఠించే కర్మ కావడం అనేది ఒక చక్రం. ఈ చక్రానికి మిగతావన్నీ తోడ్పడతాయి. దీనికి విఘాతం కలిగించగలిగింది మనిషి ఒక్కడే (శ్లో. 16). కాబట్టి ఈ విఘాతాన్ని కలిగించేవాడిని **అఘాయుః** - అంటే పాపజీవితం కలవాడు, **ఇంద్రియారామః** - ఇంద్రియాల్లోనే రమిస్తుండేవాడు అన్నారు (శ్లో. 16). అలాంటి ఇంద్రియలోలుడి జీవితం వ్యర్థం. మనిషికి మాత్రమే తను కోరుకునే విషయాలపై స్వేచ్ఛ ఉందని పైన చెప్పుకున్నాం. ఆ స్వేచ్ఛతో మనిషి ప్రకృతి చక్రానికి విఘాతం కలిగించకూడదని ఈ ప్రకరణం అర్థం.

**జ్ఞానంతో కర్మ చేయడం**

17వ శ్లోకంనుండి మళ్లీ కర్మయోగం ప్రస్తావించబడింది. ఎవడైతే ఆత్మరతుడిగా (ఆత్మయందే నిష్ఠగలవాడు) ఉంటాడో అతనికి కార్యం అనేది ఉండదు (కర్మ వుంటుందిగానీ కార్యముండదు). పరమార్థతత్త్వాన్ని తెలుసుకొని కర్మను చేయాలని అర్థం. దీనినే ఉపనిషత్తులో **జ్ఞాత్వా కర్మాణి కుర్వీత** అన్నారు. అలాంటివాడికి కర్మనుంచి ఏ ప్రయోజనమూ లేదు (శ్లో. 18). కాబట్టి చేయదగిన (విధించబడిన) కర్మను అసక్తుడవై ఆచరించు అని మళ్లీ అర్జునుడికి చెబుతున్నాడు.

ఇందుకు ఒక ఉదాహరణ కూడా ఇవ్వబడింది.

**కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥ 20**

జనకాదులు కర్మను ఆచరించియే సిద్ధిని (మోక్షాన్ని) పొందారు. కాబట్టి నీవు కూడా లోకోపకారాన్ని గమనిస్తూ కర్మ చేయాలి. లోకసంగ్రహం అంటే **లోకస్య ఉన్మార్గ ప్రవృత్తి నివారణమ్** - అని వ్యాఖ్యాతలన్నారు. లోకాన్ని చెడుమార్గంనుండి నివారించడం.

ఈ అధ్యాయం మొదట్లో అర్జునుడి శంక గమనించాం, జ్ఞానయోగం గొప్పదా, కర్మయోగం గొప్పదా అని. అందుకు ఈ శ్లోకంలో జనకుడి ఉదాహరణ. జనకుడు జ్ఞానియైన రాజర్షి. ఇతనిపేరు బృహదారణ్యకోపనిషత్తులో అలాగే భారతం, యోగవాసిష్ఠం లాంటి గ్రంథాల్లో విస్తృతంగా కనిపిస్తుంది. ఇదివరకు చెప్పిన విషయాన్నే కృష్ణుడు ఇక్కడ మళ్లీ చెప్పాడు.

కర్మయోగం రెండు రకాలు :

- జ్ఞానంతో కూడిన కర్మయోగం (జ్ఞానియై కూడా లోకోపకారానికై కర్మ చేయడం)
- సాధకుడిగా (మోక్షాన్ని కోరుతూ) కర్మయోగం చేయడం.

జ్ఞానంతో కూడిన కర్మలో మోక్షమిదివరకే సిద్ధించింది. జ్ఞాని కర్మ పేరుకు మాత్రమే కర్మ. దాన్ని కర్మాభాస అంటారు (కర్మలాగా కనిపిస్తుంది). ఇది సాక్షాత్తూ మోక్షమే.

సాధకుడిగా చేసే కర్మయోగంలో చిత్తశుద్ధి కలగడంద్వారా మోక్షానికి సహకారిగా ఉంటుంది. కర్మ పరంపరయా సాధనం అంటారు.

జనకాదులు కర్మ చేసుకొనే మోక్షం పొందారు అనే వాక్యాన్ని ఎలా గ్రహించాలి? జనకుడు ఒకవేళ జ్ఞానియై కర్మ చేసివుంటే అతనికి జ్ఞానంవల్లనే సిద్ధి అని భావించాలి. జ్ఞాని కాకుండా కర్మ చేసివుంటే క్రమేణ చిత్తశుద్ధిద్వారా సిద్ధి పొందాడని అనుకోవాలి. అలాగే నీవు (అర్జునుడు) కూడా నీకు ప్రాప్తించిన కర్మను యోగబుద్ధితో ఆచరించు అని అర్థం.

**లోకోపకారం కొరకు కర్మ**

తర్వాతి కొన్ని శ్లోకాల్లో లోకసంగ్రహం కొరకు కర్మ ఎలాంటిది అని చెప్పబడింది. మనం లోకంలో ఆదర్శప్రాయులుగా (role models)కొందరిని చూస్తుంటాం. వారివల్లనే మనం ప్రభావితులమై సన్మార్గంలో కొంతవరకు ప్రవర్తిస్తుంటాం. మనిషి ఉత్తమమార్గంలో నడవడానికి శాస్త్రంలో చెప్పిన నియమాలే కాకుండా ఈ సత్పురుషులు కూడా కారణం. దీనినే ఒక ప్రసిద్ధశ్లోకంలో చెప్పారు.

**యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః ।**
**స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ 21**

శ్రేష్ఠపురుషుడు ఎలాగ వ్యవహరిస్తాడో లోకులు దానినే అనుసరిస్తారు. అతడు తన జీవితంలో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తాడో లోకం దానిని అనుసరిస్తుంది.

మరొక ఉదాహరణ సాక్షాత్తూ శ్రీకృష్ణుడే.

**న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।**
**నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22**

లోకసంగ్రహం కోసం పనిచేయాలా? వద్దా? అనే విషయంలో నన్నే గమనించు. నాకు మూడు లోకాల్లో ఎలాంటి కర్తవ్యమూ లేదు. **నానవాప్తం** – నాలో ఇదివరకే లేనిదీ, **అవాప్తవ్యం** – పొందదగినదీ, ఏదీలేదు. అయినా నేను కర్మలు ఆచరిస్తూనే ఉన్నాను. నేను కర్మలు ఆచరించకపోతే ఇతరులు కూడా నన్నే అనుసరిస్తారు. లోకధర్మాన్ని నేను సంకరం చేసినవాణ్ణవుతాను. ఆవిధంగా ప్రజలను నాశనం చేసినవాణ్ణవుతాను (శ్లో. 24). కావున

**సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।**
**కుర్యాద్విద్వాంస్తథాఽసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥ 25**

నీవు నాలాగా ఆత్మవేత్తవైనా (జ్ఞానియై కర్మ చేసినా) కాకున్నా (సాధకుడిగా కర్మ చేసినా) ఇతరుల మేలుకైనా, పనిచేయవలసిందేకదా! అందువల్ల జ్ఞానంలేనివారు ఎలాగైతే స్వార్థంగురించి కర్మచేస్తారో జ్ఞానియైనవాడు లోకసంగ్రహం దృష్టిలో వుంచుకొని కర్మచేయాలి. కాబట్టి సమాజంలో ఆదర్శపురుషులు ఊరకే కూర్చొనకుండా ఆదర్శవంతమైన కర్మలు చేయడం అవసరం (ఊరకున్నవాడు ఉత్తముడని భావించరాదు). అలా చేస్తున్నప్పుడు ఇతరులు ఏ మంచిపని చేస్తున్నా ప్రోత్సహించాలి. వారిలో బుద్ధిభేదం (కర్మ అవసరంలేదు అని చెప్పి, లేదా అనవసరంగా తప్పులెంచడంద్వారా వారి మనస్సులో భ్రాంతి కలిగించడం) చేయకూడదు. వారు కర్మసంగులైనా సరైనపని చేస్తున్నంతవరకు జ్ఞానియైనవాడు **జోషయేత్** – ఉత్సాహపరుస్తూ ఉండాలి. తను నిష్కామకర్మ చేస్తూ మిగతావారిని ఉత్సాహపరుస్తూ ఉండాలి.

**కర్త ఎవరు?**

సృష్టి అంతా బ్రహ్మనుండి వచ్చిందని మొదట్లో చెప్పుకున్నాం. బ్రహ్మనుండి ఎలా వచ్చింది? కార్యకారణసంబంధం మళ్లీ ఒకసారి చూద్దాం. మట్టినుండి కుండ తయారైనప్పుడు మట్టిని ఉపాదాన కారణం (material cause) అంటారు. కుండ కార్యం (effect). కుమ్మరిని నిమిత్తకారణం (efficient cause) అంటారు. భగవంతుడు సృష్టి చేశాడన్నప్పుడు కుమ్మరివాడిలాగ తనకంటే భిన్నమైన పదార్థాన్ని దేన్నో తీసుకొని ఈ విశ్వాన్ని తయారుచేశాడు. దానితో ఒక మట్టిబొమ్మను తయారుచేసి అందులో ప్రాణాన్ని ఊదాడు అంటే మామూలు 5వ తరగతిస్థాయిలో సరిపోతుంది. కానీ వేదాంతశాస్త్రం అలా అనడానికి వీల్లేదు. భగవంతునికంటే భిన్నమైన పదార్థముందని అంగీకరిస్తే భగవంతుణ్ణి సర్వవ్యాపకుడు అనలేం. సర్వాన్ని వ్యాపించి అన్నింటిలో ఉండి నియమించేవాడు, అంతర్యామి (అంతః = లోపల, యామి = నియామకం చేసేవాడు)

అని ఎలా అంటాం. భగవంతుడికి కొన్ని పరిధులు (limitations) వస్తాయి. దీనినే వేదాంతభాషలో **పరిచ్ఛేదం** అంటారు. మనం మూడురకాల పరిచ్ఛేదాల్లో ఉంటాం. అంటే పరిచ్ఛిన్నులుగా ఉంటాం. ఇవి

**దేశతః –** ఈ ప్రదేశంలో ఉంటే మరొక ప్రదేశంలో ఉండలేం.

**కాలతః –** ఈ కాలంలో (21వ శతాబ్దిలో) ఉంటే మరో కాలంలో ఉండలేం.

**వస్తుతః –** పెన్ను అనే వస్తువు పుస్తకం అనే వస్తువు కాలేదు.

ఈ మూడు పరిచ్ఛేదాలతో మనం పరిచ్ఛిన్నులుగా ఉంటాం. భగవంతుణ్ణి ఇలా పరిచ్ఛిన్నుడనడానికి వీల్లేదు. అదొక అపరిచ్ఛిన్న చైతన్యం. కాబట్టి సృష్టికి సంబంధించిన పదార్థమేదో అది బ్రహ్మకే సంబంధించినది కావాలి.

పోనీ భగవంతునిలో ఒక భాగం (అవయవం) తీసుకొని సృష్టి జరిగిందీ అంటే బ్రహ్మను మనలాగే అవయవాలున్న వ్యక్తిగా భావించడం జరుగుతుంది. అదికూడా కుదరదు. బ్రహ్మ వ్యక్తికాదు. అదొక చైతన్యం (consciousness principle) అని చెప్పుకున్నాం. భగవంతుడు అని పుంలింగంలో కూడా చెప్పడానికి వీల్లేదు. ఇది బ్రహ్మ అని నపుంసకలింగంలో వాడే శబ్దం. దీనిలో అవయవాలుండడానికి వీల్లేదు.

మరి సృష్టి ఎలా జరిగింది? అంటే వేదాంతశాస్త్రంలో బ్రహ్మ చైతన్యంనుండి మాయ అనే శక్తి వచ్చిందని, దానివల్ల ఆకాశం, దానివల్ల వాయువులు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటినుండి భూమి, పశుపక్ష్యాదులు మొదలైన చేతనాచేతన ప్రపంచం వచ్చిందని ఉపనిషత్తులు చెబుతాయి (ఇది పైన కూడా చెప్పుకున్నాం). మరి ఇవన్నీ మాయనుండి వెలువడివుంటే మాయకంటే అభిన్నమైనదే ఈ సృష్టి. మాయకే ప్రకృతి, అవిద్య అని పేర్లున్నాయి. ప్రకృతి భగవంతునిలో ఏర్పడిన ఒకానొకరూపం. ఇది పరిణామం అనడానికి కూడా వీల్లేదు. పరిణామమంటే పాలు పెరుగుగా మారినట్లు అనే అర్థంవస్తుంది. బ్రహ్మ అలా మారటంలేదు. అలా కనిపిస్తున్నది. కాబట్టి బ్రహ్మ దీనికి ఉపాదానకారణం, నిమిత్తకారణం కూడా. అందుకే అభిన్న నిమిత్త ఉపాదాన కారణం అన్నారు.

ఈ సృష్టి నిజమేనా, మాయ అంటున్నాం కదా అని ఒక ప్రశ్న. ఇది సత్ – ఉన్నది అనడానికిగానీ, అసత్ – పూర్తిగా (కుందేటికొమ్ములాగ) లేదని అనడానికిగాని వీల్లేదని ఉపనిషత్తులు చెబుతాయి. ఈ మాయాశక్తి (ప్రకృతి) మూడు అంశాల కలయిక. ఈ అంశాలకే (constituents)గుణాలని పేరు. ఈ గుణాలు ఒక సామ్యావస్థ (equilibrium)లో

ఉంటాయి. ఈ సామ్యావస్థ చెదరినప్పుడు సత్త్వరజస్తమో గుణాలు సృష్టిరూపంలో కనిపిస్తాయి. (ఈ గుణాల గురించి ప్రత్యేక అధ్యాయం ఉంది). ఈ గుణాల ప్రభావంవల్ల మానవస్వభావంలో కొన్ని కొన్ని ధర్మాలు ఏర్పడుతుంటాయి. అప్పుడు మనం సత్త్వగుణంవల్ల ఇలాంటి స్వభావం, రజోగుణంవల్ల ఇలాంటి స్వభావం అని అంటుంటాం. గుణం అంటే సామాన్యంగా లక్షణం, వస్తుధర్మం, స్వభావం అని వాడుకలో అంటుంటాం. ఒకడు కోపస్వభావం కలవాడు, మరొకడు శాంతస్వభావుడు, మరొకడు సోమరిస్వభావుడు అంటాం. రాజసస్వభావం ఉన్నవాడు అన్నీ సాధించాలనే ప్రవృత్తితో ఉంటాడు. ఉన్నదానితో తృప్తిపడేవాడు సాత్త్వికస్వభావుడు. సోమరిగా వుండేవాడు తామసస్వభావుడు. ఈ గుణాలకలయికే ప్రతివ్యక్తి కూడా. ప్రతిమనిషిలో విభిన్ననిష్పత్తులో ఈ గుణాల మిశ్రమం ఉంటుంది.

ఈ గుణాలే కర్త. దీనినే ఒక ప్రసిద్ధ శ్లోకంలో –

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే ॥ 27**

ప్రకృతి (మాయ) నుండి పుట్టిన మూడుగుణాలు కర్మల్ని చేయిస్తున్నాయి. అహంకారం (నేను అనే భావన)లో నున్న మనిషి మోహంతో (సత్యం తెలియకుండా) నేనే కర్త అని భావిస్తుంటాడు. ప్రకృతిలోని విభిన్నపదార్థాలలో కూడా ఈ మూడు గుణాలు ఉన్నాయి. ఈ గుణాలధర్మాలను తన ధర్మాలుగా ఆరోపించుకోవడం మోహం. మోహం కలవాడు మూఢుడు. అందుకే పై శ్లోకంలో **విమూఢాత్మా** అన్నారు. జ్ఞానియైనవాడు ఈ మూడు గుణాలు తన స్వరూపం కాదు, తన స్వరూపం శుద్ధచైతన్యస్వరూపం, ఈ గుణాలు వాటివాటి కార్యాల్లో ప్రవర్తిస్తున్నాయి అని గ్రహించినవాడు. కర్మలపట్ల ఆసక్తి చూపడు (శ్లో. 28) ఈ గుణాల విషయంలో మోహం చెందినవారు ఆసక్తి కలిగివుంటారు. యథార్థం తెలిసినవాడు అలాంటి మోహంలో ఉన్నవారిని అనవసరంగా చలింపచేయడు. వాళ్లు అలా ప్రవర్తిస్తూనే ఉంటారు.

ఎవరైతే అహంకారభావన లేకుండా తమకు విధింపబడిన కర్మలను చేస్తారో వారు కర్మబంధంనుండి ముక్తులౌతారని మళ్లీ చెబుతున్నాడు శ్రీకృష్ణుడు 31,32 శ్లోకాల్లో. అహంకారభావంతో ఉన్నవాళ్లు అవివేకులు.

### గుణం = త్రాడు - సంస్కారం

ఎంత జ్ఞానిగా ఉండాలనుకున్నా ప్రకృతి, దాని స్వభావము, దాని గుణాలు మనల్ని లాగుతుంటాయి. గుణమంటేనే మరో అర్థం త్రాడు అని, మనల్ని బంధించే స్వభావం

కలది. అందుకే జ్ఞానవంతుడుకూడా తన ప్రకృతిని, స్వభావాన్ని అనుసరించి ప్రవర్తిస్తుంటాడు. ప్రాణులన్నీ తమ స్వభావంవైపు పరుగుతీస్తుంటాయి. నిగ్రహం ఏం చేయగలదు? (శ్లో. 33). ఇక్కడ ప్రకృతి అంటే కేవలం మూడుగుణాల సమ్మేళనమే కాకుండా పూర్వజన్మ సంస్కారం, ఈ జన్మలో వ్యక్తమైనది అని అర్థం.

సంస్కారమంటే ఏమిటి? సాధారణంగా మనం సంస్కారం ఉన్నవ్యక్తి అని వ్యవహరిస్తుంటాం. అంటే అతను సంఘంలో ఎలా మెలగాలి అనే ప్రవర్తనను అలవరచుకున్న వ్యక్తి అని అర్థం. ప్రతి మనిషికి తను చదువుకున్న చదువు సంస్కారాన్నిస్తుంది. అందుకే చదువు – సంస్కారం అంటుంటాం. మనస్సులోని అంతరాళాల్లో తన ముద్రను నాటడంవల్ల చదువు అతని ప్రవర్తనను కొంత ప్రభావితం చేస్తుంది. ఇలాంటిముద్ర లేదా గుర్తునే సంస్కారం అంటాం. దీనికే వాసన అని వేదాంతశాస్త్రంలో పేరు. (వస – అంటే కప్పిపుచ్చడమని అర్థం). మనస్సులో నాటుకు పోయిన ప్రవర్తనాశైలి (behavioural pattern).కొన్ని మంచి వాసనలుండచ్చు, కొన్ని చెడువాసనలు ఉండవచ్చు. మంచివాసనలు కూడా సాధకునికి అడ్డంకులే. ఉదా: శాస్త్రవాసన – అంటే ఎప్పుడూ శాస్త్రగ్రంథాలు, వాటిలోని వాగ్వైఖరి, శబ్దఝరి, వ్యాఖ్యానకౌశలం ఇట్లాంటి వాటిలోనే మునిగియుండి వాటి సారం గ్రహించలేకపోవడం. లోకవాసన – జనులు మెచ్చుకొనేట్లు ప్రవర్తించాలి అనే తపన. ఇలాంటివి సాధకునికి అడ్డంకులు.

సంస్కారం రెండు రకాలు. 1) ఈ జన్మలోనే అనుభవాలు, వాటి ముద్రలు 2) పూర్వజన్మలోని సుకృత దుష్కృతాల ముద్రలు, ఈ జన్మలో ప్రకటమయ్యేవి. (వీటినే నేడు heridity and environment అనే పేరిట చర్చిస్తున్నారు).

ఇంద్రియాలు ఏ విషయాలను గ్రహిస్తాయో వాటిపై అనురాగం, లేదా ద్వేషం అని రెండు సాధారణ ప్రవృత్తులు ఉంటాయి. ఇంద్రియాలకి సుఖం కలిగించే దానిపై అనురాగం, దుఃఖం కలిగించే వస్తువుపై ద్వేషం. సుఖం అనే పదంలో 'ఖం' అంటే ఇంద్రియమని అర్థం – అంటే ఇంద్రియానికి ఇంపుగా ఉండేది, దుఃఖం అంటే ఇంద్రియానికి క్లేశం కలిగించేది అని అర్థం. వీటిపైన రాగం, ద్వేషం ఈ రెండూ కూడా సాధకునికి శత్రువులు (శ్లో. 34). ఈ అనురాగంవల్లనే అర్జునుడు కూడా తన స్వధర్మాన్ని వదలాలనుకున్నాడు. అందువల్లనే శ్రీకృష్ణుడు అతని ధర్మాన్ని గుర్తుచేస్తూ–

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35**

"చక్కగా అనుష్ఠించే పరధర్మం కన్నా ఏవో కొన్ని లోపాలున్నా స్వధర్మమే అనుసరించదగినది. స్వధర్మాచరణకోసం మరణమైనా మంచిదే. పరధర్మం భయాన్ని కలిగించేది" అని అర్థం. ఇక్కడ అర్జునుడి స్వధర్మమంటే రజోగుణ స్వభావుడు, క్షత్రియుడైనందువల్ల రాజ్యపాలన అతని ధర్మం. దాన్ని వదలి భిక్షాటన చేయాలనడం పరధర్మాన్ని కోరుకోవడం.

ఇదే ప్రసంగం 18వ అధ్యాయంలో మళ్లీ వస్తుంది. ఏదో తాత్కాలికమైన మోహంలో పడి నేను యుద్ధం చేయను అన్నా **'ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి'** అంటే నీ స్వభావమే నీవు వద్దన్నా నిన్ను అవశుణ్ణి చేసి కర్మ చేయిస్తుంది అని చెప్పాడు. అర్జునుడి స్వభావం శౌర్యం, తేజస్సు, ధృతి (స్థిరత్వం) (శ్లో. 18-43) మొదలైనవి. వాటి ప్రభావంవల్ల అవశుడై యుద్ధమే చేయగలడు అని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

**కామం - క్రోధం**

ఇక్కడ మళ్లీ రాగద్వేషాలపై చర్చ. రాగంవల్ల వచ్చేది కామం (కోరిక). ద్వేషంవల్ల వచ్చేదే క్రోధం. వీటివల్ల మనిషి పాపకార్యాలకు వెనుకాడడు. అందుకే అర్జునుడి ప్రశ్న 36వ శ్లోకంలో **అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః** అని. ఎవరో బలాత్కారంగా ప్రేరేపిస్తున్నట్లు మానవుడెందుకు పాపంలో ప్రవర్తిస్తున్నాడు? దీనికి సమాధానంగా శ్రీకృష్ణుడు -

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ 37**

ప్రకృతిలోని రజోగుణంనుండి పుట్టేది కామం. దీని మరోరూపమే క్రోధం. అందువల్లే ఏకవచనంలో ఇది కామం, ఇది క్రోధం అని రెంటినీ ఉద్దేశించి ఒకేమాటలో చెప్పాడు. దీని ఆకలి ఎంతకూ తీరదు. ఇది చాలా పాపిష్ఠిది. ఇదే శత్రువని తెలుసుకో అని శ్లోకార్థం. మన కోరికను ఎవరైనా అడ్డుకుంటే అతనిపై క్రోధం. ఇది రజోగుణం యొక్క ఫలితం. ఇదే సాధకుడి శత్రువు. జ్ఞానాన్ని కప్పివేసే అంధకారం లాంటిది. 'ఎలాగైతే పొగ అగ్నిని కప్పివేస్తుందో, అద్దాన్ని మాలిన్యం ఎలా కప్పివేస్తుందో, మావి గర్భంలోని శిశువును కప్పివేస్తుందో అలాగ ఇది జ్ఞానాన్ని కప్పివేస్తుంది' (శ్లో. 38).

ఈ కామం జ్ఞానికి నిత్యశత్రువు. ఇది **కామరూపః** – అంటే అనేకరూపాల్లో ప్రకటమవుతూ ఉంటుంది. ఇవి ఎంతటికీ ఆర్పరాని అనలం (అగ్ని) లాంటిది (శ్లో. 39). **అనలం** – అంటే చాలు అనేమాట ఎక్కడ లేదో అది అని అర్థం (అలం అంటే చాలు అని అర్థం). అగ్నిలోకి ఎంత ఆజ్యం వేసినా అది గ్రహిస్తూనే ఉంటుంది. అలాగే కామం చాలు అనే మాటలేనిది.

మరి ఈ కామం దేన్ని ఆశ్రయించి వుంటుంది? ఎక్కడ ఉద్భవిస్తుంది? **ఇన్ద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే** (శ్లో. 40). ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి వీటికి అధిష్ఠానం అంటే ఆశ్రయం. ఈ మూడింటివల్ల కామం జ్ఞానాన్ని కప్పివేసి దేహిని (జీవుణ్ణి) మోహంలో పడవేస్తుంది.

జ్ఞానం కప్పివేయబడడమే మోహం. అంటే వస్తుతత్త్వాన్ని చూడలేకపోవడం. దీనికి కారణం ఇంద్రియాలు. బాహ్యవస్తువులపై ప్రసరించి వాటిని మనస్సుకు అందచేస్తాయి. బుద్ధి వాటిని విశ్లేషించి అనురాగాన్నో, ద్వేషాన్నో కలిగిస్తుంది. అదే కామం లేక క్రోధం. అంతఃకరణంలో పుడుతున్నాయి కావున వీటిని అంతఃకరణంద్వారానే ఎదుర్కోవాలి. ఈ ఇంద్రియాలను నియంత్రించాలి. దీనివల్ల జ్ఞాననాశకమైన, పాపస్వభావంగల ఈ కామం తొలగిపోతుంది (శ్లో. 41).

ఇంద్రియాలు గొప్పవే. శక్తిమంతమైనవే. వాటివలన విషయాలను గ్రహించే మనస్సు వాటికంటే గొప్పది. మనస్సుకు అందినవాటిని విశ్లేషించే బుద్ధి (discrimination) ఇంకా గొప్పది. ఈ మూడింటిని సాక్షిగా గమనించే ఆత్మ వీటిన్నింటికంటే పైనున్నది. కాబట్టి కామాన్ని ఎదుర్కోవాలంటే బుద్ధిని సాక్షిగా దర్శించే అభ్యాసం చేయాలి.

**ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 49**

మనస్సును మనస్సుతోనే నిగ్రహించు. అంటే నిశ్చలంగా చేసుకో, కామమనే శత్రువును జయించు అని అర్థం. **'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః'** అన్నారు. అంటే 'ప్రపంచజాలంలో చిక్కుకోవడానికి మనస్సే కారణం, దానిని వదిలించుకోవడానికి మనస్సే కారణం'. మంచికీ, చెడుకీ జీవునికున్న ఒకే సాధనం మనస్సు. దీనిని బయటకు మళ్ళిస్తే ప్రపంచం, లోపలికి మళ్ళిస్తే ఆత్మజ్ఞానం. శత్రువైన ఈ కామాన్ని జహి – చంపు అంటున్నాడు శ్రీకృష్ణుడు. కోరికతోపాటు కర్మను కూడా వదలకూడదు. నిష్కామకర్మ చేయడమే ఈ అధ్యాయ సారం.

❖ ❖ ❖

## నాలుగవ అధ్యాయము

# జ్ఞానకర్మసంన్యాసయోగము

ఇది 42 శ్లోకాలున్న అధ్యాయం. దీనిలో నాలుగు అంశాలు చూడగలం. మొదట 11వ శ్లోకం వరకూ ప్రసంగవశాత్తూ అవతారమంటే ఏమిటో చెప్పబడింది. 12–23 వరకు కర్మయోగం గూర్చి ఇంకా కొంత వివరణ, ప్రసంగవశాత్తూ నాలుగు వర్ణాల వ్యవస్థ. తర్వాత 23–32 వరకు మూడవ అధ్యాయంలో చెప్పిన యజ్ఞశబ్దానికి విస్తారమైన అర్థం చెప్పబడింది. చివరిభాగం జ్ఞానప్రశంస, జ్ఞానిప్రశంస.

అవతారతత్త్వం చెప్పడంలో శ్రీకృష్ణుడు కేవలం ద్వాపరయుగంనాటి ఒకానొక చారిత్రక వ్యక్తి కాదు, జగద్గురువు రూపంలో ఉన్న పరబ్రహ్మయే అని చెప్పడం లక్ష్యం. దీనివల్ల అర్జునుడి శ్రద్ధ దృఢమవుతుంది.

2, 3 అధ్యాయాల్లో తాను చెప్పవలసిందంతా చెప్పానని భావించాడు శ్రీకృష్ణుడు. అందువల్ల దాన్ని ముగింపు చేస్తూ ఆ విద్యయొక్క చరిత్ర – అంటే ఎవరు ఎవరికి మొదట బోధించారు, దాని పరంపర ఏమిటి అని చెబుతాడు. నేను మొదట్లో ఈ యోగాన్ని సూర్యుడికి ఉపదేశించాను. సూర్యుడు మనువుకు ఉపదేశించాడు. మనువు ఇక్ష్వాకరాజుకు చెప్పాడు. ఈవిధంగా పూర్వ రాజర్షులందరూ ఈ కర్మయోగం (జ్ఞానంతో కూడిన) ఆచరించారు. కానీ కాలప్రభావంవల్ల ఈ విద్య బలహీనమైంది. ఇప్పుడు ఈ విద్యను నా భక్తుడు, సఖుడు అయిన నీకు చెబుతున్నాను (శ్లో. 1–3).

ఇక్కడ రాజర్షి అనే శబ్దం గమనింపదగింది. రాజులై యుండికూడా ఋషులు – అంటే జ్ఞానులై కర్మసంన్యాసం చేయకుండా జ్ఞానులై కర్మను చేసినవారు. Philosopher king అని గ్రీకు వేదాంతంలో ప్లేటో మహాశయుడు చెప్పిన ఆశయానికి భారతదేశంలో అనేక ఉదాహరణలు.

ఇక్కడ శ్రీశంకరుల భాష్యంలో గీతాప్రయోజనం ఒక వాక్యంలో చెప్పబడింది. **జగత్పాలయితౄణాం క్షత్రియాణాం బలాధానాయ. తేన యోగబలేన యుక్తాః సమర్థాః భవన్తి బ్రహ్మ రక్షితుమ్. బ్రహ్మక్షత్రే పరిపాలితే జగత్ పరిపాలయితుమ్ అలమ్.** జగత్తును పాలించే రాజులకు బలాన్నివ్వడానికై నేను ఈ యోగాన్ని చెప్పాను. ఈ యోగబలంతో వారు ధర్మాన్ని రక్షించగలరు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు ధర్మాన్ని సరిగా నిర్వహిస్తే సంపూర్ణజగత్తును పరిపాలించడానికి అది చాలు అని అర్థం. ఈ విద్య సంన్యాసులకు కాదు, రాజులకు బలాన్నివ్వడానికి, లోకసంగ్రహార్థం ఎలా పాలించాలి అని

తెలుపడానికి. ఈ వాక్యంలో బ్రాహ్మణుడు అంటే పుట్టుకతో బ్రాహ్మణుడు అని కాకుండా రాజుకు ధర్మాన్ని బోధించి ధర్మాచరణ చేయించే గురువు అని అర్థం. ఈ రోజుల్లో మేధావివర్గం అనుకోవచ్చు. జగత్తును సక్రమంగా పాలించడానికి కావలసిన ధీశక్తి, బాహుబలం అనే రెండూ ఇక్కడ చెప్పబడ్డాయి.

ఇక్కడ అర్జునుడికి ఒక సందేహం. నీవు ద్వాపరయుగంలో ఉన్నావు కదా, సృష్టికి పూర్వం సూర్యుడికి ఈ ఉపదేశం ఎలా చేశావు అని (శ్లో. 4). అందుపై శ్రీకృష్ణుడు వివరణ ఇవ్వాల్సివచ్చింది. పుట్టుకలేని, అవ్యయమైన బ్రహ్మకు సంబంధించిన మాయాశక్తి (ప్రకృతి). ఆ త్రిగుణాత్మకశక్తిని వశం చేసుకొని పుడుతుంటాను (శ్లో. 6). ఇక్కడ అవతారమంటే దేవలోకం ఖాళీచేసి ఇక్కడ పుట్టాడు అని అర్థం కాదు. ప్రకృతిలోని నియామకశక్తి సత్త్వగుణం క్షీణించినపుడు ఆ గుణాన్ని మళ్లీ ఉద్ధరించడానికై ఏదోరూపంలో ప్రకటమవుతుంది. అదే అవతారం. దేవలోకం ఖాళీ చేయడం, దేవేరి ప్రతీక్షిస్తూ ఉండడం లాంటివి పురాణాల్లో సామాన్యజనుల్ని ఉద్దేశించి చెప్పినమాటలు. సమస్తభూతాలకు నియామకుడైన భగవానుని విషయంలో మార్పుండదు. అయినా మాయాశక్తివల్ల లోకంలో పుట్టినట్లు కనబడతాడు (శ్లో. 6). ఇక్కడ రెండు ప్రసిద్ధ శ్లోకాలు.

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 7**
**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8**

ధర్మానికి (లోకాన్ని సరిగా నడపడానికున్న యంత్రాంగానికి) ఎప్పుడైతే హాని కలుగుతుందో, అధర్మం పెల్లుబుకుతుందో అప్పుడు ధర్మాన్ని ఉద్ధరించడానికై నన్ను నేను సృష్టించుకుంటాను. మంచిని రక్షించడానికి చెడును నశింపచేయడానికి, ధర్మాన్ని మళ్ళీ స్థాపించడానికి నేను ప్రతియుగంలో జన్మిస్తుంటాను. ఇదొక సార్వకాలిక నియమం. ఈ యథార్థాన్ని ఎవడు తెలుసుకుంటాడో పునర్జన్మ చక్రంనుండి బయటపడి నన్నే చేరుకుంటాడు (శ్లో. 9).

భగవానుని శరీర సంగ్రహణానికి జీవుని జన్మకు తేడా ఉంది. భగవంతుడి శరీరగ్రహణం లీలామాత్రం, లోకసంగ్రహం కోసం. జీవుడి జన్మ అతని కర్మఫలితం. భగవంతుడు మనుష్యరూపంలో ఉన్నా ముక్తస్వరూపుడు. జీవుడు అజ్ఞానం, మోహం

వీటిచే బంధింపబడినవాడు. భగవంతునిది మాయాశరీరం అంటారు. జీవుడిది పాంచభౌతికమైన శరీరం, సుఖానుభవము, దుఃఖానుభవము కలిగినట్టి స్థితి. పై శ్లోకాలతో అవతారతత్త్వం ముగిసింది.

మళ్ళీ కర్మయోగ ప్రస్తావన. జ్ఞానం అంటే కర్మలో అకర్మను చూడడమే. జ్ఞానయోగం మోక్షానికి అంతరంగసాధనమనీ (అంటే సాక్షాత్తూ మోక్షానికి మార్గమనీ), కర్మయోగం బహిరంగసాధనమనీ (క్రమేణ చిత్తశుద్ధి కలిగించడంద్వారా మోక్షానికి మార్గమనీ) చెప్పుకున్నాం. జ్ఞానంలేని కర్మయోగం కేవలం చిత్తశుద్ధికే. జ్ఞానంతో కూడిన కర్మయోగంతో మోక్షము, జన్మరాహిత్యము. కర్మయోగం సాధనం – జ్ఞాననిష్ఠ సాధ్యం. కర్మయోగం ఉపాయం – జ్ఞానయోగం ఉపేయం (ఉపాయంతో పొందదగినది). మున్ముందు గీతలో ఏదైతే సాంఖ్యమని (జ్ఞానమని) చెప్పబడిందో అదే యోగం (కర్మయోగం) అని తెలుసుకో (5,6 అధ్యాయాల్లో) అనే వ్యాఖ్యలుండడంవల్లనూ, ఆ రెండింటి ఫలం ఒకటే అని తెలుపడంవల్లనో (5–4) ఈ రెండూకూడా ఒకే మార్గంలోని రెండు దశలు లేదా స్థాయిలు అని చెప్పారు. కేవలం జ్ఞానయోగంతో లభించేదేదో దానినే జ్ఞానంతో కూడిన లేదా జ్ఞానసాధనకై చేసే కర్మయోగంతో కూడా పొందవచ్చు అని అర్థం.

ఇక్కడ ప్రసంగవశాత్తూ ఒక ప్రసిద్ధమైన శ్లోకం –

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥ 13**

దీని ప్రతిపదార్థం తెలుసుకోవడం అవసరం. చాతుర్వర్ణ్యం = నాలుగు వర్ణాలు. అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనబడే నాలుగు వర్ణాలు. మయా = భగవంతుడైన నా చేత, గుణకర్మవిభాగశః = వారి గుణాలు (స్వభావం), స్వభావ వశాత్తూ చేసే కర్మను బట్టి, సృష్టం = సృష్టింపబడినది, విభజింపబడినది. తస్య = దానియొక్క (ఆ నాలుగు వర్ణాలయొక్క), కర్తారమపి = కర్తను అయినా కూడా, మాం = నన్ను, అకర్తారం = కర్త కానివాడిగా, అవ్యయం = మార్పులేనివానిగా, విద్ధి = తెలుసుకో.

వారివారి గుణాలు, స్వభావవశాత్తూ చేసే కర్మలనుబట్టి జనుల్ని నాలుగు వర్ణాలుగా విభజించాను. దీనిని నేనే చేసినప్పటికీ నన్ను అకర్త అని తెలుసుకో అని అర్థం. భగవానుడు ఎలా అకర్త? ప్రాణుల జన్మకు కారణమైంది వారి స్వకర్మలే. భగవానుడు

దీనిని నిర్దేశించడు. గుణాల ప్రభావమే కర్మలు. గుణాలకు, కర్మలకు అతీతుణ్ణి నేను అని భగవానుడు చెప్పే సందర్భంలో ఈ శ్లోకం చెప్పబడింది. అందువల్ల భగవానుడు అకర్త. వ్యావహారిక దృష్ట్యా కర్త. కానీ పారమార్థిక దృష్ట్యా అకర్త. భగవంతునికి కర్తృత్వభోక్తృత్వములు లేవని వేదాంత సిద్ధాంతం. కర్తృత్వముంటే సంసారిత్వం వస్తుంది. గుణాలవల్లనే మనుషుల విభాగం లేదా నామకరణం. అంతేకానీ భగవానుడు ఆవిధంగా సృష్టించాడని అర్థంకాదు.

గుణాలంటే సత్త్వము, రజస్సు, తమస్సు అని స్థూలంగా పైన చెప్పుకున్నాం. వీటి కలయికను గురించి, వర్ణాల ఏర్పాటును గురించి ఈ క్రిందివిధంగా చెప్పారు ప్రాచీన వ్యాఖ్యాతలు.

| **వర్ణము** | **సత్వగుణం** | **రజోగుణం** | **తమోగుణం** |
|---|---|---|---|
| బ్రాహ్మణుడు | ప్రధానం | రెండవస్థానం | మూడవస్థానం |
| క్షత్రియుడు | రెండవస్థానం | ప్రధానం | మూడవస్థానం |
| వైశ్యుడు | మూడవస్థానం | ప్రధానం | రెండవస్థానం |
| శూద్రుడు | మూడవస్థానం | రెండవస్థానం | ప్రధానం |

ఈ గుణాల కలయిక విభిన్న నిష్పత్తుల్లో ఉండడంవల్లనే సృష్టిలోని వైచిత్ర్యం. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం, తపస్సు, స్వాధ్యాయం మొదలైనవి సత్త్వగుణమున్న వాళ్లు స్వాభావికంగా చేసేపని. శౌర్యం, తేజస్సు, ప్రతాపం, ఈశ్వరభావం (ఇతరులను శాసించే స్వభావం – leadership qualities) రజోగుణం ప్రధానంగా ఉన్నవాళ్లు చేసేపని. అలాగే ధనసంపాదన రజోగుణం ఉన్నవాళ్లు చేసేపని. ఆలోచించే స్వభావం తక్కువగా ఉన్న గుణం తమస్సు. ఇతరుల ఆజ్ఞల్ని పాటించడం. పై చెప్పబడిన స్వభావం ఉన్నవాళ్లని ఆయా వర్ణాల్లోకి విభజించవచ్చు. ఒకడు జాతివల్ల బ్రాహ్మణుడైనా స్వభావంవల్ల వైశ్యుడో, శూద్రుడో కావచ్చు. అంటే స్వభావమే ప్రతిమనిషి వర్ణాన్ని నిర్ణయిస్తుంది. భగవంతుడు కేవలం గుణాలని వివరించి, విభజించాడు. ఈ వర్ణాలకు, గుణాలకు అతీతుడుగా ఉన్నవాడు భగవానుడు.

(నేడు భారతదేశ సమగ్రతకు సమస్యగా మారుతున్న విషయం, ఆచరణలో గాడితప్పిన విషయం మనం చూస్తున్నాం. ఉపనిషత్తుల్లోనూ, గీతలోనూ చెప్పిన వాక్యాలను ప్రస్తుత సమాజ సమగ్రతకు అన్వయించుకోవడం అవసరం. ఉపనిషత్తుల్లో గుణకర్మవిభాగమే

చేశారు. పుట్టుకకు ప్రాధాన్యమైతే **'జన్మకర్మవిభాగశః'** అని చెప్పివుండేవి. ఇదే విషయంపై 18వ అధ్యాయంలో విస్తృతమైన చర్చ ఉంది.)

ఈ చర్చ అంతా గుణాలకు భగవంతుడు అతీతుడు అని చెప్పే సందర్భంలో వచ్చిందని పైన చెప్పుకున్నాం. దీనినే **న మాం కర్మాణి లింపంతి** అనే తరువాతి శ్లోకంలో (శ్లో. 14) చెప్పారు. పై విభజన కర్మగానీ, ఏ కర్మలుగానీ నన్ను అంటవు. నాకు కర్మఫలంపై ఆసక్తిలేదు. ఈవిధంగా నన్ను ఎవడు తెలుసుకుంటాడో అతడు కర్మలచేత బద్ధుడు కాడు అని తాత్పర్యం.

సాధకుడు ఏం చేయాలి అని కూడా ఇక్కడ చెప్పబడింది. **'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'** అని ఒక వేదాంతసూత్రముంది. అంటే బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మయే అవుతాడని. మూడుగుణాలకు అతీతుడుగా ఉన్న భగవంతుణ్ణి తెలుసుకొని సాధకుడు కూడా గుణాలకు అతీతంగా వెళ్ళినప్పుడు బ్రహ్మకు ఎలాంటి కర్మబంధాలు, మార్పులు లేవో అట్లాంటి బ్రహ్మ లక్షణాలు ఇతనికికూడా వంటబడతాయి. అలాగ అతను బ్రహ్మస్వరూపానికి దగ్గరవుతాడు అని భావం.

**కర్మ - అకర్మ - వికర్మ**

రాజర్షుల ప్రస్తావనతో ఈ అధ్యాయం ప్రారంభమైంది. ఆ రాజర్షులెలాగ కర్మయోగం చేస్తూ మోక్షాన్ని పొందారో నీవూ అలా ఆచరించాలి అని 15వ శ్లోకంలో చెప్పబడింది. ఆత్మతత్త్వం తెలియనివాడైతే చిత్తశుద్ధికొరకు (తద్వారా జ్ఞానం, మోక్షం కొరకు) తత్త్వం తెలిసినవాడైతే లోకం మేలుకొరకు కర్మను చేయాలి.

ఇక్కడే గీతలో కర్మ, అకర్మ, వికర్మ అనే పదాలు వాడబడ్డాయి.

**కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17**

కర్మ ఏమిటో తెలుసుకోవాలి. వికర్మ (నిషిద్ధ కర్మ) ఏమిటో తెలుసుకోవాలి, అకర్మ (కర్మ చేయకుండా ఉండడం) ఏమిటో గ్రహించాలి. కర్మమార్గం తెలుసుకోవడం చాలా కష్టం అని భావం. కర్మను అనుష్ఠించాలి, వికర్మను వదలివేయాలి, అకర్మ (కర్మ చేయకుండా నేను కర్మను చేయడంలేదు అంటూ 'నేను' అనే భావనతో ఉండడం) వల్ల ప్రయోజనం లేదు. అలాంటప్పుడు కర్మను ఎలా ఆచరించాలి అంటే –

**కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥ 18**

ఎవడైతే కర్మలో అకర్మను చూస్తాడో, అకర్మలో కర్మను చూస్తాడో అతడు జ్ఞాని. అతడే యోగం కలవాడు. అతడే అన్నిపనులూ చేసినవాడు అని అర్థం. ఇక్కడ కర్మలో అకర్మను చూడడమంటే కర్తృత్వభావన – అహం కర్తా (నేను కర్తను) అనే భావన లేకపోవడం. ఇది సైద్ధాంతికంగా తత్త్వాన్ని తెలుసుకోవడంవల్లను, ఆ తర్వాత నిరంతర అభ్యాసంవల్లను కలుగుతుంది. అలాంటివాడు చేసే కర్మ లోకం దృష్టిలో కర్మలాగ కనిపిస్తుంది. కానీ జ్ఞానిదృష్టిలో అకర్మ.

ప్రారంభసమయంలో నిష్కామకర్మ చేసేవాడికి 'నేను కర్త' అనే భావన ఉన్నా కర్మలను చేస్తున్నప్పుడు మధ్యలో కలిగిన చిత్తశుద్ధి, దానివల్ల జ్ఞానప్రాప్తి అతనికి మధ్యలో 'తాను కర్త' అనే భావన తొలగిపోతుంది. అంటే అతనికి అకర్మ సిద్ధిస్తుంది. అతని కర్మ కేవలం వ్యాపారమాత్రం. అంటే చేష్టామాత్రం అంటారు. దేహానికి సంబంధించినది కర్మ. ఆత్మకు సంబంధించిన కాదు. దానిని ఆత్మపై ఆరోపించుకోవడం అజ్ఞానం. విద్యవల్ల అతని అజ్ఞానం తొలగుతుంది.

నేను చేస్తున్నానని అనుకోవడం ఎలా తప్పో, నేను చేయడంలేదని అనుకోవడం కూడా తప్పే (కర్తృత్వం ఉన్నది కాబట్టి). నేను అనేదాన్ని సాక్షిగా దర్శించాలి. ఇక్కడ వ్యాఖ్యాతలు ఒక ఉపమానం ఇచ్చారు. వేగంగా ప్రవహించే నదిలో నావలో వెళు తున్నప్పుడు మనం స్థిరంగా ఉన్నట్లు నదీతీరాన ఉన్న చెట్లు మనకెదురుగా వస్తున్నట్లు కన్పిస్తాయి. అట్లే కర్మలేని ఆత్మయందు కర్మ ఉన్నట్లు కన్పిస్తుంది. అలా లేదని గమనించడమే సరైన దృష్టి. అలా చూసినవాణ్ణే 'బుద్ధిమాన్' అని పై శ్లోకంలో చెప్పారు.

జ్ఞానం అగ్నిలాంటిది. ఈ అగ్ని కర్మలను దహిస్తుంది. అంటే కర్మ చేసినా అది కర్మ అనిపించుకోదు. అలాంటివాణ్ణి గూర్చి తర్వాతి శ్లోకంలో **'జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః'** (శ్లో. 19) అన్నారు. తాను అనే భావన, కామనలు లేని కర్మ కావున జ్ఞానమనే అగ్నిలో కర్మలు దగ్ధమయ్యాయని అర్థం.

ఇదే విషయం ఇంకా స్పష్టంగా "ఇలా కర్మఫలంపై ఆసక్తి లేకుండా ఎలాంటి పురుషార్థం కోరకుండా కర్మ చేస్తున్నవాడు ఏ కర్మను చేయనట్లే" అంటూ (శ్లో. 20,21) చెప్పారు.

**యజ్ఞం అంటే ఏమిటి?**

23వ శ్లోకం ఇలా చెబుతుంది.

**గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః ।**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23**

కర్మఫలంతో ఎలాంటి సంగం లేకుండా ఆత్మజ్ఞానంలోనే మనస్సును స్థిరంగా నిలిపి పనిచేసేవాడు యజ్ఞదృష్టితో (లోకసంగ్రహం కొరకు) పనులు చేసినా ఆ కర్మలు జ్ఞానంలో సమగ్రంగా లీనమౌతాయి. సమగ్రం అంటే అగ్రం (ఫలం)తో పాటు అని. ఫలాన్నివ్వకుండా జ్ఞానంలో లీనమౌతాయి, జ్ఞానాగ్నిలో నశిస్తాయి అని భావం.

రాబోయే శ్లోకాల్లో (24-33) వరకూ యజ్ఞానికి విస్తృతమైన అర్థంలో వివరించారు. జ్ఞాననిష్ఠలో ఉంటూ లేదా సాధనదశలో ఉంటూ నిష్కామకర్మ లోకోపకారం కోసం చేయడం యజ్ఞం. అన్నింటినీ బ్రహ్మదృష్టితో (అన్నింటిలోనూ బ్రహ్మను చూడడం) మొదలుగా చెప్పబడింది.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥ 24**

అర్పణం అంటే హోమసాధనం. అది బ్రహ్మయే. హవిస్సు (యజ్ఞంలో వేసే నేయి మొ॥) కూడా బ్రహ్మమే. బ్రహ్మమే అయిన అగ్నిలో బ్రహ్మయే (హోమం చేసే నేను) హోమం చేస్తున్నాను. కర్మ కూడా బ్రహ్మయే. దానితో పొందేది బ్రహ్మనే. ఇక్కడ కర్త, కరణం, క్రియ అన్నీ బ్రహ్మకంటే వేరుకాదు అని గ్రహించడమే బ్రహ్మజ్ఞానం.

(అందుకే ప్రతినిత్యం త్రికాలాల్లో చేయాల్సిన సంధ్యావందనంలో 'బ్రహ్మకర్మ సమారభే' అని చెబుతుంటాం. ఇది బ్రహ్మభావనను అభ్యాసం చేసే పని. మిగతా పూజలు చేసుకున్నా చేసుకొనకపోయినా తప్పక చేసుకోవాల్సిన పని సంధ్యావందనం. దీనినే నిత్యకర్మ అని చెప్పారు. పూజలు పుణ్యాలు, ఫలాలకొరకు. జ్ఞానం కొరకు అభ్యసించాల్సింది బ్రహ్మకర్మ).

ఇలాగ లోకసంగ్రహంకోసం చేసే కర్మలు బ్రహ్మబుద్ధిచేత మర్దింపబడినవి. కావున అకర్మయే. సమ్యక్ దర్శనం (జ్ఞానం) తో చేసే పనులన్నీ యజ్ఞమే.

బ్రహ్మవేత్తలు మరికొందరు ఈ క్రింద చెప్పిన యజ్ఞాలు చేస్తారు.

1) కొందరు దేవతలనుద్దేశించి యజ్ఞాలు చేస్తారు (శ్లో. 25).

2) కొందరు బ్రహ్మ అనే అగ్నిలో ఆత్మచేత హోమం చేస్తారు. అంటే బ్రహ్మలో తనను విలీనం చేయడం ఆహుతిలాంటిది. అలాంటి జ్ఞానయోగంలో ఉంటారు. దేహము, ఇంద్రియాల సంఘాతమే నేను అనే భావాన్ని బ్రహ్మభావంలో త్యజించడం, అంటే బ్రహ్మతో తన ఐక్యాన్ని గమనించడం, (శ్లో. 25) 'త్వం' పదార్థాన్ని 'తత్' పదార్థంగా తెలుసుకోవడం అన్నారు మధుసూదన సరస్వతి.

3) ఇంద్రియాలను సంయమం (నిగ్రహించడం) అనే అగ్నిలో హోమం చేయడం, అంటే ఇంద్రియనిగ్రహం (శ్లో. 26). దీనినే పతంజలి యోగసూత్రాల్లో ప్రత్యాహారం అంటారు.

4) కొందరు ఇంద్రియాలతో గ్రహించే విషయాలను (శబ్దాదుల్ని) ఇంద్రియాలనే అగ్నుల్లో ఆహుతి చేస్తారు (శ్లో. 26). అంటే ఇంద్రియాలు అగ్నివలె శుద్ధమైన స్థితిలో ఉండడం. వీటితో శబ్దాది విషయాల్లో శాస్త్రనిషిద్ధమైన వాటిని వదలి మిగతావాటినే గ్రహించడం.

5) మరికొందరు ఇంద్రియాలతో చేసే కర్మలు, ప్రాణాలతో చేసే కర్మలు, జ్ఞానంచే వెలిగించబడిన ఆత్మసంయమనం అనే అగ్నిలో ఆహుతిచేస్తారు (శ్లో. 27). ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు ప్రాణవాయువులు, మనస్సు, బుద్ధి వీటి సముదాయాన్ని లింగశరీరం అంటారు. వీటిని ఆత్మసంయమనం అనే అగ్నిలో హోమం చేస్తారు. అంటే పరిశుద్ధ విషయాలను గ్రహిస్తారు. వీరు గ్రహించే విషయాలు అగ్నిచేత శుద్ధిచేయబడినట్లు ఉంటాయి. ఆత్మజ్ఞానంచేత, అంటే వేదాంతవాక్యాలచేత వెలిగింపబడిన బ్రహ్మాత్మభావం (బ్రహ్మయే తాను అనే భావం)తో శుద్ధిగావింపబడిన విషయాలను గ్రహిస్తారు.

6) కొందరు ద్రవ్యయజ్ఞాలు చేస్తారు (శ్లో. 28). **తీర్థేషు ద్రవ్యవినియోగం యజ్ఞ బుద్ధ్యా కుర్వంతి యే తే ద్రవ్యయజ్ఞాః** అని వివరించారు. అనగా తీర్థములయందు ద్రవ్యవినియోగం చేయడం. తీర్థమంటే రెండు అర్థాలు. ఒకటి కాశీ, గయ, ప్రయాగలాంటి పుణ్యతీర్థాలు. రెండు పూజనీయులైన, అర్హులైన వ్యక్తులు, పూజనీయమైన కార్యాలు, ప్రజలకోసం బావులు, చెరువులు త్రవ్వించడం, అన్నదానాలు చేయడం మొ॥ వీటిని నిష్కామంగా చేసేవారిని ద్రవ్యయజ్ఞాః అన్నారు.

7) కొందరు తపోయజ్ఞాలు చేస్తారు. కష్టమైన చాంద్రాయణాది వ్రతాలు చేయడం తపోయజ్ఞం. (చాంద్రాయణమంటే చంద్రుని అయనం లేదా గతిని అనుసరిస్తూ పాడ్యమిరోజు ఒక ముద్దతో మొదలుపెట్టి 15వ రోజు పదిహేను ముద్దలు మళ్ళీ 15 రోజులు ఒక్కో ముద్ద తగ్గిస్తూ అమావాస్య రోజు ఒక్క ముద్దతో ముగించడం).

8) కొందరు యోగయజ్ఞాలు చేస్తారు (శ్లో. 28). అనగా పతంజలి యోగంలో చెప్పిన యమ, నియమ, ఆసన మొదలైన ఎనిమిది అంగాలతో కూడిన యోగాన్ని అభ్యసిస్తూ ఉంటారు.

9) జ్ఞానయజ్ఞంలో మరికొందరుంటారు (శ్లో. 28). ఇక్కడ జ్ఞానయజ్ఞమంటే వేదాధ్యయనం, శాస్త్రాల అర్థాన్ని తెలుసుకోవడం, వీటినే కర్తవ్యంగా భావించడం. దీనిని ఆచరించేవాళ్లని సంశితవ్రతులు అన్నారు. అంటే బాగుగా తీక్ష్ణం చేయబడిన, దృఢంగా చేయబడిన వ్రతం కలవారు.

10) కొందరు ప్రాణాయామంలోనే నిష్ఠ కలవారు. ప్రాణవాయువును అపానంలో లీనం చేస్తూ అపానాన్ని ప్రాణంలో లీనం చేస్తూ ఉంటారు (శ్లో. 29). వీటినే పూరకం, రేచకం అంటారు.

11) కొందరు మితాహారం తీసుకుంటూ ప్రాణవాయువును ప్రాణవాయువులో హోమం చేస్తారు (శ్లో. 30). ఇక్కడ ప్రాణశబ్దానికి నీలకంఠ పండితులు ఇంద్రియాలు అనే అర్థాన్ని గ్రహించి ఇలా చెప్పారు – ఇంద్రియాలను మనస్సులోను, మనస్సును అహంకారంలోనూ ప్రవిలాపనం (అంటే నశింపచేయడం) చేస్తారు. అంటే ఇంద్రియ వ్యాపారాన్ని, మనస్సు వ్యాపారాన్ని చివరకు అహం అనే భావాన్ని వదలివేస్తారు అని అర్థం.

పై చెప్పిన వాళ్లందరూ చేసేది యజ్ఞమే. వాళ్లందరూ యజ్ఞవిదులే (అంటే యజ్ఞం తెలిసినవాళ్లు) (శ్లో. 30). యజ్ఞవిదులు అన్నారేగాని బ్రహ్మవిదులు అనలేదు. పై చెప్పిన వ్యాయామాలన్నీ చిత్తశుద్ధికోసం, అంటే జ్ఞానానికి పూర్వరంగంగా చేసే పనులే. వీటివల్ల మనస్సులోని కల్మషం నశిస్తుంది (శ్లో. 30). అద్దంపై మాలిన్యం తొలగిపోతుంది. వెలుగు పడితే ప్రతిఫలించడానికి సిద్ధంగా ఉంది.

మూడవ అధ్యాయం 13వ శ్లోకంలో యజ్ఞశిష్టాశినః అని చెప్పినమాటనే ఇక్కడ 31వ శ్లోకంలో యజ్ఞశిష్టామృతభుజః అంటూ మళ్లీ చెప్పి ఇలా యజ్ఞం చేయగా మిగిలిన అన్నాన్నే తిన్నవాళ్లు అమృతాన్ని భుజించినవాళ్లవుతారు, అంటే పరమార్థాన్ని

పొందుతారు అని యజ్ఞప్రాముఖ్యాన్ని చాటుతున్నాడు. లోకసంగ్రహంకోసం చేసే కర్మలన్నీ యజ్ఞాలే. ద్రవ్యయజ్ఞాలకు అనేక సంభారాలు అవసరం. వీటిని చేయలేనివాళ్లకు మనశ్శుద్ధికై చేసే యజ్ఞాలు చెప్పారు. ఇలా జీవనం గడిపేవాళ్లు 'యాంతి బ్రహ్మ సనాతనమ్' – అంటే బ్రహ్మను పొందుతారు అని అర్థం. ఈ యజ్ఞాలద్వారా చిత్తశుద్ధి కలుగగా క్రమేణ జ్ఞానాన్ని పొంది బ్రహ్మను పొందుతారని అర్థం.

**జ్ఞానప్రశంస - జ్ఞాని ప్రశంస**

ఈ అధ్యాయంలో 4వ అంశం జ్ఞానప్రశంస, జ్ఞానిప్రశంస. పైన చెప్పిన యజ్ఞాలే సుఖంగా ఉన్నాయని ఆ స్థాయిలోనే ఉండకూడదు. వాటిలో జ్ఞానయజ్ఞమొక్కటే కర్మఫలాన్ని నశింపచేసేది. కాబట్టి కర్మఫలం వదులుకోవాలనేవాడు జ్ఞానయజ్ఞంలోకి రావాలి. దీనినే ఒక ప్రసిద్ధమైన శ్లోకంలో చెప్పారు –

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాద్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥ 33**

ఈ జ్ఞానాన్ని తెలుసుకోవడానికి మార్గం 1) ప్రణిపాతం – గురువును ఆశ్రయించి, శ్రద్ధాభక్తులతో ఉండడం. 2) పరిప్రశ్న – శుశ్రూష, ఆత్మను గురించి ప్రశ్నించడం, సందేహాలు నివారణ చేసుకోవడం, 3) సేవ – గురువును భక్తితో సేవించడం (శ్లో. 34). అప్పుడు గురువు అతనికి జ్ఞానాన్ని ఉపదేశిస్తాడు. ఇక్కడ శ్లోకంలో జ్ఞానినః, తత్త్వదర్శినః అని రెండు విశేషణాలు చెప్పారు. జ్ఞానం కేవలం సిద్ధాంతరూపంలో తెలిసినవాడికంటే దాని తత్త్వాన్ని అనుభవంతో ఎఱిగినవాడు సరిగా బోధించగలడని అర్థం.

జ్ఞానంవల్ల సాధకుడికి ఎలాంటి అనుభవం వస్తుంది? అతనికి విషయాలపై సరైన అవగాహన (మోహంలేని స్థితి) ఉంటుంది. ప్రపంచంలోని అన్ని ప్రాణులను తనయందే చూసుకొనగలడు. వాటన్నింటినీ తనకంటే భిన్నంకానివిగా చూడడం (శ్లో. 35). భగవంతునిలో ఎలా ఉన్నాయో నాలో అలా ఉన్నాయి అంటూ భగవంతునిలో ఐక్యం అనుభవించడం ఇక్కడ చెప్పబడింది.

'నేను' అనే పరిచ్ఛిన్న దేహంలో ప్రపంచమంతా ఎలా ఉంటుంది? అంటే 'నేను' అనేదాని శరీరపరిధిని వదిలేసి ఆ బ్రహ్మయే 'నేను' అని మన పరిధిని పెంచుకున్నప్పుడు ప్రపంచాన్నంతా మనలో భాగంగా చూడగలుగుతాం. అందుకే భగవానుడు నీకు ఇలాంటి దృష్టి వచ్చిన తర్వాత ప్రపంచమంతా నాలో ఎలా ఉందో అలాగే నీలో ఉన్నట్లు

తెలుసుకొనగలవు అంటాడు (**యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి** – శ్లో. 35).

జ్ఞానం ఒక నావలాంటిది. ఈ నావ సహాయంతో పాపమనే సముద్రాన్ని దాటివేయగలవు (శ్లో. 36). జ్ఞానికి పుణ్యంగాని, పాపంగాని అంటవు.

జ్ఞానం అగ్నిలాంటిది. అగ్నిచేత వస్తువులు పవిత్రం చేయబడతాయి. అగ్ని ఎలాగ అన్నింటినీ భస్మం చేస్తుందో అలాగ కర్మలన్నీ (పుణ్యం – పాపం రెండూ) ఆ జ్ఞానంలో భస్మమవుతాయి. అంటే వాటి ఫలాన్నివ్వవు (శ్లో. 37).

ఇక్కడ ఒక ముఖ్యమైన వాక్యం – **న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే** (శ్లో. 38). జ్ఞానంకంటే శుద్ధికరమైనది మరొకటిలేదు. ఈ జ్ఞానాన్ని కర్మయోగాభ్యాసంవల్ల కాలేన = క్రమేణ పొందగలరు (శ్లో. 38). దీనికి ఇంద్రియనిగ్రహం, శ్రద్ధ, ఆవశ్యకం. జ్ఞానాన్ని పొందిన తర్వాత అచిరేణ = త్వరగా శాంతిని పొందగలడు (శ్లో. 39). ఒక మార్గంలో కాలక్రమేణ మరోమార్గంలో వెనువెంటనే అని అర్థం.

ఈ ఆత్మజ్ఞానంపట్ల సంశయభావం కలవాడు నశిస్తాడు – **సంశయాత్మా వినశ్యతి** (శ్లో. 40). సంశయం గలవాడు కర్మయోగాన్ని కూడా ఆచరించడు. అతనికి కర్మ బంధమే కాని కర్మ విముక్తి లేదు. ఆవిధంగా నశిస్తాడు.

అర్జునుడు ఇంకా ఏదో సంశయంతో ఉన్నాడనే సందేహం కలగడంవల్ల భగవానుడు మళ్లీ నేరుగా చెబుతున్నాడు – 'అజ్ఞానంవల్ల వచ్చే ఈ సంశయాన్ని జ్ఞానమనే కత్తితో నరికివేసి కర్మయోగంలోకి ప్రవేశించు'. ఈ వాక్యంతో ఈ అధ్యాయం ముగుస్తుంది.

❖ ❖ ❖

### ఐదవ అధ్యాయము

# కర్మసంన్యాసయోగము

శ్రీకృష్ణుడు ఒకసారి కర్మసంన్యాసంచేయమని మరొకసారి కర్మయోగంలో ఉండమని చెప్పినట్లు స్థూలంగా కన్పిస్తుంది. అందువల్ల అర్జునుడికి ఒక సందేహం. “నీవు ఒకసారి కర్మసంన్యాసం ప్రశంసిస్తున్నావు, తర్వాత యోగాన్ని ప్రశంసిస్తున్నావు. వీటిలో ఏది శ్రేయస్కరమైనదో నిశ్చితంగా చెప్పుము” అంటున్నాడు. శ్రీకృష్ణుడు ఈ అధ్యాయంలో కర్మసంన్యాసం ఏమిటి? యోగం ఏమిటి? అని చెప్పబోతున్నాడు. కావున ఈ అధ్యాయం పేరు ‘కర్మసంన్యాసయోగం’. కొన్ని గ్రంథాల్లో కేవలం సంన్యాసయోగం అన్నారు.

ఈ అధ్యాయంలో 29 శ్లోకాలున్నాయి. మొదటి 9 శ్లోకాల్లో ఇదివరకే మూడవ అధ్యాయంలో చెప్పిన సాంఖ్యము, యోగము (**ద్వివిధానిష్ఠా** 3-3) అని చెప్పిన దానిపై ప్రస్తావన. శ్లో. 9-22 వరకు కర్మయోగం, జ్ఞానయోగాల తులనాత్మక పరిశీలన. కర్మయోగం సాధనం, జ్ఞానయోగం సాధ్యం (కర్మయోగంద్వారా సాధించదగినది). శ్లో. 23 నుండి చివరి వరకూ మళ్ళీ జ్ఞానసాధనాలు.

కర్మలు, సంన్యాసాలలో వివిధదశలున్నాయి. ఎవరికర్మలు, ఎలాంటి కర్మలు, ఎవరి సంన్యాసం, ఎలాంటి సంన్యాసం అనేది చూడాలి.

1) ఆత్మజ్ఞానం లేకుండా కర్మలను వదలివేయడం. అంటే జ్ఞానం కలగాలనే కోరికతో వేదాంతవాక్యాల శ్రవణము, మననము చేస్తూ ఉండడం. దీనినే **‘వివిదిషా సంన్యాసం’** అంటారు. దీనికి కాలక్రమేణ ప్రయోజనం ఉండవచ్చు.

2) జ్ఞానియై (ఆత్మతత్త్వం తెలుసుకొని) కర్మలు వదలివేయడం. ఇవి రెండు రకాలు. ఎ) కొన్నాళ్లు కర్మయోగం చేసిన తర్వాత చిత్తశుద్ధి, తర్వాత వేదాంతశ్రవణం, దానివల్ల జ్ఞానోదయం, తదుపరి కర్మలను వదలివేయడం. బి) పూర్వజన్మ సుకృతంవల్ల పుట్టుకతోనే జ్ఞానులు కర్మలను వదలివేస్తారు. ఉపనిషత్తుల్లో మనకు వామదేవుడు మొదలైనవాళ్ల ఉదాహరణలు ఇవ్వబడ్డాయి.

3) జ్ఞానియై లోకసంగ్రహం కోసం కర్మలు చేయడం. ఉదా: యాజ్ఞవల్క్యుడు గృహస్థుడు, జ్ఞాని. ఇతడు వేలాదిమంది శిష్యులను పోషిస్తుంటాడు. అలాగే జనకుడు మహారాజు. రాజ్యపాలన చేస్తుంటాడు.

4) జ్ఞాని కాకుండా నిష్కామకర్మ చేయడం. అంటే ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను చేయడం. దీనివల్ల మనస్సుకు నిర్మలత్వం లభిస్తుంది. ఇదే కర్మయోగం.

ఇదికాక **'అధికారి భేదం'** అని ఒకమాట శాస్త్రంలో ఉంది. అధికారి అంటే ఒక కర్మ చేయడానికో, తత్త్వం తెలుసుకోవడానికో అర్హుడు. పూర్వజన్మసుకృతంవల్ల బాల్యంలోనే చిత్తనైర్మల్యం కలిగి జ్ఞానమార్గంలో ఉండేవాడు **ఉత్తమాధికారి**. ఉదా: పైన చెప్పిన వామదేవుడు, ప్రహ్లాదుడు మొదలగువారు. రెండోవాడు **మధ్యమాధికారి**. గృహస్థుడుగా ఉన్నవాడికి గృహస్థధర్మం ముఖ్యం. సమాజంలో బ్రహ్మచారులను, సంన్యాసులను పోషించాల్సిన బాధ్యత అతనిది. అతడు గృహస్థుడుగానే వుంటూ జ్ఞాని కావచ్చు. క్రమేణా వానప్రస్థం తర్వాత సంన్యాసి కావచ్చు. మూడోవాడు **మందాధికారి**. అంటే మందబుద్ధి కలవాడు. ఇతనికి శాస్త్రం అవసరంలేదు. కర్మకాండల్లో కొట్టుమిట్టాడుతుంటాడు.

పైన చెప్పిన అధికారిభేదం, కర్మలో, సంన్యాసంలో భేదం అంటే ఏ సందర్భంలో ఏం చెబుతున్నారని తెలియకుంటే వేదాంతశాస్త్రం / గీత గజిబిజిగా ఉంటుంది.

ఈ అధ్యాయంలో అర్జునుడి ప్రశ్నకు శ్రీకృష్ణుడిలా అన్నాడు. "సంన్యాసం, కర్మయోగం ఈ రెండూ నిశ్శ్రేయస (మోక్ష) సాధనాలే. కానీ వాటిలో కర్మసంన్యాసం కంటే కర్మయోగం గొప్పది" (శ్లో. 2).

ఇక్కడ ఎలాంటివాడి కర్మసంన్యాసంకంటే ఎలాంటివాని కర్మయోగం గొప్పది అని ప్రశ్న. జ్ఞాని కానివాడి కర్మసంన్యాసంకంటే, జ్ఞాని కానివాడి కర్మయోగం (నిష్కామకర్మ) గొప్పది అని కృష్ణుడి భావం. ఈ రెండూ క్రమేణా జ్ఞానం కలగడానికి కారణాలే. అయినా కర్మయోగం గొప్పది. ఎందుకంటే అది లోకానికి ఉపయోగిస్తుంది. అర్జునుడి స్వభావానికి కూడా కర్మయోగం సరైనదని శ్రీకృష్ణుడి భావన. "నిజం చెప్పాలంటే ఆ కర్మయోగినే నిత్యసంన్యాసి అనవచ్చు. ఎవడు దేనినీ ద్వేషించడో, దేనినీ కోరడో అతడు కర్మల్లో ప్రవర్తించినా కూడా అతణ్ణి నిత్యసంన్యాసి అనవచ్చు. అతనికి ద్వంద్వాలు లేవు. కాబట్టి కర్మబంధంనుండి ముక్తుడౌతాడు" (శ్లో. 3).

"సాంఖ్యం (జ్ఞానం) మరియు కర్మయోగం గురించి చెప్పాల్సివస్తే ఈ రెండూ వేర్వేరు అని జనులు భావిస్తారు. కానీ పండితులు అలా భావించరు. రెంటిలో ఏది ఆచరించినా ఫలం (మోక్షం) ఒక్కటే. రెంటినీ ఒకటే అని తెలుసుకున్నవాడే సరిగా తెలుసుకున్నవాడు" (శ్లో. 4,5). ఇది శ్రీకృష్ణుడు కర్మయోగాన్ని ఈ సందర్భంలో మెచ్చుకుంటూ చెప్పినమాట. ఎందుకంటే తర్వాతి శ్లోకంలో "కర్మయోగ సహాయం లేకుండా సాంఖ్యాన్ని సాధించడం చాలాకష్టం. కర్మయోగంద్వారా జ్ఞానాన్ని పొందగలం" అంటున్నాడు. ఇదివరకే మూడవ అధ్యాయంలో చెప్పినమాటనే మళ్లీ చెబుతూ 7వ

శ్లోకంలో "కర్మయోగం అభ్యసిస్తూ నిర్మలమైన మనస్సుతో ఇంద్రియాలను జయించి కర్మ చేసినవాణ్ణి ఆ కర్మఫలం అంటుకొనదు" అన్నాడు.

**యోగయుక్తుడు ఎలా ఉంటాడు ?**

పై శ్లోకంలో ఆత్మజ్ఞానానికి ఉపాయంగా కర్మయోగం చెప్పబడింది. **'సర్వభూతాత్మ భూతాత్మా'** అనేపదం సాధకుణ్ణి ఉద్దేశించి ఇక్కడ వాడబడింది. జ్ఞానియైనవాడు ఎలాగైతే ప్రపంచాన్నంతా తనలోనే చూసుకుంటాడో అలాగే సాధకుడు కూడా ఆ భావాన్ని సాధన చేయాలి. అందుకై తన ఆత్మయే సర్వభూతాల ఆత్మ అనుకోవడం, లేదా అన్ని జీవులను తనకు అభిన్నంగా చూసుకోవడం. జ్ఞానం కలవాడి లక్షణమేదో సాధకుడు దానినే సాధనంగా అభ్యసించాలి అని పైన చెప్పుకున్నాం. అలాంటి సాధకుడికి జ్ఞానం ప్రాప్తించిన తర్వాత అతనిదృష్టి ఇలా వుంటుంది.

**నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8**

ఈ వాక్యం జ్ఞాని కర్మను చక్కగా నిర్వచిస్తుంది. కర్మ శరీరానికి చెందినదే కాని, ఆత్మకు చెందినదికాదు. జ్ఞాని అన్ని సాధారణ కర్మల్లో కూడా (చూస్తూ, వింటూ, స్పృశిస్తూ, తింటూ, శ్వాస పీల్చుకుంటూ, నడుస్తూ ఇలా అన్నిపనులు చేస్తూ) ఇంద్రియాలు వాటి విషయాలపై ప్రవర్తిస్తున్నాయి అని భావిస్తాడు. తన్నుతాను నిష్క్రియుడిగా అంటే కర్మ చేయనివాడిగా, ఇంద్రియాల ప్రవర్తనను సాక్షిగా గమనిస్తుంటాడు.[1]

**'పద్మపత్రమివాంభసా'** అని తర్వాతి శ్లోకంలో చెప్పబడింది. ఇది నిష్కామకర్మను ఈశ్వరార్పణ బుద్ధితో చేసే వ్యక్తి గురించి చెప్పబడింది. తామరాకుపై నీటిబొట్టు ఎలా అంటదో అలా కర్మఫలం ఇతణ్ణి అంటదు అని అర్థం. యోగులు కర్మ చేయడమంతా ఆత్మశుద్ధి గురించే. దీనికై ఒక ప్రసిద్ధ శ్లోకం –

**కాయేన మనసా బుద్ధ్యా కేవలైరిన్ద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాఽఽత్మశుద్ధయే ॥ 11**

ఈ శ్లోకంలో యోగి అనే పదానికి మోక్షమార్గంలో ఉన్న కర్మయోగి అని అర్థం. సంగం అంటే ఫలాపేక్ష. ఈ రెంటినీ వదలి కేవలం చిత్తశుద్ధికోసం కర్మలు చేస్తుంటాడు. ఇదే భావము శ్లో. అ.3 శ్లో.4లో కూడా చెప్పారు.

---

1. మనం ఎంతో తీరిక లేకుండా పనులు చేస్తున్నప్పుడు పై శ్లోకార్థాన్ని మననం చేసుకోవడం మంచి సాధన.

**పరమార్థం తెలిసినవాడి స్థితి**

పరమార్థదర్శి అయినవాని స్థితి ఏమిటి అని శ్లో. 13 నుండి 22 వరకూ చెప్పబడింది. ఇతడు కర్మలనన్నింటినీ మనస్సుతోనే త్యజించి **నవద్వారే పురే దేహీ** (శ్లో. 13) – అంటే నవద్వారాల పురమైనటువంటి ఈ దేహంలో తాను చేయడం, చేయించడం అనే పనులు లేకుండా సుఖంగా ఉంటాడు. అందరూ దేహంలో ఉండేవారే కదా? అంటే జ్ఞాని కానివాడు దేహీ – 'దేహమే నేను' అనే భావనలో ఉంటాడు. ఆత్మను తెలుసుకున్నవాడు 'నేను' దేహంలో ఉన్నాను అనుకుంటాడు. అంతే తేడా. అందుకై జ్ఞానిని ఉద్దేశించి దేహంలో ఉన్నాడు అని పై శ్లోకంలో చెప్పారు. కర్తృత్వం (చేయడం), కారయితృత్వం (చేయించడం) అనేవి ఆత్మధర్మాలు కావు. అందుకే పైన చెప్పిన 'దేహీ' ఏమీ చేయడు, చేయించడు అన్నారు.

**భగవానుడు మన పాపాలను తొలగిస్తాడా?**

ఆత్మధర్మాల ప్రసక్తివచ్చింది కాబట్టి 14, 15 శ్లోకాల్లో వాటిని గురించి చెబుతున్నాడు. అన్నిటికీ ప్రభువైన పరమాత్మ (బ్రహ్మ) జనులకు కర్తవ్యాన్నిగానీ, కర్మలనుగానీ సృజించదు. కర్మలఫలాన్ని కూడా ఇవ్వదు. అయితే వీటన్నింటికీ కారణం స్వభావం (ప్రకృతి – మాయ) (శ్లో. 14). ప్రకృతి, దానిలోవున్న మూడు గుణాల కలయికవల్ల ప్రాణులు వివిధకర్మలను చేస్తుంటాయి.

**నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥ 15**

సృష్టికి, బ్రహ్మకు సంబంధం ఏమిటి? అని టూకీగా ఈ శ్లోకంలో చెప్పబడింది. పరబ్రహ్మకు ఎట్లాంటి కర్తృత్వభోక్తృత్వాలు లేవు. అది శుద్ధచైతన్యస్వరూపం. కావున బ్రహ్మ ఎవరి పాపాలనుగానీ, పుణ్యాలనుగానీ తీసుకొనదు. అజ్ఞానంచే మోహంచెంది జనులు పైవిధంగా భావిస్తుంటారు అని పై శ్లోకార్థం.

ఈ వాక్యాలను సరిగా అర్థం చేసుకోవాలి. దేవుడందరికీ నొసలుపై భాగ్యరేఖలు వ్రాస్తాడు, కర్మలు చేయిస్తాడు, మంచి పనికి పుణ్యమిస్తాడు, మన పాపాలను తొలగిస్తాడు అనుకునేవాళ్లకి పై వాక్యం ఒక షాక్‌లాగా అనిపిస్తుంది. దేవుడు మన పాపాలను తీసుకుంటాడు అంటే మనిషికి సాంత్వన. మనం పాపాలు చేస్తూ దేవుడి వాటిని క్షమిస్తూ ఉంటే మనకు చాలా అనుకూలం. కానీ దేవుడికి ఇవన్నీ పట్టవు. పరబ్రహ్మ వీటికి అతీతమైన తత్త్వం అంటే జీర్ణించుకోవడం కష్టంగా ఉంటుంది. పై మాటలు

పరమార్థదశలో  పరబ్రహ్మనుగూర్చి చెప్పేమాట. సృష్టికి కారణమైంది మాయ. అందులో ఉన్న త్రిగుణాలు మనపై ప్రభావం చూపేవి. ఈ త్రిగుణాలే మనిషితో పనులు చేయిస్తాయి. పనులకు ఫలితాలనిస్తుంటాయి. మనిషికి తాను కోరిన కర్మ చేయడానికి స్వేచ్ఛ (free will) ఉందని రెండవ అధ్యాయంలో చెప్పుకున్నాం. దీనివల్ల వచ్చే పుణ్యపాపాలు సృష్టినియమాల ప్రకారం వస్తుంటాయి. పాపాన్ని తొలగించుకోవడానికై ప్రాయశ్చిత్తకర్మలు చెప్పబడ్డాయి. ప్రాయశ్చిత్తం అంటే మనఃపూర్వకంగా చేసేపని. అందువల్ల పాపం తొలగుతుంది. ఈ విషయం మనకు అజ్ఞానం తొలగిన తర్వాతనే తెలుస్తుంది (శ్లో. 16).

పై శ్లోకంవల్ల పాపాలను తొలగించుకొనే మార్గమే లేదని అర్థంకాదు. ఆత్మజ్ఞానం కలిగిన తర్వాత అతని పుణ్యపాపాలన్నీ కూడా నశిస్తాయని వేదాంతసిద్ధాంతం. జ్ఞానం కేవలం తత్త్వవిచారంవల్ల, అంటే వేదాంతవాక్యాల అర్థాన్ని మననం చేసి విచారం చేయడంవల్ల కలుగుతుంది. అప్పుడు అలాంటి వ్యక్తి పుణ్యపాపాలకతీతంగా వుంటాడు.

**సమదృష్టి**

జ్ఞాననిష్ఠలో ఉన్నవాడిని గూర్చి తర్వాతి శ్లోకాల్లో చెప్పబడింది. ఈ నిష్ఠలో వున్నవాడికి పునరావృత్తి (పునర్జన్మ) తొలగిపోతుంది. జ్ఞానంచేత వాళ్ల కల్మషం ఎగురగొట్టబడింది (శ్లో. 17). అలాంటివాడికి లోకంలో అన్నింటిపట్లా సమదృష్టి ఉంటుంది. ఇక్కడ ఒక ప్రసిద్ధ శ్లోకం –

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః ॥ 18**

పండితులు (పండా అంటే ఆత్మజ్ఞానమని పైన చూశాం) విద్య, వినయము ఉన్న బ్రాహ్మణుడియందు, గోవుయందు, ఏనుగునందు, కుక్కయందు, కుక్కమాంసం తినేవాడియందు సమమైన బ్రహ్మతత్త్వాన్ని చూస్తారు. ఇక్కడ **సమం** = ఎట్టి వికారములేని బ్రహ్మచైతన్యం అని అర్థం చెప్పారు.

ఇలాంటి సమత్వభావంలో ఉన్నవాళ్లు ఇక్కడే జననమరణ చక్రాన్ని జయిస్తారు. **'ఇహైవ తైర్జిత స్సర్గః'** (శ్లో. 19) అంటే ఇక్కడే ఈ లోకంలోనే అనగా జీవించి ఉండగానే ముక్తుడౌతాడు. జీవన్ముక్తుడితడే. ఇలాంటివాడు ఇష్టమైనదాన్ని పొంది సంతోషించడు,

ఇష్టంలేని దాన్ని పొంది ఉద్వేగం చెందడు. బ్రహ్మజ్ఞానంలో నిష్ఠుడై (స్థిరంగా) వుంటాడు (శ్లో. 20). ఎందుకనగా ఇంద్రియవిషయాలపైన ఆసక్తి దుఃఖాన్నే కలిగిస్తుంది. అవి మధ్యలో వచ్చిపోయేవి. పండితుడు వాటియందు రమించడు (శ్లో. 22).

**జ్ఞానానికి సాధనాలు**

23వ శ్లోకం నుండి చివరి వరకూ జ్ఞాని లక్షణాలను మళ్లీ చెబుతున్నాడు. పైన చెప్పినట్లుగా అధ్యాత్మశాస్త్రంలో జ్ఞాని లక్షణాలే సాధకుడికి సాధనాలు. అవే శమం, దమం, అహింస మొదలైన అభ్యాసాలు. ఈ అభ్యాసాలు చేస్తుంటే అవే అతని లక్షణాలుగా మారతాయి. ఆధునిక భాషలో చెప్పాలంటే conscious habits influence the unconscious mind అనవచ్చు.

1) శ్లో. 23లో **'కామక్రోధోద్భవం వేగం** – కామం, క్రోధం అతి వడిగా వస్తుంటాయి. వాటి వేగాన్ని నిరోధించి అణచడం చెప్పబడింది. వాటి వేగాన్ని అడ్డుకుంటే మనస్సుకు ఆలోచించే సమయం లభిస్తుంది. కాబట్టి ఈ అడ్డుకోవడాన్ని అభ్యసించాలి.

2) శ్లో. 24లో మరికొన్ని విషయాలు –

**యోఽన్తస్సుఖోఽన్తరారామస్తథాన్తర్జ్యోతిరేవ యః ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ 24**

**అంతస్సుఖః** అంటే తనలోనే సుఖమున్నది, బాహ్యపదార్థాల్లో లేదు అని గ్రహించినవాడు. తైత్తిరీయ ఉపనిషత్తులో ఆనందం ఏమిటి? అని పెద్ద చర్చ ఉంది (ఆనందమీమాంస అంటారు). సుఖాన్ని కొలవడం ఎలా? అని మనవాళ్లు కొన్ని కొలతలు చూపించారు. ప్రపంచం మొత్తంలో విలువైన వస్తువులు, భోగాలు అన్నీ ఒకే యువకుడు, ఉత్సాహ వంతుడు, శక్తిమంతుడు, ఇంద్రియపటుత్వం ఉన్న వ్యక్తి అధీనంలో ఉంటే అతనికిగలిగే సుఖాన్ని ఒక కొలమానంగా తీసుకొని దాన్ని **మానుషానందం** అన్నారు. దానికి వందరెట్లు **గంధర్వానందం**, దానికి వందరెట్లు దేవతల ఆనందం అంటూ మనిషికి పై స్థానాల్లో ఉన్న అందరి ఆనంద స్థాయిలను కొలుస్తూ వెళ్ళి వీళ్లందరి ఆనందం కోరికలులేని ఆత్మజ్ఞాని ఆనందంకంటే తక్కువే అని **'శ్రోత్రియస్య చాకామ హతస్య'** అంటూ నిర్ధారిస్తారు. అకామహతుడు అంటే కామములచేత కొట్టబడనివాడు. బలవంతంగా కోరికలను అణచుకొని లేదా విధిలేక అణచుకున్నవాడు కాదు. ఆత్మజ్ఞానంతో తాను పరిపూర్ణుడను అని తెలుసుకోవడంతో కోరికలు వాటంతటవే తొలగిపోతాయి. అలాంటివాడు పై శ్లోకంలో చెప్పిన అంతస్సుఖుడు.

అందుకే **అంతరారామః** అని మరో విశేషణం. ఆత్మయందే ఇతనికి క్రీడ. అలాగే **అంతర్జ్యోతిః** – అంటే ఆత్మయే ప్రకాశంగా కలవాడు. అనగా ఆత్మభావంతో అతని ప్రవర్తన ప్రభావితమై ఉంటుంది. బాహ్యవిషయాలను కోరుకొనేవాడు బాహ్యజ్యోతి. ఆత్మజ్ఞాని అలాంటివాడు కాడు.

అలాంటివాడికే **బ్రహ్మనిర్వాణం** – అనగా ఎలాంటి చాంచల్యంలేని స్థితి (నిర్వాణ శబ్దానికి అర్థం పైన చెప్పుకున్నాం). అతన్నే **బ్రహ్మభూతః** – అంటే బ్రహ్మగా అయినవాడు అంటే జీవన్ముక్తుడు అన్నారు.

అలా బ్రహ్మభావంలో ఉన్నవాడు **సర్వభూతహితే రతః** (శ్లో. 25) – అన్నిప్రాణుల హితము కోరి ప్రవర్తిస్తుంటాడు. ఇది కూడా అభ్యసించవలసిన విషయం.

పై చెప్పినవన్నీ జ్ఞాని లక్షణాలు, సాధకుడు చేయాల్సిన సాధనలు / అభ్యాసాలు. చివరి మూడు శ్లోకాల్లో (27,28,29) తర్వాతి అధ్యాయంలో చెప్పబోయే ధ్యానయోగాన్ని గూర్చి సూత్రప్రాయంగా చెప్పారు. బ్రహ్మతత్త్వాన్ని సగుణ, సాకార రూపం (నామం, రూపం కలిగిన దేవతామూర్తిగా)లో ధ్యానించడంవల్లనో, యోగాభ్యాసం చేయడంవల్లనో, ఎలా మనస్సును నిగ్రహించుకోవాలి అని విషయం. పతంజలిమహర్షి చెప్పిన అష్టాంగయోగంలో యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారం అనేవి శరీరానికి, ఇంద్రియాలకు సంబంధించిన విషయాలు. తర్వాత చెప్పిన మూడు ధ్యాన, ధారణ, సమాధులు. ఇవి మనసుకు సంబంధించినవి. వీటన్నింటినీ అభ్యసిస్తేనే మనోనిగ్రహం.

సారాంశం చెప్పాలంటే –

– కర్మయోగం (నిష్కామకర్మ) సమ్యగ్దర్శనానికి **బహిరంగసాధనం** (సహకరించి చిత్తశుద్ధి కలిగిన తర్వాత వాటితో పనిలేదు, బయటనే ఉండిపోయేవి. జ్ఞాని కర్మలు చేయవచ్చు, చేయకపోవచ్చు అని అర్థం).

– ధ్యానయోగం సమ్యగ్దర్శనానికి **అంతరంగసాధనం** (జ్ఞానం కలిగిన తర్వాత కూడా జ్ఞానంలో భాగంగా ఉండేది. శ్రవణమనననిధిధ్యాసనలు జ్ఞాని లక్షణాలు. వాటి అనుసంధానం అతని మనసులో నిరంతరం ఉంటుంది).

– జ్ఞానం సమ్యగ్దర్శనానికి సాక్షాత్ సాధనం.

ఈ అంశంతో పంచమాధ్యాయం ముగుస్తుంది.

❖ ❖ ❖

## ఆఱవ అధ్యాయము

# ధ్యాన యోగము

ఐదవ అధ్యాయం చివరి మూడు శ్లోకాల్లో ధ్యానయోగాన్ని గూర్చి సూత్రప్రాయంగా చెప్పాడు శ్రీకృష్ణుడు. దానినే ఈ అధ్యాయంలో వివరిస్తున్నాడు.

ఈ అధ్యాయం పేరు ధ్యానయోగం. ఆత్మసంయమయోగం అని కూడా కొన్నిచోట్ల ఉంది. ఆత్మ అంటే అంతఃకరణం, సంయమనం = అంతర్ముఖంగా నిలపడం, నిగ్రహించుకోవడం కావున ఆ పేరు కూడా సరైనదే. అంతఃకరణం బహిర్ముఖంగా వుంటే అది బంధానికి కారణం. అంతర్ముఖంగా ఉంటే మోక్షానికి కారణం. అంతఃకరణం చాలా చంచలమైనది. కాబట్టి దీన్ని అదుపులో పెట్టడానికి చాలా అభ్యాసం అవసరం. వీటిని పతంజలి యోగసూత్రాల్లో చెప్పారు. యోగదర్శనం ప్రత్యేక దర్శనశాస్త్రమైనప్పటికీ మనస్సు గూర్చి అభ్యాసాలు సర్వసాధారణం. కావున వేదాంత శాస్త్రంలో వీటిని గ్రహించారు. ఉపనిషత్తుల్లోని సిద్ధాంతానికి విరుద్ధంగా ఉన్న అంశాలను వదలి అవిరుద్ధంగా ఉన్న అన్నింటినీ వేదాంతులు గ్రహిస్తారు. అందుకే పతంజలియోగంలోని అభ్యాసాలు గ్రహించబడ్డాయి. ఈ ధ్యానయోగంకూడా ఒకానొక కర్మయే. మనస్సును శుభ్రపరచుకొనే కర్మ. దీనితోపాటు ఆత్మచింతన (శ్రవణ మనన నిధిధ్యాసనలు) ఉంటేనే జ్ఞానప్రాప్తి.

ఈ అధ్యాయంలో 47 శ్లోకాలున్నాయి. మొదలుగా ధ్యానప్రశంస. మనస్సును క్రమక్రమంగా ఎలాంటి అభ్యాసాలద్వారా లొంగదీసుకోవాలి అని 3 నుండి 17 శ్లోకాలలో చెప్పబడింది. తర్వాత 18 నుండి 26 వరకు ధ్యానసమయంలో మనస్సులో వచ్చే మార్పులు చెప్పబడ్డాయి. శ్లో. 26 నుండి 32 వరకు ధ్యానం దేనిపై చేయాలి అనే విషయం. పరబ్రహ్మను ఒక సగుణ, సాకార రూపం (ఒక రూపం, గుణాలు ఉన్నట్లు – విష్ణువు, శివుడు, వినాయకుడు ఇలాగ)లో చేయాలా? ఒక నిర్గుణతత్త్వంగా భావించి చేయాలా అని. చివరగా ఈ యోగాభ్యాసంలో అడ్డంకులు, వాటినెలా ఎదుర్కోవడం అని శ్లో. 33 నుండి 47 వరకూ చెప్పబడింది.

**ఈశ్వరార్పణబుద్ధి**

మొదటి రెండు శ్లోకాల్లో కర్మయోగాన్ని మళ్లీ ప్రశంసిస్తున్నాడు శ్రీకృష్ణుడు. చిత్తశుద్ధి దీనివల్లనే కలుగుతుంది. ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేయడం, సంన్యాసంతో సమానమైనదే అని ప్రశంసావాక్యంగా చెబుతున్నాడు. గృహస్థులందరూ కర్మసంన్యాసం

చేయజాలరు. వారు చేయగలిగింది కర్మయోగం. అంటే ఫలం కోరకుండా ఈశ్వరార్పణ బుద్ధితో కర్మచేయడం. ఈశ్వరార్పణం అంటే ఒక అకౌంట్ నుండి ఇంకో అకౌంట్‌కు మార్చినట్లు కాదు. బ్రహ్మతత్త్వమే 'నేను' అనే భావంలో ఇంద్రియాలు నిర్వర్తిస్తున్న కర్మలకు సాక్షిగా ఉంటూ కర్మలు పరమాత్మనుండియే ఉద్భవిస్తున్నాయి, అందులోనే లయమౌతున్నాయి అని గ్రహించడం. ఈ భావన మనసులో గట్టిపడుతుంటే అది ధ్యానయోగానికి తొలిమెట్టు అవుతుంది. ఈ సాధనలన్నీ ఒక మెట్టుపై మరోమెట్టు లాంటివి. అందుకే 3వ శ్లోకంలో యోగాన్ని ఆరోహించేవాడు, ఆరోహించినవాడు అని కృష్ణుడు చెప్పబోతున్నాడు.

**యోగాన్ని ఆరోహించినవాడు, ఆరోహించదలచినవాడు**

> **ఆరురుక్షోర్మునేర్యోగం కర్మకారణముచ్యతే।**
> **యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ॥ 3**

"జ్ఞాననిష్ఠను ఆరోహించదలచిన మునికి (మననం చేసే స్వభావంకలవాడికి) కర్మయోగం సాధనం. దాన్ని (కర్మయోగాన్ని) ఆరోహించినవాడికి శమం జ్ఞానప్రాప్తికి సాధనం" ఇదొక ముఖ్యమైన విశ్లేషణ.

ఇక్కడ రెండు విషయాలు చెప్పబడ్డాయి. ఎ) ఫలాకాంక్షలేని కర్మయోగం ధ్యానయోగానికి బహిరంగసాధనం (సహకరించి బయటే ఉండిపోయేది, చిత్తశుద్ధి మాత్రం కలుగజేస్తుంది కాని సాక్షాత్తూ మోక్షానికి కారణం కాదు). బి) ఈ ధ్యానయోగం జ్ఞానానికి అంతరంగసాధనం (అంటే దానితో వ్యాపించివుండేది, ఏ సాధనం జ్ఞానానికి సాక్షాత్తుగా కారణమౌతుందో అది అంతరంగసాధనం. శమం, దమం, వివేకం మొదలైనవి). పై శ్లోకంలో **ఆరురుక్షువు** = అంటే ధ్యానయోగం ఆరోహించాలని కోరేవాడు. అతనికి కర్మయోగం సాధనం. యోగారూఢుడు = యోగాన్ని ఆరోహించినవాడు. అతడికి జ్ఞానం పొందడానికి శమము కారణము.

యోగారూఢుడు కావడమెలాగ? అంటే సమస్తమైన సంకల్పాలను వదలి విషయాలయందు, కర్మలయందు ఆసక్తి వదిలేసుకుంటాడో అప్పుడు అతడు యోగారూఢుడు అని చెప్పబడతాడు (శ్లో. 4). అంటే కర్మలవల్ల ప్రయోజనం లేదనే స్పృహతో సంకల్పాన్ని వదలివేసి క్రమంగా కర్మలను వదలివేయడం. ఇక్కడొక ప్రసిద్ధ శ్లోకం –

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్।**
**ఆత్మైవహ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మనః ॥ 5**

ఆత్మతో (తనతో – దేహేంద్రియ సముదాయంతో) ఆత్మను (తనను) ఉద్ధరించుకోవాలి. తనను క్షీణింపచేసికొనకూడదు. తానే తనకు బంధువు, తానే తనకు శత్రువు అని శ్లోకార్థం. వేదాంతశాస్త్రం తన్నుతాను ఉద్ధరించుకోవడానికి చెప్పిన విషయం అని గీత మాటిమాటికీ మనకు గుర్తుచేస్తుంది.

దేహేంద్రియాదులు లాగినట్టల్లా ఆ దిక్కున వెళ్లేవాడు తనకు తానే శత్రువు. అలా వెళ్లక వాటిని నిగ్రహించేవాడు తనకుతానే బంధువు (శ్లో. 6). ఇలాగ ఇంద్రియాలను జయించినవాడు ప్రశాంతతతో ఉంటాడు. బ్రహ్మతత్త్వాన్ని సాక్షాత్కరించుకొన్న వాడౌతాడు. అతడు సుఖదుఃఖాలలో, మానావమానాల్లో సమబుద్ధితో ఉంటాడు (శ్లో. 7). శాస్త్రజ్ఞానంచేతను, ఆ జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడంవల్లనూ తృప్తితో స్థిరంగా ఉంటాడు. అతనికి మట్టి, బంగారం ఒకటే. అతడే యోగి అనబడేవాడు (శ్లో. 8). మిత్రుడు, శత్రువు, బంధువు కానివాడు అని అందరిపట్ల సమబుద్ధితో ఉండేవాడు యోగి. అతడే శ్రేష్ఠుడు, అతడే యోగారూఢుడు (శ్లో. 9).

**యోగాన్ని ఆరోహించడానికి అభ్యాసాలు**

పై నాలుగు శ్లోకాల్లో (6–9) యోగారూఢుడు ఎలా ఉంటాడని చెప్పబడింది. ఆ స్థానం పొందడానికై ఏం చేయాలి అని తర్వాత చెబుతున్నాడు.

1) **రహసిస్థితః** – అంటే ఏకాంతంగా ఉంటూ అభ్యాసం చేయాలి (శ్లో. 11).

2) **యతచిత్తాత్మా** – అంతఃకరణం దేహం వశంలో ఉంచుకోవాలి (శ్లో. 11).

3) **నిరాశీః, అపరిగ్రహః** – అంటే ఏవీ ఆశించకూడదు, ధనసంచయం చేయకూడదు. (శ్లో. 11).

4) **ఆసనం** – శుచి అయిన ప్రదేశంలో దర్భలు, జింకచర్మము, వస్త్రము ఒకదానిపై ఒకటివేసి కూర్చోవడం (శ్లో. 11).

5) ఏకాగ్రచిత్తంతో అంతఃకరణశుద్ధికై యోగం ఆరంభించాలి (శ్లో. 12).

6) నిటారుగా కూర్చొని ముక్కుచివర దృష్టిని నిలపాలి (శ్లో. 13). ఇటూ అటూ చూడకుండా ఉండాలని ఉద్దేశం. ముక్కునే చూడడంకాదు. ముక్కునే చూడడమైతే ముక్కుమీదే మనసు ఉంటుంది, ఆత్మపై కాదని అర్థం.

7) **ప్రశాంతాత్మా** – ప్రశాంతమైన మనసు కలిగివుండాలి (శ్లో. 14).

8) **విగతభీః** – భయం తొలగిపోయి వుండాలి (శ్లో. 14). అందరినీ బ్రహ్మతత్త్వంగా చూసేవాడికి ఎవరినుండీ భయముండదు. ఎవరినీ శత్రువుగా చూడకపోవడం.

9) బ్రహ్మచారివ్రతంలో వుండడం (శ్లో. 14). బ్రహ్మచర్యమంటే బ్రహ్మతత్త్వాన్ని గురించి మననం చేస్తూవుండడం.

10) **మచ్చిత్తః, మత్పరః** – నాయందే మనసు నిలిపి నన్నే పరమలక్ష్యంగా భావిస్తూండాలి. (శ్లో. 14). ఒకడికి భార్యయందు మనసు ఉండవచ్చు. కానీ ఆమే జీవితపరమలక్ష్యం అనుకోడు. ఇక్కడ బ్రహ్మతత్త్వంపై మనసు, అదే పరమలక్ష్యమని భావించాలని అర్థం.

11) **యుక్తాహార విహారః** – ఆహారం తగినంతనే తీసుకోవాలి. తగినంతనే నిద్రపోవాలి, అతినిద్ర, అతిజాగరణ సరికాదు (శ్లో. 16).

12) **యుక్తచేష్టః** – సాధనకు అవసరమైన పనులే చేయాలి (శ్లో. 17).

ఇలాగ నియంత్రించినవాడి మనసు ఆత్మయందు ఎప్పుడైతే స్థిరంగా ఉంటుందో వాడిని యుక్తుడు అంటారు.

**చిత్తంలోసమాధి[1] ఏర్పడినవాడి స్థితి ఎలా ఉంటుంది?**

1) వాయువు వీచని ప్రాంతంలో దీపం ఎలా నిశ్చలంగా ఉంటుందో అలా నిశ్చలంగా ఉంటుంది ఇతని అంతఃకరణం (శ్లో. 19). నిశ్చలత్వము, నిర్మలత్వము రెండూ జ్ఞానానికి అవసరం.

2) ఇతర చిత్తవృత్తులు (ఆలోచనలు) లేకుండా ఆత్మయందే సంతోషిస్తూ ఉంటాడు (శ్లో. 20).

3) ఈ సుఖం బుద్ధిచేతనే గ్రహింపదగినది. ఇంద్రియాలకు గోచరంకానిది (శ్లో. 21). సుఖాలు ఇంద్రియాలద్వారా వస్తాయి. కానీ ఈ సుఖం మనస్సుద్వారా తెలుసుకోదగినది.

---

1. సమాధి ఒక మానసికస్థితి. **సమ్యక్ ఆధీయతే మనః అస్యాం ఇతి సమాధిః** – అని వ్యుత్పత్తి. అంటే మనస్సును ఏదో ఒక వస్తువుయందు నిలకడగా ఉంచడం. సమాధియే పరమలక్ష్యం అని పతంజలి శాస్త్రం. అది కేవలం ఒక స్థితి మాత్రమే, సమాధి తర్వాత మళ్లీ మామూలు స్థితిలోకి వస్తాడు. కావున సమాధి కన్నా ముఖ్యమైనది జ్ఞాననిష్ఠ అని అంటారు వేదాంతులు.

4) ఈ ఆత్మలాభాన్ని పొందినవాడు మరి దేనిని కూడా అంతకంటే గొప్పదని భావించడు. ఎలాంటి దుఃఖం (ఇతరులదృష్టిలో) వచ్చినా చలించడు (శ్లో. 22).

5) దుఃఖ సంయోగంతో వియోగం పొందడమే యోగం (శ్లో. 23) దుఃఖ సంయోగానికి కారణమైన ఇంద్రియాలకు ఇక్కడ ప్రసక్తిలేదు.

పై స్థితి లభించిన తర్వాత ఏం చేయాలి? క్రమక్రమంగా బుద్ధిని విషయాలనుండి వెనుకకు మరల్చాలి, బుద్ధిని ఆత్మయందే నిలిపి మరొకదానిపై ఆలోచించకూడదు (శ్లో. 25). చంచలమైన మనస్సు ఎప్పుడైతే బయటికి వెళ్ళడానికి ప్రయత్నిస్తుందో దానిని వెనక్కు మరల్చి ఆత్మయందే స్థిరంగా ఉండేట్లు చేసుకోవాలి (శ్లో. 26). అనగా ఆయా విషయాల యథార్థస్వరూపమింతే, ఇవి ఆభాసరూపమైనవి అని బుద్ధిచే గ్రహించి వాటిని వదలాలి. అలాంటి యోగి జీవన్ముక్తుడు. అతన్నే **బ్రహ్మభూతుడు** (శ్లో. 27) అనగా బ్రహ్మ అయినవాడు అన్నారు.

**విగతకల్మషుడు** అని మరో విశేషణం. పుణ్యపాపాలు రెండూ జ్ఞానిదృష్టిలో కల్మషాలే. ఎందుకంటే పుణ్యంకూడా మళ్లీ జన్మకు కారణమయ్యేది. పుణ్యపాపాలు రెండూ తొలగిపోయినవాడు అని అర్థం.

అన్నింటికన్నా గొప్ప సుఖం పొందడమే మనిషి లక్ష్యం. దర్శనశాస్త్ర లక్ష్యం కూడా అదే. అది అకామహతుడైన (కోరికలను తిరస్కరించిన) సాధకుడికే కలుగుతుందని పైన చెప్పుకున్నాం. ఈ సంపూర్ణ దుఃఖనివృత్తి బ్రహ్మభావం కలవాడికే సాధ్యమౌతుంది. అందుకే మళ్లీ –

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29**

తానే సకలభూతాల్లో ఉన్నాడని, సకలభూతాలు తనలోనే ఉన్నాయని (అంటే తను అంతటా వ్యాపించిన బ్రహ్మచైతన్యం అని భావించేవాడు) చూస్తూ అన్నింటితో సమానంగా వ్యవహరిస్తాడు. సమదర్శీ అనే పదంలో సమ = నిర్విశేషమైన, ఎలాంటి విశేషణాలు లేని బ్రహ్మ. కావున ధ్యానయోగనిష్ఠుడు సమ్యగ్దర్శనాన్ని పొందగలడని అర్థం.

బ్రహ్మను అన్నింటిలో చూడడమెలాగ? సృష్టిలో అన్ని పదార్థాలలోనూ 'సత్' అంటే ఉనికి అనేది ఉంది. అన్నింటిలో చైతన్యరూపంగా ఉంది. పూలమాలలోని దారంలాగా అన్నింటిలో ఉన్నది అయిన ఆత్మను చూడగలగడం ముఖ్యం. ప్రపంచంలో కనిపించే వస్తువులన్నీ (దృశ్యాలు) బ్రహ్మకు ఉపాధులే, తాత్కాలిక రూపాలే. కానీ వాటిలో

ఉపాధి లేనటువంటి బ్రహ్మను గుర్తించడం. అలాంటివాడికి పరమాత్మ ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా ఉంటాడు. 'ఇందుగలడందులేదని' ప్రహ్లాదుడు తండ్రికి తెలిపిన తత్త్వం.

దీనినే 31వ శ్లోకంలో **'సర్వభూతస్థితం ..... ఏకత్వమాస్థితః'** అనే మాటల్లో చెబుతున్నాడు. సర్వభూతాల్లో ఉన్న నన్ను (పరమాత్మను) **ఏకత్వమాస్థితః** అనగా తనకంటే వేరుగాదని ఏకత్వభావనతో ఉన్నవాడు. అలాంటివాడు ఎట్లాంటి ఉపాధిలో (దేహంలో) ఉన్నా అతడు నాయందే ఉన్నవాడౌతాడు. మనుష్యమాత్రుడైనవాడు జ్ఞానానికి అర్హుడు కాబట్టి అతను జీవనాధారంకోసం ఏ ఉపాధిలో ఉన్నా నాయందే ఉంటున్నాడు అని అర్థం. భారతంలో ధర్మవ్యాధుణ్ణి, రామాయణంలో జనకుణ్ణి ఉదాహరణగా చెబుతారు.

ఏకత్వం అన్నచోట మధుసూదనసరస్వతి 'మనోనాశంవల్ల' అని మరోమాట వ్రాశారు. మనోనాశం అంటే 'నేను' అనే అభిమానం నశించడం. మనస్సు జడము, తాను శుద్ధచిద్రూపుడే, జడమైన చిత్తం (మనస్సు) కాదు అని తెలుసుకోవడంతో 'నేను' అన్నది నశిస్తుంది. ఈ భావనలో ఉన్నవాడు అని అర్థం.

తర్వాత ఒక చక్కని శ్లోకంలో ఇలా –

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32**

**ఆత్మౌపమ్యేన** అనగా ఆత్మనే (తననే) ఉపమానంగా చేసికొని అంటే సమస్తప్రాణులయందూ సుఖంగాని, దుఃఖంగాని తన సుఖదుఃఖాలవంటివే భావించి ఎవడు చూస్తాడో అతడు శ్రేష్ఠుడైన యోగి. తనకు అప్రియమైనది ఎలా చేసికొనడో ఇతరులకు అది చేయకపోవడం.

ఇక్కడ మధుసూదన సరస్వతి ఒకమాట వ్రాశారు. ఈ శ్లోకంలో యోగి = బ్రహ్మజ్ఞాని అని అర్థం చెప్పారు. ఈ స్థితి రావడానికి మూడు పూర్వరంగదశలు దాటాలి. 1) తత్త్వజ్ఞానం 2) మనోనాశం 3) వాసనాక్షయం అని వివరించారు. తత్త్వజ్ఞానం అంటే సైద్ధాంతికంగా ఉపనిషద్వాక్యాలు గురుముఖంగా శ్రవణం చేయడంవల్ల తత్త్వం అవగాహన చేసుకోవడం, జీవుడు, బ్రహ్మ ఒకటేనని తర్కంద్వారా కూడా గ్రహించడం. వేదాంతం కేవలం బుద్ధిద్వారా తెలుసుకొని వదలివేయాల్సింది కాదని పైన తెలుసుకున్నాం. తత్త్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే మనోనాశం అవసరం. మనస్సు నేను కాదు అని తెలుసుకొని ఆ భావాన్ని నిరంతరం అభ్యాసం చేయడం.

మనస్సు వృత్తిగా (ఆలోచనగా) మారుతూ ఉంటుంది. చిత్తవృత్తులు ప్రవాహంలాగా వస్తుంటాయి (చిత్తస్రోతః – stream of consciousness) అని పతంజలి సూత్రానికి వ్యాసభాష్యంలో చెప్పబడింది. ఈ ప్రవాహాన్ని అడ్డుకొని ఆలోచనలను నిరోధించి 'నేను' అనే ఆలోచనను కూడా నిరోధించి శుద్ధచైతన్యరూపం అనే స్థితిలో ఉండడం మనోనాశం.

**వాసనాక్షయం** – వాసనల గూర్చి పైన చెప్పుకున్నాం. మన పూర్వజన్మ ఫలితంగాగాని, ఈ జన్మలో చేసిన పనులవల్లగానీ మనస్సులో ఏర్పడిన ముద్రలవల్ల మనస్సు ఒక ప్రవర్తనా మార్గంలోకి వచ్చి కొన్ని ఇష్టానిష్టాలు ఏర్పరచుకొంటుంది. ఒక వస్తువుపై అనాలోచితంగా ఇష్టం. ఒకదానిపై అనాలోచితంగా ద్వేషం. లోకంలో మంచి అని భావించేదికూడా సాధకుడికి అడ్డంకులే. ఉదా: **శాస్త్రవాసన** – శాస్త్రాలపై వ్యసనం. అన్ని శాస్త్రాలూ చదవాలనుకోవడం. **లోకవాసన** – జనులేమనుకుంటారో అని అందరూ మెచ్చుకొనేలా ప్రవర్తించడం. అనుష్ఠాన వ్యసనం – తీవ్రంగా పూజలు, అనుష్ఠానాలు చేస్తూండడం (ఆత్మవిచారం లేకుండా). **దేహవాసన** – అంటే దేహపరిశుభ్రత, సంభాషణా చాతుర్యం, వీటిపై అతిశ్రద్ధ. ఇవన్నీ మనసులో ఉన్న కామక్రోధాదులవలె అడ్డంకులే.

**మనస్సును నిగ్రహించుకోవడం**

ఇవన్నీ విన్న అర్జునుడికి మళ్లీ సందేహం కలిగింది. మనస్సు ఇంత చంచలమని నీవే అంటున్నావు కదా! మరి దీన్ని నిగ్రహించడం ఎలా అని (శ్లో. 34). నిజమే కష్టమే – **అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే** – అంటాడు కృష్ణుడు (శ్లో. 35). అభ్యాసం – వైరాగ్యం అని రెండు సాధనలు చెప్పబడ్డాయి యోగశాస్త్రంలో. ఈ రెండూ ముఖ్యమే. అభ్యాసం అనగా మనస్సులో **సమాన ప్రత్యయవృత్తి** అన్నారు. ప్రత్యయం అంటే ఆలోచన. **తుల్యప్రత్యయ సంతతిః** అని మరోమాట అన్నారు. అంటే ఒకేవిధమైన ఆలోచనాస్రవంతి. శరీరాన్ని, ఇంద్రియాలని బలవంతంగా నిగ్రహించుకోవచ్చు. కానీ మనస్సును అలా నిగ్రహించలేం. దానికి బుద్ధి చెప్పి మెలమెల్లగా అదుపులోకి తెచ్చుకోవాలి. బుద్ధి చెప్పడమంటే వివేకం నేర్పాలి. **వివేకం** అంటే విభజించి చూపడం (discrimination) ఏది నిత్యమైనది, ఏది అనిత్యమైనది అని విభజించి చూపిస్తూ అదే ఆలోచన మళ్ళీ మళ్ళీ చేయాలి. రాగద్వేషాలు, వాటి స్వభావం పైన విచారం చేస్తే అదే వైరాగ్యానికి దారితీస్తుంది. ఇది ఎలా సాధ్యమంటే భోగాల్లో దోషదర్శనంవల్ల అన్నారు వ్యాఖ్యాతలు. దోషదర్శనం అంటే పైన చెప్పినట్లు ఇవన్నీ అనిత్యాలే. మళ్లీ జన్మకు కారణమయ్యేవి అని వాటి దోషాలను ధ్యానిస్తూ వాటిపట్ల ఉపేక్ష పెంచుకోవడం.

వస్తువులపై అపేక్ష, రాగం. ఉపేక్ష వైరాగ్యం. ఈ రెండింటి ఫలితంగా మనస్సును మెలమెల్లగా అదుపులో ఉంచుకోవడం.

**యోగం కుదరకపోతే ఏమౌతుంది?**

ఇక్కడ అర్జునుడికి మరో సందేహం. జీవితాంతం శ్రద్ధతోనే అభ్యాసం చేస్తాం. కానీ యోగం కుదరకపోతే రెంటికీ చెడ్డ రేవడి నవుతానా? (శ్లో. 37, 38). అలా కాదు అంటాడు కృష్ణుడు. అలా యోగభ్రష్టుడైనవాడు పుణ్యలోకాల్లో చాలాకాలం ఉండి, తర్వాతి జన్మలో **'శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే'** అంటే శ్రేష్ఠులైన యోగుల ఇండ్లలోనే జన్మించి పూర్వజన్మ సంస్కారంతో త్వరలో సిద్ధిని పొందుతాడు (శ్లో. 41, 43). ఈ యోగసాధన అనేది ఒక జన్మజన్మలకూ అనువర్తించే అకౌంట్ లాంటిది. దీనిని కొంత అభ్యాసం చేసినా మంచి ఫలితమే ఉంటుంది. అందువల్ల అలాంటివి యోగివి కమ్ము అంటాడు కృష్ణుడు (శ్లో. 46).

చివరి శ్లోకంలో భగవద్భక్తి కూడా జ్ఞాననిష్ఠకు అవసరం అని చెప్పబడింది. మనిషి ప్రయత్నం అవసరమే కానీ దైవానుగ్రహం కూడా ఉండాలి. అందుకే **'శ్రద్ధావాన్ భజతే యో మాం'** అంటాడు కృష్ణుడు (శ్లో. 47). ఎంత శ్రద్ధ ఉన్నా భక్తి అవసరం. అది సగుణం కావచ్చు, నిర్గుణభక్తి కావచ్చు. ఇది సాధకుడికి ఆత్మస్థైర్యాన్నిస్తుంది.

ఇక్కడితో గీతలో ఆరు అధ్యాయాలు ముగిసాయి. మనం పుస్తక పరిచయంలో చెప్పుకున్నట్లు ఈ ఆరు అధ్యాయాలు కూడా మనిషి (శాస్త్రపరిభాషలో జీవుడు) యొక్క స్వభావం మొత్తాన్ని విశ్లేషణ చేస్తాయి. వేదాంతంలో ముఖ్యవిషయం జీవుడు, బ్రహ్మ, వాటి సంబంధం అని చెప్పుకున్నాం. **తత్త్వమసి** (తత్ = అది అంటే బ్రహ్మ, త్వమ్ = నీవు అనగా జీవుడు, అసి = అయి వున్నావు) అనే వాక్యంలో 'జీవుడు' (త్వం) అనే అంశం గురించి ఈ ఆఱు అధ్యాయాల్లో చెప్పబడింది. అర్జునుడి రాగద్వేషాలు మనందరి రాగద్వేషాలు. అతని సంశయాలు మనందరి సంశయాలు. మనిషి జీవితంలో పరమలక్ష్యం జ్ఞానమార్గం. జ్ఞానమార్గంలో ఉండి సన్న్యసించడం. ఇది లోకులందరికీ కుదరదు. అందువల్ల జ్ఞానియై లోకోపకారంకోసం కర్మలు చేయి, వ్యక్తిగతంగా ఉద్ధరించుకో! (ఆత్మను తెలుసుకో) లోకం మేలుకు పనిచేయి అంటూ అర్జునుడికి కర్మయోగం నీవు ఆచరించాల్సిన మార్గం అని బోధించాడు శ్రీకృష్ణుడు.

❖ ❖ ❖

## ఏడవ అధ్యాయము

# జ్ఞాన విజ్ఞాన యోగము

'త్వం' తర్వాత తెలుసుకోవలసింది 'తత్' – అది, అనగా బ్రహ్మ. వేదాంతశాస్త్రంలో 'తత్' అనే పదం బ్రహ్మను తెలుపుతుంది.

ప్రస్తుత అధ్యాయం పేరు 'జ్ఞాన విజ్ఞానయోగం'. జ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ నీకు బోధిస్తున్నానని కృష్ణుడు అంటున్నాడు కావున ఈ పేరు. ఈ అధ్యాయంలోని 30 శ్లోకాల్లో మొదటగా పరమాత్మస్వరూపం (శ్లో. 2 నుండి 12), సంసార కారణం ఏమిటి? (శ్లో. 13 నుండి 19), మూడవది నిజమైన భక్తి ఎలా ఉంటుంది (శ్లో. 27, 28)లో చెప్పబడింది. చివరి మూడు శ్లోకాల్లో 8వ అధ్యాయంలోని విషయప్రస్తావన. ఈ అధ్యాయంలో అర్జునుడి ప్రశ్న లేదు. అన్నీ శ్రీకృష్ణుడి మాటలే.

**జ్ఞానం - విజ్ఞానం - పదవవాడి కథ**

అధ్యాయంలోని విషయం 2వ శ్లోకం చెబుతుంది.

**జ్ఞానం తేఽహం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషతః** – అంటే జ్ఞానం, విజ్ఞానం ఇవి రెండూ నీకు సంపూర్ణంగా వివరిస్తాను అని అర్థం. భగవంతుని ఎలా ధ్యానించాలి? అని ఆఱవ అధ్యాయంలో చెప్పినదానినే అనుసరిస్తూ అలా ధ్యానం చేసినవాడు నన్నెలా తెలుసుకుంటాడో విను అంటున్నాడు. ఇక్కడ జ్ఞానం అంటే **'సత్యం, జ్ఞానం అనంతం బ్రహ్మ'** అని ఉపనిషత్తుల్లో చెప్పే శుద్ధచైతన్యతత్త్వం. విజ్ఞానమంటే అనుభవంలోకి తెచ్చుకున్న జ్ఞానం. అంటే ఆ తత్త్వమే నేను అని తెలుసుకోవడం.

వేదాంత అధ్యాపకులు ఒక ప్రసిద్ధ ఉదాహరణ ఇస్తుంటారు. పదిమంది విద్యార్థులు ఒక ఊరినుండి మరో ఊరికి వెళుతున్నప్పుడు ఒక నది దాటాల్సివచ్చింది. పదిమందీ దాటిన తర్వాత అందులో ఒకడు అందరూ దాటారా లేదా అని లెక్కించడం మొదలుపెట్టాడు. అందరినీ లెక్కపెట్టాడు కానీ తన్నుతాను లెక్కపెట్టుకోలేదు. మిగతా వాళ్లు అదే ప్రయత్నం చేశారు కానీ తమను తాము లెక్కించుకోలేదు. అందరూ దిగాలుపడి ఏడుస్తుంటే ఆ త్రోవలో వెళుతున్న పెద్దమనిషి వారి పరిస్థితి కనుక్కొని ఆ పదోవాడివి నీవే – **'దశమస్త్వమసి'** అని చూపించాడు. ఆవిధంగా ఇందాక పరోక్షంగా ఉన్న జ్ఞానాన్ని ఇప్పుడు ప్రత్యక్షంగా అయ్యేట్లు చెప్పాడు. వేదాంతంలో దీనిని అపరోక్షజ్ఞానం (immediately knowledge) అంటారు. ఈ అధ్యాయంలో పరబ్రహ్మతత్త్వం సిద్ధాంతరూపంలోనే కాకుండా నీకు అర్థమయ్యేట్లు చెబుతాను అని శ్రీకృష్ణుడి భావం.

**పరాప్రకృతి - అపరాప్రకృతి**

ఇక్కడ శ్రీకృష్ణుడు రెండువిధాల సృష్టిగురించి చెప్పాడు. ఒకటి **పరా** – అంటే శ్రేష్ఠమైనది. రెండవది **అపరా** – అంటే శ్రేష్ఠం కానిది అని అర్థం. **ప్రకర్షేణ కరోతి** – వివిధరకాలుగా సృష్టిలో వస్తువులను తయారుచేస్తుంది కాబట్టి ప్రకృతి. ఇది రెండు విధాలు. ఒకటి చేతనం, మరోటి అచేతనం. వీటిని ఈ క్రిందివిధంగా చూడవచ్చు.

| అపరా | పరా |
|---|---|
| – ఈ ప్రకృతిలో 8 భాగాలు భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారం | – జీవుడు |
| – పరిచ్ఛిన్నం (పరిమితి కలది) | – అపరిచ్ఛిన్నం (పరిమితి లేనిది) |
| – జడము (insentient) | – చేతనం (sentient) |
| – ఇదంతా క్షేత్రం అంటే చూడబడేది, దృశ్యం. | – క్షేత్రజ్ఞుడు – చూసేవాడు (దీనినే దృక్ అంటారు.) |
| – సంసారస్వరూపం, బంధనాత్మకం | – బంధంలేనిది, బంధం ఉన్నట్లు భావించేది. దేహాత్మభావం ఉంటే జీవుడికి బంధం. |

ఈ రెండురకాల ప్రకృతికి అనగా చేతన, అచేతనాలన్నింటికీ ఉత్పత్తిస్థానం, లయస్థానం పరమాత్మ (శ్లో. 6). జగత్తు పరమాత్మలోనే పుట్టి లీనమౌతూంటుందని అర్థం.

**ఇవి పరమాత్మకంటే భిన్నాలా?**

**మత్తఃపరతరం నాన్యత్** – నాకు అతీతంగా ఏ కారణంలేదు (శ్లో. 7) అంటాడు శ్రీకృష్ణుడు.

> **మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ ।**
> **మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7**

ఇక్కడ మత్ శబ్దంతో సృష్టికారకుడైన ఈశ్వరుణ్ణి గురించి చెబుతున్నారు. దీనియందే ప్రకృతి అంతా నిండివుంది. సూత్రంలో మణిహారంలాగా అని వాక్యానికి అని అర్థం. అంటే మణిహారంలోని సూత్రంలాగా పరమాత్మ అన్నిటినీ ధరించివుంది అని అర్థం.

పరాప్రకృతియే శరీరంలో ఉన్నపుడు జీవుడు, శుద్ధచైతన్యంగా ఉంటే పరమాత్మ. అంటే సృష్టికి పూర్వం పరమాత్మయే, సృష్టి తర్వాత జీవుడు.

పై శ్లోకంలో **'మయి సర్వమిదం ప్రోతం'** – నాలో ఇవన్నీ ఉన్నాయి. అంటే బుట్టలో పళ్ళలాగా కాదు. వాటన్నింటిలోని చైతన్యం పరమాత్మదే అని అర్థం. పరమాత్మయే ఉపాదానకారణం, నిమిత్తకారణం కూడా (ఈ పదాలు పైన చెప్పుకున్నాం). ఏ కార్యంలోనైనా కారణంయొక్క గుణాలే ఉంటాయి. కారణంకంటే భిన్నంగా కార్యం లేదు. మట్టియే పాత్రలరూపం, బంగారమే ఆభరణాల రూపం, ఆభరణాలు కేవలం పేర్లు మాత్రమే. దీనినే వాచారంభణం – పేరు మాత్రమే అంటుంది ఉపనిషత్తు. అందుకనే విశ్వంలో అన్ని వస్తువుల రూపంలో ఉన్న ప్రకాశనశక్తి పరమాత్మయే. దీని వివరణ శ్లో. 8 నుండి 12 వరకు చెప్పబడింది. ఉదకంలో ఉన్న రసం నేను, మనుషుల్లో ఉన్న తేజస్సు నేను, పృథ్విలోని సుగంధం నేను, సూర్యునిలోని తేజస్సు నేను, అన్ని ప్రాణుల్లోనూ బీజభూతమైనది నేనే అంటాడు శ్రీకృష్ణుడు.

### మనిషికి కోరికలే ఉండవద్దా?

11వ శ్లోకం గమనించదగ్గది.

**బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥ 11**

మొదటి వాక్యం బలాన్ని గూర్చి చెబుతుంది. బలవంతుని బలం ఏ సందర్భంలో భగవంతుని స్వరూపం అని గమనించాలి. **కామరాగవివర్జితమ్** అంటే కోరిక, ప్రీతి, అనే భావన లేకుండా లోకకల్యాణానికై వాడే బలం భగవంతుడి స్వరూపం. ఇతరమైనది, అనగా స్వార్థానికి ఉపయోగించే బలం ప్రకృతివిరుద్ధమైనది. అంటే మనిషికి కోరికలే అక్కరలేదా? అనే ప్రశ్న వస్తుంది. అందుకే పై శ్లోకం రెండవ వాక్యంలో ధర్మానికి అవిరుద్ధమైన – అంటే ధర్మసమ్మతమైన కోరిక కూడా భగవంతుని రూపమే అని చెప్పబడింది. భగవద్గీత పూర్తిగా కోరికలను చంపుకోమంటుంది, అందువల్లనే భారత సమాజంలో అభివృద్ధి లేదు అని తెలియనివాళ్లు చెబుతుంటారు. Hindu growth అని అవహేళన కూడా చేస్తుంటారు. అనగా భారతీయులకు అభ్యుదయంలో ఎలాంటి అభిరుచి లేదు అని విమర్శిస్తుంటారు. భారతీయతత్త్వం అభ్యుదయాన్ని ఎప్పుడూ వ్యతిరేకించలేదు. ధర్మానికి విరోధంలేకుండా అభ్యుదయం కావాలని మాత్రమే చెప్పింది.

### మాయ - దాని కార్యాలు

ప్రకృతిలోని సాత్త్వికభావాలు (సత్త్వగుణంవల్ల పుట్టిన పదార్థాలు), రాజసభావాలు, తామసభావాలు అన్నీ నావల్ల పుట్టేవే (శ్లో. 12). అవి నాలో ఉన్నాయి, నేను వాటి

అధీనంలో లేను అంటున్నాడు శ్రీకృష్ణుడు. అవి నాలో ఉన్నాయి అంటే వాటిలో ఉన్న సత్తా (ఉనికి), స్ఫురణము (తెలివి) రెండూ పరమాత్మవే అని అర్థం. ప్రపంచంలోని పదార్థాలన్నీ ఈ మూడు గుణాలచే కూడినవే. వీటివల్లనే లోకులు మోహంచెంది ఈ గుణాలకు అతీతుడుగా ఎలాంటి మార్పులులేని అవ్యయమైన నా పరమాత్మ తత్త్వాన్ని గుర్తించలేకున్నారు (శ్లో. 13). ఇక్కడ ఒక ప్రసిద్ధ శ్లోకం –

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే ॥ 14**

మాయ అనేది పరబ్రహ్మకు చెందిన స్వభావం. మూడు గుణాలతో కూడినది (గుణములంటే మాయకు చెందిన ధర్మాలనే అర్థంకాదు – మాయలోని అంశాలు అని అర్థం). ఇది దాటశక్యంగానిది. గుణాలప్రవాహంలో కొట్టుకుపోతున్నంతసేపూ బయటికి రాలేము. ఒడ్డున ఉన్న ఏదొక ఆధారాన్ని పట్టుకుంటేనే దానినుండి బయటపడగలం. దీనినే **ప్రపద్యన్తే** అనే పదంలో చెప్పారు. ప్రపత్తి అనగా శరణాగతి, దైవభక్తి అని అర్థం. ఇది క్రమేణా ఆత్మజ్ఞానానికి సహాయపడేదే. అయినప్పటికీ మాయచేత మన బుద్ధి దొంగిలింపబడింది కావున మనం ఆసురీభావంలో ఉంటూ గుణాలకు అతీతంగా ఉన్న తత్త్వాన్ని తెలుసుకొనలేం (శ్లో.15). (అసురులు అంటే **అసుషు రమంతే** – అనగా ఇంద్రియాల్లో రమించే స్వభావం కలవారు అని అర్థం. రాక్షసులు అని కాదు).

**నాలుగు రకాల భక్తులు**

సాధారణంగా పైన చెప్పినట్లు మనమందరమూ మాయలో ఉన్నా అప్పుడప్పుడూ కొన్ని కారణాలవల్ల పరమాత్మను తలచుకుంటూ ఉంటాము. భగవంతుని తలచుకొనేవాళ్లను నాలుగు రకాలుగా విభజించారు.

**చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ 16**

అనగా నాలుగు రకాల భక్తులు భగవంతుణ్ణి సేవిస్తారు. 1) ఆర్తుడు. 2) జిజ్ఞాసువు 3) అర్థార్థీ అనగా ధనాదులను కోరేవాడు 4) జ్ఞానియైనవాడు. ఈ నలుగురూ సుకృతినః – పుణ్యం చేసుకున్నవారే అని తాత్పర్యం.

పై నలుగురూ పుణ్యం చేసుకున్నా పుణ్యతారతమ్యముంది. ఒకరు ఉన్నతశ్రేణిలో, మరొకరు తక్కువశ్రేణిలో ఉన్నవారు.

ఆర్తుడు అంటే కష్టాల్లో చిక్కుకొన్నవాడు. శత్రువువల్ల కావచ్చు, వ్యాధివల్ల కావచ్చు మరే ఆపదవల్లనైనా కావచ్చు, ఏదో ఒక కష్టంలో ఉన్నవాడు. చేయాల్సినవన్నీ

అయిపోయాక చివరగా దేవుణ్ణి సహాయం కోరేవాడు. భాగవతంలో గజేంద్రుడు ఇందుకు ఉదాహరణ. అహం అనే భావనతో చాలాకాలం పోరు సలిపి చివరకు 'నేను'ను రద్దు చేసుకొని, దేవుణ్ణి ఆశ్రయించినవాడు. అలాగే కౌరవసభలో ద్రౌపది ఆర్తభక్తురాలు. కష్టం వచ్చినప్పుడే దేవుణ్ణి తలచుకుంటుంటాం. అందుకే 'కుంతీదేవి నాకెప్పుడూ కష్టాలు ఇస్తూవుండు అలా నిన్ను తలచుకుంటూ ఉంటాను' అని శ్రీకృష్ణుడిని కోరుతుంది. ఇది ఆర్తభక్తికి ఉదాహరణ.

రెండవవాడు జిజ్ఞాసువు. అంటే తత్త్వాన్ని తెలుసుకోవాలని కోరేవాడు. ఇతనికి ఐహిక కోరికలేమీ లేవు. భాగవతంలో ఉద్ధవుడు దీనికి ఉదాహరణ.

మూడవవాడు అర్థార్థి – అర్థాన్ని అనగా అభ్యుదయాన్ని కోరుకొనేవాడు. ఇతనికి ఇదివరకే కొంత ఉన్నదికానీ ఇంకా ఏదో కావాలి, స్వర్గం కావాలి అని యత్నించేవాడు. మనలో చాలామంది ఈ కోవకు చెందివుంటాం. రామాయణంలో సుగ్రీవుడు, భాగవతంలో ధ్రువుడు దీనికి ఉదాహరణలు.

చివరగా జ్ఞాని. ఆత్మజ్ఞానం తెలిసి భగవంతుణ్ణి ప్రేమతో ఆరాధించువాడు. ఇతడు ఇదివరకే మాయ అనే నదిని దాటినవాడు, కోరికలు లేనివాడు, ఇది నిష్కామప్రేమ. నారదభక్తిసూత్రాల ప్రారంభంలో భక్తిని నిర్వచిస్తూ **సాత్వస్మిన్ పరమప్రేమ రూపా** అంటారు. భగవత్తత్త్వంలో అత్యంత ప్రేమయే భక్తి. దీనికి ప్రహ్లాదుణ్ణి ఉదాహరణగా చెబుతారు.

పై నలుగురికీ వారి పుణ్యఫలంగానే భగవంతుణ్ణి ఆశ్రయించాలనే బుద్ధి కలిగింది. పై నలుగురిలో జిజ్ఞాసువుకు జ్ఞానం కలుగగా ముక్తి లభిస్తుంది. ఆర్తునికీ, అర్థార్థునికీ కూడా భక్తి అనే ద్వారం వల్ల క్రమేణ చిత్తశుద్ధి కలిగి ఎప్పుడో ఒకప్పుడు మోక్షమార్గంలో అడుగుపెట్టే అవకాశముంది. జ్ఞాని వీరందరికన్నా శ్రేష్ఠుడు. ఎలాంటి చిత్తవిక్షేపం లేకుండా పరబ్రహ్మతత్త్వంలో నిలచివున్నాడు కనుక. అందువలన పై నలుగురూ ప్రశంసనీయులే (శ్లో. 17, 18).

జ్ఞాని ఇదివరకే ఎన్నో జన్మలలో చిత్తశుద్ధికై చేసుకున్న అభ్యాసాల ఫలితంగా శుద్ధమైన అంతఃకరణం కలవాడై బ్రహ్మతత్త్వంలో మనసు నిలిపినవాడు. ఇతని జన్మను చరమజన్మ అంటారు. జ్ఞానికావడంవల్ల జీవన్ముక్తుడు – పునర్జన్మ లేనివాడు ఇలాంటి వాళ్లు మిక్కిలి దుర్లభులు (శ్లో. 19).

## ఏడవ అధ్యాయం

**విభిన్న దేవతలను ఆరాధించడం - లోకంతీరు :**

లోకులు సాధారణంగా భక్తి విషయంలో ఎలా వ్యవహరిస్తారు అని 20 నుండి 26 శ్లోకాల్లో చెప్పబడింది. ఇది చక్కని మనోవిశ్లేషణ. మన ఆలోచనలను ప్రభావితం చేసేవి మూడు గుణాలని, పైన చెప్పాడు. ఆ గుణాలవల్లనే కోరికలు కలుగుతాయి, కోరికలవల్లనే బుద్ధి అపహరింపబడుతుంది. (**అపహృత జ్ఞానాః**). వాళ్లవాళ్ల స్వభావానికి వశులై ప్రవర్తిస్తుంటారు (శ్లో. 20). ఇలాంటివారికి పరబ్రహ్మతత్త్వాన్ని ఆలోచించే ఓపికగానీ, జ్ఞానంగానీ ఉండదు. ఏదో ఒక క్షుద్రదేవతారాధనలో నిమగ్నులై వుంటారు (శ్లో. 20). ఈ క్రింది రెండు శ్లోకాలు బహుదేవతారాధన గురించి చెబుతాయి.

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥ 21**

**స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధనమీహతే ।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్ ॥ 22**

వీటి తాత్పర్యం ఇలా ఉంది. ఏయే భక్తుడు ఏయే దేవతాస్వరూపాన్ని శ్రద్ధగా ఆరాధించినా అలాంటివాడికి ఆ దేవతాస్వరూపానికి సంబంధించిన శ్రద్ధను నేనే కలుగజేస్తాను (శ్లో. 21). అతడు అలాంటి శ్రద్ధతో ఆ దేవతను ఆరాధిస్తాడు. దానివల్ల ఆ శ్రద్ధకు తగిన ఫలితాన్ని పొందుతాడు. కానీ ఆ ఫలం నాచే ఇవ్వబడినదే (శ్లో. 22).

ఈ శ్లోకాలను పరిశీలిస్తే మనకు ఈ క్రింది విషయాలు తెలుస్తాయి.

1) భారతీయ సంస్కృతిలో దేవుడు ఇలా ఉంటాడు అని మతం నియంత్రించలేదు. వేదాంతశాస్త్రం దీన్ని వివరించింది. మామూలుగా మతాల్లో దేవుడు ఫలానా, ఇది తప్ప మరొకటిలేదు అని చెబుతుంది. వేదాంతం అలాకాకుండా ఆత్మస్వరూపం, పరమాత్మ స్వరూపం ఏమిటి? అని విమర్శించి ఏదో ఒక రూపాన్ని ఆలంబనగా చేసుకొని సిద్ధిని పొందవచ్చు అని చెబుతుంది.

2) ఏ దేవతను ఆరాధించాలనే విషయంలో మనిషికి స్వేచ్ఛ (free will) ఉంది. ఇది అతని స్వభావంపై ఆధారపడివుంటుంది.

3) వాడి వాడి స్వభావాన్ని బట్టి కోరికలుంటాయి. దానినిబట్టి ఒక దేవతారూపాన్ని నిర్మించుకొని ఆరాధిస్తారు. ఆ దేవతారూపాలన్నీ ఒకే పరబ్రహ్మతత్త్వంలో మనం మన ప్రత్యేక కోరికలను తీర్చుకోవడానికి కల్పించుకున్న రూపాలు. సత్త్వగుణం

ఉన్నవారు సత్త్వప్రధాన దేవతలను ఆరాధించి లోకానికి హితమయ్యే పనులను చేస్తారు. చెడు స్వభావంవున్నవారు క్షుద్రదేవతలను పూజిస్తుంటారు.

4) ఏ రూపంలో ఫలం కావాలని కోరితే ఆ రూపంలో ఆ ఫలం వస్తుంది.

5) ఫలం పరబ్రహ్మశక్తివల్లనే ఇవ్వబడుతుంది. అనగా ప్రకృతి / సృష్టి నియామకశక్తి యొక్క నియమాలమేరకు ఫలితమివ్వబడుతుంది.

6) ఇలాంటి బహుదేవతారాధనను పరబ్రహ్మ (శ్రీకృష్ణుడు) ప్రశంసించలేదు, నిషేధించలేదు కూడా. మనిషి స్వభావాన్నిబట్టి, సంస్కారాన్నిబట్టి చేస్తున్న కర్మలలో భాగమే కాబట్టి ఆ కర్మలకు ఫలితాన్నిస్తున్నాడు. ఆ కర్మఫలితం ఆ మనిషి నాశనానికి కూడా కావచ్చు. ఉదా: రాక్షసులు వరాలు కోరుకోవడం, నశించడం కూడా ప్రకృతి నియమాల్లో భాగమే.

7) ఎన్ని దేవతారూపాల్లో మనం కోరుకున్నా పరమాత్మతత్త్వం ఒకటే.

8) సాధకుడు మనస్సుకు ఏకాగ్రత సాధించడానికై వివిధరూపాలను ప్రతీకలు (symbols)గా గ్రహించి సాధన చేయవచ్చు. ఈ సగుణోపాసన క్రమేణ ఏకాగ్రత నిస్తుంది. కానీ ఈ పరిచ్ఛిన్నమే బ్రహ్మ అని భావించరాదు.

9) ఇన్ని రూపాల్లో కోరుకోవడానికి కారణం, కోరికలచే బుద్ధి లాగివేయబడడమే.

మన సమాజంలో బహుదేవతారాధన అనే విషయం నేడు ఇతరులచే చాలా విమర్శింపబడుతోంది. భారతీయులందరూ విగ్రహారాధకులనీ, వివిధ దేవతలను పూజించేవారనీ, మిగతా మతాల్లో ఒకే దేవుడు కాబట్టి ఆ వాదం శ్రేష్ఠమైనదని చెబుతుంటారు. ఇది కొత్త విషయమేంకాదు. అదే విషయమే శ్రీకృష్ణుడు పై వాక్యాల్లో చెప్పాడు. సనాతనధర్మం మనిషి స్వభావాన్ని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించి అతని అంతఃకరణంలో మార్పుకై సాధనాలు చెప్పింది. సమాజంలో అదివరకే ఉన్న బహుదేవతారాధనను నిషేధించలేదు. ఇది చేసితీరాలి అని నియంత్రించలేదు.

పై కారణాలవల్ల ఒకే వ్యక్తి అనేక సందర్భాలలో అనేక దేవతలను పూజించడం చూస్తున్నాం. విష్ణువు, శివుడు, శక్తి, గణేశుడు మొదలైనవన్నీ సాత్త్విక దేవతారూపాలే. రూపం ఒక ఆలంబనం (ఆధారం, ఊతం) మాత్రమే. ఒకే తత్త్వంలో కల్పించుకొన్న ఆలంబనలు. మన పూజలను పరిశీలిస్తే ఏ దేవతను పూజించేటప్పుడు దానినే పరబ్రహ్మతత్త్వంగా భావించి పూజిస్తుంటాం. ఉదా: గణేశుణ్ణి పూజించేటప్పుడు **'యం**

**బ్రహ్మ వేదాంత విదో వదంతి'** అంటూ పరబ్రహ్మస్వరూపం అని కీర్తిస్తారు. సత్యనారాయణ వ్రతంలో సత్యనారాయణుడే పరమాత్మ అని పూజిస్తారు. వాయనదానం సమయంలో కూడా వాయనం ఇచ్చేవాడు పరమాత్మయే, తీసుకొనేవాడు పరమాత్మయే (**గణేశః ప్రతిగృహ్ణాతి గణేశో వై దదాతి చ**) ఇలాగ ఆయా దేవతపేర్లు చెప్పి ఇచ్చేవాడూ, తీసుకొనేవాడు రెండూ ఆ దేవతారూపంలో ఉన్న పరబ్రహ్మయే అని చెప్పుకుంటుంటాం. ఇవన్నీ సాత్త్విక పూజలు. ఇవి కాక కొందరు క్షుద్రమైన ఉపాసనలు చేసేవాళ్లు, క్షుద్ర ఫలితాలు అనుభవిస్తారని వేదాంతసిద్ధాంతం. పరబ్రహ్మతత్త్వం మాత్రం వీటన్నింటికీ అతీతమైనది.

ఇదే భావాన్ని తర్వాతి శ్లోకాల్లో చెబుతున్నాడు – "ఆ విభిన్న దేవతలిచ్చే ఫలాలు అంతవంతమైనవి (శ్లో. 23). అనగా కోరికల ఫలితంగా వచ్చినవి కాబట్టి వాటి ఫలం పూర్తయిన తర్వాత మళ్లీ జన్మమరణ చక్రంలో పడవేస్తాయి. ఆ దేవతారూపాలన్నీ అనంతచైతన్యంలో పరిచ్ఛిన్నరూపాలు. **'మద్భక్తా యాంతి మామపి'** (శ్లో. 23) అనే మాటలో నన్ను అంటే పరమాత్మను ధ్యానించేవాళ్లు మోక్షం అనే అనంతఫలాన్ని పొందుతారు అంటాడు కృష్ణుడు. సకామభక్తులు ఆయా పరిమితస్థాయిలో నిలచిపోతారు. నిష్కామభక్తి అనగా జ్ఞానిభక్తి పూర్ణత్వాన్ని, మోక్షాన్ని ఇచ్చేది. సకామభక్తి ప్రేయస్‌కు దారితీస్తుంది. నిష్కామభక్తి శ్రేయస్సు కలుగజేస్తుంది.

మూర్ఖులైనవారు రూపం, ఉపాధి లేని నన్ను రూపం, ఉపాధి ఉన్నవాడిగా భావిస్తారు **అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయః** – (శ్లో. 24). పరమాత్మస్వరూపం రెండువిధాలు. ఉపాధితో ఉన్న స్వరూపం. అంటే రాముడు, కృష్ణుడు లాంటి ఉపాధుల్లో (పరిచ్ఛిన్నభావంలో). లోకవ్యవహారంకోసం 4వ అధ్యాయంలో చెప్పినట్లు ధర్మసంస్థాపనకై వ్యక్తమైన రూపాలు. రెండవది నిరుపాధిక స్వరూపం, శుద్ధచైతన్యమాత్రం.

ఒకేసారి నిర్గుణతత్త్వం గ్రహించలేనందువల్ల దేవతాకల్పన అని అనేకచోట్ల చెప్పబడింది.

**చిన్మయస్యాద్వితీయస్య నిష్కలస్యా శరీరిణః ।**
**ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా ॥** (రామతాపనీయోపనిషత్)

శుద్ధ అద్వితీయ చైతన్యం ఎలాంటి విభాగాలుగానీ, శరీరంగానీ లేనిది. ఇలాంటి బ్రహ్మతత్త్వమందు ఉపాసకుల కార్యార్థం అనగా వాళ్ళ సాధనకొరకు రూపకల్పన చేయబడింది అని అర్థం. సాధకుడు దానినే పరమార్థంగా తీసుకుంటే అది వాడి దోషం. విగ్రహం సాధనం మాత్రమే. అదే పరమార్థం కాదు.

జ్ఞానిగా ఉండి భక్తిగలవాడు మాత్రమే పరాప్రకృతిని తెలుసుకోగలడు. సకామభక్తులు అపరాప్రకృతి ఇచ్చే భోగాలతో తృప్తిపడి ఉంటాడు. జ్ఞాని మాత్రమే భగవంతుని యోగమాయను తెలుసుకోగలడు (శ్లో. 25).

అందరూ పరమాత్మతత్త్వాన్ని ఎందుకు గ్రహించలేరు? దీనికి మోహమే కారణం (ఉన్నదాన్ని వేరేవిధంగా చూడడం). దీనికి కారణం భగవంతుడు మొదటినుండీ చెబుతూనే ఉన్నాడు. రాగద్వేషాలు, వీటివల్ల కలిగే ఇష్టము, ద్వేషము అనే ద్వంద్వాలు, ఆ ద్వంద్వాలవల్ల మోహము, అదే మాట 27వ శ్లోకంలో ద్వంద్వమోహేన అనగా ఈ ద్వంద్వాలు సృష్టించిన మోహంవల్ల లోకంలో ప్రాణులు తత్త్వాన్ని గ్రహించలేకున్నాయి అన్నాడు.

మరి తత్త్వాన్ని ఎవరు చూడగలరు? దీనికి కొంత పుణ్యవిశేషం ఉండాలి. అనేక జన్మల పాపం పుణ్యకర్మలచేత క్షయమై ఉండాలి (శ్లో. 28). (పుణ్యపాపాల గురించి వేదాంతసిద్ధాంతం చెప్పకపోయినా ధర్మశాస్త్రాలిలా చెబుతాయి. పుణ్యంవల్ల పాపం తరిగిపోతుంది. అందువల్ల పాపాలను ఏవో పుణ్యకర్మలు చేసి తగ్గించుకోవచ్చు. బహుశా మానవుణ్ణి ఉత్సాహపరచి, మంచిమార్గంలో ఉంచడానికి ఈ వ్యవస్థ). అలా పుణ్యం క్షయమైనవారు ద్వంద్వాలచే ఏర్పడిన మోహం నుండి విముక్తులై పరతత్త్వాన్ని పట్టుకోగలరు. అంటే ప్రకృతినంతా అఖండపరమాత్మ చైతన్యంగా చూడగలరు.

అధ్యాయంలోని చివరి మూడు శ్లోకాల్లో ద్వంద్వమోహాలనుండి విడువబడినవారి గురించి చెబుతూ అలాంటివారు సగుణోపాసన చేయాల్సిందిగా చెబుతున్నారు. సగుణం అంటే మూడు గుణాలతో కూడినది. బ్రహ్మ ఒక్కటే నిర్గుణం. బ్రహ్మ తప్ప మిగతా అంతా సగుణమే. అనగా మాయాశక్తి, దాని పరిణామంగా పుట్టిన హిరణ్యగర్భ తత్త్వం, పంచభూతాలు, వాటివల్ల పుట్టిన ఇంద్రియాలు, మొదలైనవన్నీ సగుణాలు. వీటన్నిటిలో భగవంతుని చూడడం. ఈ అభ్యాసాన్ని 8వ అధ్యాయంలో వివరంగా చెప్పబోతూ సూచనప్రాయంగా ఈ అధ్యాయంలోని 29,30 శ్లోకాల్లో చెబుతున్నాడు. సగుణోపాసన చేసేవారు క్రమంగా బ్రహ్మ, అధ్యాత్మం, కర్మ స్వరూపం, అధిభూతం, అధిదైవం, అధియజ్ఞం అనే పేరుగల వాటన్నింటిలో నన్ను గుర్తించగలరు. అలాగే మరణకాలంలోకూడా నన్ను గుర్తించగలుగుతారు అంటాడు కృష్ణుడు. ఈ పదాలన్నీ మొదట చెప్పిన పరాప్రకృతి, అపరాప్రకృతి అనే వాటికే మరోవిధంగా చెప్పిన పేర్లు. పూర్తి వివరణ తర్వాతి అధ్యాయంలో చూద్దాం!

❖ ❖ ❖

## ఎనిమిదవ అధ్యాయము

# అక్షరబ్రహ్మ యోగము

ఏడవ అధ్యాయం చివరి రెండు శ్లోకాల్లో సగుణోపాసన గురించి చెప్పబడింది. నన్ను ఉపాసన చేసేవారు బ్రహ్మ, అధ్యాత్మం, కర్మ, అధిభూతం మొదలైనవాటిని సరిగా తెలుసుకుంటారు. అలాగే ప్రయాణకాలంలో (మరణకాలంలో) నన్ను గుర్తించగలుగుతారు అన్నాడు. అక్కడ చెప్పిన ఉపాసన నిష్కామ ఉపాసన. ఈ ఉపాసనలన్నీ తను ఉపాసించే వస్తువు వేరు, నేను వేరు అనే భావన (భేదబుద్ధి)తో చేసేవే. ఆ భేదబుద్ధి పోవాలంటే అభ్యాసం అవసరం. భేదబుద్ధి లేనివాడు జీవన్ముక్తుడు. అతనికి ఉపాసనలతో పనిలేదు. ఇంకా పూర్తి భేదబుద్ధి తొలగక, సగుణోపాసన చేసేవాడి గూర్చి అనగా సమ్యక్‌జ్ఞానంలేని సాధకుడి గురించి ఈ అధ్యాయం చెప్పబడింది. జ్ఞాని విషయం 9వ అధ్యాయంలో చెప్పబడుతుంది.

ఈ అధ్యాయంలో 28 శ్లోకాలు. మొదటి 13 శ్లోకాల్లో అర్జునుడి ప్రశ్నలు, వాటికి కృష్ణుడి సమాధానం. 15 నుండి 22 వరకు శ్లోకాల్లో బ్రహ్మలోకంవరకూ ఉన్న వివిధ లోకాలు, బ్రహ్మకాలపరిమితి, సృష్టి, ప్రళయం, వీటన్నింటికీ అతీతంగా ఉన్న తత్త్వం, అనే వాటిగురించి చెప్పబడింది. అలాగే సగుణోపాసన, కర్మయోగం చెప్పబడ్డాయి. ఒకదానివల్ల పునరావృత్తి (మళ్ళీ జన్మ ఎత్తడం) మరొకదానివల్ల బంధవిముక్తి. 23 నుండి 27 శ్లోకాల్లో రెండురకాల మార్గాలు శుక్లగతి, కృష్ణగతి. ఒకటి పునరావృత్తి లేనిది, రెండోది పునరావృత్తి కలది. ఈ అధ్యాయంలో చెప్పిన ఉపాసనలు మనిషిని తరింపచేసేవి కావున ఈ అధ్యాయానికి తారకబ్రహ్మయోగం అని మరో పేరుకూడా కొన్ని గ్రంథాల్లో కన్పిస్తుంది.

మొదటగా అర్జునుడి ప్రశ్నలు. శ్రీకృష్ణుడు వాడిన పదాలకు విభిన్న అర్థాలు ఉండడంవల్ల వాటిని ఏ అర్థంలో గ్రహించాలి అని అర్జునుడి సందేహం. శ్రీకృష్ణుడి జవాబు ఈవిధంగా ఉన్నాయి.

1) **బ్రహ్మ** అంటే అక్షరం – క్షరం కానిది, నశించనిది అని అర్థం. అన్నింటికన్నా ఉత్కృష్టమైన తత్త్వం (శ్లో. 3).

2) **అధ్యాత్మం** – ఆత్మను (ఈ సందర్భంలో దేహమని అర్థం), అనగా దేహాన్ని అధిష్ఠించిన చైతన్యస్వభావం. దేహాన్ని చైతన్యవంతం చేసే స్వభావం. పై చెప్పిన పరబ్రహ్మ శుద్ధచైతన్యమైనప్పటికీ అధ్యాత్మమనేది జీవుడి దృష్టికోణం నుండి చెప్పినమాట.

రెండింటి తత్త్వంకూడా చైతన్యమే. దీనినే స్వభావం, చైతన్యం జీవుడుగా ఉండడం, ప్రత్యగాత్మ (ప్రత్యక్ అంటే లోపల, ఆత్మ అంటే చైతన్యం)గా ఉండడం అని చెప్పారు (శ్లో. 3).

3) **కర్మ** – దేవతలనుద్దేశించి చేసే యజ్ఞము మొదలైనవి, ప్రపంచ ఉత్పత్తికి, సృష్టికి కారణభూతమైనవి. (శ్లో. 3).

4) **అధిభూతం** – భూతం అంటే పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు. వీటి రూపంలో ఉన్న ప్రకృతి. దీన్ని క్షరం – నశించేది అంటారు. ఈ పదంతో సర్వప్రాణులు కూడా చెప్పబడతాయి. పుట్టుకగల ప్రతి వస్తువూ అధిభూతం (శ్లో. 4).

5) **అధిదైవం** – పై చెప్పిన అధిభూతమనబడే ప్రపంచాన్ని పాలించే / నియమించే తత్త్వం. మనిషి శరీరమెలాగైతే మనస్సుచే నియంత్రించబడుతుందో అలాగ ఈ ప్రపంచమనే శరీరాన్ని నియంత్రించే విశ్వాత్మకమైన మనస్సు (cosmic mind) దీన్ని హిరణ్యగర్భతత్త్వం అంటారు. ఇతన్నే / దీనినే పురుషుడు లేదా విరాట్పురుషుడు అంటారు (శ్లో. 4)

6) **అధియజ్ఞం** – హిరణ్యగర్భతత్త్వానికి మూలమైన భగవత్తత్త్వము. యజ్ఞం అంటే విష్ణువు (అంతటా వ్యాపించినది) అని అర్థం చెప్పారు. యజ్ఞం దేహంచే నిర్వర్తింపబడుతుంది కావున దేహమే దీని ఆధారం. ఆ దేహంలో ఉన్న చైతన్యతత్త్వం. అధియజ్ఞం.

ఈవిధంగా తన దేహాన్ని దాన్ని అధిష్ఠించిన చైతన్యాన్ని, తాను చేసే యజ్ఞాన్ని, పంచభూతాలను, ఇంద్రియాలను బ్రహ్మస్వరూపాలుగా చూడడం, అదే చిత్తవృత్తితో ఉండడం సాధకుడు చేయాల్సినపని.

**అంత్యభావన - మరణకాలం**

అర్జునుడి ఏడవ ప్రశ్న మరణకాలం గురించి. 7వ అధ్యాయం చివర ఉపాసకులు నన్ను మరణసమయంలో కూడా ధ్యానించుకుంటారు అని చెప్పినదానిపై అర్జునుడు అది ఎలాగ అని ప్రశ్నించాడు. దానికి జవాబు శ్లో. 5 నుండి 13 వరకు. "మరణకాలంలో కూడా నన్నే స్మరిస్తూ ఎవడు మరణిస్తాడో అతడు నా స్వరూపాన్నే పొందుతాడు" (శ్లో. 5).

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేబరమ్ ।**
**తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః ॥ 6**

# ఎనిమిదవ అధ్యాయం

మరణసమయంలో మిగతా ఏవైనా దేవతావిశేషాలనుగానీ, మరి ఏదైనాగానీ స్మరిస్తూ మరణిస్తే అలాంటి భావనాప్రభావంవల్ల అదే స్వభావంతో మరలా జన్మిస్తాడు. అంత్యభావన (చివరి ఆలోచన) మరో దేహం పొందడానికి కారణం కావున నీవు ఎల్లప్పుడూ నా భావనలోనే ఉండుము. నాయందే బుద్ధి నిలిపివుండుము (శ్లో. 7).

ఈ మాటలు అనాదిగా భారతీయ జనజీవితాన్ని ప్రభావితం చేశాయి. ప్రతి భారతీయుడి మనస్సులో జీర్ణించుకున్న భావం ఇది. మనిషి మామూలుగా భేదదృష్టి కలిగివుంటాడు. అనగా అన్నింటినీ విడమరచి చూసే (analytical mind) స్వభావం. భౌతికశాస్త్రంలో ఇది అవసరం కావచ్చు. వేదాంతశాస్త్రం దీనికి విరుద్ధం. అన్నింటిలో సమతత్త్వాన్ని చూస్తుంది. ఈ అధ్యాయంలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు ప్రపంచాన్ని అధిభూతం, అధిదైవం, అధ్యాత్మం ఇలాగ విభజించుకొని ఆయా వస్తువులను చూస్తుంటాడు. వీటన్నింటిలో బ్రహ్మను చూడడం ఇక్కడ చెప్పుతున్న అభ్యాసం. ఈ అభ్యాసం చేసేవాడికి మనసులో ఏర్పడిన వాసనాబలంవల్ల చివరిదశలో కూడా మనసులో మరోభావం రాకుండా బ్రహ్మనుగూర్చియే చింతిస్తాడు. మన పూర్వీకులు విధించిన వానప్రస్థాశ్రమం ఉద్దేశమిదే. ఆ దశలో వ్యక్తి సంసారబాధ్యతల్ని పిల్లలకు అప్పగించి ఆత్మచింతన – తన స్వరూపమేమిటి? అని చింతన చేయాలి. ఆ చింతనలో అతనికి సహజంగా భగవద్భక్తి ఏర్పడి ఆ వాసనాబలంచే అంత్యకాలంలో అదే భావనలో ఉంటాడు.

ఇక్కడ ఒక ప్రసిద్ధ ఉదాహరణ – భాగవతం 5వ స్కంధంలోని జడభరతుని కథ. జడభరతుడనే రాజు జ్ఞానియై వానప్రస్థాశ్రమంలో ఉంటూ అకస్మాత్తుగా ఒక లేడిపిల్ల సంరక్షణబాధ్యత స్వీకరిస్తాడు. తర్వాత దానిపై ఆసక్తి పెరగడంవల్ల భగవచ్చింతన బలహీనమౌతుంది. లేడిపిల్లపై మమకారం పెరిగి ఆ భావనే అతని చివరి సమయంలో బలంగా ఉండడంవల్ల అతడు మరుజన్మలో లేడిగా పుడతాడు. తర్వాత మనుష్యజన్మ ఎత్తి **'పూర్వాభ్యాసేన'** (6–44) అని పైన చెప్పినట్లు వాసనాబలంచే బాల్యంలోనే జ్ఞానియై ఒకానొక రాజుకు ఆత్మబోధ చేసినట్లు భాగవతకథ.

**బ్రహ్మదృష్టిని ఎలా అభ్యసించాలి?**

శ్లో. 8 నుండి 15 వరకు బ్రహ్మదృష్టిని అలవరచుకొనే అభ్యాసం చెప్పబడింది. అభ్యాసం అనే పదానికి అర్థం **'తుల్యప్రత్యయ ఆవృత్తి లక్షణః'** అన్నారు. అంటే ఒకేవిధమైన ఆలోచన పరంపరను మనస్సులో చేస్తూ ఉండడం, ఇతర ఆలోచనలను అడ్డుకోవడం. ఈ అభ్యాసమే యోగం అనే అర్థంలో అభ్యాసయోగం అనే పదాన్ని చెప్పారు (శ్లో. 8). ఇలాంటి అభ్యాసంతో పొందేదెవరిని? దీనినే ఒక అందమైన శ్లోకంలో –

**కవిం పురాణమనుశాసితార మణోరణీయాంసమనుస్మరేద్యః।**
**సర్వస్య ధాతారమచిన్త్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్॥ 9**

ఈ శ్లోకంలో **కవి** = సర్వజ్ఞుడు, సర్వప్రాణి కర్మలను తెలుసుకొని వాటికి ఫలాన్ని నియమించేవాడు. **పురాణం** = అనాదియైన, **అనుశాసితారం** = జగత్తుకు నియామకుడు, అణువుకన్నా సూక్ష్మమైన (ఆలోచించడానికి శక్యంగాని) కర్మఫలదాత అయిన పరమపురుషుడు. **ఆదిత్యవర్ణః** = నిత్యచైతన్య స్వరూపుడు, **తమసః పరస్తాత్** = చీకటికి (అజ్ఞానానికి/మాయకు) అవతల ఉన్నవాడు. దీనినే పోతన **'అలోకంబగు పెంజీకటి కవ్వలనెవ్వండేకాకృతి వెలుగు నతనినేసేవింతున్'** అంటాడు. భగవత్తత్త్వంలోనే ఏర్పడిన శక్తి మాయ అని పైన చెప్పుకున్నాం. ఈ మాయకు పైనున్న తత్త్వం అంటే బ్రహ్మతత్త్వం దీన్ని గురించి చింతన చేసేవాడు ఆ వాసనాబలంచే తన మనస్సు చక్కగా నిలిపివుండడంవల్ల మరణసమయంలో ఆ తత్త్వాన్ని పొందగలడు.

యోగమార్గంలోకూడా ఈ తత్త్వాన్ని పొందగలరు అని 10వ శ్లోకంలో చెబుతున్నాడు. "మరణసమయంలో నిశ్చలమైన మనస్సుతో యోగబలంతో, ప్రాణవాయువును కనుబొమలమధ్య నిలిపి పరమపురుషుణ్ణి చేరగలడు" అన్నాడు. ఇది యోగశాస్త్రంలో చెప్పే ప్రక్రియ. మొదట కుంభక ప్రాణాయామంద్వారా వాయువును నిలిపి తర్వాత దానిని సుషుమ్నానాడిద్వారా కనుబొమల మధ్యన (ఆజ్ఞాచక్రంలో) నిలపాలని, దానిద్వారా యోగి ప్రాణాలు వదలుతాడని శంకరానందులు వ్రాశారు. ఇది యోగులకు మాత్రమే సాధ్యమయ్యే విషయం.

యోగమార్గం కాకుండా ఓంకార ఉపాసనామార్గం 11వ శ్లోకంలో చెప్పబడింది. "ఏది అక్షరం (వినాశనం లేనిది) అని వేదవేత్తలు చెబుతారో యతులు (శమదమాదులను అభ్యాసం చేసినవారు) దేనిని ప్రవేశిస్తారో, దేనిని కోరుతూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తారో ఆ పదాన్ని గూర్చి సంగ్రహంగా చెబుతాను (శ్లో. 11). ఈ పదమే 'ఓంకారం'. 'పదం' అనే మాటకు రెండర్థాలు. 1) శబ్దం 2) స్థానం (బ్రహ్మపదం, విష్ణుపదం లాగా). ఇక్కడ రెండర్థాలూ తీసుకోవచ్చు. ఈ ఓంకార ఉపాసనే యోగమార్గంతోకూడా కలిపి చేయవచ్చని 12వ శ్లోకం చెబుతుంది. **సర్వద్వారాణి సంయమ్య** – అనగా ఇంద్రియాలే ద్వారాలు. వీటిని నియంత్రించడమంటే వెనక్కు మరల్చడం. వీటిద్వారా మనసును నిరోధించడం. పైన చెప్పినట్లు ప్రాణాయామం కూడా దీనికి జోడించాలి. "ఆవిధంగా 'ఓం' అనే అక్షరరూపంలో వున్న పరబ్రహ్మను ధ్యానిస్తూ దేహాన్ని విడిచివెళ్లేవాడు

పరమగతిని పొందుతాడు" (శ్లో. 13). ఈ శ్లోకంలో **మా మనుస్మరన్** అంటే నన్ను స్మరిస్తూ ఓంకారం ఉచ్చరిస్తూ, ఉపాసన చేయి అని అర్థం.

ఉపాసన అంటే తక్కువ దానిలో ఎక్కువను భావించడం. శిలావిగ్రహంలో విష్ణువును భావించి ధ్యానించినట్లు. ఇదే మనం నిత్యకర్మ అయిన సంధ్యావందనంలో చూస్తాం. ఓంకారాన్నే సృష్టికర్తయొక్క గొప్ప తేజస్సు, చైతన్యం, ఆ తత్త్వమే నాది (**భర్గో దేవస్య ధీమహి**) అంటూ స్మరిస్తాం. అందువల్లే సంధ్యావందనాన్ని బ్రహ్మకర్మ అన్నారని పైన చెప్పుకున్నాం. దీనివల్ల పరమగతి క్రమేణా లభిస్తుంది.

**క్రమముక్తి - సద్యోముక్తి**

ఈ లోకాలు, క్రమముక్తి, సద్యోముక్తి (వెంటనే ముక్తి) కొంత గజిబిజిగా కనిపిస్తాయి. ఈ సందర్భంలో నీలకంఠులు ఒక మాట వ్రాశారు. బ్రహ్మలోకం, విష్ణులోకం, రుద్రలోకం ఇలాంటివన్నీ ఒకదానిపై ఒకటి ఉంటాయి అనడం పౌరాణికుల కల్పన (శైవులు రుద్రలోకం పైనున్నదంటే వైష్ణవులు విష్ణులోకం అన్నింటికంటే పైన అనవచ్చు). వేదాంతం ఇలా చెప్పదు. వేదాంతసిద్ధాంతం ప్రకారం సృష్టికర్త బ్రహ్మ అనగా శుద్ధ చైతన్యంలో వ్యక్తమయ్యే తత్త్వం, హిరణ్యగర్భతత్త్వం. దీనిలోనే అన్ని దేవతారూపాలు, అన్నిలోకాలు. దీనినే మనం విష్ణులోకమనవచ్చు, రుద్రలోకమనవచ్చు, మరేమైనా అనవచ్చు అని వారు వ్రాశారు. ఇవన్నీ పరబ్రహ్మకు ఉపాధులు మాత్రమే. జీవుని అంతఃకరణం చిన్న ఉపాధి అయితే బ్రహ్మాండానికే అంతఃకరణమైన హిరణ్యగర్భుడు పెద్ద ఉపాధి. ఈ ఉపాధిచే సంకుచితమైన తత్త్వాన్ని ఉపాసిస్తే ఫలితం కూడా తక్కువగానే ఉంటుంది. పౌరాణికులు ఆనాటి సామాన్య ప్రజలకోసం తత్త్వాన్ని సులభం చేసి చెప్పారు. కానీ విద్యావ్యాప్తి బాగావున్న ఈ రోజుల్లో ఆ కథలన్నీ అసమంజసంగా కన్పిస్తాయి. పై చెప్పిన నీలకంఠుల వాక్యం కూడా పురాణాలని పరమ ప్రమాణంగా గ్రహించకూడదు, వాటిలోని తాత్పర్యాన్ని, సింబాలిజమ్‌ను గ్రహించాలని చెబుతుంది.

మళ్ళీ క్రమముక్తి ప్రసంగం చూద్దాం. హిరణ్యగర్భలోకంలో క్రమముక్తి అని చెప్పారు. అనగా ఆయా లోకాలు ప్రళయకాలంలో నశించినపుడు ఇదివరకే ఉపాసన చేసి అక్కడ చేరిన సాధకులు హిరణ్యగర్భుడితోపాటు ముక్తి పొందుతారని వేదాంతుల సిద్ధాంతం.

సద్యోముక్తి అంటే ఏమిటి? సద్యః అంటే వెంటనే అని అర్థం. అంటే జ్ఞానం కలిగిన వెంటనే అతనికి బంధరాహిత్యం అని అర్థం. దీన్ని 14వ శ్లోకంలో చెప్పారు.

**అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ 14**

**అనన్యచేతాః** అంటే ఇతర విషయాలను ఆలోచించకుండా అని ఒక అర్థం, పరమార్థతత్త్వం నాకంటే భిన్నంకాదు అనే భావన ఉండడం అని మరో అర్థం. **నిత్యయుక్తః** అంటే ఎల్లప్పుడూ యోగంతో కూడినవాడై ఉండేవాడు. అలాంటివాడికి నేను సులభుడను. అతనికి జీవన్ముక్తి (జీవించివుండగానేముక్తి, అదే సద్యోముక్తి) లభిస్తుంది అని పై శ్లోకార్థం.

ఇతనికీ, ఉపాసకుడికీ తేడా ఏమిటి? అనగా ఇతడు వేదాంతశాస్త్ర శ్రవణం, వాటి మననం, వాటి నిదిధ్యాసనం (మనస్సుకు పట్టించుకోవడం) లాంటి అభ్యాసాలన్నీ చేసి ఆ బ్రహ్మాత్మభావంలోకి వచ్చాడు. అతన్నే మనం జ్ఞాని అని 4వ అధ్యాయంలో చూశాం. అతని కర్మ కేవలం చేష్టామాత్రమే అని చూశాం. అతడు నిత్యముక్తుడే. అందుకే **తస్యాహం సులభః** – అలాంటివాడికి నేను సులభుడను అని పై శ్లోకంలో చెప్పబడింది. ఈ స్థితిని పొందినవాడికి పునరావృత్తి లేదు.

పుణ్యకర్మలను చేసి వివిధలోకాలకు వెళ్లేవాళ్ల గతి ఏమిటి? అంటే వాళ్లకు పునరావృత్తి ఉంది (శ్లో. 16). హిరణ్యగర్భలోకంకంటే క్రింద చెప్పబడిన అన్ని లోకాలూ **పునరావర్తినః** – అనగా మళ్లీ తిరుగుప్రయాణం కలవే. కేవలం బ్రహ్మాత్మభావం పొందినవానికి పునర్జన్మ లేదు (శ్లో. 16).

ఆ లోకాలకు ఎందువల్ల తిరుగుప్రయాణం చెప్పబడింది? అంటే అవన్నీ కాలంచే కొలవబడేవే (మూడురకాల పరిచ్ఛేదాలు – limitations పైన గమనించాం). సృష్టికర్తయైన నాలుగు తలల బ్రహ్మ మొదలైన తత్త్వాలన్నీ కొన్ని యుగాలపాటు ఉండేవే. అందుకే కొత్త మనువులు, కొత్త సృష్టికర్తలు, అంటూ చెప్పబడింది. మనకంటే లక్షలరెట్ల సంవత్సరాలు వాళ్లకు ఒక పగలు కావచ్చు. అయినా దానికి ఒక అంతం ఉంది. అనంతం కాదు. వీటిగూర్చి 17 నుండి 19 శ్లోకాలవరకూ చెప్పారు. ప్రజాపతి యొక్క పగటి సమయంలో ప్రాణులన్నీ బయటికి వస్తాయి, అనగా సృష్టి, అతనికి రాత్రికి రాగానే మళ్లీ విలీనమవుతాయి – ఇదే లయం. ఏ ప్రాణులు విలీనమౌతాయో అవే మళ్లీ మళ్లీ పుడుతుంటాయని **భూత్వా భూత్వా ప్రలీయతే** (శ్లో. 19) అని చెప్పారు. ఆ ప్రాణులు చేసిన కర్మను అనుసరించి వాటికి మళ్లీ వివిధజన్మలు, దానివల్ల సృష్టిలో వైచిత్రి. అలా కాకుంటే ఒకడు ధనికుడుగా, ఒకడు దరిద్రుడిగా జన్మించడం అనేదానిని వివరించలేం. దేవుడికి పక్షపాతం అంటగట్టినట్లవుతుంది.

పై చెప్పిన సృష్టికర్తకు అవ్యక్తం అని కూడా పేరు. దానిపైన ఉన్న తత్త్వం నేను అని 20వ శ్లోకంలో చెప్పారు. సృష్టికర్త అనే ఆ అవ్యక్తంపై సనాతనుడైన నేను అనే అవ్యక్తం ఉన్నాను. ఆ సృష్టికర్త అతనితోపాటు సమస్తప్రాణులు నశించినా నేను నశించను (శ్లో. 20). అనగా శుద్ధచైతన్యానికి కాలపరిమితిలేదు. నాశం లేదు. సృష్టి, స్థితి, లయాలు కాలంచేత తెలియబడేవే. Space and Time అనేవి మాయచేత కల్పించడినవే అని, **'మాయాకల్పిత దేశకాలకలనా'** అని దక్షిణామూర్తి స్తోత్రంలో చెబుతారు. కల్పించబడినవన్నీ నశిస్తాయి కావున బ్రహ్మచైతన్యం తప్ప మిగతావన్నీ కాలంచే కొలువబడేవే. శుద్ధచైతన్యాన్నే అక్షరం (నశించనిది), పరమాగతి అంటారు (శ్లో. 21)

ఇలాంటి పరమాగతి ఎలా లభిస్తుంది? అని 22వ శ్లోకంలో చెప్పబడింది. **భక్త్యాలభ్యస్త్వనన్యయా** – అనగా అనన్యభక్తితో లభిస్తుంది అని అర్థం. ఈ అనన్యభక్తి అనే పదానికి రెండు అర్థాలు పైన చూశాం. ఇతరులెవ్వరినీ పూజించకుండా నన్నే పూజించడం అని ఒక అర్థం. పరమాత్మతత్త్వం తప్ప మరొకటి లేదు. **అనన్యం** – అన్యమైంది లేదు అని మరో అర్థం. సర్వం వ్యాపించివున్న పరమాత్మ అనే అధిష్ఠానంలోనే ఈ ప్రాణులన్నీ ఉన్నాయి. లేదా కల్పించబడ్డాయి అని 22వ శ్లోకం.

**రెండు ప్రయాణాలు**

ఒకటి తిరుగులేని ప్రయాణం (అనావృత్తి). మరొకటి తిరుగుప్రయాణం ఉండేది (ఆవృత్తి). వీటిని శ్లో. 23 నుండి 27 వరకు గల శ్లోకాల్లో దేవయానం, పితృయానం అని చెబుతున్నాడు.

**దేవయానం** – ఈ అధ్యాయంలో చెప్పినట్లు ఓంకార ఉపాసనా ద్వారా, యోగంద్వారా సగుణోపాసన చేస్తూ ఆ లోకాల్లో వాసం చేస్తుండగా అక్కడ సమ్యక్ దర్శనం కలుగగా ముక్తులయ్యే మార్గం (మధుసూదనసరస్వతి). జ్ఞానులెలాగైతే ముక్తులవుతారో వీరూ అలాగే ముక్తులౌతారు. దీనినే క్రమముక్తి అన్నారు.

దేవలోకం అనే మజిలీ ఉంది కాబట్టి దేవయానం అన్నారు. వీరు సగుణోపాసకులు కావున వీరు కోరుకున్న లోకం వీరి ప్రథమ మజిలీ. ఏ దేవతను ఉపాసిస్తే ఆ లోకం అని అర్థం. ఆ లోకంలో బ్రహ్మను తెలుసుకున్న తర్వాత నిర్గుణబ్రహ్మను పొందుతారు కావున క్రమముక్తి అన్నారు.

**పితృయానం** కర్మలను (యజ్ఞయాగాదులు) ఆచరిస్తూ పుణ్యలోకాలకు వెళ్ళి ఆ పుణ్యఫలం పూర్తయిన తర్వాత తిరిగి రావడం. ఈ రెండు మార్గాలను ఈ క్రిందివిధంగా చూడవచ్చు.

| దేవయానం | పితృయానం |
|---|---|
| – ఉత్తరమార్గం అని కూడా పేరు. జ్ఞాన ప్రకాశమయము. | – దక్షిణమార్గం అని పేరు. జ్ఞానహీనం తమోమయం. |
| – సగుణబ్రహ్మోపాసకులకు చెప్పినది. | – ఉపాసన లేకుండా యజ్ఞయాగాదులు చేసేవారికై చెప్పినది. |
| – శుక్లగతి అనగా జ్ఞానంతో కూడిన మార్గం. వీరు బ్రహ్మను పొందుతారు. పునరావృత్తి ఉండదు. | – కృష్ణగతి అనగా అజ్ఞానంతో కూడినది. దీని అధిదేవతలు భోగప్రధానలోకాలకు తీసుకువెళతారు. పునరావృత్తి ఉంటుంది. |

'పై రెండు మార్గాలను' తెలుసుకున్న యోగి మోహం చెందడు. అందువల్ల నీవు సర్వదా యోగయుక్తుడవై యుండు (శ్లో. 27).

ఈ అధ్యాయం సారాంశం చూస్తే ఈ విషయాలు గమనిస్తాం.

1) కేవలం కర్మ చేసేవాడికి చిత్తశుద్ధి కలిగింది కానీ జ్ఞానం లేదా ఉపాసన రెండూ లేవు. కావున అతనికి పితృయానం.

2) చిత్తశుద్ధి కలిగిన కర్మయోగి సగుణోపాసన చేస్తే అతనికి దేవయానం – క్రమముక్తి.

3) చిత్తశుద్ధి కలిగిన కర్మయోగికి సమ్యక్‌జ్ఞానం కలిగితే (నిర్గుణతత్త్వాన్ని గ్రహిస్తే) అతనికి సద్యోముక్తి అనగా జీవన్ముక్తి. పై రెండు మార్గాలతో పనిలేదు.

పాఠశాలలో బాలుడు 1వ తరగతిలో ఉన్నపుడు అదే ముఖ్యమని స్తుతిస్తాం. 10వ తరగతి వాడికి అదే ముఖ్యమని స్తుతిస్తాం. కానీ అదే పరమార్థంకాదు. అలాగే శ్రీకృష్ణుడు సాధకుని అధికారిభేదాన్ని బట్టి అప్పుడప్పుడూ కర్మయోగాన్ని స్తుతించడం జరుగుతుంది. కానీ అదే పరమార్థంకాదని అర్థం.

కర్మయోగం, ఉపాసన ఈ రెండింటిమధ్య ఉపాసనమార్గం ఉత్తమమైనది. ఎందుకంటే అది క్రమముక్తినిస్తుంది. కర్మయోగం చిత్తశుద్ధి కలుగచేస్తుంది కానీ జ్ఞానంవరకు వెళ్లకపోతే పునర్జన్మను కలిగిస్తుంది అని ఈ అధ్యాయ తాత్పర్యం.

❖ ❖ ❖

## తొమ్మిదవ అధ్యాయము

# రాజవిద్యా రాజగుహ్యా యోగము

'తత్'పదార్థ (బ్రహ్మస్వరూప) నిరూపణకై ప్రారంభమైన ఏడవ అధ్యాయంలో 'జ్ఞానం – విజ్ఞానం రెండూ చెబుతాను' అన్నాడు శ్రీకృష్ణుడు (శ్లో. 2). అదే జ్ఞానము, విజ్ఞానము ఈ అధ్యాయంలోని విషయాలు. అనగా సాక్షాత్తూ మోక్షకారణమైన పై రెంటిని గురించి మళ్లీ శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. మధ్యలో వచ్చిన ఎనిమిదవ అధ్యాయంలో సగుణబ్రహ్మోపాసన – అనగా ధ్యానంచేత తెలుసుకోదగిన బ్రహ్మ, ధ్యేయబ్రహ్మ లేదా హిరణ్యగర్భ బ్రహ్మ. ప్రస్తుత అధ్యాయంలో జ్ఞానంతో తెలుసుకోదగిన బ్రహ్మ, జ్ఞేయబ్రహ్మ. ఎనిమిదవ అధ్యాయంలో చెప్పింది క్రమముక్తి. ఈ అధ్యాయంలో జీవన్ముక్తి అనగా సద్యోముక్తి విషయం.

ఈ అధ్యాయాన్ని రాజవిద్యా రాజగుహ్య యోగం అన్నారు. బ్రహ్మజ్ఞానం విద్యలన్నింటికీ రాజులాంటిది. అందువల్ల రాజవిద్య. అన్నింటికన్నా సూక్ష్మమైనది. సూక్ష్మంగా విచారిస్తే తప్ప సాధ్యంకానిది, అందువల్ల రహస్యమైనది (గుహ్యం = రహస్యం). రహస్యాల్లో రాజులాంటిది. అందుకే రాజగుహ్యం. ఈ పేరునుబట్టి ఇదేదో కొత్తరకమైన యోగమని భావించరాదు. రెండవ అధ్యాయంనుండి చెబుతున్న సాంఖ్యం (జ్ఞానం), మళ్లీ ఏడవ అధ్యాయంలో చెప్పిన జ్ఞానం, విజ్ఞానం. ఇవే ఇక్కడ వివరింపబడుతున్నాయి.

ఈ అధ్యాయంలో 34 శ్లోకాలు. మొదటి మూడు శ్లోకాల్లో విద్యాప్రశంస. తర్వాత శ్లో. 4 నుండి 14 వరకు నిర్గుణబ్రహ్మస్వరూపం, బ్రహ్మకు, సృష్టికి సంబంధం. శ్లో. 12 నుండి 34లలో జ్ఞానసాధనంగా భక్తి అందులో స్థాయిభేదాలు చెప్పబడ్డాయి.

**విద్యాప్రశంస**

ఈ విద్యను ప్రశంసిస్తూ **'ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్'** (శ్లో. 2) అంటాడు శ్రీకృష్ణుడు. ప్రత్యక్షావగమం అనగా ప్రత్యక్షంగా తెలుసుకోదగినది. మోక్షం ఇలావుంటుంది అని వినడమేకాక స్వయంగా అనుభవించదగినది. జ్ఞాని అనగా జీవన్ముక్తుని స్థితి ఇది. అలాగే **సుసుఖం** = సుఖంగా తెలుసుకోదగినది. అన్నిటికన్నా సూక్ష్మమైనది అని ఒకవైపు అంటూ మరోవైపు సులభం అనడమేమిటి? ఇంద్రియాల శ్రమలేకుండా కేవలం తత్త్వచింతనవల్ల తెలుసుకోదగినది. సులభంగా వచ్చిందని సులభంగా పోయేదికాదు. అందుకే **అవ్యయం** = దీని ఫలం ఎన్నటికీ

కరగిపోదు (శ్లో. 2). అయినా ఆత్మజ్ఞానంపై శ్రద్ధ లేనివాళ్లు బ్రహ్మతత్త్వాన్ని పొందలేక సంసారచక్రంలో తిరుగుతూ ఉంటారు.

**బ్రహ్మస్వరూపం**

4వ శ్లోకం నుండి బ్రహ్మస్వరూపం వివరింపబడింది.

**మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥ 4**

**అవ్యక్తమూర్తి** = ఇంద్రియాలచే తెలియబడలేనిది. అలాంటి తత్త్వంచేత జగత్తంతా వ్యాపించబడినది. సర్వభూతాలూ నాలో ఉన్నాయి. అంతేకాని 'నేను' వాటిలో లేను అని తాత్పర్యం. ఎవరు ఎవరిలో ఉన్నారు అనేది ప్రశ్న. మనం మామూలుగా మనకొక దేహం, దేహంలో మనస్సు అందులో ఎక్కడో ఆత్మ అని ఒక ఇనప్పెట్టెలో లోలోపలి సొరుగుల్లో ధనం ఉన్నవిధంగా ఆత్మను భావిస్తాం. కానీ జగత్తంతా చైతన్యంలో ఉంది. ఆ చైతన్యంలో వ్యక్తమయ్యే మాయాశక్తి, దానివల్ల సృష్టి. ఆ చైతన్యం రూపాలే దేహాలు. ఆకాశం అనేక పాత్రల్లో ఇమిడివున్నా అది ఆకాశమే. గిన్నెలో ఆకాశం వేరుగాలేదు. సముద్రంలో అలలు, బుడగలు, నురుగు మొదలైనవి సముద్రజలంకంటే వేరుగాలేవు. అంతేగాక పరమాత్మ నిరవయవం (అవయవాలు లేనిది, విభజించడానికి వీలులేనిది). కావున చిన్నచిన్న విభాగాల్లో ప్రవేశించడం కుదరదు. బ్రహ్మచైతన్యంలోనే అన్నిభూతాలూ ఉన్నాయని తాత్పర్యం. ఈ శ్లోకంలో **మయాతతమ్** అంటే నాచేత వ్యాపించబడింది అని అర్థం. ఇది ఇంత సూక్ష్మమైన విషయంకాబట్టే రాజవిద్య.

మరి సృష్టికర్త ఎవరు? అంటే పరబ్రహ్మలోని మాయాశక్తి పరిణామంగా ఏర్పడిన విరాట్పురుషుడు లేదా హిరణ్యగర్భుడు. అతని రూపాలే బ్రహ్మ, విష్ణు, రుద్రాదులు. వీరివల్ల సృష్టి, స్థితి, లయ అనేవి. బ్రహ్మదృష్టిలో ఇవి చైతన్యంలో కల్పితాలు. సృష్టికర్తయైన చతుర్ముఖబ్రహ్మ నుండి గడ్డిపోచవరకూ చేతనాలు, అచేతనాలు అన్నీ చైతన్యంలో వ్యక్తమయ్యే రూపాలే. చైతన్యం ఆత్మగా కలది. కావున నాలో ఉన్నాయి అని కృష్ణుడి రూపంలోవున్న పరమాత్మ చెబుతున్నాడు. ఈ భావాన్నే 5వ శ్లోకంలో

**న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5**

నిజానికి ఈ భూతాలన్నీ నాలో ఉన్నాయనడంకూడా సరికాదు (**న చ మత్స్థాని భూతాని**) అంటున్నాడు. **మమాత్మా భూతభావనః** – ఈ ప్రాణులన్నింటినీ పుట్టించి

భరించే నా తత్త్వం. ప్రాణుల్ని భరిస్తుంది కానీ వాటిలో లేదు అని శ్లోకార్థం. దీన్నెలా అర్థం చేసుకోవాలి. నీలకంఠ పండితులు దీన్నిలా వివరించారు. ఈ ఇంద్రజాలంలాంటి సృష్టికి ఉపాదానకారణం మాయ/అజ్ఞానం. అజ్ఞానంవల్ల సృష్టి అనే కారణాన్నిబట్టి బ్రహ్మను సృష్టికి కారణం అంటున్నాం, అంతేగాని నిజంగా భూతాలు అతనిలో లేవు అని వివరించాడు. వేదాంతసిద్ధాంతం ప్రకారం బ్రహ్మకు కార్యకారణ సంబంధంలేదు. కేవలం మాయాశక్తి పరిణామంగా కన్పించేదే సృష్టి అని అర్థం.

బ్రహ్మ = ఆత్మా = పరమాత్మా అని చెప్పబడేది వేదాంతసిద్ధాంతం ప్రకారం ఒక శుద్ధచైతన్యతత్త్వం. నిరాకార నిర్గుణతత్త్వం. ఎలాంటి కర్తృత్వాదులు లేనిది అని పైన అక్కడక్కడ చూశాం. ఈ శుద్ధచైతన్యానికి సంబంధించినది మాయాశక్తి (దీనినే ప్రకృతి – మూడుగుణాల సముదాయం అంటారు). ఇది కూడా చైతన్యమే. ఇది గుణాలతో కూడినది కావున సగుణం అన్నారు. ఈ మూడుగుణాలు సృష్టికి కారణం అని చెప్పుకున్నాం. ఈ మాయాశక్తిలోనే మనం ఊహించుకొనే ఇష్టదేవతలందరూ వస్తారు. వీరు సృష్టికర్తలు, కర్మఫలాన్నిచ్చేవారు. ఈ సగుణ దేవతలకు ఆకారం ఉండవచ్చు (సాకారం). లేదా నిరాకారులు కావచ్చు. సగుణ సాకారదేవతలు మన విష్ణువు, శివుడు, వినాయకుడు మొదలైనవారు 7వ అధ్యాయంలో **'యో యో యాం యాం'** (7–21) అని చెప్పినట్లు మనం భావించినరీతిలో భావించిన ఫలాలనిస్తారు. ప్రకృతి – మాయాశక్తి దృష్టితో చెప్పినట్లయితే **'మత్స్థాని సర్వభూతాని'** సర్వభూతాలూ నాయందు ఉన్నాయి అని చెప్పాలి. బ్రహ్మచైతన్యం దృష్టితో చెబితే నాలో భూతాలు లేవు అని చెప్పబడుతుంది. అందుకే శ్రీకృష్ణుడు పైవిధంగా 'నాలో ఉన్నాయి అయినా నాలో లేవు' అని పై రెండు శ్లోకాల్లో చెప్పాడు.

బ్రహ్మ సృష్టికి నేరుగా కారణంకాదు. అయినా సృష్టికి అధిష్ఠానం. దీన్ని వివరించడానికి వేదాంతులు రజ్జు, సర్పం ఉదాహరణ ఇస్తారు. త్రాడును చూస్తే సర్పం భాసించింది. సర్పంపై తాడు ఆధారపడిలేదు. తాడుపై సర్పం ఆధారపడివుంది. ఈ సర్పకల్పనకు త్రాడును అధిష్ఠానం అంటారు. అలాగే బ్రహ్మ సృష్టికి అధిష్ఠానం. ఇది పాము కాదు త్రాడు అని తెలిసిన తర్వాత అధిష్ఠానమైన త్రాడు మాత్రమే మిగులుతుంది. అలాగే బ్రహ్మజ్ఞానం కలిగిన తర్వాత ప్రపంచమంతా బ్రహ్మగానే కనిపిస్తుంది. ప్రపంచమనే దృశ్యం (సర్పం) నశిస్తుంది. ఎలాగయితే త్రాడుకు, సర్పానికి ఎట్టి సంబంధమూ లేదో అలాగే బ్రహ్మకు, సృష్టికి సాక్షాత్ సంబంధంలేదు. మాయద్వారా కల్పిత సంబంధం అని వేదాంతుల సిద్ధాంతం. సృష్టి అనే సందర్భాన్నిబట్టి కేవలం సృష్టిని వివరించడంకోసం

వస్తుతః నిర్గుణమైన బ్రహ్మను సృష్టికి కారణం అంటుంటాం. అందుకే పై శ్లోకంలో **భూతభృత్** = అన్నిప్రాణుల్నీ భరించేది (మాయతో కూడిన బ్రహ్మ దృష్టికోణం నుండి). **న చ భూతస్థః** = ప్రాణుల్లో లేనిది. ఇది పరబ్రహ్మ దృష్టికోణం. దీన్నే వివరిస్తూ 6వ శ్లోకం ఇలా అంటుంది. 'ఎలాగైతే సర్వత్రా వ్యాపించివున్న వాయువు ఆకాశంలో ఉంటుందో అలాగే సర్వప్రాణులూ నాలో ఉంటాయి అని గ్రహించు'. ఆకాశం నిరవయవం, వస్తువులతో ఎలాంటి సంబంధం వుండడానికి వీల్లేనిది. అయినా వాయువు ఆకాశంలోనే ఉంది. దానిలోనే లయం కూడా.

**సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్ ।**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥ 7**

కల్పాంతంలో అన్ని ప్రాణులూ నా ప్రకృతిలో విలీనమవుతాయి. మళ్లీ కల్పప్రారంభంలో నేను సృష్టిస్తుంటాను అని అర్థం. కల్పమంటే సృష్టి. శుద్ధచైతన్యానికి మాయాశక్తి తోడవడం కల్పం. ఆ కల్పంలోనుండి వచ్చిన శక్తియే సృష్టికర్త, లేక హిరణ్యగర్భుడు, పురుషుడు, విరాట్ అని వివిధసందర్భాల్లో వాడే పదాలు. కల్పక్షయం అంటే కల్పాంతం. ఇది మళ్లీ మాయాశక్తి బ్రహ్మలో విలీనంకావడం. హిరణ్యగర్భుడు మొదలగువారితోపాటు ప్రకృతి విలీనం కావడం. ఒక ఐంద్రజాలికుడు తన ఇంద్రజాలాన్ని ముగించినట్లు. మళ్లీ కల్పాదిలో సృజిస్తాను అంటే మళ్లీ మాయాశక్తితో హిరణ్యగర్భాదులు రావచ్చు మళ్లీ సృష్టి. ఇది ఉపనిషత్తులు బోధించే సిద్ధాంతం.

*(ఇవన్నీ పరమాత్మదృష్టితో (పారమార్థికదృష్టితో – absolute level) చెప్పిన విషయాలు. ప్రపంచమంతా కేవలం కుందేటికొమ్ములాగా పూర్తిగా అబద్ధం లేదా తుచ్ఛం అని భావించకూడదు. మిథ్య అంటే అసలే లేదని అర్థంకాదు. పారమార్థికంగా అది నిజంకాదు. వ్యవహారదశలో ఉంది. ఒక ప్రసిద్ధ కవి చెప్పినట్లు జమీందారు రోల్స్‌కారు మాయకాదు. వ్యవహారదశలో దాన్ని ఖండించాల్సిందే. పై చెప్పిన ఉపనిషత్ సిద్ధాంతం ఆనాటి రాజులు ప్రజల్ని మభ్యపెట్టడానికి వ్రాయించిన విషయాలు కాదు. రాగద్వేషాలు లేని మునులు సమస్తాన్నీ త్యజించి అరణ్యాలలో తత్త్వచింతన చేసి గ్రహించిన విషయాలు.)*

8వ శ్లోకం మళ్లీ పై విషయాన్నే వివరిస్తుంది. "నాదైన ప్రకృతిని వశం చేసుకొని ప్రకృతి స్వభావంవల్ల ఈ భూతసముదాయాన్ని మాటిమాటికీ సృష్టిస్తుంటాను". అనగా సృష్టిస్థితిలయాలకు కారణం ప్రకృతి, మాయాశక్తి. శుద్ధచైతన్యానికి సంబంధంలేదు. అందుకే 9వ శ్లోకంలో **ఉదాసీనవదాసీనః** అన్నారు. ఉదాసీనుడు అంటే జరుగుతున్న

విషయానికి సంబంధంలేకుండా కూర్చున్నవాడు అని అర్థం. అలాగే **అసక్తః** (శ్లో.9) అనగా ఎలాంటి సంబంధంలేనివాడు అని కూడా చెప్పారు.

10వ శ్లోకంలో ఇంకా వివరంగా **మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్'** అన్నారు. పరబ్రహ్మ కేవలం అధ్యక్షుడు (అధి + అక్షం) పైన ఉండి కేవలం ఈక్షించేవాడు, చూచేవాడు లేదా భాసింపచేసేవాడు అని అర్థం. కేవలం దృక్ స్వరూపంగా ఉన్న తత్త్వం. ప్రకృతి ఈ చరాచరాన్ని సృష్టిస్తుంది. దాని నియమాలకు లోబడి కర్మఫలం లభిస్తూ ఉంటుంది. "అయినా మూఢులు నన్ను మనుష్య శరీరం ఆశ్రయించినవాడిగా (అంటే ఒకానొక ఆకారంలో ఉన్నట్లు) చూస్తారు. నాయొక్క పరతత్త్వాన్ని తెలియక వారు నన్ను అలా అవహేళన చేస్తారు" (శ్లో.11). అపరిచ్ఛిన్నమైన (పరిచ్ఛేదంలేని – పరిమితిలేని) చైతన్యాన్ని నామరూపాలున్న వ్యక్తిగా భావించడం పరమాత్మతత్త్వాన్ని అవహేళన చేసినట్లే.

ఇంతవరకూ నిర్గుణబ్రహ్మ స్వరూపం చెప్పబడింది. తరవాతి భాగంలో (శ్లో. 12 నుండి 34) జ్ఞానసాధనంగా భక్తి, అందులో వేదాల్లో చెప్పిన ఉపాసనల స్థాయి వివరింపబడ్డాయి.

**దైవీప్రకృతి - ఆసురీప్రకృతి**

మొదట్లోనే రాక్షసపట్టు ఉన్న భక్తుల్ని నిరసిస్తున్నాడు శ్రీకృష్ణుడు. తీవ్రపట్టుదలతో చెడుపనులు చేసేవాళ్లు రాక్షసులు. కేవలం ఇంద్రియసుఖాలలో మునిగితేలేవాళ్లు అసురులు. ఇలాంటివారు యజ్ఞాలు, వారి స్వభావానికి తగినట్లే ఉంటాయి. ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. ఈ రాక్షసీ ప్రకృతి, ఆసురీ ప్రకృతి ఉన్నవాళ్లు ప్రకృతి అనే మోహినీ వశంలో ఉంటారు (**ప్రకృతిం మోహినీం శ్రితాః** – శ్లో.12). మోహినీ అంటే మరెవరోకాదు. అనేక రుచుల్ని చూపిస్తూ మనల్ని మోహింపచేసే జగత్తే జగన్మోహిని. దేహాత్మవాదంలో ఉన్న మనిషిని సంతృప్తిపరచేది. ఇదే రాక్షసీ, ఆసురీప్రకృతి. దీన్ని గూర్చి 16వ అధ్యాయం వివరంగా చెబుతుంది.

ఆసురీప్రకృతికి విరుద్ధమైనది దైవీప్రకృతి. దీన్ని ఆశ్రయించినవాళ్లు **అనన్యమనసః** (శ్లో.13) – మిగతా దేనినీ కాకుండా పరమాత్మపైనే మనసు నిలిపి పరమాత్మను భజిస్తారు. ఆ పరమాత్మతత్త్వం నాకంటే అన్యంకానిది అని భావిస్తారని మరో అర్థం. వీరు జ్ఞానులు, ఉత్తమాధికారులు.

మధ్యమాధికారులు సాధుమార్గంలో ఉంటూ భగవంతుణ్ణి కీర్తిస్తూ, అనగా వేదాంతశ్రవణం చేస్తూ మోక్షం కావాలనే కోరికతో భక్తితో కూడినవారై నన్ను సేవిస్తుంటారు (శ్లో. 14). జ్ఞానం కోరుతూ ఏదైనా దేవతారూపాన్ని ఉపాసన చేయడంకూడా ఇందులో భాగమే.

మరికొందరు జ్ఞానులు జ్ఞానయజ్ఞంలో (4వ అధ్యాయంలో చెప్పినవిధంగా) బ్రహ్మాత్మైక్యభావనలో ఉంటారు (శ్లో. 15). **ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్** అన్నాడు. పరబ్రహ్మ ఒకటే, అదే నా తత్త్వం అని **ఏకత్వేన** అనే పదానికి అర్థం. **పృథక్త్వేన** అంటే ఆదిత్యుడే బ్రహ్మ, చంద్రుడే బ్రహ్మ, మనస్సే బ్రహ్మ అని వివిధరకాలుగా ఉపాసన చేయడం.

### సగుణ - నిర్గుణ పూజలు

మనం చేసే చాలా పూజలు, వ్రతాల్లో ఇలాంటి భావాలే కన్పిస్తుంటాయి. సగుణబ్రహ్మరూపాల్ని ఆరాధించేవాళ్లు కూడా ప్రతి పూజలో సగుణ, నిర్గుణ రూపాల్ని రెంటినీ చెబుతుంటారు. ఉదాహరణకు **మిథ్యాజగదధిష్ఠానా** అని లలితాదేవిని శుద్ధచైతన్యంగా పూజిస్తాము. **స బ్రహ్మ స శివః స హరిః** అంటూ నారాయణుడే అన్ని దేవతల రూపమని పూజిస్తుంటాం. **యం బ్రహ్మ వేదాంతవిదో వదంతి** అంటూ విఘ్నేశ్వరుడే పరబ్రహ్మ అని పూజిస్తుంటాం. ఇలాగ సగుణ, నిర్గుణ రూపాలు రెంటినీ చెప్పడంలో ఉద్దేశం క్రమక్రమంగా అలా పూజించేవాడిలో సగుణభావము, కోరికలు తొలగి తత్త్వంవైపు వెళతాడని ఆశ. కేవలం కోరికల కోసం పూజచేసేవాడు సగుణాకారంతో సంతృప్తిపడతాడు. ఇంకొంత ఆలోచనాశక్తి ఉన్నవాడు నిర్గుణతత్త్వాన్ని గురించి ఆలోచించడం ప్రారంభిస్తాడు.

ఈ రూపాలన్నీ పరమాత్మలోనివే అని 16వ శ్లోకం. "నేనే క్రతువును, నేనే యజ్ఞము, నేనే మంత్రం, నేనే ఆజ్యం మరియు హోమద్రవ్యం" (ఈ భావం 4వ అధ్యాయంలో చూశాం.

17, 18 శ్లోకాలు ఇదే భావాన్ని తెలుపుతాయి. ఈ జగత్తుకు తండ్రి, తల్లి, కర్మఫలమిచ్చేవాడు అన్నీ నేనే. వేదస్వరూపం నేనే. నేనే పోషకుడను, ప్రభువును, సాక్షిని. జగత్తుకు అధిష్ఠానమైన వాణ్ణి, ప్రపంచానికి బీజభూతుడైనవాణ్ణి. (ఈ శ్లోకాలు సృష్టి అనే సందర్భాన్ని వివరించడానికి చెప్పినవని బ్రహ్మకు నిజంగా వీటివల్ల కర్తృత్వం లేదని మనమెప్పుడూ గుర్తుచేసుకుంటుండాలి.)

**ఘనపాఠి సంగతి ఏమిటి?**

ఇకపోతే మిగతావారు, యాజ్ఞికులు, సోమయాజులు, వేదాల్లో నిష్ణాతులు అయినవారి ప్రవర్తన ఏమిటి? వీరికి మోక్షంగురించి పట్టుదలలేదు. స్వర్గసుఖాలూ, మిగతా దేవతాలోకాలు లాంటి భోగాలను కోరుకుంటారు. ఒకవేళ శ్రద్ధగా ఆచరించివుంటే స్వర్గాన్ని పొంది దేవభోగాలను అనుభవిస్తారు (శ్లో. 20). కానీ వాళ్లకు క్రింద చెప్పినట్లు తిరుగుప్రయాణముంది.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి ।**
**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభన్తే ॥ 21**

వాళ్లు విశాలమైన స్వర్గలోకంలోని సుఖాలను అనుభవించి ఆ పుణ్యం క్షీణించగానే మళ్లీ ఈ లోకంలోకి ప్రవేశిస్తారు. ఇలాగ కామకాములైనవారు (కోరికలు కోరేవారు). **గతాగతం** అనగా వచ్చిపోయేవాటిని మాత్రమే పొందుతారు. శాశ్వతమైనదాన్ని పొందలేరు. ఇది వేదపండితుల సంగతి.

కానీ కోరికలను వదలి నిష్కామకర్మ చేసేవారు పరమాత్మకంటే వేరుగా దేనినీ ధ్యానించకుండా ఉంటారు. ఇక్కడొక ప్రసిద్ధశ్లోకం.

**అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 22**

ఎవరైతే నాకంటే వేరుగా ఉండక నన్నే సేవిస్తుంటారో ఎల్లప్పుడూ ప్రయత్నశీలురై ఉంటారో వారి యోగక్షేమాల్ని నేనే వహిస్తాను అని అర్థం. ఈ సందర్భంలో యోగక్షేమాలంటే లౌకిక యోగక్షేమాలు కాదు. యోగం అంటే నిరంతర బ్రహ్మనిష్ఠ, క్షేమం దానిని రక్షించడం అని అర్థం చెప్పారు. వీరు జ్ఞానాన్ని కోరేవారు. ఇలాగ భక్తి రెండు రకాలు –

**సకామభక్తి –** స్వర్గం కావాలని కోరిక.

**నిష్కామభక్తి –** మోక్షం కావాలనే చింతనతో భక్తి.

**ఇతదేవతలు**

అన్ని స్వరూపాలు శుద్ధచైతన్యంలోనివే అన్నప్పుడు మిగతా దేవతలసంగతి ఏమిటి? అని శ్లో. 23 చెబుతుంది. "ఇతర దేవతలను – అనగా ఏయే రూపాల్లోనైనా భక్తిగా భజిస్తే వాళ్లు నన్ను సేవిస్తున్నట్లే. కాగా వారు అవిధిపూర్వకంగా అనగా జ్ఞానమార్గంలో

కాకుండా ఇతర మార్గాల్లో భజిస్తున్నారు” (శ్లో. 23). పై శ్లోకంలో మళ్లీ ఇష్టదేవతారాధన చెప్పబడింది. భారతీయచింతనలో విశాలదృక్పథం ఉండడానికీ, విభిన్న దేవతల్ని విభిన్న సందర్భాల్లో విభిన్న ప్రాంతాల్లో పూజించడానికీ, అయినా ఇవన్నీ భారతీయ సిద్ధాంతంలో భాగం కావడానికీ ఇలాంటి గీతావాక్యాలు, వీటికి మూలమైన ఉపనిషద్వాక్యాలు కారణం.

కోరికనుబట్టి ఫలం. దేవతలను పూజించేవారు దేవత్వాన్ని పొందుతారు. పితరుల్ని పూజించేవారు పితరుల్ని, ఇతర భూతాల్ని (పృథ్వీ మొదలగు భూతాలు) పూజించేవారు ఆ భూతాల్ని పొందుతారు. నన్ను (బ్రహ్మతత్త్వాన్ని) కోరేవారు నన్నే పొందుతారు (శ్లో. 25).

**సన్మార్గంలో ఉన్న సాధారణభక్తుల సంగతేమిటి?**

ఈ విషయం తర్వాతి శ్లోకాల్లో చెప్పబడింది.

- భక్తి ప్రధానం. భక్తిపూర్వకంగా పత్రంకానీ, పుష్పంకానీ, ఫలంకానీ, నీరుకానీ సమర్పించినా భగవానుడు దానిని స్వీకరిస్తాడు (శ్లో. 26).
- ఈశ్వరార్పణబుద్ధి (శ్లో. 27,28). నీవు ఏది చేసినా, ఏది తిన్నా, ఏది హోమం చేసినా, ఏది దానం చేసినా అది నాకు సమర్పించు (శ్లో. 27). అలా చేసినపుడు ఆ అభ్యాసంవల్ల నీవు క్రమంగా కర్మల్ని వదలినవాడవవుతావు. ఆవిధంగా కర్మఫలం నుండి తప్పించుకోగలవు (శ్లో. 28).
- భగవంతునికి రాగద్వేషాలు లేవు. శీతకాలంలో సూర్యుడి ఎండలో నిల్చొన్నవాడికే సుఖంగా ఉంటుంది. నిల్చోనివాడికి ఉండదు. అట్లాగే సూర్యకిరణాల్లాగా భగవానుడు అందరిపట్లా ఒక్కటే. మనకు లభించే ఫలంలో వైషమ్యం, మన ప్రయత్నాన్నిబట్టి ఉంటుంది. ఇలాగే కర్మబంధము, విముక్తి మన ప్రయత్నంపై ఆధారపడి ఉంటాయి. ఎవరు భగవంతుణ్ణి భజిస్తారో వారి ప్రయత్నం సిద్ధిస్తుంది (శ్లో. 29).
- భక్తిలో ఆచారనియమాల ప్రాధాన్యంలేదు. భక్తిలేకుండా ఎంతో శిష్టాచారం, తు.చ తప్పకుండా పూజచేసినా ఫలం తక్కువే. అదే పూజ శిష్టాచారం కాకపోయినా, ఏ వర్ణం వాడైనా, జాతివల్ల, వర్ణంవల్ల, క్రియలో విధానంవల్ల, స్వభావంవల్ల ఏవైనా లోపాలున్నా అవన్నీ భక్తిచేత పవిత్రాలవుతాయి అని శంకరానందులు ఇక్కడ వ్యాఖ్యానించారు. దుష్టస్వభావం కలవాడైనా అని

మరో అర్థాన్ని కూడా చెప్పారు పండితులు. భాగవతంలో అజామిళుడు అనేక దుర్మార్గాలు చేసినా అకస్మాత్తుగా నారాయణ స్మరణ చేయడంవల్ల రావడంవల్ల అతనికి విష్ణుకృప కలుగుతుంది.

**కర్మభూమి**

ఈ సందర్భంలో నీలకంఠ పండితులు ఒకమాట వ్రాశారు. ఈ భక్తి ఇక్కడే చేయాలి. అనగా మనుష్యలోకంలోనే చేయాలి. ఇతర లోకాల్లో కర్మకు అవకాశంలేదు అన్నారు.

మనుష్యలోకాన్నే కర్మభూమి అంటారు. అనగా మంచిపనులుగానీ, చెడుపనులుగానీ చేయడానికి అవకాశమున్న ఒకే ఒక స్థానం. (భారతదేశం కర్మభూమి అని తెలియనివారు వ్యవహరిస్తుంటారు. మనుష్యలోకమంతా కర్మభూమే). మిగతాలోకాలు అనగా భువర్లోక, సువర్లోక, సత్యలోకంలాంటి ఊర్ధ్వలోకాలుగానీ, అతల, వితల, పాతాళలోకాల్లాంటి అధోలోకాలుగానీ కేవలం కర్మఫలాన్ని అనుభవించడానికే ఏర్పడిన స్థానాలు. అవి కర్మభూములు కావు, భోగభూములు. పుణ్యంయొక్క గానీ, పాపంయొక్క గానీ భోగం (భుజించడం) కోసం ఉన్న స్థానాలు. కావున ఇక్కడే భజించు అనే ఉద్దేశంతో కృష్ణుడు "ఈ అనిత్యమైన లోకాలను పొందిన నీవు నన్ను సేవించు" (శ్లో. 33) అంటాడు.

"నాపైనే మనస్సు నిలిపివుండు, నన్నే యజ్ఞంచేయి, నన్నే పరమమైన మార్గంగా ఎంచుకొని, నన్నే పొందగలవు" (శ్లో. 34).

ఈ సందేశంతో ఈ అధ్యాయం ముగుస్తుంది.

❖ ❖ ❖

## పదవ అధ్యాయము

# విభూతియోగము

విభూతి అనగా వివిధరూపాల్లో ఉండడం. 'వి' అనే ఉపసర్గకు వివిధమైన అని అర్థం. 'భూ' ధాతువుకు ఉండడం అని అర్థం. పరమాత్మతత్త్వం అనేకరూపాల్లో కనపడడం ఇందులో చూస్తాం. పరమాత్మతత్త్వం నేరుగా ఇంద్రియాలకు తెలియదు. కానీ దాని ప్రభావం తెలుస్తూంటుంది. ఇదివరకు ఏడవ అధ్యాయంల్లో **'రసోహమప్సు కౌన్తేయ'** (7-8) మొదలగు శ్లోకాల్లో నీటిలో ఉన్న శక్తిని నేనే, పృథివిలో గంధం నేనే, జగత్తులోని ప్రతివస్తువు తత్త్వం నేనే. అన్ని భూతాల్లో ధర్మానికి అవిరుద్ధమైన కామము నేనే అంటూ చెప్పాడు. అలాగే 9వ అధ్యాయంలో శ్లో. 10 నుండి 19 వరకు **అహం క్రతు రహం యజ్ఞః** అంటూ నేనే క్రతువు, నేనే యజ్ఞము, సత్, అసత్తు నేనే అంటూ తను ఎలా ప్రకటమవుతున్నాడు అని చెప్పాడు. ఆ తత్త్వమే మరింత విస్తారంగా ఈ అధ్యాయంలో చెప్పబడింది. విభూతి అనగా భగవంతుని విస్తారం. దీన్ని చెప్పినందువల్ల ఈ అధ్యాయం విభూతియోగం.

ఈ అధ్యాయానికీ, 11వ అధ్యాయానికీ ఒక ప్రత్యేక సంబంధం ఉంది. ఈ రెండూ రెండు దృష్టికోణాలు. భగవంతుణ్ణి విశ్వంలో దర్శించడం 10వ అధ్యాయంలో అయితే భగవంతుడిలో విశ్వాన్ని దర్శించడం 11వ అధ్యాయంలో విషయం. ఆనందగిరి అనే ఆచార్యులు ఈ రెంటిని గురించి వ్రాస్తూ, 11వ అధ్యాయంలో 'తత్' (బ్రహ్మ) యొక్క **లక్ష్యార్థం** చెప్పబడింది, 11లో 'తత్' యొక్క **వాచ్యార్థం** చెప్పబడింది అన్నారు. ఈ పదాలు వేదాంతశాస్త్రంలో తరచుగా కనిపిస్తాయి. వీటి అర్థం తెలుసుకుందాం.

వాచ్యార్థం అంటే ఒక వాక్యంలోని శబ్దాలకు ఉన్నది ఉన్నట్లుగా అర్థాన్ని గ్రహించడం (literal meaning). అలా అర్థం గ్రహించడం కొన్ని సందర్భాల్లో పొసగదు. అలాంటప్పుడు వాక్యం మొత్తానికి దీని ఉద్దేశం ఏమిటి? అని తర్కించి మరో అర్థం గ్రహించాలి. దీని లక్ష్యార్థం (intended meaning, implied meaning) అంటారు. ఉదాహరణకు 'నదిలో పల్లె' అన్నప్పుడు నదిలో పల్లె ఉండడానికి వీల్లేదు కాబట్టి నది ఒడ్డున, నదిని ఆనుకొనివున్న పల్లె అని మనం గ్రహించినట్లే ఉపనిషత్తుల్లో అక్కడక్కడ చెప్పిన వాక్యాలకు సందర్భాన్నిబట్టి లక్ష్యార్థం తీసుకుంటారు. ఉదాహరణకు **'తత్త్వమసి'** (అదే నీవు) అని ఛాందోగ్యోపనిషత్తులో తొమ్మిదిమార్లు చెప్పినప్పుడు సర్వశక్తిమంతం, సర్వజ్ఞం, సర్వవ్యాపిని అయిన బ్రహ్మ ఒకవైపు, అల్పశక్తిమంతుడు, దేశకాలాలచేత పరిచ్ఛేదం (పరిమితి)

చేయబడినవాడు, అల్పజ్ఞుడు అయిన నేనొకవైపు. అది నేను ఎలా అవుతాను? మరి ఉపనిషత్తు తొమ్మిదిసార్లు చెప్పింది. ఇలాంటి మాటలే మిగతా ఉపనిషత్తుల్లోనూ. వీటికర్థం ఎలాగంటే సర్వజ్ఞత్వం, అల్పజ్ఞత్వం మొదలైనవాటిని ప్రక్కనబెట్టి పరమాత్మ చైతన్యం, జీవునిలో ఉన్న చైతన్యం అనే రెంటినే తీసుకొని ఈ విషయంలో రెండూ ఒకటే అని చెప్పవచ్చు. ఇదే వేదాంతం చెబుతుంది. అంతేగానీ అహంకారంతో 'నేనే బ్రహ్మ' అని చెప్పినమాట కాదు. ఎలాంటి రాగద్వేషాలు, ఆసక్తి లేనట్టి బ్రహ్మతత్త్వంగా తన్నుతాను మార్చుకోవాలని, తన వ్యక్తిగత అహంకారాన్ని తుడిచిపెట్టుకోవాలని సాధకుడు అభ్యాసం చేస్తాడు.

ఇక్కడ 'తత్' పద లక్ష్యార్థం అంటే అఖండచైతన్యం. మన కళ్లెదుట ఎన్ని రంగుల్లో, ఎన్ని రూపాల్లో కనిపిస్తుందో చూడడం. మట్టిలో ఎన్నెన్నో పాత్రల్ని, బంగారంలో ఎన్నెన్నో నగలని చూడగలగడం. దీనికి భిన్నంగా 11వ అధ్యాయంలో 'తత్' పద వాచ్యార్థమంటే సర్వశక్తిమంతం, సర్వజ్ఞం అయిన చైతన్యంలో ఈ విశ్వం ఎలా పుట్టుతూ, గిట్టుతూ ఉంటుందో చూడగలగడం. పాత్రలన్నీ కరిగి మట్టిలో కలవడం. ఆభరణాలన్నీ బంగారురూపంలో నిలచిపోవడం. ఉదాహరణ ఈ రెండు దృష్టికోణాలు మనిషికి విషయంపై పూర్తి అవగాహనను కల్పిస్తాయి. తన మహత్త్వము (గొప్పదనం) అల్పత్వం రెండూ అనుభవంలోకి వస్తాయి.

పదవ అధ్యాయంలో 42 శ్లోకాలు. అర్జునుడి ప్రశ్నలున్న 7 శ్లోకాలు (12 నుండి 16) మినహాయిస్తే మిగతావన్నీ శ్రీకృష్ణుని మాటలే. భగవంతుని విభూతి ఎన్నెన్ని రూపాల్లో కనిపిస్తుంది అని. ఇది భగవంతుని రూపాల యొక్క పూర్తి పట్టికకాదు. ఉదాహరణప్రాయంగా మచ్చుకు చూపించిన కొన్ని నామరూపాలు మాత్రమే. మనందరిలో పరమాత్మ అభివ్యక్తి ఉంది. కొందరిలో కొంత ఎక్కువ అభివ్యక్తి ఉంటుంది. అందుకే వారు గొప్ప కార్యాలు చేయగలుగుతారు. మహాత్ములందరూ భగవంతుని ఉత్తమ అభివ్యక్తి అని చెప్పుకోవచ్చు. అలాంటి ఉదాహరణలు ఈ అధ్యాయంలో ఇవ్వబడ్డాయి.

మొదటి 11 శ్లోకాల్లో శ్రీకృష్ణుడు తన తత్త్వాన్ని (బ్రహ్మతత్త్వాన్ని) చెప్పడం ప్రారంభిస్తాడు. ఇక్కడ 'నేను' అని శ్రీకృష్ణుడు అన్నపుడు కొన్నిచోట్ల పరబ్రహ్మ, కొన్నిచోట్ల మాయాశక్తితో కూడిన సృష్టికర్త అని గ్రహించాలి.

అన్నిరకాలైన మనోభావాలు భగవంతునివే. కానీ అందులో శ్రేష్ఠమైన వాటియందే మనిషి ప్రవర్తించాలి. హింస, మూర్ఖత్వం, అసత్యం మొదలైనవి భగవంతుని నుండి

వచ్చినవే కదా అని వాటిలో ప్రవర్తించకూడదు. ఉత్తమమైనవాటిలో భగవద్బుద్ధి నిలుపుకొని వాటిని అనుసరించాలి అనే భావనతో బుద్ధి, జ్ఞానం, వివేకం, క్షమ (ఓర్పు), సత్యం, అహింస, సమత, తుష్టి (సంతోషం), తపస్సు, దానం ఇత్యాదులన్నీ (శ్లో. 4,5) భగవంతుని రూపాలుగా చూపించారు.

అలాగే సప్తఋషులు, మనువులు, వీరందరూ **మద్భావా మానసా జాతాః** (శ్లో. 6) – అనగా నాయొక్క హిరణ్యగర్భతత్త్వం గురించి జన్మించారు. వారినుండి సృష్టి అని అర్థం. "ఈవిధంగా విస్తారాన్ని, ఆ విస్తారంలో యోగం (ఏకత్వం) ఎవరు చూస్తారో అతనిది నిశ్చలమైన యోగం అనవచ్చు" (శ్లో. 7). "సర్వజగత్తుకూ ప్రత్యగాత్మ (అన్నిప్రాణుల్లో ఉన్న ఆత్మతత్త్వం, చైతన్యతత్త్వం) నేనే అని పండితులు గ్రహిస్తారు" (శ్లో. 8). అలా ఉపాసన చేయాలి అని అర్థం.

అలా ఉపాసించేవారికి ఏం లభిస్తుంది?

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే ॥ 10**

"ఎల్లప్పుడూ ఆసక్తితో, శ్రద్ధతో, ప్రేమతో నన్ను భజించేవారికి నేను బుద్ధిని కలుగజేస్తాను. ఆ బుద్ధి సహాయంతో వారు నన్ను చేరగలరు" అని అర్థం. భక్తివల్ల మొదట లభించేది బుద్ధి. అనగా ఏది ఆత్మ, ఏది అనాత్మ, ఏది నిత్యం, ఏది అనిత్యం అని విడమరచి చూసే బుద్ధి. ఆ బుద్ధిని మనం వాడుకొని ఆత్మతత్త్వాన్ని పొందాలి.

"బుద్ధినివ్వడమే కాకుండా వారిపై దయతో వారి అంతఃకరణంలోనే ఉంటూ అజ్ఞానమనే చీకటిని జ్ఞానదీపంతో పారద్రోలుతాడు భగవంతుడు (శ్లో. 11). ఇంద్రియ విషయాలపై ఆసక్తి తొలగాలన్నా, వివేకబుద్ధి రావాలన్నా భగవదనుగ్రహం ఉండాలి అని అర్థం.

ఈ తర్వాత అర్జునుడి ప్రశ్నలు. మొదటిసారిగా **పరంబ్రహ్మ, పరంధామ** అని నీవే పరబ్రహ్మవు అంటున్నాడు శ్రీకృష్ణుణ్ణి. "నీ తత్త్వాన్ని గురించి ఎన్నెన్నో విషయాలను ఋషులనుండి, నారదుడు, వ్యాసుడు మొదలైనవారినుండి విన్నాను. నీ తత్త్వాన్ని దేవతలు, దానవులు, తెలుసుకొనలేరు. ఏయే విభూతులతో నీవు ఈ లోకాన్ని వ్యాపించివున్నావో వాటిని నాకు వినిపించు. నిన్ను ఏయేవిధాలుగా భావన చేయవచ్చు, ఉపాసించవచ్చు. నీ యోగాన్ని (ప్రపంచరూపంలో కనిపించే నీ తత్త్వాన్ని) నీ విభూతిని (ఎక్కడ విశేషంగా కనిపిస్తున్నావో వాటిని) వివరంగా చెప్పు" (శ్లో. 12 నుండి 18).

ఈ విభూతులన్నీ ధ్యానానికి ఆలంబనగా ఉపకరిస్తాయి. ధ్యానానికి, లేదా ఉపాసనకు ప్రారంభదశలో ఒక ఆలంబన, ఒక ఊతం లేదా పట్టుగొమ్మ ఉండాలంటారు సాధకులు. ఆలంబనం లేకుండా సాక్షాత్తుగా వేదాంతవాక్యాల చింతన ఏ కొద్దిమంది పూర్వజన్మ సుకృతమున్నవారికో కలుగుతుంది అని పైన శ్రీకృష్ణుడి మాటలు చూశాం. మిగతావాళ్లు ఏదో ఒక మంత్రాన్నో, విగ్రహరూపాన్నో, ప్రకృతిలోని ఒకానొక విభూతినో ఊతంగా తీసుకొని దానిద్వారా మనసును ఏకాగ్రంగా నిలపగలరు. (అందుకే **మననాత్ త్రాయతే ఇతి మంత్రం** – దేని అర్థాన్ని మననం చేయడంవల్ల అది మనల్ని రక్షిస్తుందో అది మంత్రం అని అర్థం). అలాగే విగ్రహం. **విశేషేణ గృహ్యతే ఆత్మతత్త్వమనేన ఇతి విగ్రహః** – అనగా ఆత్మతత్త్వాన్ని విశేషంగా గ్రహించడానికి ఒకానొక ఆలంబన. విగ్రహంలో చూపించిన లేదా వర్ణించిన సంకేతంపై (సింబల్) ధ్యానం చేయడం. మనస్సును నిగ్రహించడానికి ఉపయోగపడుతుంది. (విగ్రహంలో సంకేతానికి ఉదాహరణ – **మనోరూపేక్షు కోదండా పంచతన్మాత్ర సాయకా** – (లలితాసహస్రనామం) అంటే మనస్సనేదే కోరికలను తీర్చే చెరకువిల్లు. ఐదు ఇంద్రియాలే ఐదు బాణములు. ఈ రూపంలో లలితాదేవిని ధ్యానించడం. ఇలాగ చాలా దేవతారూపాల్లో సంకేతం కనిపిస్తూ ఉంటుంది. ఆ సంకేతార్థంపై ధ్యానం చెయ్యాలి).

అందుకనే శ్రీకృష్ణుడు **దివ్యాహ్యాత్మ విభూతయః** అంటూ దైవీప్రకృతి ఉన్న విభూతుల్ని మాత్రమే చెప్పాడు. ప్రధానంగా కొన్ని మాత్రమే చెపుతాను. నా విస్తారానికి అంతంలేదు అన్నాడు (శ్లో. 19). మొదలుగా తెలుసుకోవాల్సిందేమంటే –

> **అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।**
> **అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ ॥ 20**

ఓ గుడాకేశా! (గుడాకా = నిద్ర, దాన్ని జయించినవాడా! అజ్ఞానమనే నిద్రను జయించినవాడా! అని అర్థం). నేను అన్నిప్రాణుల్లో ఉన్న ఆత్మను. (చైతన్యరూపాన్ని) సర్వభూతాశయ స్థితః అన్నిప్రాణుల హృదయాల్లో ఉన్న తత్త్వాన్ని, అన్ని జలాలకు సముద్రంలాగా ఏకీభావం చెందేస్థానం, అన్నింటిలో సమంగా ఉన్న తత్త్వం. ఆది, మధ్యం, అంతం (సృష్టి, స్థితి, లయం) లకు కారణం అని అర్థం. ఇక్కడ వ్యాఖ్యాతలు ఒక విషయం వ్రాశారు. ఈ ఆత్మతత్త్వాన్ని ధ్యానించడం ముఖ్యం. దీన్ని ధ్యానించడానికి శక్తిలేనివారు మరేదైనా (ముందు చెప్పబోయే) విభూతి విశేషాన్ని ధ్యానించవచ్చు అని వివరించారు.

21వ శ్లోకం నుండి 38వ శ్లోకం వరకూ 75 వివిధ రూపాలు, భావాలు చెప్పబడ్డాయి. ఇవన్నీ విభూతులే. కొన్ని దేవతారూపాలు, కొన్ని గంధర్వులు మొదలైనవి. కొన్ని ప్రకృతిలో ఉన్న సూర్యుడు, నక్షత్రాలు మొదలైనవి. కొన్ని మనుషులు, ఋషుల్లో ఉన్న రూపాలు, కొన్ని సముద్రాలు, పర్వతాలు, వృక్షాలు మొదలైనవి. కొన్ని దండనీతి, వాదం మొదలైన భావాలు.

**మచ్చుకు కొన్ని -**

| | |
|---|---|
| ఆదిత్యుల్లో విష్ణువు | జ్యోతులలో సూర్యుడు |
| వేదాల్లో సామవేదం | దేవతల్లో ఇంద్రుడు |
| ఇంద్రియాల్లో మనస్సు | రుద్రుల్లో శంకరుడు |
| యక్షులలో కుబేరుడు | శిఖరాల్లో మేరు |
| సరస్సులలో సముద్రం | శబ్దాల్లో ఓంకారం |
| యజ్ఞాల్లో జపయజ్ఞం | స్థావరాల్లో హిమాలయం |
| వృక్షాల్లో రావిచెట్టు | గుఱ్ఱాల్లో ఉచ్చైశ్రవసం |
| ఏనుగుల్లో ఐరావతం | ఆయుధాల్లో వజ్రాయుధం |
| పాముల్లో అనంతుడు | రాక్షసుల్లో ప్రహ్లాదుడు |
| విలుకాళ్లలో రాముడు | చేపల్లో మొసలి |
| నదుల్లో గంగ | విద్యల్లో అధ్యాత్మవిద్య |
| అన్నింటినీ హరించే మృత్యువు | స్త్రీలలో కీర్తి, వాక్కు |
| ఛందస్సుల్లో గాయత్రి | ఋతువులలో వసంతం |
| వృష్ణికులంలో వాసుదేవుడు | పాండవుల్లో అర్జునుడు |
| మునుల్లో వ్యాసుడు | అణచివేసేవాటిలో దండనీతి |

వేదాంత అధ్యాపకులు ఈ విభూతులకు సంబంధించిన పురాణకథల్ని అన్వయించి చెబుతారు. ఉదాహరణకు ఆయుధాల్లో వజ్రం అన్నప్పుడు వజ్రాయుధం దధీచి అనే ఋషి వెన్నెముక. వెన్నెముక సుషుమ్నానాడికీ యోగానికీ చిహ్నం. కుండలినీ ప్రబోధమే వజ్రాయుధం. దాంతో వృత్రుడు (వృత్ర అంటే ఆవరించి ఉండేది అని అర్థం) అనే అజ్ఞానాన్ని నశింపచేయడం. అలాగే కామధేనువు అంటే మన వాక్కే కామధేనువు.

**ధేనుం వాచ ముపాసీత** అనగా వాక్కును కామధేనువుగా ఉపాసించు అని అర్థం. సంప్రదాయంలో ఉన్న గురువులనుండి ఇలాగే విభూతులన్నింటికీ విశేషార్థాలను గ్రహించాలి. "స్థావరజంగమాల్లో ఏవేవి దైవీశక్తిమంతములై ఉన్నాయో అవన్నీ నా విభూతులే". ఇదొక ప్రసిద్ధ శ్లోకం.

**యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్ ॥ 41**

వాటినన్నింటినీ పరబ్రహ్మరూపాలుగానే భావించి ఉపాసించాలి. ఏదేది ఐశ్వర్యయుక్తమైనది, శక్తిమంతమైనది, ఉత్సాహవంతమైనది కలదో అదంతా భగవద్విభూతిగానే భావించాలి అని అర్థం. జగత్తంతా భగవంతునిలో అంశ మాత్రమే (శ్లో. 42).

భారతీయ సంస్కృతిలో వృక్షాలను, నదులను, కొండలను, జంతువులను భగవంతుని స్వరూపంగా చూడడానికి ఇదే కారణం. సర్వత్ర బ్రహ్మదృష్టి కలిగివుండడం. ఉదాహరణకు గృహం నిర్మించడానికి నేలను తవ్వేటప్పుడు **మృత్తికే హన మే పాపం** అని భూమిని క్షమాపణ కోరడం. నదిలో స్నానం చేస్తే నదిని కలుషితం చేస్తున్నాను క్షమించమని కోరడం **(యన్మయా దూషితం తోయం శారీరమలసంయుతం)**, ఉదయాన్నే లేచినవెంటనే నేలపై కాలు పెట్టేటప్పుడు **పాదస్పర్శం క్షమస్వ మే** అని కోరడం లాంటివి, ఇతరులకు మూఢనమ్మకాలుగా కనపడవచ్చు. కానీ ఇదొక తాత్త్వికభూమికపై ఆధారపడి వచ్చిన భావన అని గమనించాలి.

ఈవిధంగా నామరూపాలుగా ఉన్న విశ్వాన్ని చైతన్యరూపంగా చూడడం ఈ అధ్యాయంలోని విషయం.

❖ ❖ ❖

## పదకొండవ అధ్యాయము

# విశ్వరూపదర్శన యోగము

పదవ అధ్యాయమంతా విశ్వంలో (అనగా అనేక విభూతుల్లో) భగవంతుణ్ణి చూడడం అనే అభ్యాసం. 'తత్' (బ్రహ్మ) పదంయొక్క లక్ష్యార్థమైన (intended meaning) అఖండచైతన్యం అక్కడ చెప్పబడింది. ఈ అధ్యాయంలో విశ్వాన్ని భగవంతునిలో చూడడం విషయం. సర్వశక్తిమంతం, సర్వజ్ఞం, సర్వవ్యాపి, సృష్టి, స్థితి లయాలకు కారణమైన తత్త్వంను చూడడం. ఇందులో ప్రపంచాలు లయం కావడం, మహావీరులైన భీష్మద్రోణాదులు కాలపురుషుడి కోరల్లో నశించడం మొదలగునవి చూడగలం. విశ్వాన్నంతటినీ భగవంతునిలో చూస్తున్నాం గనుక ఈ అధ్యాయం పేరు 'విశ్వరూపదర్శన యోగం'.

ఈ అధ్యాయంలో 55 శ్లోకాలున్నాయి. మొదటగా కృష్ణుడిని తన స్వరూపాన్ని చూపాల్సిందిగా అర్జునుడి ప్రార్థన (శ్లో. 1 నుండి 4). శ్రీకృష్ణుడు దానికి అంగీకరించడం, 5 నుండి 9 శ్లోకాల్లో. సంజయుడు కూడా ఆ విశ్వరూపాన్ని చూసి ధృతరాష్ట్రుడికి వర్ణించడం 9 నుండి 14 శ్లోకాల్లో. అర్జునుడు విశ్వరూపాన్ని దర్శిస్తూ, దాన్ని ప్రశంసించిన విధానం 15 నుండి 31 శ్లోకాల్లో. తాను ప్రదర్శించినది కాలరూపంలో ఉన్న ఒకానొక దివ్యరూపమని శ్రీకృష్ణుడు చెప్పడం 32 నుండి 34 శ్లోకాల్లో. అర్జునుడు మరలా విశ్వరూపాన్ని ప్రశంసిస్తూ భయంకరమైన రూపాన్ని ఉపసంహరించమని కోరడం 36 నుండి 46 శ్లోకాల్లో. చివరి శ్లోకాలు విశ్వరూపదర్శనంలోని గొప్పతనాన్ని చెబుతాయి.

శుద్ధపరబ్రహ్మకు రూపం, నామం లేదు అని వేదాంతసిద్ధాంతం. మరి శ్రీకృష్ణుడు చూపుతున్న రూపమేమిటి? బ్రహ్మకే సంబంధించిన మాయాశక్తిలో ఏర్పడే రూపమే విశ్వరూపం. ఇదొక మాయామయ రూపం. ఈ రూపాన్నిబట్టి ఊహించేదే పరబ్రహ్మతత్త్వం. ఈ మాయమయ రూపంలోనే సర్వజ్ఞత్వం, సర్వశక్తిమత్వం మొదలైన గుణాలన్నీ ఉంటాయి. కావున ఇదొక సగుణరూపం. వేదాంతులు దీనిని ఉపాధితో కూడిన రూపం (మాయ అనే ఉపాధితో కూడినరూపం) అంటారు. మనం ఆరాధించే అన్ని దేవతారూపాలు ఇందులోనివే. యక్షులు, గంధర్వులు మొదలగు శక్తులన్నీ ఇందులో భాగమే. ఇదే ఈ అధ్యాయంలో చూపబడుతుంది.

**దివ్యదృష్టి**

దివ్యదృష్టి అంటే ఏమిటి? దివ్యం అంటే దైవీభావన కలది. సంస్కృతంలో 'దివ్' అనే ధాతువుకు ప్రకాశనాత్మకం అనే అర్థం ఉంది. అనగా వస్తువును ప్రకాశింపచేసేది. మామూలు దృష్టి దైవీతత్త్వాన్ని చూడలేదు. దైవీదృష్టి మాత్రమే దైవీతత్త్వాన్ని చూడగలదు.

భగవద్గీత ప్రారంభం నుండి చెబుతున్నది సాధకుని దృష్టికోణంలో మార్పు తేవడమే. ప్రపంచాన్ని భగవంతుని రూపంగా చూడడం ఒక దృష్టికోణం. దీనినిబట్టి భగవత్స్వరూపాన్ని ఊహించుకోవడం. మరొక దృష్టికోణంలో చూస్తే భగవంతునిలో (కాలప్రవాహంలో) ప్రపంచం పుట్టడం, గిట్టడం అనేది కన్పిస్తుంది. చూడడం అంటే మనం కళ్లతో ఒక దృశ్యాన్ని చూసినట్లు కాదు, బుద్ధితో గ్రహించడం, అవగాహన చేసుకోవడం అని గ్రహించాలి.

ఇదే భావాన్ని నీలకంఠ ఆచార్యులు వ్రాస్తూ ఛాందోగ్యోపనిషత్తులోని ఒక వాక్యాన్ని ఉటంకించారు – **"మనోఽ స్య దైవం చక్షుః"** (ఛాందో. 8-12-5) మనస్సే దివ్యచక్షువు. దీనివల్లనే తత్త్వాన్ని చూడగలడు. ఇంద్రియాలు వర్తమానకాలంలోనే పనిచేస్తాయి. మనస్సు మూడుకాలాల్లోనూ విహరిస్తూ వుంటుంది. అవిద్య (అజ్ఞానం)వల్ల కలిగిన దేహాత్మభావం (దేహమే తన ఆత్మ అనే భావం) తొలగిపోయి సర్వాత్మభావంలోకి వచ్చిన సాధకుడు సూర్యకాంతితో సమానమైన దృష్టిచేత అన్నింటినీ చూడగలడు అని ఈ సందర్భంలో శ్రీశంకరులు వ్రాశారు. పై ఉపనిషత్తు వాక్యంలోనే **"య ఏతమాత్మాన ముపాసతే"** – అనగా ఎవరైతే ఈ సాధన చేస్తారో వారందరూ ఈవిధంగా చూడగలరు అన్నారు. శంకరులు దీన్ని స్పష్టపరుస్తూ – ఆనాటి ఋషులకు, దేవతలకే కాదు, అల్పజీవులైన ఈనాటి సాధకులందరూ ఈవిధంగా చూడగలరు అంటారు. ఈ విషయాన్ని ఈ విశ్వరూపసందర్భానికి అన్వయిస్తే కేవలం అర్జునుడే కాదు, సాధన చేస్తే మనం కూడా అర్జునుడు చూసినట్లు జగత్తును విరాట్పురుషుడిలో చూడగలం అని అర్థం. ప్రపంచాన్ని చూసే దృష్టి ప్రాకృతదృష్టి. భగవంతుణ్ణి చూసేది దివ్యదృష్టి.

మరోవిధంగా చూడాలంటే శ్రీకృష్ణుడు అర్జునుడికి తాత్కాలికంగా యోగులకు, ఋషులకు మాత్రమే సాధ్యమయ్యే దృష్టిని ఇస్తున్నాడని భావించవచ్చు. అర్జునుడిని తాత్కాలికంగా దేశం, కాలం, అనే పరిచ్ఛేదాలనుండి బయటికి తీసుకెళ్ళి అతనికి భూత, భవిష్యద్వర్తమానాల్లో అన్నింటినీ కబళించే కాలతత్త్వాన్ని ఒకేసారి కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

మొదటి నాలుగు శ్లోకాల్లో అర్జునుడు ఇదివరకు విన్నదాన్ని పునశ్చరణ చేసుకొని నా మోహం తొలగిపోయింది అని పరమేశ్వర! పురుషోత్తమ! అని సంబోధిస్తూ నీ మహిమాన్వితమైన రూపాన్ని చూడాలనుకుంటున్నాను అని ప్రార్థిస్తున్నాడు. **ఐశ్వరం రూపం** అనే పదానికి శ్రీశంకరులు జ్ఞానం, ఐశ్వర్యం, శక్తి, బలం, వీర్యం, తేజస్సుతో కూడిన అన్నింటినీ శాసించే రూపం అని వ్యాఖ్యానించారు. నిర్గుణబ్రహ్మకు రూపంలేదు. ఇక్కడ రూపం చెప్పబడింది అంటే అది ఉపాధితో కూడిన రూపం.

శ్రీకృష్ణుడు తన వేలాదిరూపాల్ని అన్నివిధాల దేవతాస్వరూపాలను మొత్తం చూపిస్తానంటాడు (శ్లో. 5, 6).

**ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।**
**మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి ॥ 7**

చరాచరమైన ప్రపంచాన్నంతా ఒకేచోట నా దేహంలో చూడు. ఇంకా ఏమేం చూడాలనుకుంటున్నావో అదంతా చూడు అని తాత్పర్యం.

విరాట్‌స్వరూపం – **'వివిధం రాజతి ఇతి విరాట్'** వివిధ రూపాల్లో ప్రకాశించేది. అనగా ప్రపంచంలో ఉన్న అన్ని నామరూపాలు అందులోవే. అందుకే పురుషసూక్తంలో **సహస్రశీర్షా పురుషః** అంటూ ప్రపంచంలో ఉన్న ప్రాణులన్నీ ఆ విరాట్పురుషుడే అని వర్ణిస్తాం. అదేమాట ఇక్కడ **అనేక వక్త్రనయనం** (శ్లో. 10) అనేకములైన తలలు, కళ్ళు కలది అని వర్ణించారు. **విశ్వతోముఖం** (శ్లో. 12) ప్రపంచంలోని ప్రాణులు అన్ని కళ్ళతో చూసే రూపం అలాగే అన్ని నోళ్ళతో స్వీకరించే ఆహారం, అన్ని చెవులతో వినే శబ్దం, అన్ని ఇంద్రియాలనుండి గ్రహించే తత్త్వం విశ్వతోముఖం. సర్వభూతాలకు ఆత్మ అయినటువంటిది అన్నారు వ్యాఖ్యాతలు.

ఆ దేవదేవుని (దేవతలకే దేవుడు – అన్ని దేవతారూపాలు తనలో కలిగినవాడు) శరీరంలో ప్రపంచమంతా అనేకవిధాలుగా విభజించి చూపినట్లుగా కనబడింది అర్జునుడికి (శ్లో. 13). విస్మయంతో ఆ రూపాన్ని వర్ణించడం ప్రారంభించాడు. ఆ రూపం విశేషాలు ఇలా ఉన్నాయి –

- త్రిమూర్తులు అందులో భాగంగా కనిపిస్తున్నారు (శ్లో. 15).
- యక్షగంధర్వాది దేవతాగణాలు అన్నీ ఇందులో ఉన్నాయి (శ్లో. 15)
- ఇది ఆది, అంతము లేని రూపం (శ్లో. 16).
- అన్ని జీవులూ ఇందులో కన్పిస్తున్నాయి (శ్లో. 16).
- 'సమంతాత్' అనగా అన్నివైపులా కన్పిస్తున్న రూపమిది (శ్లో. 17).
- ఈ రూపాన్ని చూస్తే నీవే అక్షరబ్రహ్మ (నిర్గుణబ్రహ్మ) అని భావించాలి. ప్రపంచానికంతటికీ ఆధారం/గమ్యస్థానం నీవే (శ్లో. 18).
- ఇది ప్రపంచ ధర్మాలను, సృష్టి ధర్మాలను నియంత్రించే తత్త్వం (శ్లో. 18).
- ఈ రూపం 'వేదితవ్యం' – జ్ఞానంతో తెలుసుకోదగినది, ఇంద్రియాలతో తెలుసుకొనేది కాదు. ఉపాసనద్వారా తెలుసుకొనేది అని అర్థం (శ్లో. 18).

- సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు ఇందులో భాగంగా కన్పిస్తున్నాయి (శ్లో. 19 మరియు 20)
- దేవతలు, ఋషులు, ఈ రూపాన్ని స్తుతిస్తున్నారు (శ్లో. 21)
- వికృతమైన కోరలతో ఉన్న ముఖాలు ఇందులో కన్పిస్తున్నాయి (శ్లో. 25).
- ధృతరాష్ట్రపుత్రులు, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మొదలగువారందరూ పాండవుల పక్షంవారితో సహా ఈ భయానకమైన కోరల్లోకి త్వరత్వరగా ప్రవేశిస్తున్నారు. కొందరి దేహాలు ఆ కోరలమధ్య సగం చూర్ణమయ్యాయి (శ్లో. 27).
- నదీజలాలన్నీ సముద్రాన్ని చేరినట్లు ఈ నరలోక వీరులందరూ ఈ భయంకరమైన నోళ్లలోకి ప్రవేశిస్తున్నారు (శ్లో. 28).
- జ్వలిస్తున్న దీపంలోకి మిణుగురు పురుగులు దుమికి నశించినట్లున్నది వీరి స్థితి. వీరేకాదు లోకులందరూ ఇలా ప్రవేశిస్తున్నారు (శ్లో. 29).
- జగత్తంతా ఈవిధంగా లయమౌతూ ఉన్నది (శ్లో. 30).

**కాలస్వరూపం**

పై భయంకరమైన రూపాన్ని చూసి ఈ స్వరూపం ఏమిటి? అని ప్రశ్నించాడు అర్జునుడు. అందుకు శ్రీకృష్ణుడు –

**కాలోఽ స్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్తః ।**
**ఋతేఽ పి త్వాం న భవిష్యన్తి సర్వే యేఽ వస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥ 32**

లోకాన్ని క్షయింపచేయడానికి (నశింపచేయడానికి) ఉన్న శక్తిని నేను. నీవు లేకున్నా (యుద్ధం చేయకున్నా) ఈ యోధులందరూ జీవించివుండరు అని భావం. తర్వాతి శ్లోకంలో ఇదే చెబుతూ "అందువల్ల నీ క్షత్రియధర్మం ప్రకారం యుద్ధం కొనసాగించు. శత్రువులను జయించి రాజ్యం పాలించు. వీరందరూ నాచే ముందే చంపబడ్డారు. **నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ –** నీవు నిమిత్తమాత్రుడవై పనిచేయి (శ్లో. 33).

ఈ రెండు శ్లోకాల్లో చూపిన విశ్వరూపం కూడా విరాట్పురుషునిలో ఒక భాగమే అని అర్థమౌతుంది. ఇది కాలస్వరూపం (the wheel of time అని అంగ్లభాషలో అన్నట్లు). ఈ కాలచక్రం పరిధిలోకి అందరూ రావాల్సిందే. సృష్టి స్థితి లయం అనే మూడు అంశాల్లో లయం గూర్చియే ఇక్కడ ప్రధానంగా చెప్పారు. అందుకే **లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్తః** (శ్లో. 32) – అంటే ప్రస్తుతం యుద్ధభూమిలో ఈవిధంగా కన్పిస్తున్నాను అన్నాడు. ఆనందగిరి అనే ఆచార్యులు దీన్ని వివరిస్తూ కాలం అంటే

క్రియాశక్తితో కూడిన పరబ్రహ్మ అని వ్రాశారు. (ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి స్వరూపిణి అని లలితాస్తోత్రంలో లలితాదేవిని ఈ విశ్వరూపంలో చెప్పిన శక్తిగా పూజించడం తెలిసిందే). అధర్మాన్ని నశింపచేయడానికై ఏర్పడిన శక్తి విశేషం.

అర్జునుడు దీన్ని గమనించాడు. అధర్మనాశానికి వచ్చి శక్తి కాబట్టే జగత్తంతా నిన్ను చూసి సంతోషిస్తున్నది. రాక్షసులు భయంతో దిక్కులన్నిటా పరుగెత్తుతున్నారు. సిద్ధపురుషులు నిన్ను నమస్కరిస్తున్నారు (శ్లో. 31). అర్జునుడికి ఇది పరబ్రహ్మతత్త్వమే అని బోధపడింది. అందువల్లే

**త్వమాదిదేవః పురుషః పురాణ స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనన్తరూప ॥ 38**

దేవతలందరినీ నియంత్రించే రూపం నీదే. నీవే ఆదిదేవుడవు (హిరణ్యగర్భ తత్త్వానివి). సృష్టిస్థితిలయకారకుడివి. వేద్యం – తెలుసుకోదగిన పరబ్రహ్మవు కూడా నీవే. విశ్వమంతా నీచే వ్యాపింపబడినది అని భావం.

బ్రహ్మను అర్థం చేసుకోవడంలో రెండు స్థాయిలు గమనించాం. 1) ఉపాస్య బ్రహ్మ (ఉపాసించదగిన స్వరూపం – సగుణస్వరూపం); 2) జ్ఞేయ బ్రహ్మ (అనగా తెలుసుకోదగిన బ్రహ్మ – ఉపాస్యబ్రహ్మకన్నా పైనున్న తత్త్వం – వేదాంతవాక్యాల ద్వారా తెలుసుకోదగిన నామరూపాలు లేని నిర్గుణతత్త్వం. ఉపాస్యబ్రహ్మలోని ఒక అంశాన్ని చూస్తూ అర్జునుడు జ్ఞేయబ్రహ్మ ఇంకెంత ఉత్కృష్టమైనదో భావించగలుగుతున్నాడు. అందుకే నీవే అక్షరబ్రహ్మ. **సదసత్ పరం** అనగా సత్తుకు, అసత్తుకు అతీతంగా ఉన్న తత్త్వం, **వేద్యం బ్రహ్మ** ఇలాంటి మాటలతో స్తుతిస్తున్నాడు.

ఈ కాలస్వరూపం చూడడంవల్ల భీతితో గద్గదస్వరంతో కూడినవాడై దీన్ని ఉపసంహరించి నీ సాధారణ రూపంలోకి మళ్ళీ రమ్మని కృష్ణుణ్ణి ప్రార్థించాడు (శ్లో. 45 – 46).

భక్తుడైన అర్జునుడికి విశ్వరూపం చూపించాడు శ్రీకృష్ణుడు. కేవలం జిజ్ఞాసార్థం కాదు, ధర్మసంరక్షణార్థం కూడా. ఈ గ్రంథారంభంలో గమనించినట్లు ఇతనికి పూర్తిగా తత్త్వబోధ జరగాలి అప్పుడే ఇతనికి స్వధర్మం అవగతమవుతుంది. కాలప్రవాహంలో ధర్మసంస్థాపనకు పనికివచ్చే ఒక చిన్న పనిముట్టుగా తన్నుతాను తెలుసుకోగలుగుతాడు అని శ్రీకృష్ణుడి ఉద్దేశం. అందుకే జ్ఞానాన్ని ప్రశంసిస్తూ ఇలా అంటాడు.

**న వేదయజ్ఞాధ్యయనైర్న దానై ర్న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః ।**
**ఏవంరూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥ 48**

ఈ విశ్వరూపం చూడడంకూడా జ్ఞానంలో భాగమే. అనంతవిశ్వంలో తన స్థానాన్ని, తన ధర్మాన్ని చూడగలగడం. ఈ జ్ఞానం యజ్ఞాలవల్ల, దానాలవల్ల ఇతర క్రియలవల్ల లభించేదికాదు. ఇలాంటి రూపాన్ని దేవతలు కూడా చూడాలని కోరుకుంటారు (శ్లో. 52). కానీ కేవలం వేదాలు, యజ్ఞాలు, మొదలైన క్రియలవల్ల నన్ను చూడలేరు (శ్లో. 53).

మరెలాగ శక్యం అంటే –

**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 54**

అనన్యభక్తితో మాత్రమే నన్ను చూడగలవు, తెలుసుకోగలవు, నా రూపంతో అదే భావంతో ప్రవేశించగలవు అని శ్లోకార్థం. అనన్యభక్తి అనే పదం ఇదివరకే వచ్చింది. భగవంతునికంటే వేరైన తత్త్వం లేదు అనే స్థిరభావన అనన్యభక్తి. శ్రీకృష్ణుడు ఆత్మస్వరూపాన్ని (సగుణ, నిర్గుణ రూపాలను) గూర్చి ఏడవ అధ్యాయం నుండి చెబుతూనే ఉన్నాడు. ఈ బోధవల్ల అర్జునుడికి కొంతవరకు అవగతమైంది. తర్వాత నేరుగా విశ్వరూప దర్శనంతో అతని మోహం తొలగిపోయి భగవత్తత్త్వాన్ని సరిగా గ్రహించాడు.

రాబోయే అధ్యాయంలోని విషయం భక్తి. దాన్ని సూచిస్తూ చివరి శ్లోకం శ్రీకృష్ణుడి మాటల్లో –

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః ।**
**నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాణ్డవ ॥ 55**

నా కొరకై (శాశ్వత ధర్మసంరక్షకుడైన తత్త్వానికే) కర్మలు చేస్తూ నన్నే పరమధర్మం అని భావించు. నా భక్తుడుగా ఉంటూ రాగద్వేషాలు లేకుండా, ప్రాణులవిషయంలో శత్రుభావం లేనివారై ఎవరుంటారో వారు నన్ను పొందుతారు.

ఈ శ్లోకాన్ని గీతాశాస్త్రం మొత్తానికి సారభూతమైన శ్లోకం అంటారు శ్రీశంకరులు. నాకోసం కర్మలు చేయాలి అనే మాటతో కర్మయోగం, నన్నే పరమాత్మగా భావించు అనే మాటతో ధ్యానయోగం ఈ రెండూ చెప్పబడ్డాయి. అనన్యభక్తి అంటే నిష్కామభక్తి ఇలాంటి భక్తితో నిమిత్తమాత్రుడివై (శ్లో. 33) కర్మయోగం చేయాలి. నిమిత్తమాత్రుడవై పనిచేయి అనేది అందరికీ వర్తించేమాట. కర్మ చేయడానికి మనిషికి స్వేచ్ఛ (free will) ఉందని పైన గమనించాం. ధర్మాన్ని దృష్టిలో ఉంచుకొని కర్మను ఎంచుకోవాలి. ఇది అధ్యాయ సారాంశం.

❖ ❖ ❖

## పన్నెండవ అధ్యాయము

# భక్తి యోగము

పై అధ్యాయాలలో పరమాత్మతత్త్వం గురించి రెండు విషయాలు చెప్పబడ్డాయి. ఒకటి ఎలాంటి కర్తృత్వం, భోక్తృత్వం, గుణాలు లేనట్టి, మార్పులు లేనట్టి శుద్ధచైతన్యతత్త్వం. అదే జీవుని తత్త్వం అని కూడా చెప్పబడింది. రెండవది సగుణతత్త్వం. శుద్ధచైతన్యంలో మాయాశక్తివల్ల ఏర్పడిన విరాట్‌తత్త్వం, 10, 11 అధ్యాయాల్లో చెప్పినది. ఈ మాయాశక్తిలో మూడు అంశాలు. ఇవే మూడు గుణాలు సత్త్వము, రజస్సు, తమస్సు. వీటివల్లనే సృష్టివైచిత్రి అని కూడా చెప్పబడింది. ఈ గుణాలతో కూడివున్న పరమాత్మతత్త్వాన్ని సగుణబ్రహ్మ, సగుణ ఈశ్వరతత్త్వం (కైలాసంలో ఉన్న ఈశ్వరుడు కాదు) అన్నారు. ఈశ్వరుడు అంటే ఈశనశీలుడు, అన్నింటినీ పరిపాలించేవాడు అని అర్థం. మనం ఆరాధించే శివుడు, రుద్రుడు, వినాయకుడు మొదలైన రూపాలన్నీ ఇందులో భాగమే.

**దేవుణ్ణి ఎలా ఊహించుకుంటాం?**

చీమకే ఆలోచించే శక్తి వుంటే భగవంతుణ్ణి వేలాది తలలతో కూడిన చీమగా అది ఊహిస్తుంది అని వివేకానందుడు అన్నట్లు మానవుడు మొదలుగా మనకంటే ఎన్నోరెట్లు శక్తి, తేజస్సు, గుణాలు ఉన్న దేవుణ్ణి ఊహించుకుంటాడు. దానికి ఒక రూపకల్పన చేస్తే దాన్ని సాకార, సగుణ ఈశ్వరుడు అంటారు. మనం అర్చన చేసే దేవుళ్ళందరూ ఇందులో చేరుతారు.

రెండవదశలో తార్కికులు, పాతంజలయోగులు చెప్పిన నిరాకారతత్త్వం. అయినా ప్రపంచసృష్టి నిర్వహణ, పాపపుణ్యాల వ్యవస్థను నిర్వహించడం, మంచిని రక్షించడం, చెడును శిక్షించడం మొదలైన గుణాలున్న నిరాకార, సగుణ బ్రహ్మతత్త్వం. ప్రపంచంలో అన్ని మతాలు ఈ స్థాయిలోకి వస్తాయి. నిరాకారరూపమేగానీ సగుణం కావడంవల్ల దుష్టశిక్షణ, శిష్టరక్షణ ఇలాంటి గుణాలన్నీ ఉంటాయి.

మూడవస్థాయి ఉపనిషత్తులు చెప్పిన నిరాకార నిర్గుణతత్త్వం. సృష్టికి కూడా సంబంధంలేని దశ. **నాదత్తే కస్యచిత్ పాపం** (శ్లో. 5-15) అనగా పాపపుణ్యాల వ్యవస్థకు కూడా సంబంధంలేని శుద్ధచైతన్యం. మతాలేవీ ఈ స్థాయిలోని బ్రహ్మను వర్ణించలేదు.

**మనుష్యాణాం సహస్రేషు** (శ్లో. 7-3) అన్నట్లు మనమందరం పై మూడవస్థాయిని గురించి ఊహ కూడా చేయం. మనం మామూలుగా సగుణ, సాకార, స్థాయిలోనే

ఉంటాం. అదేదో తక్కువస్థాయి/కక్ష్య, మనలాంటి మేధావులకు జ్ఞానమార్గము లేదా నిర్గుణ కక్ష్య అనుకోవడం పెద్ద తప్పు.

భక్తి అనే పదానికి విభజించడం, విడదీయడం అని అర్థం. సంసారాన్ని మిథ్య అని విడదీసి సాధకుడు భగవంతుని తత్త్వాన్ని తెలుసుకోవడం, ఆ తత్త్వానికున్న లక్షణాలను అలవరచుకోవడానికి ప్రయత్నించడం. కేవలం ఆర్తభక్తుడు, అర్థార్థి (శ్లో 7-16లో చెప్పినట్లు) వీటిని గూర్చి ఆలోచనే చేయరు. జిజ్ఞాసువు, లేదా జ్ఞానిభక్తుడు మాత్రమే ఈ విషయం ఆలోచిస్తాడు. పరిచ్ఛిన్న (పరిమిత) రూపంలో భగవంతుణ్ణి ధ్యానించేవాడికంటే విశ్వరూపంలో ధ్యానించేవాడికి బుద్ధి మరింత పరిపక్వం చెందిందని భావించాలి. ఆ రూపంలో భగవంతుణ్ణి చూచినవాడికి విశ్వమంతా బ్రహ్మదృష్టి సిద్ధిస్తుంది. ఆపైన నిర్గుణతత్త్వాన్ని తెలుసుకొన్నవాడు **బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి** అన్నట్లు బ్రహ్మభావంలోనే ఉండగలడు. నిర్గుణంగా, అనగా గుణాలకతీతుడుగా ఉండడం, రాగద్వేషాలు లేకుండడం, దేహాభిమానం వదలివేయడం మొదలైన లక్షణాలు ఉంటాయి. కేవలం సైద్ధాంతికంగా తెలుసుకోవడంవల్ల గొప్ప ఫలితం చెప్పలేదు శాస్త్రం. దీనికన్నా కర్మయోగమే మేలైనదని చెప్పింది.

ఈవిధమైన విశ్లేషణ 12వ అధ్యాయంలో జరుగుతుంది. భక్తియోగం అని పేరుకు తగినట్లే భక్తియొక్క సమగ్రస్వరూపం వివరించబడింది. కేవలం 20 శ్లోకాలున్న చిన్న అధ్యాయం ఇది. అయినా వేదాంత తత్త్వాన్ని సంక్షేపంగా అందజేస్తుంది. మొదటి 12 శ్లోకాలు భక్తిమార్గంలోని రెండు కక్ష్యలు లేదా భూమికలను గూర్చి చెబుతాయి. శ్లో. 13 నుండి 20 వరకు జ్ఞాని లక్షణాలు, జ్ఞాని భక్తి ఎలా ఉంటుంది అని చెబుతాడు శ్రీకృష్ణుడు.

**సగుణోపాసన - నిర్గుణోపాసన, ఏది గొప్ప?**

11వ అధ్యాయంలోని చివరి శ్లోకంలో నాకోసం కర్మ చేయి, నన్నే పరమగతి అని భావించు అన్న శ్రీకృష్ణుడి మాట విని అర్జునుడికి సందేహం కలిగింది. సోపాధిక (ఉపాధి కలిగిన, గుణాలు కలిగిన, సగుణ) బ్రహ్మను గూర్చి చెప్పాడు. అలాగే నిరుపాధిక (ఉపాధి లేనట్టి, గుణాలులేని, నిర్గుణ) బ్రహ్మను గూర్చి చెప్పాడు. ఈ రెండురకాల ఉపాసనలు చేసేవారిలో ఎవరు గొప్ప? ఎవరు గొప్ప ఫలితాన్ని పొందుతారు? అని అర్జునుడి సందేహం. శ్రీకృష్ణుడు దీనిని శ్లో. 2 నుండి 7 వరకు వివరించాడు.

పై రెంటిలో ఏది గొప్పది అని వేదాంతశాస్త్రం చెప్పదు. సాధకుని స్థాయి, బుద్ధిపరిపక్వత, సాధనలో ఏ కక్ష్యకు చేరుకున్నాడు అనేదాన్ని బట్టి సమాధానం ఉంటుంది. అంతేగాక సగుణభక్తితో ప్రారంభించనిది నిర్గుణభక్తి కుదరదు. ఇక్కడొక ప్రసిద్ధ శ్లోకం గమనించాలి.

**నిర్విశేషం పరంబ్రహ్మ సాక్షాత్ కర్తుమనీశ్వరాః ।**
**యే మందాస్తేఽనుకంప్యంతే సవిశేష నిరూపణైః ॥**

అనగా ఎలాంటి విశేషణములు లేని పరబ్రహ్మాను తెలుసుకోవడానికి శక్తిలేనివారిని అనుగ్రహించడంకోసం శాస్త్రం విశేషణాలతో కూడిన బ్రహ్మాను గూర్చి చెప్పింది అని అర్థం. పై అధ్యాయాల్లో కూడా ఈ విషయం కొంత చెప్పబడింది. పూర్వజన్మ సుకృతం ఉన్న ప్రహ్లాదుడు, వామదేవుడు, మొదలైన వారికి జ్ఞానం పుట్టుకతో రావచ్చు కానీ మిగతా అందరూ దీన్నెంతో అభ్యసించాలి. అందుకే ఏది గొప్పది అని శ్రీకృష్ణుడు చెప్పడంలేదు. వాటిలో ఉన్న తారతమ్యాలు చెబుతున్నాడు. మొదటగా

**మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।**
**శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః ॥ 2**

విశ్వరూప భావంతోనే, శ్రద్ధతో అనుదినము ఉపాసన చేసేవారు నిజంగా ఉత్తములని భావిస్తాను. ఈ మాట అంటూనే తర్వాతి రెండు శ్లోకాల్లో 'అక్షరబ్రహ్మాను ఎవరు ఉపాసిస్తారో వారు నన్నే చేరుకుంటారు' అంటున్నాడు. కానీ వీరు ఎక్కువ శ్రమపడాల్సి వస్తుంది. దేహాత్మభావాన్ని త్యజించి అనగా అంతఃకరణను కేవలం దృశ్యంగా చూస్తూ సర్వాత్మభావంలో ఉండడం, సమదృష్టి కలిగివుండడం, ఇవి చాలా కష్టమైన పనులు. ఆధునిక భాషలో చెప్పాలంటే వ్యక్తి తన identityని రద్దు చేసుకోవడం, తన హెూదాను వదలివేయడం అనవచ్చు. మామూలు మనిషికి identity లేకపోవడాన్ని identity crisis అంటారు. ఇది చాలా భయంకరమైన విషయం. కానీ జ్ఞాని కోరుకొనేస్థాయి ఇదే.

దేహాభిమానాన్ని ఉంచుకుంటూ సగుణరూపాన్ని ఉపాసన చేయడం సులభం. ఆలంబన ఉంచుకొని ఉపాసన చేసేవాళ్లు, క్రమక్రమంగా మెట్లు పైకెక్కినట్లు పరతత్త్వాన్ని తెలుసుకుంటారు. అలాకాక కేవల వేదాంతవాక్యాల చింతనం చేస్తూ శమం, దమం కలిగివుండి, బ్రహ్మాచింతనం చేయడం కష్టమైనపని. అందుకనే నిర్గుణ బ్రహ్మోపాసనను **క్లేశోఽధికతరః** – ఎక్కువ శ్రమించాల్సిన మార్గం అంటున్నాడు.

6వ శ్లోకం ఇలా చెబుతుంది–

**యే తు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః ।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥ 6**

అన్ని కర్మలను నాయందే సంన్యసించి నన్నే ఉత్తమలక్ష్యంగా భావించి, మరొక ఆలంబన లేకుండా నన్ను ధ్యానిస్తూ ఉపాసిస్తారో వారిని నేను మృత్యువుతో కూడిన సంసారసాగరంనుండి ఉద్ధరిస్తాను అని అర్థం.

జ్ఞానులైతే వారే నన్ను చేరుకుంటారు. వీరినేమో ఉద్ధరించాలి. అనగా పైకిలాగి నా దగ్గరకు తీసుకోవాలి అని అర్థం. శ్రీకృష్ణుడు చెప్పిన విషయాలను ఈ క్రిందివిధంగా చూడవచ్చు–

| సగుణభక్తి | నిర్గుణభక్తి |
|---|---|
| – సులభతరమైనది | క్లేశం ఎక్కువ (క్లేశోऽధికతరః) మనస్సును నిగ్రహించాలి. తత్త్వచింతనం చేయాలి – దేహవద్భిః–అనగా దేహాత్మభావం కలవారికి ఇది చాలా కష్టం. |
| – సగుణ ఉపాసన చేసేవారిని నేను ఉద్ధరిస్తాను. వీరు దేహాత్మభావంలో ఉన్నవారు. ఈశ్వరాధీనులు. | అక్షరబ్రహ్మ (నిర్గుణతత్త్వం) తెలుసుకొన్నవారు నన్నే చేరుకుంటారు. ఉద్ధరించే పనిలేదు. వీరు దేహాత్మభావం లేనివారు. |
| – ఆత్మజ్ఞానపూర్వకం కానిది. | ఆత్మజ్ఞానపూర్వకమైనది. |
| – ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేస్తుంటారు. | జ్ఞానికర్మ. ఇది చేష్టామాత్రమే (ఈ అధ్యాయంలో వివరింపబడుతుంది.) |
| – వీరికి ఒక మజిలీ ఉంటుంది. కొన్నాళ్ళు బ్రహ్మలోకం (వీరు ఉపాసించిన లోకంలో)లో ఉండి నిర్గుణతత్త్వాన్ని పొందుతారు. | వీరికి మజిలీ ఉండదు. నిర్గుణతత్త్వంలో ఉంటారు. |

**అర్జునుడు ఏం చేయాలి?**

శ్లో. 8 నుండి 12 వరకు శ్రీకృష్ణుడు అర్జునుడు ఏం చేయాలి అనే విషయాన్ని చెబుతున్నాడు (అనగా మనందరికీ వర్తించే విషయం). పై చెప్పిన భక్తి, జ్ఞానము, కర్మసంన్యాసము ఇవన్నీ ఏయే కక్ష్యల్లో ఉన్నాయి, ఏది దేనికంటే శ్రేష్ఠమైనది అని ప్రశ్న. ఏది కష్టమైనదో అదే సాధారణంగా శ్రేయస్కరం. సులభమైనదానితో మొదలుపెట్టి కష్టమైనవాటిని సాధిస్తూపోతాం. అదే శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. "నాయందే (విశ్వరూప ఈశ్వరభావమందే) మనస్సును నిలిపివుంచు. ఆపై నీవు కూడా ఆ స్థితిని చేరుకోగలవు" (శ్లో. 8).

"ఒకవేళ పై భావనయందు మనస్సును నిలపలేకపోయినట్లయితే అభ్యాసయోగంతో నన్ను పొందడానికి ప్రయత్నించు" (శ్లో. 9). ఇక్కడ అభ్యాస యోగమంటే ఏదైనా ఆలంబనము, ఒక ఊతం, అనగా ఒక ప్రతిమ లేదా దేవతారూపం తీసుకొని దానియందు మనస్సును నిలపడం. నేరుగా విశ్వరూప తత్త్వ అవగాహన కష్టం కావున సులభమైన ఆలంబనను తీసుకొని (ఏదో ఒక విగ్రహం వినాయకుడు, విష్ణువు, వెంకటేశ్వరుడు మొ॥) దానిపై మనస్సు నిలిపి దానిద్వారా విశ్వరూపతత్త్వాన్ని ధ్యానం చేయడం.

"అభ్యాసం చేయడానికికూడా సమర్థుడు కాకుంటే నాకు సంబంధించిన పనులు చేయి. దానివల్ల కూడా క్రమంగా సిద్ధి కలుగుతుంది" (శ్లో. 10). దేవతామూర్తిపై మనస్సును నిలిపి ధ్యానం చేయడంకూడా చేతకానప్పుడు కనీసం దేవుని కీర్తన, భజనలాంటివి చేయాలి. ఇది సామాన్యంగా అందరూ చేసేపని. ఇక్కడ వ్యాఖ్యాతలు 9 రకాల భక్తిమార్గాలు చెప్పారు.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥**

విష్ణు కథలు వినడం, కీర్తనలు పాడడం, స్మరించుకోవడం, పాదసేవ, పూజ, నమస్కారం, దాస్యం, మైత్రి, తన్నుతాను సమర్పించుకోవడం అని తొమ్మిదివిధాలు.

'ఇది కూడా చేతకానివాడైతే కనీసం కర్మఫలత్యాగం చేయి' (శ్లో. 11) అనగా నిష్కామకర్మ చేయి, ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయి అని అర్థం.

మొదట కష్టమైన మార్గంతో మొదలుపెట్టి అది చేతకానప్పుడు ఇది చేయి అని చివరగా కర్మయోగం చెప్పాడు. అనగా కర్మయోగం మొదటిమెట్టు. అందుకే దీనిని

ధ్యానయోగానికి బహిరంగసాధనమని పైన గమనించాం. ధ్యానయోగం జ్ఞానయోగానికి ఉపకారకం. అలాగ క్రమక్రమంగా ఆరోహణమార్గం చెప్పబడింది.

**ఎన్నో మెట్లు**

ఈ మార్గాలన్నీ అన్నిరకాల మానవులను, ఉద్దేశించి చెప్పినవి. ఇవన్నీ విభిన్న మార్గాలు కావు. ఒకేమార్గంలోని వివిధదశలు లేదా మెట్లు. ఒక్కో మెట్టూ పైకెక్కి వెళ్లాలి. ఇవన్నీ చెప్పిన తర్వాత శ్రీకృష్ణుడు వీటినన్నిటినీ సంగ్రహించి కర్మయోగాన్ని స్తుతించడానికై (సాధారణ సాధకుణ్ణి ఉత్సాహపరచడానికై) ఇలా అంటున్నాడు.

**శ్రేయో హి జ్ఞానమభ్యాసాద్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్ ॥ 12**

ఇదొక క్లిష్టమైన శ్లోకం. "అభ్యాసం కంటే జ్ఞానం గొప్పది. జ్ఞానం కంటే ధ్యానం గొప్పది. ధ్యానం కంటే కర్మఫలత్యాగం గొప్పది. దానివల్ల శాంతి వెంటనే లభిస్తుంది" అని శ్లోకార్థం. అన్నింటికంటే సులభమైనదాన్ని (మొదటిమెట్టును) గొప్పది అంటున్నాడు కృష్ణుడు. వేదాంతశాస్త్రంలో జ్ఞానంవల్లనే మోక్షం, శాంతి అని సిద్ధాంతం. ఇక్కడేమో అందుకు వ్యతిరేకంగా జ్ఞానం కంటే ధ్యానం గొప్పది. ధ్యానం కంటే కర్మఫలత్యాగం గొప్పది అంటున్నాడు. ఇక్కడ జ్ఞానం అనే పదానికి శ్రవణమననాదులచే కలిగిన పరోక్షజ్ఞానం (అనుభవంలేని జ్ఞానం) అని అర్థం చెప్పారు. అనుభవంలేని శాస్త్రజ్ఞానం కేవలం వేదాంతశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నట్లు. అయినా ఇది అభ్యాసం (అనగా ఏదైనా ఆలంబనపై మనస్సు నిలిపి ధ్యానించడం) కన్నా గొప్పది. ఇలాంటి జ్ఞానంకంటే ధ్యానం (జ్ఞానపూర్వకమైన ధ్యానం) గొప్పది. దానికంటే కర్మఫలత్యాగం అని అర్థం చెప్పుకోవాలి. కేవలం కర్మఫలత్యాగం స్తుతించడం కోసం చెప్పిన వాక్యమిది. అజ్ఞానులై స్వార్థంకొరకు కర్మలు చేసేవారికి కర్మఫలత్యాగం అనే మార్గంలో ఆసక్తి కలిగించడంకోసం శ్రీకృష్ణుడు ఈవిధంగా చెప్పాడని వ్యాఖ్యాతలు వివరించారు.

పై వర్ణించిన మెట్లన్నీ ఒకదానితర్వాత ఒకటి అధిరోహించడం అనే కర్మలో భాగమే. అనగా కర్మయోగంలో భాగమే. **లోకేஉస్మిన్ ద్వివిధా నిష్ఠా** (శ్లో. 3-3) అన్నట్లు రెండే నిష్ఠలు. జ్ఞాననిష్ఠ, కర్మనిష్ఠ వేదాంతశాస్త్రంలో చెప్పబడ్డాయి. ధ్యానయోగం, సంన్యాసయోగం, భక్తియోగం మొ॥వన్నీ కర్మయోగంలో భాగాలే. సాధకుడు ప్రయత్నపూర్వకంగా చేసేవి.

**జ్ఞాని భక్తి ఎలా ఉంటుంది?**

ఎవరినైతే తాను పూనుకొని ఉద్ధరించాలో వారి గురించి వారి తారతమ్యాల గురించి పైన చెప్పాడు. ఎవరిని ఉద్ధరించాల్సిన పనిలేదో అట్టి జ్ఞానులు వారి ప్రవర్తన, వారి భక్తి ఎలా వుంటుంది అన్నది శ్లో. 13 నుండి 19 వరకు చెబుతున్నాడు.

ఈ శ్లోకాల్లో చెప్పిన లక్షణాలు, స్థితప్రజ్ఞుడి లక్షణాలు ఒకటే. ఈ శ్లోకాల్లో జ్ఞానియై భక్తిమార్గంలో ఉండేవారిని గూర్చి చెప్పబడింది. ఆ లక్షణాలు ఇవి.

**అద్వేష్టా సర్వభూతానాం** – (శ్లో. 13) అనగా అన్ని ప్రాణులను ఆత్మభావంతో చూడడంవల్ల ద్వేషం నశించినవాడు.

**మైత్రః, కరుణః** – (శ్లో. 13) పై కారణంవల్ల అన్నింటిపట్ల మైత్రీభావంతో, కరుణతో ఉండేవాడు.

**నిర్మమః, నిరహంకారః** – (శ్లో. 13) 'నాది' అను భావన లేనివాడు. 'నేను' అనే భావన లేనివాడు.

**సమదుఃఖ సుఖః** – (శ్లో. 13) సుఖాన్ని, దుఃఖాన్ని సమంగా (భగవత్స్వరూపంగా) చూచువాడు. పరమాత్మ చైతన్యంలోనే పుట్టి నశించే బుద్ధివృత్తులుగా చూచువాడు.

**మయ్యర్పిత మనోబుద్ధిః** – (శ్లో. 14) నాయందే మనస్సు, బుద్ధి అర్పించినవాడు. ఇక్కడ 'నేను' అనే శబ్దానికి నిర్గుణ బ్రహ్మతత్త్వం అనే అర్థం చెప్పారు. అయినా ఇష్టదేవతా పూజకు వ్యతిరేకంకాదు. ఇలాంటి భక్తుడు నాకు ప్రియుడు అంటున్నాడు శ్రీకృష్ణుడు.

తాను ఉద్వేగం (tension) చెందనివాడు, ఇతరులను ఉద్వేగానికి గురిచెయ్యనివాడు. (శ్లో. 15)

ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేవాడు. అసహిష్ణుత (intolerance)లేనివాడు. భయం, ఉద్వేగం నుండి విముక్తుడైనవాడు. (శ్లో. 15)

పరమాత్మయందు అపేక్ష, వస్తువులయందు ఉపేక్ష (శ్లో. 16).

**శుచిః** – కాయికశౌచం, మానసశౌచం అని రెండు విధాలు. శరీరాన్ని శుచిగా ఉంచుకోవడం తెలిసిందే. దయ, అహింసలాంటి గుణాలవల్ల మనస్సు యొక్క శౌచం.

**దక్షః** – కార్యనిర్వహణలో దక్షత.

**ఉదాసీనః** – ఎలాంటి పక్షపాతభావంలేనివాడు.

**గతవ్యథః** – ఎలాంటి భయం లేనివాడు (శ్లో. 16).

**సర్వారంభపరిత్యాగీ** – (శ్లో. 16) సుఖప్రాప్తికై చేసే కర్మలను పరిత్యజించినవాడు.

శత్రువులయందు, మిత్రులయందు సమానముగా ఉండువాడు.

సుఖదుఃఖాలనే ద్వంద్వాలనుండి ముక్తి చెందినవాడు.

**అనికేతః** – (శ్లో. 19) అన్ని ప్రాణుల్లో ఉండేవాడు కావున ఒక నివాసమంటూ లేనివాడు.

**స్థిరమతిః** – స్థితప్రజ్ఞుడైనవాడు.

**భక్తిమాన్** – (శ్లో. 19) నిర్గుణతత్త్వం కదా అని భక్తిని వదలివేయక ప్రేమభావంతో భక్తి కలిగినవాడు.

ఈ గుణాలన్నీ రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుడికి చెప్పబడ్డాయి. 19వ శ్లోకంలో స్థితప్రజ్ఞుడనే మాటకూడా **స్థిరమతిః** అనే పదంతో చెప్పబడింది.

**జ్ఞాని భక్తి - నిర్గుణ భక్తి**

నిర్గుణ భక్తి అనే పదంపై మనకొక సందేహం కలుగవచ్చు. భక్తి అంటే విభజించడం, వేరుగా చూడడం అని అర్థం కదా! అలాంటప్పుడు విశ్వమంతా ఉన్న శుద్ధ నిర్గుణ చైతన్యంలో మళ్లీ నేను వేరు, ఆ తత్త్వం వేరు అని చూడడమెలాగ? నిజమే నిర్గుణతత్త్వంలో విభజన లేదు. అయినా జ్ఞాని శరీరమనే ఉపాధిలో ఉన్నాడు. ఆ ఉపాధి ధర్మాలైన ఆచార వ్యవహారాది కర్మలు, లోకహితం కోసం చేష్టామాత్రంగా (నేను అనే భావం లేకుండా) చేస్తున్నాడు. అది నిజంగా కర్మ కాదు, కర్మాభాస అన్నారు శాస్త్రంలో. అయినా అతనికి జన్మకు కారణమైన కర్మ ఇదివరకే ఆరంభమైవుంది. దానినే ప్రారబ్ధ (ఫలం ఇవ్వడానికి ఆరంభమైన) కర్మ అంటారు. దీనివల్ల అతడు తన శరీరమనే ఉపాధి ధర్మాలను నిర్వహిస్తుంటాడు.

వేదాంతులు ఒక ఉదాహరణ చెబుతారు. కుమ్మరివాడు చక్రం తిప్పుతూ కుండ చేసేటప్పుడు కుండ తయారైన తర్వాత దానిని ప్రక్కకు తీసిపెడతాడు. అయినా ఆ

చక్రం తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ప్రయోజనం లేకపోయినా అది తిరిగి తిరిగి వేగం తగ్గగానే ఆగిపోతుంది. జ్ఞానికర్మ ఆ కుమ్మరిచక్రం తిరుగుడులాంటిది (కులాలచక్రన్యాయం) అంటారు. అందువల్ల మిగతావాళ్లలాగా లోకసంగ్రహంకోసం కర్మలు చేస్తున్నా వాటి ఫలం అతడిని అంటదు. అతని భక్తిగూడా ప్రేమతో కూడిన భక్తే. ప్రతి మనిషీ తన్నుతాను ప్రేమించుకుంటాడు. ఆత్మతత్త్వం తెలిసిన జ్ఞాని ఆ తత్త్వాన్ని ప్రేమతో పూజించడం జ్ఞానిభక్తి. అదే నిర్గుణభక్తి.

అధ్యాయం యొక్క చివరి శ్లోకం

**యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః ॥ 20**

ధర్మంతో కూడిన ఈ అమృతాన్ని ఎవరైతే శ్రద్ధతో నాయందే భక్తి నిలిపి ఉపాసన చేస్తారో వారే నా పరమభక్తులు అని అర్థం. వారే ముక్తులు. భగవద్గీతలో అక్కడక్కడ జ్ఞాని లక్షణాలే జ్ఞానానికి సాధనాలుగా చెప్పినట్లు చూశాం. అలాగే ఈ అధ్యాయంలో కూడా జ్ఞాని భక్తుని లక్షణాలను చెప్పి అవే సాధనాలని కూడా చెప్పారు. సోపాధిక తత్త్వం (సగుణ) నుండి నిరుపాధిక తత్త్వం (నిర్గుణ) ఎలా చేరుకోవాలి అని ఈ అధ్యాయ సారాంశం.

❖ ❖ ❖

# పదమూడవ అధ్యాయము

# క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము

జీవుడు తన్నుతాను మార్చుకునే సాధన, తన గురించి తన దృష్టికోణం మార్చుకోవడం, 'నేను'ను 'బ్రహ్మ'గా మార్చుకునే ప్రక్రియ భగవద్గీతలోని విషయం అని మనం ఇదివరకే చూశాం. జీవుడి తత్త్వం, పరమాత్మతత్త్వం మొదటి పండ్రెండు అధ్యాయాల్లో తెలుసుకున్నాం. ఇప్పుడు సాధకుడు అభ్యాసం చేయాల్సిన సాధన మార్గమేమిటి? అని 13వ అధ్యాయం నుండి చివరి వరకూ చెప్పబడుతుంది. ఈ ఆరు అధ్యాయాల సముదాయాన్ని 'సాధనషట్కం' అంటారు.

వేదాంతశాస్త్రంలో మిగతా శాస్త్రాల్లోవలెనే వస్తువివేచనం (విడమరచి పరిశీలించడం) చూస్తాం. వస్తువు (విషయం) జీవుడు, బ్రహ్మ, జగత్తు, వీటిమధ్య సంబంధం. రెండవ అధ్యాయంలోనే **అవ్యక్తోఽయం అచింత్యోఽయం** (2-25) ఇత్యాది శ్లోకాల్లో జీవుడు సర్వగతుడు, నిత్యుడు అని చెప్పబడింది. అలాగే అతని రాగద్వేషాలు, ప్రకృతిలోని గుణాలు అతణ్ణి ఎలా ప్రభావితం చేస్తాయో చూశాం. 7 నుండి 12వ అధ్యాయాల్లో **యేత్వక్షర మనిర్దేశ్యం** (12-3) మొదలైన శ్లోకాల్లో 'తత్' పదార్థమైన బ్రహ్మనుగూర్చి చెప్పారు. **అవ్యక్తం అచింత్యం** లాంటి పదాలు ఇద్దరి విషయంలో చెప్పారు. ఇదెలా సాధ్యం? జీవుడు సంసారి. సుఖదుఃఖాలు అనుభవిస్తున్నవాడు. పరమాత్మ శుద్ధచైతన్యస్వరూపం. ఈ రెంటికీ ఐక్యం ఎలా చెప్పారు. కావున జీవుని వాస్తవస్థితి ఏమిటో చూడాలి. ప్రయోగశాలలో ఒక మిశ్రణంలో ఏ మూలపదార్థాలు ఉన్నాయి అని ఎలా విశ్లేషణ చేస్తారో అలాంటి విశ్లేషణ చేయాలి. జీవుడు అని మనం భావించే వస్తువులో ఏయే పదార్థాలున్నాయో విశ్లేషించాలి. ఈ విశ్లేషణే 13వ అధ్యాయంలో చూస్తాం.

**క్షేత్రం = పొలం**

ఈ అధ్యాయం పేరు 'క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం' క్షేత్రమంటే మామూలుగా మనం పంటలు పండించే క్షేత్రమే. మన సేద్యానికి తగినట్లు పంట పండినట్లుగా మన కర్మ (మంచి-చెడు పనుల)ను అనుసరించి ఫలం. ఈ క్షేత్రాన్ని ప్రకాశింపచేసేవాడు క్షేత్రజ్ఞుడు. ఈ రెండింటి విభాగం ఈ అధ్యాయంలో 34 శ్లోకాలున్నాయి (కొన్ని గ్రంథాల్లో అర్జునుడి ప్రశ్న రూపంలో ఒక శ్లోకం అదనంగా ఉంది). వీటిలో ఐదు అంశాలు చూడవచ్చు. 1) మొదటి ఆరు శ్లోకాల్లో క్షేత్రక్షేత్రజ్ఞుడు అనే పదాలకు అర్థం. 2) 7

నుండి 11 వరకు జ్ఞానం ఏమిటి? 3) 12 నుండి 13 వరకు జ్ఞేయం, అనగా తెలియదగినదేది? 4) శ్లో. 19 నుండి 23 వరకు ప్రకృతి, పురుషుడు, పరమాత్మ అంటే ఏమిటి? 5) శ్లో. 22 నుండి చివరి వరకు సాధకుడు ఎలాంటి అభ్యాసం చేయాలి అని రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుడి గూర్చి చెప్పిన సాధనలే ఇక్కడ కూడా చెప్పబడ్డాయి. చివరి శ్లోకం ఈ క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అనేవాటిని తెలుసుకున్నవాడు ముక్తుడౌతాడని ఫలశ్రుతి.

మొదటి శ్లోకంలోనే శ్రీకృష్ణుడు కొన్ని ముఖ్య విషయాలు చెబుతున్నాడు.

**ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే ।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ 1**

ఈ శరీరాన్నే క్షేత్రమంటారు. దీన్ని తెలుసుకున్నవాడిని క్షేత్రజ్ఞుడు అంటారు అని శ్లోకార్థం. చాలా సులభంగా కనిపిస్తుంది. కానీ దీన్ని విచారించాలి.

మనం ఏదైనా వస్తువును తీసుకొని ఇది పుస్తకం, ఇది పెన్ను, ఇది కుర్చీ అన్నప్పుడు 'ఇది' అనేది మనచేత తెలియబడేది. అంటే 'నేను' వేరు, కుర్చీ వేరు. తెలియబడేదంతా నాకంటే భిన్నమైనది. ప్రపంచంలో అన్ని వస్తువులూ మనచేత తెలియబడేవే, మనకంటే వేరైనవే. ఒకసారి మన దేహాన్నే పరిశీలిస్తే చేయి, కాలు వీటిని నా చేయి, నా కాలు అంటుంటాం. అంటే నాచే చూడబడేవి, నాకంటే భిన్నమైనవి అని అర్థమొస్తుంది. అలాగే జ్ఞానేంద్రియాలు – నా కన్ను, నా ముక్కు ఈవిధంగా. ఒక ఇంద్రియం లేదా ఇంద్రియాలు పనిచేయకున్నా 'నేను' ఉంది. మరి ఈ 'నేను' అని భావించేదేమిటి? అంతఃకరణమా అంటే అది కూడా జడమైనదే. అంతఃకరణం (మనస్సు) మనం తినే అన్నంవల్లనే పెరిగేది. అందువల్ల మనస్సు కూడా 'నేను' కాదు అని వేదాంత ప్రతిపాదన (ఆధునిక సైకాలజీ 'మనస్సే' నేను అనవచ్చు. వేదాంత శాస్త్రం ఇందుకు భిన్నంగా చెబుతుంది).

పై శ్లోకం 'ఇదం శరీరం' – ఈ శరీరం అంటుంది. అనగా ఇది నీవు కాదు అని ఒకమాటలో చెబుతుంది. ఇంతవరకూ ఈ దేహమే నేను అనే భావనలో ఉన్నవాడికి ఇదికూడా మిగతా చూడబడేవాటితో సమానమే అంటుంది. చూడబడేదానిపేరు దృశ్యం, చూచేదాన్ని దృక్ అంటారు. దృక్ ఏది, దృశ్యమేది అని విడగొట్టుకుంటూ పోవడమే దృక్ – దృశ్య వివేకము (ఈ పేరుతో విద్యారణ్యముని ఒక ప్రసిద్ధ గ్రంథాన్ని వ్రాశారు).

ఈ శరీరం క్షేత్రమంటుంది పై శ్లోకం. దీన్ని తెలుసుకునేవాడు, ప్రకాశింపచేసేవాడు క్షేత్రజ్ఞుడు. ఈ దేహాన్ని/క్షేత్రాన్ని చూసేవాడు అనే మాటతో దీన్ని గమనిస్తూ కూర్చునే మరోవ్యక్తి అని, ఆ చూసే వ్యక్తికి చూడడమే అనే ఒక క్రియ ఉన్నట్లు చెప్పడమవుతుంది. కానీ ఆ క్షేత్రజ్ఞుడు అనేది క్షేత్రంలో ఉన్న కేవల చైతన్యమే. ఈ క్షేత్రమే నేను అనుకుంటూ తాదాత్మ్యభావం (అదే నేను అనుకోవడం)లో ఉంటే జీవుడు. ఈ క్షేత్రమంతా దృశ్యమే అని తెలుసుకోవడం 'క్షేత్రజ్ఞుడు' కావడం. అంటే కేవలం 'జ్ఞ' మాత్రం అంటే తెలివి లేదా చైతన్యమాత్రంగా ఉండడం. దీన్ని సాక్షిచైతన్యం అని వేదాంతంలో అంటారు. సాక్షి అంటే దేన్నో చూస్తున్న వ్యక్తి అని భావించరాదు. ఇది కేవలం అంతఃకరణాన్ని భాసింపచేసే చైతన్యం.

**అంతఃకరణం + చైతన్యం = సంసారి / జీవుడు.**
(మనస్సు) (సాక్షి)

అంతఃకరణమనే అంశం తీసివేస్తే కేవలం సాక్షిగా మిగులుతాడు. 'నేను' చేస్తున్నాను, 'నేను' సంతోషంగా ఉన్నాను అని కర్తృత్వ, భోక్తృత్వభావన అంతఃకరణానికి చెందినది. కానీ జీవుడు (చైతన్యరూపుడైనప్పటికి) నేను సుఖి, దుఃఖి అని భావిస్తుంటాడు. అంటే అంతఃకరణానికి చెందిన ధర్మాలను (గుణాలను) తన ధర్మాలుగా భావిస్తుంటాడు. ఇలా భావించడం, ఒకదాని ధర్మాలు ఇంకొకదానిపై ఉంచడం, అధ్యాస (super imposition) అంటారు. దీనివల్లనే మనిషి క్లేశమంతా.

రెండవ శ్లోకం కూడా ముఖ్యమైనది.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥ 2**

అన్ని క్షేత్రాలలో (అన్ని జీవశరీరాలలో) క్షేత్రజ్ఞుడను నేనే (పరమాత్మ) అని తెలుసుకో. క్షేత్రము, క్షేత్రజ్ఞుడు ఈ రెంటి జ్ఞానమే సరైన జ్ఞానం అని నా నిశ్చయం - అని తాత్పర్యం.

ఇక్కడ క్షేత్రజ్ఞుడు అంటే పైన చెప్పినట్లుగా సాక్షిగా చూస్తూ ఉన్నవాడు కాదు. సాక్షి అనే పదంలో కర్తృత్వం లేదు అని పైన చూశాం. సాక్షి అంటే కేవలం విషయాన్ని ప్రతిఫలింపచేసే చైతన్యం. పరమాత్మ అసంసారి, అపరిచ్ఛిన్నం (దేశకాల పరిమితి లేనిది), జీవుడేమో సంసారి, పరిచ్ఛిన్నుడు. అయినా శ్రీకృష్ణుడు ఈ క్షేత్రజ్ఞుడు నేనే అంటున్నాడు. మరి పరమాత్మకు మనలాగే సంసారిత్వం వస్తుంది. అంతేగాక అన్ని

శరీరాలలో ఉన్నాను అన్నప్పుడు నానాత్వం కూడా వస్తుంది. అందుకే ఇక్కడ అన్ని శరీరాలు అనే ఉపాధులలో చైతన్యరూపంలో ఉన్నాను అనే అర్థం చెప్పుకోవాలి. ఉపాధులు పోగానే శుద్ధచైతన్యమే, జ్ఞానస్వరూపమే మిగులుతుంది. పాత్రలో ఉన్న ఆకాశం మహాకాశం రెండూ ఒకటే అనేది ఉదాహరణ. కుండలు/పాత్రలు నశించగానే ఆకాశం ఒకటే మిగులుతుంది.

**క్షేత్రంలో ఉన్న వస్తువులు**

క్షేత్రం యొక్క పూర్తి వివరాలేమిటి? అని 5,6 శ్లోకాల్లో చెప్పారు. "పంచమహాభూతాలు (పృథివి, జలం, అగ్ని, వాయు, ఆకాశం), అహంకారం (నేను అనే భావన), బుద్ధి, అవ్యక్తము (మాయ), ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, మనస్సు, ఇంద్రియాలచే గ్రహింపబడే శబ్దాది విషయాలు ఇవన్నీ క్షేత్రము" (శ్లో. 5). అంతేగాక "అంతఃకరణ భావాలైన కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, చేతన అనగా అంతఃకరణలో ఏర్పడే ఆలోచనలు, ధృతి అనగా will power, వీటన్నింటినీ ధరించే శక్తి, ఇవన్నీకూడా క్షేత్రమే" (శ్లో. 6).

ఇవన్నీ దృశ్యకోటిలోకి చేరేవే, చూడబడే వస్తువుల రాశిలోకి చేరేవే. 'నేను'చే గ్రహింపబడేవే. వీటన్నింటిని ప్రకాశింపచేసే చైతన్యమే క్షేత్రజ్ఞుడు (పరమాత్ముడు మన అంతఃకరణలో సాక్షిగా ఉంటూ మనం చేసే పనులను చూస్తుంటాడు అనేది పౌరాణికులు చెప్పే విషయం. అందరినీ గమనిస్తూ ఉండడం పరమాత్మ పనికాదు. స్వర్గం, నరకం అనే వాటిని వివరించే సందర్భంలో పౌరాణికులు చెప్పిన విషయాలవి).

క్షేత్రజ్ఞుడు అంటే కేవల చైతన్యం. అంతఃకరణధర్మాలు నావి అనుకుంటున్నప్పుడు జీవుడు అంటారు. అతడే సంసారి. జననమరణ చక్రంలో తిరుగుతుంటాడు. అంతఃకరణధర్మాలు నావి కాదు అనుకున్నప్పుడు శుద్ధచైతన్యం, ఇతడే ముక్తుడు. జననమరణచక్రం నుండి బయటపడినవాడు.

అంతఃకరణధర్మాలు నావి కావు అనడానికి కొంత అభ్యాసం, అహంకార మర్దనం (self-negation) కావాలి. పైన చెప్పుకున్నదాన్ని బట్టి ఎవరైనా ఒక వితండవాదం చేయవచ్చు. 'సరే నేను చైతన్యమని తెలుసుకున్నాను, తర్వాత ఏమిటి' అని అడగవచ్చు. అలా అడిగినవాడికి ఇంకా తెలియలేదని అర్థం. అతనిలో 'నేను' అనే భావన స్ఫుటంగా ఉంది. **'అవిజ్ఞాతం విజానతాం'** అని కేనోపనిషత్తు చెప్పినట్లు నాకు తెలుసు అనేవాడికి ఇంకా తెలియలేదని అర్థం. ఇంకా అభ్యాసం కావాలి, కొన్ని గుణాలు అలవరచుకోవాలి. ఆ గుణాలేమిటి? అనే విషయంపై ఈ క్రింది శ్లోకాలు, జ్ఞానం గురించి చెప్పినవి.

జ్ఞానం ఏమిటి అని శ్లో. 7 నుండి 11 వరకు చెప్పబడింది. ఇక్కడ జ్ఞానసాధనకు ఉపకరణాలు చెప్పబడ్డాయి. ఉపకరణాలు కాబట్టి వీటిని ప్రశంసిస్తూ జ్ఞానమంటున్నాడు శ్రీకృష్ణుడు. ఆ లక్షణాలు / ఉపకరణాలు ఇవి.

**జ్ఞానం :**

**అమానిత్వం** (శ్లో. 7) – గర్వం లేకపోవడం.

**అదంభిత్వం** (శ్లో. 7) – దంభం అనగా డాంబికస్వభావము లేకపోవడం. నేను ధార్మికుడనని జెండా పట్టుకొని చెప్పడం.

**అహింస** (శ్లో. 7) – ప్రాణులకు ఎట్టి పీడను కలిగించకపోవడం.

**శాంతిః** (శ్లో. 7) – ఎదుటివాడు అపరాధము చేసినప్పటికీ ఓర్పుతో ఉండడం.

**ఆర్జవం** (శ్లో. 7) – ఋజుస్వభావం.

**ఆచార్యోపాసనమ్** (శ్లో. 7) – విధింపబడిన ప్రకారం గురువుదగ్గర విద్యనభ్యసించడం.

**శౌచం** (శ్లో. 7) – బాహ్యశుద్ధి, అంతఃకరణశుద్ధి.

**స్థైర్యం** (శ్లో. 7) – మోక్షమార్గమందు గట్టిగా నిలచివుండడం.

**ఆత్మవినిగ్రహం** (శ్లో. 7) – ఇంద్రియ నిగ్రహం.

**ఇంద్రియార్థేషు వైరాగ్యం** (శ్లో. 8) – ఇంద్రియ విషయాలలో వైరాగ్యం.

**అనహంకారం** (శ్లో. 8) – అహంకారం లేకపోవడం.

జన్మ, మృత్యువు, ముసలితనము, వ్యాధిలలో దుఃఖం వుంది అని గమనించడం. ఇదే దోషదర్శనం అంటారు. ఇవన్నీ అనిత్యాలని భావించడంవల్ల వైరాగ్యం కలుగుతుంది.

**అసక్తిః** (శ్లో. 9) – ఇంద్రియ విషయాలపై ప్రీతి లేకపోవడం.

**అనభిష్వంగం** (శ్లో. 9) – ఏదైనా విషయంపై అత్యంత పట్టుదల, ప్రీతి ఉండడం అభిష్వంగం. అది లేక నేను లేను అనే భావన భార్యాపిల్లలు మొదలైన వాటియందు. ఈ భావన లేకపోవడం అనభిష్వంగం.

**సమచిత్తత్వం** (శ్లో. 9) – సుఖదుఃఖాలయందు సమభావనతో ఉండడం.

**అవ్యభిచారిణీ భక్తిః** (శ్లో. 10) – భగవంతునిపై వ్యభిచరించని (ఇటూ, అటూ చలించని) భక్తి. అనన్యయోగంతో, అనగా పరమాత్మకంటే అభిన్నుణ్ణి అనే భావనతో ఉండడం.

**వివిక్తదేశసేవిత్వం** (శ్లో. 10) - ఏకాంతస్థలమునందు ఉండడం - సాధనకు యోగ్యమైన ప్రదేశంలో ఉండడం.

**అధ్యాత్మజ్ఞాననిత్యత్వం** (శ్లో. 11) - అధ్యాత్మమంటే ఆత్మను గురించి అని. ఆ చింతనయే ఎల్లప్పుడూ చేయడం.

**తత్త్వజ్ఞానార్థ దర్శనం** (శ్లో. 11) - అధ్యాత్మశాస్త్ర ప్రయోజనాన్ని బాగా గ్రహించడం, ఇదే ముక్తిసాధనమని గ్రహించడం.

పై చెప్పినవన్నీ జ్ఞానసాధనాలు. కావున జ్ఞానమని ప్రశంసాపూర్వకంగా చెప్పబడింది.

**జ్ఞేయం :**

జ్ఞేయమనగా తెలుసుకొనదగినది. ఇదే తెలుసుకొనవలసింది కూడా.

**జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వాఽమృతమశ్నుతే ।**
**అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥ 12**

జ్ఞేయం, యత్, తత్ ఇవన్నీ నపుంసకలింగ శబ్దాలు. ఇలాగే మిగతా శ్లోకాల్లో వాడబడిన నపుంసకలింగ శబ్దాలు పరబ్రహ్మను సూచిస్తాయి (పరబ్రహ్మను స్త్రీలింగ, పుంలింగాల్లో సూచించరని చెప్పుకొన్నాం). ఈ జ్ఞేయాన్ని తెలుసుకోవడంవల్ల అమృతాన్ని పొందుతాడు అని శ్లోకార్థం. అమృతం అంటే దేవతలు, రాక్షసులు సముద్రాన్ని మథించి తీసిన అమృతం కాదు. **అజ్ఞానం వై మృత్యుః** - అజ్ఞానమే మృత్యువు అని ఉపనిషద్వాక్యం. దానినుండి బయటపడడమే అమృతం, అనగా జ్ఞానమే అమృతం.

**అనాదిమత్** - అనగా ఆదిలేనిది. పరంబ్రహ్మ ఇంకా ఎలాంటిదంటే **న సత్, న అసత్** అనగా సత్‌కానిది, అసత్తుకానిది అని అర్థం. ఎంతో పటాటోపంతో నడుంబిగించి బ్రహ్మగురించి చెబుతాను అని అంటూ 'ఇది సత్ కాదు, అసత్ కాదు' అనడమేమిటి? అని ప్రశ్నించుకొని శ్రీశంకరులు దీన్నిలా వివరించారు. సత్ అనగా అన్ని దృశ్యపదార్థాల్లోనూ 'ఉన్నది' 'ఉన్నది' అని చెప్పడానికి అవకాశమున్న తత్త్వం. వ్యక్తప్రపంచమంతా ఇందులో చేరుతుంది. బ్రహ్మను ఇది ఫలానా అని ఒక వస్తువును కొమ్ము పట్టుకొని (శృంగగ్రాహికయా) చూపినట్లుగా నిర్దేశించలేం. ఉన్నది అని చెప్పగలిగే ప్రతివస్తువుకూ కొన్ని ధర్మాలుంటాయి. అవి జాతి, క్రియ, గుణం, నామం అనేవి. ఉదాహరణకు ఆవు అనేది ఒక జాతి. చదువుతున్నాడు అనేది ఒక క్రియ. ఎఱ్ఱని పుష్పం అనేది ఒక గుణం. ఇలా ఏదో ఒక ధర్మముంటుంది. బ్రహ్మ నిర్గుణం, నిరవయవం (అవయవాలు లేనిది), కావున బ్రహ్మకు పై నాలుగు ధర్మాలూ లేవు.

అంటే అది వస్తుకోటికి చెందినదికాదు. నామ, రూప, క్రియ, జాతి, గుణములు ఏవీ లేనట్టిది బ్రహ్మ. అందువల్ల ఇది సత్ కాదు అన్నారు.

బ్రహ్మ సత్ కానప్పుడు అసత్ అవుతుంది కదా అని ప్రశ్న. అసత్ అంటే అసలే లేనిది. వంధ్యాపుత్రుడు (గొడ్రాలి కొడుకు), కుందేటి కొమ్ములాగా శబ్దం మాత్రం ఉండి వస్తువు లేనిది. బ్రహ్మ అలాంటిదా? అవునంటే మనమందరం నాస్తికమతంలోకి వెళ్ళిపోతాం. మరి ఎలాగంటే ఇంద్రియాలతో చూడగలిగేదానినే మనం ఉన్నది, లేదు అంటాం. బ్రహ్మ ఇంద్రియాలచే తెలియబడేది కాదు. అస్తి (ఉన్నది), అనడానికి నాస్తి (లేదు) అనడానికి వీలులేనిది.

మనిషికి జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ (స్వప్నంకూడా లేని గాఢనిద్ర) అను మూడు దశలున్నాయి. జాగ్రత్‌లోనూ, స్వప్నంలోనూ మనకు (అంతఃకరణానికి) కొన్ని విషయాలు తెలుస్తాయి. వీటిని వ్యక్తమంటాము. సుషుప్తిలో మనస్సు కూడా సెలవు తీసుకుంటుంది. అదొక అవ్యక్తదశ. అయినా దాన్ని గుర్తించే తెలివివుంటుంది. అందువల్లే నిద్ర మేల్కొని నేను సుఖంగా నిద్రించాను అనే జ్ఞానం మనకుంటుంది. ఆ అవ్యక్తదశలో కూడా చైతన్యముంది. ఈ కారణంవల్ల కూడా అసత్ అనడానికి వీల్లేదు.

కేనోపనిషత్తు **'అన్యదేవ తద్విదితాత్ అథో అవిదితాదధి'** (1-3) అనగా అది తెలియబడినదీ కాదు, తెలియబడనిదీ కాదు అని చెబుతుంది. బ్రహ్మ సత్ కాదు, అసత్తు కాదు అని అర్థం. సత్యము, అసత్యము కాదనో, ఉందో లేదో అనో అర్థంకాదు. శబ్దాలతో చెప్పజాలనిది అని అర్థం.

బ్రహ్మ అసలే లేదు అనే భావనను నిరాకరించడానికి తర్వాతి శ్లోకం

**సర్వతఃపాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్ ।**
**సర్వతఃశ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 13**

దాని హస్తాలు, పాదాలు అంతటా ఉన్నాయి (అన్ని ప్రాణుల హస్తాలు, పాదాలు దానివే). దాని కన్నులు, తలలు, నోళ్లు, చెవులు, అన్నివైపులా ఉన్నాయి. అన్నింటినీ ఆవరించివున్నది అని తాత్పర్యం.

అన్నిప్రాణుల్లోని అన్ని ఇంద్రియాలు దీని ఉపాధులు అనగా వీటిద్వారా బ్రహ్మ తెలియబడుతుంది. ఉపాధి అనేది ఒక మీడియంలాంటిది. అన్ని ఇంద్రియాలను అన్ని అంతఃకరణలను భాసింపచేసేది చైతన్యమే. ఈ చైతన్యమే బ్రహ్మ. అందుకే తర్వాతి

శ్లోకంలో **'సర్వేంద్రియ గుణాభాసం'** (శ్లో. 14) అన్నారు. అన్ని అంతఃకరణాల్లో ప్రతిఫలించే చైతన్యం (దీన్నే చిదాభాసుడు అంటారు) బ్రహ్మచైతన్యమే. ఇది వివిధ పాత్రల్లో ఉన్న ఆకాశంలాగా వేర్వేరుగా కనిపిస్తుంది. కానీ అన్ని క్షేత్రాల్లో ఉన్న క్షేత్రజ్ఞుడు ఒకటే.

ఇది (బ్రహ్మ) అన్ని ఇంద్రియాలను భాసింపచేసేదే కానీ **'సర్వేంద్రియ వివర్జితమ్'** (శ్లో. 14) – దీనికంటూ ఇంద్రియాలు లేవు. ఇది కేవలం జ్ఞానస్వరూపం. అందువల్లనే **'అసక్తం'** (శ్లో. 14) దేనితోనూ సంబంధంలేనిది. తనలో కల్పితాలైన ఇంద్రియాలతో ఎలాంటి సంగమం లేనిది. అలాగే **'సర్వభృత్'** (శ్లో. 14) – సర్వాన్నీ భరించేది, ప్రపంచమంతా ఆ బ్రహ్మచైతన్యమందే ఉన్నది. అన్ని వస్తువుల్లోనూ ఉన్నది, ఉన్నది అంటూ కనిపిస్తున్నది. ఎండమావుల్లో కూడా ఉన్నది అనే భావన. ఆ భావనకు ఆధారం కూడా బ్రహ్మచైతన్యమే.

**మిథ్య అంటే ?**

బ్రహ్మ నిర్గుణం. ఎలాంటి విశేషాలూ లేనిది. ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేనిదీ అనే విషయాన్ని మాటల్లో ఎలా చెప్పాలి. దీనికి వేదాంతశాస్త్రంలో ఒక ప్రక్రియ చెప్పారు. మొదటగా బ్రహ్మ నుండి ఈ ప్రపంచం అంతా వచ్చిందని చెప్పడం (మాయాశక్తి, హిరణ్యగర్భతత్త్వం మొదలైనవన్నీ), తర్వాత ఇవన్నీ కాదు, కాదు అంటూ ఒక్కోదానిని ప్రక్కకు నెట్టుతూ చివరకు మిగిలేది బ్రహ్మ అని చెప్పడం. దృశ్యమయ్యేదంతా సత్యంకాదు అనే మాటనే వేదాంతభాషలో జగత్తు మిథ్య అంటారు. ఇది ఒక పారిభాషిక పదం. జగత్తు మిథ్య అంటే బొత్తిగా లేదని కాదు. సాపేక్షికంగా (relativeగా) అనగా బ్రహ్మను గ్రహించినపుడు జగత్తు నశిస్తుంది. అది కూడా బ్రహ్మరూపంలోనే కనిపిస్తుంది. ఒకవైపు సత్యంకాదంటూనే అదే బ్రహ్మలో కల్పించిన రూపంగా చూడడం. ఇది వివరించడానికే పరస్పర విరుద్ధాలైన విశేషణాలు ఈ శ్లోకంలో వాడబడ్డాయి.

నిర్గుణం – గుణభోక్తృ (గుణాలను అనుభవించేది) అని అన్నప్పుడు బ్రహ్మ నిర్గుణమనేది మనకు తెలిసిందే. గుణాలను అనుభవించేది ఎలా అవుతుంది. సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలవల్ల సుఖం, దుఃఖం, మోహంలాంటి మనోవృత్తులు (mental cognitions) కలుగుతాయి. అంతఃకరణానికి సంబంధించిన ఈ వృత్తులన్నీ బ్రహ్మచైతన్యంవల్ల కలిగినవే. అందువల్ల గుణాలను అనుభవించేది అన్నారు.

15వ శ్లోకంలో ఇలాంటి పరస్పర విరుద్ధ విశేషణాలనే చూస్తాం. అన్ని భూతాల లోపలా, బయటా ఉన్న వస్తువు అన్నారు. బ్రహ్మ కేవలం క్షేత్రంలోనే కాదు దృశ్యానికి

బయటకూడా ఉన్న తత్త్వం. వంద ఘటాకాశాలు పోయినా అన్నింటి లోపలా, బయటా ఒకే ఆకాశం ఎలాగో బ్రహ్మతత్త్వం అలాగ. **'అచరం చరమేవ చ'** (శ్లో. 15) అనగా అచేతనం, చేతనం ఈ రెండూ బ్రహ్మయే. అందువల్లే అవిజ్ఞేయం అన్నారు. ఇంద్రియాలతో తెలుసుకొనేది కాదు కావున అది అప్రమేయం (ప్రమాణాలకు అందేది కాదు). అలాగే **'దూరస్థం'** (శ్లో. 15) – అజ్ఞానులకు దూరమైనది. **'అంతికే చ తత్'** (శ్లో. 15) – విద్వాంసులకు అతి దగ్గరగా ఉంది. అనగా విద్వాంసుల స్వరూపమే అది. కొత్తగా పొందేదికాదు. చైతన్యమే తమ ఆత్మ అని వారిచే తెలియబడేది.

తర్వాతి శ్లోకం కూడా ఇలాంటి విరుద్ధవిశేషణాలతో కూడినదే. బ్రహ్మలో విభాగాలు లేకపోయినా అది విభాగాలున్నట్లు కన్పిస్తుంది (శ్లో. 16). అఖండమైన (ఖండం లేని – అవయవాలులేని) చైతన్యాన్ని మనం భిన్నభిన్న నామరూపాలుగా చూడడమే బ్రహ్మను విభజించడం. ఒకే బ్రహ్మను మనం విభజించి చూస్తున్నాం. దానియందే ఆ రూపాలన్నీ కల్పించబడి అందులోనే విలీనమౌతున్నాయి కావున ఈ బ్రహ్మయే సృష్టికి, లయకు కారణమంటున్నాం (శ్లో. 16).

17వ శ్లోకం అది జ్యోతిస్సులకే జ్యోతిస్సు అని చెబుతుంది. అంధకారానికి దూరంగా ఉండేది. అంధకారాన్ని, వెలుగును గ్రహించేది తెలివితోనే. దీన్నే ఆత్మజ్యోతి అని బృహదారణ్యకోపనిషత్తులోని **'జ్యోతిర్బ్రాహ్మణం'** వివరిస్తుంది. అన్నింటినీ భాసింపచేసేది, చీకటిని కూడా భాసింపచేసేది, సుషుప్తిలో చైతన్యరూపంలో ఉండేది, మనలో ఉన్న తెలివి అనే జ్యోతియే. ఈ ఆత్మజ్యోతి లేనిదే సూర్యుడికి కాంతి ఉందని చెప్పలేం. వెలుగు స్వభావం ఇలా ఉంది. చీకటి స్వభావం ఇలా ఉంది అని చెప్పగలిగింది ఆత్మజ్యోతియే.

ఈ శ్లోకం రెండవ వాక్యంలో జ్ఞానం, జ్ఞేయం, జ్ఞానగమ్యం ఈ మూడూ ఒకటే అంటున్నాడు. అనగా ఒకే చైతన్యమే తెలుసుకొనేవాడు (**ప్రమాత**), తెలుసుకునే విధానం (**ప్రమాణం**), తెలుసుకోబడేది (**జ్ఞేయం**) అని మూడురకాలుగా ఉంది. పై వాక్యంలో జ్ఞానగమ్యం అంటే జ్ఞానఫలం. అనగా తెలుసుకొనదగినది. ఒకే చైతన్యాన్ని వివిధ దృష్టికోణాల్లో చూపించి చెప్పాడు శ్రీకృష్ణుడు. ఈవిధంగా క్షేత్రాన్ని, (జడప్రకృతిని) జ్ఞానాన్ని, జ్ఞేయాన్ని, తెలుసుకున్నవాడు నా భావంలోకి వస్తాడు అనగా భక్తుడే 'నేను' అవడానికి అర్హుడవుతాడని అర్థం. **'మద్భావాయోపపద్యతే'** (శ్లో. 18). ఇంత బ్రహ్మాత్మభావం

వచ్చిన తర్వాత జీవన్ముక్తుడు ప్రతిప్రాణిలో ఉన్న చైతన్యం నేనే అనే భావనలో ఉంటాడు. అదే సర్వాత్మభావం, అహం అనేది లేని భావం.

**ప్రకృతి - పురుషుడు :**

తర్వాతి ఐదు శ్లోకాల్లో (19 నుండి 23) ప్రకృతి – పురుషుడు గురించి చెప్పబడింది. ఇది ముందు అధ్యాయాల్లో వేరే మాటల్లో చెప్పినదే.

పరా = క్షేత్రజ్ఞుడు = పురుషుడు = జీవుడు.

అపరా = క్షేత్రం = ప్రకృతి = జగత్.

ఈ రెండూ అనాదులు అనగా ఆదిలేనిది, మాయాశక్తితో పాటే వచ్చినది. వీటితోపాటే సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలు వచ్చాయి (శ్లో. 19).

ప్రకృతిలో పై సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు అంశాలు ఉన్నాయని, వాటి సామ్యావస్థ / సమతౌల్యం / equilibrium మారినప్పుడు సృష్టి అనే సాంఖ్యుల ప్రతిపాదనను వేదాంతులు (నీలకంఠ వ్యాఖ్య) అంగీకరిస్తారు. పంచభూతాల పరిణామంగా ఐదు జ్ఞానేంద్రియాలు ఏర్పడ్డాయి. అనగా భూమి పరిణామంగా ఘ్రాణేంద్రియము (ముక్కు), వెలుతురు పరిణామంగా కన్ను ఇలా మిగతా ఇంద్రియాలు ఏర్పడ్డాయి. వాటితోపాటు మనస్సు, బుద్ధి, అహంకారము ఇవన్నీకూడా పనిముట్లలాంటివి. వీటినే కరణాలు అంటారు. ఈ కరణాల సమూహమంతా ఒక కార్యం (అనగా చేయబడినది), ఈ కార్యానికి కారణం ప్రకృతి (శ్లో. 20).

మరి పురుషుడెవరు? పురుషుడనగా అహంతో ముడిపడిన జీవచైతన్యం. ఆ సత్త్వరజస్తమోగుణాల ఫలితంగా వచ్చిన సుఖం, దుఃఖం మొదలైనవాటిని తన అనుభవాలుగా భావిస్తుంటాడు. ఇలాగ జీవచైతన్యం / పురుషుడు సుఖదుఃఖాల భోక్త అని పిలువబడతాడు (శ్లో. 20). తన సుఖదుఃఖాలుగా భావించడానికి కారణం అవిద్య, అజ్ఞానం, దీన్ని తత్త్వవిచారంద్వారా తొలగించుకోవాలి. ప్రకృతి గుణాలను చైతన్యగుణాలుగా భావిస్తూ, అధ్యాస చేస్తూ (super imposition) నేను సుఖీ, దుఃఖీ అని భావిస్తుంటాడు.

ఈ గుణాల ప్రభావంవల్లనే మంచి లేదా చెడుపనులు చేయడం, వాటి ఫలితంగా మంచి లేదా చెడు జన్మలు (జంతు, క్రిమి, కీటకాది జన్మలు) పొందడం జరుగుతుంది

(శ్లో. 21). ప్రకృతితో, అనగా జడమైన అంతఃకరణతో తాదాత్మ్యం కలవాడై అలా భావిస్తున్నాడు అని ఈ శ్లోకం చెబుతుంది.

**కర్త, కర్మ, క్రియ అన్నీ బ్రహ్మయే**

శరీరంలో జరిగే వివిధ కార్యాలకు కర్త, కర్మ, క్రియ భగవానుడేనని తర్వాతి శ్లోకం

**ఉపద్రష్టానుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః ।**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥ 22**

'శరీరంలో ఉన్న పరబ్రహ్మయే సాక్షిగా ఉండేవాడని, అనుమతించేవాడని, పోషకుడని, భోక్త అని, మహేశ్వరుడని, పరమాత్మయని చెప్పబడుచున్నాడు' అని తాత్పర్యం. అనగా అన్ని వేషాలూ ఒకే చైతన్యంలో కనిపించేవే. నాల్గవ అధ్యాయంలో **'బ్రహ్మార్పణం బ్రహ్మహవిః'** (శ్లో. 4-24) అన్నట్లు కర్త, కర్మ, క్రియ, కరణం అన్నీ ఆ స్వరూపాలే. **ఉపద్రష్ట** అనగా సాక్షిచైతన్యం లేదా అంతఃకరణాన్ని ప్రతిఫలింపచేసే చైతన్యం. **అనుమంత** అనగా అనుమతించేవాడు. అనగా ధర్మాధర్మకార్యాల్లో స్వేచ్ఛగా ప్రవర్తింపచేసేవాడు. **భర్తా** – ఆ భావాలన్నింటికీ అధిష్ఠానం (దేనిపై ఆధారపడి ఉన్నాయో ఆ తత్త్వం). **భోక్తా** – ఈ కార్యాలన్నీ చైతన్యస్వరూపమైన ఆత్మలోనే లయిస్తున్నాయని అర్థం.

ఇలా జడం-చేతనం, ప్రకృతి-పురుషుడు అని వివేకంతో తెలుసుకోగలవాడు లోకంలో అన్ని కార్యాలు చేసినా (కర్మయోగి అని అర్థం) అతనికి పునర్జన్మ ఉండదు (శ్లో. 23). అనగా అతని కర్మలు జ్ఞానంచే దగ్ధమౌతాయి.

**సాధనమార్గాలు**

శ్లో. 24,25లలో ఆత్మదర్శనానికి సాధనాలుగా ఈ క్రింది మార్గాలు చెప్పబడ్డాయి. 1) ధ్యానయోగం – మనస్సును పరమాత్మపై నిలిపి, ఒకేతీరుగా ఆలోచనాప్రవాహం ఉండేటట్లు నియంత్రించి ఉండడం. ఇది మనస్సు యొక్క నిశ్చలత్వానికి సహాయపడుతుంది. 2) కర్మయోగం – ఇది పై అధ్యాయాల్లో వివరింపబడింది. ఇది చిత్తశుద్ధి అనగా మనస్సు నిర్మలత్వానికి సహకరిస్తుంది. 3) జ్ఞానయోగం – పై అధ్యాయాల్లో వివరింపబడింది.

ఈ మూడూ వేర్వేరు మార్గాలు కావు. ఒకే మార్గంలో వివిధ మెట్లు. కర్మయోగం మొదటిమెట్టు. తర్వాత ధ్యానయోగం. తర్వాత జ్ఞానయోగం. వేదంలో కూడా కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ అని మూడు కాండలను చెబుతారు. అవే ఈ శ్లోకంలో చెప్పబడ్డాయి. కర్మయోగం ధ్యానయోగానికి బహిరంగసాధనమనీ, ధ్యానయోగం

జ్ఞానానికి అంతరంగసాధనమనీ 6వ అధ్యాయంలో గమనించాం. కాబట్టి ఇవన్నీ ఒకే మార్గంలోని వివిధ దశలు. ధ్యానయోగం, కర్మయోగం ఈ రెండూ కూడా బ్రహ్మజ్ఞానానికి స్వతంత్రంగా సాధనాలు కావు. పరంపరగా మోక్షానికి సహకరించేవి అని కూడా పై అధ్యాయాల్లో గమనించాం.

ఇవన్నీ చేయలేనివాళ్లు, కర్మనిష్ఠలో ఉన్నవాళ్లు (సత్కర్మలు చేస్తున్నవాళ్లు) చాలామంది. వారి గతి ఏమిటి? అంటే వారు కూడా శ్రుతుల్లో ఉన్న ఉపదేశాలను వింటూ క్రమక్రమంగా ఏదో ఒక మార్గంలోకి వచ్చి అజ్ఞానాన్ని అతిక్రమిస్తారు (శ్లో. 25). వీళ్లని **శ్రుతిపరాయణాః** అన్నారు. శ్రుతుల్లో చెప్పినదాన్ని విని కర్మ చేసేవాళ్లు, గొప్ప ఆలోచనాపరులు కారు, అయినా వీరు క్రమంగా సన్మార్గంలోకి వస్తారు.

**క్షేత్ర - క్షేత్రజ్ఞుల సంయోగం**

అధ్యాయం సారాంశం చివరి శ్లోకాల్లో చెప్పబడింది. ప్రపంచంలోని చేతనాలు, అచేతనాలు అన్నీ కూడా క్షేత్ర–క్షేత్రజ్ఞుల సంయోగంతో ఏర్పడినవే (శ్లో. 26). క్షేత్రం = అచేతనం. క్షేత్రజ్ఞుడు = చేతనుడు అని చెప్పి వాటి సంయోగమెలా చెప్పగలం? చైతన్యానికి అవయవాలు లేవు. అవయవాలుంటేనే ఏదో ఒక సంబంధం కుదురుతుంది. అందువల్ల ఇక్కడ సంబంధమంటే ఒకదాని ధర్మాలు వేరొకదానిపై భావించుకోవడమనేదే సంబంధం. ఈ భావననే అధ్యాస అని పైన చూశాం. అంతఃకరణం జడం. దీని ధర్మాలను చేతనమైన జీవునికి సంబంధించినవిగా భావించడంవల్ల. ఈ సంబంధం పాముకి దానిపై భ్రమవల్ల కన్పించే త్రాడుకి ఉన్న సంబంధం. జ్ఞానంవల్ల తొలగిపోయేది.

ఇదే భావం 27వ శ్లోకంలో చెప్పారు. సమస్తభూతాల్లో సమంగా ఉంటుంది బ్రహ్మ. సమమంటే పరిణామం చెందనిది. నశించే శరీరాలతో ఇది నశించదు. ఘటాలు ఎన్ని నశించినా ఆకాశం నశించనట్లు. సమం = బ్రహ్మ అనే భావాన్ని 5వ అధ్యాయంలో **'శునిచైవ శ్వపాకే చ'** (5–18) అనే శ్లోకంలో తెలుసుకున్నాం.

**ఆత్మహత్య**

28వ శ్లోకం ఆత్మహింసను గూర్చి చెబుతుంది. "అన్ని ప్రాణుల్లోనూ ఉన్న పరమేశ్వరుని సమంగా చూడగలిగినవాడు తన ఆత్మను తాను హింసించడు". ఆత్మను హింసించడమేమిటి? ఆత్మను అనాత్మగా చూడడం, జడానికున్న గుణాలను దీనిపై భావించడం, హింసించడమంటే ఇదే. ఇలా చేసినవాణ్ణి ఆత్మహనుడు – ఆత్మను హింసించినవాడు అంటుంది గీత. ఆత్మను ఎరుగకపోవడమే ఆత్మహత్య. ఇదే పదాన్ని

## పదమూడవ అధ్యాయం

ఈశావాస్యోపనిషత్తు కూడా **'యే కే చాత్మహనో జనాః'** (3వ మంత్రం) అనే మంత్రంలో చెబుతుంది. ఈ ఆత్మహనులైన జనులు ఆసురీలోకాలకు అంటే అధోలోకాలకు వెళతారని పై మంత్రం చెబుతుంది.

ఈ ఆత్మ అకర్త అని 29వ శ్లోకం. కర్మలన్నీ ప్రకృతితో చేయబడేవే, అనగా గుణాల ప్రభావంచే చేయబడేవే. ఈ విధంగా ఆత్మను అకర్తగా చూసినవాడు సరైన సాధకుడు. ప్రాణులు వేర్వేరుగా ఉన్నా వీటన్నింటియందు ఒకే ఆత్మ, దానియందే భూతాల ఉత్పత్తి, వికాసం అని తెలుసుకున్నవాడు బ్రహ్మగానే అవుతాడు (శ్లో. 30). బ్రహ్మజ్ఞాని బ్రహ్మయే అనే ఉపనిషద్వాక్యం దీనినే చెబుతుంది.

ఆత్మ కేవలం **'శరీరస్థః'** (శ్లో. 31) – శరీరం ఉపాధిగా కలది. ఉపాధి ఉన్నది కావున మనం ఆత్మను ఊహించగలుగుతున్నాం. ఉపాధి లేకుంటే వట్టి చైతన్యంగానే ఉండేవాళ్లం. ఉపాధి ఆత్మకు ఉపలబ్ధిస్థానం (అనగా దొరికేస్థలం). చైతన్యప్రతిఫలనం (reflection) ఇక్కడ ఉన్నది అని తెలుసుకునేస్థానం. ఆకాశంలో కాంతిని నేరుగా చూడలేం. అది ఏదైనా అద్దంపై లేదా వస్తువుపై ప్రతిఫలించినపుడే కాంతిని చూడగలం. అలాగ అంతఃకరణంలో ప్రతిఫలించడంవల్లనే చైతన్యాన్ని తెలుసుకోగలుగుతున్నాం.

33వ శ్లోకంలో సూర్యుడి ఉదాహరణ. సూర్యుడెలాగ లోకాన్నంతా ప్రకాశింప చేస్తున్నాడో అలాగే క్షేత్రి అయిన పరమాత్మ అన్ని దేహాలను ప్రకాశింప చేస్తున్నది. క్షేత్రం కలది క్షేత్రి. పైన చెప్పినట్లు క్షేత్రం ఆత్మను వెతికిపట్టుకునే స్థానం.

ఈవిధంగా క్షేత్రం (జడమైన ప్రపంచం), క్షేత్రజ్ఞుడు (చేతనం) అనే రెండింటి భేదాన్ని జ్ఞానచక్షువుతో చూడడం, దీనితోపాటు ప్రకృతి ఎలాగ మోక్షం పొందుతుందో (అనగా అవిద్యవల్ల చైతన్యంలో ఆభాసగా కనిపించేదే ప్రకృతి అని తెలుసుకోవడంతో అది తొలగిపోతుంది) తెలుసుకున్నవాడు పరమాత్మను పొందుతాడు. మాయ, అనగా ప్రకృతి దీనికి ఉపాదానకారణం (material cause) అని పైన తెలుసుకున్నాం. జ్ఞానంవల్ల అది బ్రహ్మలోనే లయమౌతుంది. ఈవిధంగా జీవుడు, జడం అని రెండు రూపాలుగా కాకుండా ఈ రెండూ పరమాత్మ చైతన్యంలో లయమయ్యేవే అని గ్రహించడం ఈ అధ్యాయ సారాంశం.

❖ ❖ ❖

## పదునాల్గవ అధ్యాయము

# గుణత్రయ విభాగ యోగము

సృష్టిలో ప్రతి వస్తువూ (మనిషి, జంతువు, వృక్షాలు మొ॥ అన్నీ) క్షేత్రం, క్షేత్రజ్ఞుడు అనే రెంటి కలయికవల్ల పుడుతుందని గత అధ్యాయంలో (26వ శ్లోకంలో) చెప్పారు. అది ఎలాగ అని ప్రస్తుత అధ్యాయం.

ఈ అధ్యాయంలో 27 శ్లోకాలు. వీటిని మూడు విభాగాలుగా చూడవచ్చు. మొదటి 5 శ్లోకాల్లో సృష్టి వివరణ. 6 నుండి 18 వరకు త్రిగుణాలు, వాటి ప్రభావంవల్ల మనిషి ఎలా వ్యవహరిస్తాడు అనే విషయం. 19 నుండి చివరి వరకూ గుణాలకు అతీతంగా ఎదగడం ఎలా, గుణాల పట్టునుండి విడిపించుకోవడమెలా? అని సాధన ఉపాయాలు, అలా విడిపించుకున్నవాడి లక్షణాలు ఏమిటి? అని రెండూ చెప్పబడ్డాయి.

క్షేత్రం, క్షేత్రజ్ఞుల సంగం ఎలాంటిది?

**మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।**
**సంభవః సర్వభూతానాం తతో భవతి భారత ॥ 3**

మహత్ బ్రహ్మ నాకు సంబంధించిన మాయ (ఇక్కడ నేను అంటే మాయకు అతీతమైన శుద్ధ నిర్గుణ చైతన్యం). దానియందు నేను గర్భాన్ని (సృష్టిబీజాన్ని) ఉంచుతాను. దానినుండి సమస్త భూతాల పుట్టుక జరుగుతుంది అని తాత్పర్యం. ఈ శ్లోకంలో మహద్బ్రహ్మ అనగా మాయాశక్తి, త్రిగుణాలతో కూడిన ప్రకృతి. ఇది అన్నింటిలో వ్యాపించి ఉండడంవల్ల దీనిని ఔపచారికం (figurative) గా బ్రహ్మ అన్నారు. దీనియందు గర్భాన్ని ఉంచుతున్నాను అనగా మాయాశక్తి నుండి మొట్టమొదట కనిపించే హిరణ్యగర్భ తత్త్వం (cosmic mind). దీని పుట్టుకకు నేను బీజాన్ని ఉంచుతున్నాను, అనగా శక్తిని ఉంచుతున్నాను. ఇక్కడే క్షేత్రం, క్షేత్రజ్ఞుడు రెండూ కలిశాయి. క్షేత్రంలో ఉన్న అంశాలు త్రిగుణాలు. వీటి గురించి అనేకచోట్ల ఇదివరకే చెప్పబడింది. వీటివల్లనే రాగద్వేషాలు మొదలయ్యాయి. ఇవి చైతన్యరూపుడైన జీవునిలో కలుస్తాయి. అనగా వీటి ప్రభావానికి చేతనుడు లోబడడం జరుగుతుంది. దీనినే 4వ శ్లోకం వివరిస్తుంది.

**సర్వయోనిషు కౌన్తేయ మూర్తయః సంభవన్తి యాః ।**
**తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా ॥ 4**

అన్ని యోనులయందు (సమస్త జీవరాశియందు) ఏయే మూర్తులు (శరీరాకారాలు) ఏర్పడుతున్నాయో వాటన్నింటికీ కారణం మహద్బ్రహ్మ (మాయాశక్తి). నేను బీజాన్నిచ్చే

తండ్రిని అని తాత్పర్యం. ఇక్కడ మూర్తులు అనగా పంచభూతాల కలయికతో ఏర్పడే రక్తం, మాంసం, మజ్జ మొ॥ ధాతువులతో ఏర్పడే శరీరాలు. ఇదంతా అపరా ప్రకృతి (7వ అధ్యాయంలో చెప్పినట్లు మనస్సు, బుద్ధి కూడా ఇందులో చేరతాయి). చైతన్యంయొక్క బీజం / గర్భం అంటే చైతన్యం యొక్క ఆభాస. సూర్యకాంతి దర్పణంపై పడగా దర్పణం ప్రతిబింబించినట్లు చైతన్యం అపరాప్రకృతిలో ప్రతిఫలిస్తుంది.

5వ శ్లోకం సత్త్వరజస్తమోగుణాలనే మూడు అంశాలు మాయకు సంబంధించినవే. అవి అవ్యయమైన (ఎలాంటి మార్పులేని, చైతన్యరూపుడైన) జీవుణ్ణి బంధిస్తాయి అని చెబుతుంది. అవ్యయం, అవికారి అయినదాన్నీ, అవయవాలు లేనిదాన్నీ బంధించలేం. అందుకే బంధించినట్లు అగుపడతాయని అర్థం చెప్పారు. హిరణ్యగర్భతత్త్వంలోనే క్షేత్రం – క్షేత్రజ్ఞుల సంయోగం (జడ, చేతనాల సంయోగం) అని ఈ శ్లోకంలో తెలుస్తుంది. ప్రకృతిలోని గుణాలతో తాదాత్మ్యం పొందడం, ఆ గుణాలు నా స్వరూపమనుకోవడం, దానికి అనుగుణంగా కర్మలు చేయడం, వాటి ఫలితంగా దేవ, మనుష్యాది జన్మలుగాని, నీచజన్మలు గాని (పశువులు, వృక్షాలు, లతలు మొ॥) ఎత్తడం జరుగుతుంది. దీన్ని వదలించుకోవడమెలాగ అంటే ఈ గుణాలు నా తత్త్వంకాదు, స్వరూపం కాదు అని గ్రహించడం.

పై మూడు శ్లోకాలను ఈవిధంగా అర్థం చేసుకోవచ్చు.

**శుద్ధచైతన్యం (బ్రహ్మ)**

|

**మహత్ (మాయ)**

|

**హిరణ్యగర్భుడు**

|

**జగత్తు (అపరా)** — **జీవుడు (పరా)**

ఈ రెండింటినీ పుట్టుకతోనే ముడివేసేవి గుణాలు. గుణాలు అంటే కట్టివేసే త్రాళ్లు అని కూడా పైన తెలుసుకున్నాం.

**త్రిగుణాలు వాటి ప్రభావం**

6వ శ్లోకం నుండి పద్దెనిమిదవ శ్లోకం వరకూ వీటి స్వభావం చెప్పబడింది. ఈ మూడూ ప్రకృతిలోని అంశాలు. మూడూ జీవుణ్ణి బంధించేవే. ఒకటి బంగారు సంకెళ్లతో బంధిస్తే, మిగతావి ఇనుప సంకెళ్లతో బంధిస్తాయి. వీటిని స్థూలంగా ఈ క్రింది విధంగా చూడవచ్చు.

| సత్త్వము | రజస్సు | తమస్సు |
|---|---|---|
| నిర్మల స్వభావం, ప్రకాశస్వరూపం | కోరికలతో కూడినది, కలుషితమైనది | అలసత్వము, పొరపాట్లు చేయడం |
| సుఖంగా ఉండడం కోరుకుంటుంది. | ఎప్పుడూ ఏదో సాధించాలని వెంపర్లాడుతుంటుంది. | క్రియాశీలత లేకపోవడం, నిద్ర |
| జ్ఞానంయందు ఆసక్తి వుండేలా చేస్తుంది. | పనిలో లగ్నమై ఉంటుంది. | అజ్ఞానంలో ఉంటుంది. |

ఒక్కోసారి సత్త్వము మిగతా రెండింటిని అణచివేసి విజృంభిస్తూ ఉంటుంది. ఒక్కోసారి రజస్సు మరోసారి తమస్సు విజృంభిస్తుంటాయి (శ్లో. 10).

ఈ గుణాలను ఎలా గుర్తించాలి? మనిషి ఉన్న స్థితినిబట్టి గుర్తించాలి. అన్ని ఇంద్రియద్వారాలు, జ్ఞానంచేత ప్రకాశింపబడినపుడు (అనగా 4వ అధ్యాయంలో చెప్పినట్లు ఇంద్రియాలచే సాత్త్విక వ్యవహారాలను చేస్తున్నపుడు) ఆ ప్రకాశమనే చిహ్నాంచే సత్త్వగుణంలో ఉన్నట్లు గ్రహించాలి (శ్లో. 11). అలా కాకుండా ఎప్పుడూ ఒక కర్మయందు పట్టుదల, సాధించాలనే కోరిక, లోభం, అలుపు లేకుండా పోరాడే స్వభావం, ఇవన్నీ ఉన్న పక్షంలో రజోగుణం ఉందని గ్రహించాలి (శ్లో. 12). ఎలాంటి పురుష ప్రయత్నం లేకుండా అలసత్వం (సోమరితనం)లో ఉండడం, పొరపాట్లు చేస్తుండడం, మోహంలో ఉండడం, ఇవి తమోగుణంచే ఏర్పడతాయి (శ్లో. 13).

ఈ వ్యక్తుల మరణానంతర గతి ఎలా ఉంటుంది? సత్త్వగుణంలో మరణించిన వ్యక్తి సాధుకర్మలు చేసేవాళ్లు వెళ్లే నిర్మలమైన లోకాలకు వెళతాడు (శ్లో. 14). రజోగుణంలో ఉంటూ మరణించినవాడు మళ్లీ అదే గుణంతో కర్మలయందు ఆసక్తితో జన్మిస్తాడు

(శ్లో. 15). తమోగుణంలో ఉండి మరణించినవాడు మళ్లీ అలాంటి జన్మలనే గ్రహిస్తాడు (శ్లో. 15).

సత్త్వంవల్ల క్రమేణ జ్ఞానం ప్రాప్తిస్తుంది. రజస్సు వల్ల లోభం, కర్మసంగం కలుగుతాయి. తమోగుణం అజ్ఞానానికి, మోహానికి దారితీస్తుంది (శ్లో. 17).

సత్త్వగుణంలో ఉన్నవారు దేవలోకాలకు వెళతారు. రజోగుణం ఉన్నవారు మనుష్యలోకంలో జన్మిస్తుంటారు. తమోగుణం ఉన్నవారు పశ్వాది జన్మలు గ్రహిస్తారు (శ్లో. 18).

**గుణాలనుండి విముక్తి ఎలా?**

ప్రకృతి (సత్త్వరజస్తమోగుణాలు) జీవుణ్ణి ఎలా బంధిస్తుంది అని పై శ్లోకాల్లో వివరింపబడింది. ఈ గుణాల (త్రాళ్ల) బంధంనుండి ఎలా విముక్తి పొందాలి అంటే మిథ్యాజ్ఞానాన్ని తొలగించుకోవడం, సరైన జ్ఞానాన్ని పొందడం. గుణా గుణేషు వర్తంతే – గుణాలే వాటి విషయాల్లో ప్రవర్తిస్తున్నాయి. కానీ 3వ అధ్యాయంలో చెప్పిన విషయాన్ని ఇక్కడ మళ్లీ చెబుతున్నాడు.

**నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥ 19**

ఈ గుణాలే తప్ప అన్యుడైన కర్త ఎవరూ లేడు అని గ్రహించాలి. గుణాలకతీతంగా గుణాలకంటే విలక్షణంగా ఉన్న ఆత్మచైతన్యాన్ని ఎవడు తెలుసుకుంటాడో అతడు నా స్వరూపాన్నే పొందుతాడు అని తాత్పర్యం. ఈ గుణాలు, వాటి క్రియలైన కామక్రోధాలు కేవలం అంతఃకరణధర్మాలు, ఆత్మధర్మాలు కావు అని గ్రహించడం ముఖ్యం. అందుకే మనం నిత్యకర్మయైన సంధ్యావందనంలో **కామోఽకార్షీన్నమోనమః, మన్యురకార్షీన్నమోనమః** – కామమే ఈ పని చేసినది, కోపమే ఈ పని చేసినది అని ప్రాయశ్చిత్తం చెప్పుకోవడం చూస్తాం. శరీరంతోపాటు ఇంద్రియాలు, అంతఃకరణం, ఈ సంఘాత మంతా ప్రకృతి. మూడు గుణాలతో కూడినది. దీనివల్లనే కామక్రోధాదులు కలుగుతాయి. దీనికి విలక్షణమైనది ఆత్మచైతన్యం. అందుకే తర్వాతి శ్లోకంలో "దేహానికి సంబంధించిన ఈ గుణాలను అతిక్రమించు" (శ్లో. 20) అంటాడు శ్రీకృష్ణుడు అనగా అవి నీ ధర్మాలు కావు అని చెబుతాడు.

ఇక్కడ సత్త్వగుణం గురించి పండితులు ఒక హెచ్చరిక చేస్తారు. సత్త్వగుణంవల్ల ఏవో మంచికార్యాలు చేస్తూ అందరి ప్రశంసలూ పొందడం, తాను మంచిపని చేస్తున్నానని

సుఖానుభవం పొందడం, ఇది కూడా బంధనమే. లోకంలో అలాంటి ప్రవృత్తి చాలా అవసరమే. కానీ మోక్షం కోరుకునేవాడు ఈ బంధాన్ని కూడా అతిక్రమించాలి. అంటే కర్తృత్వభావన లేకుండా, సుఖానుభవం లేకుండా సత్కర్మలు చేస్తుండాలి.

ఇలా గుణాల క్రియలన్నింటినీ తప్పించుకోగలిగితే వాటి ఫలమైన జన్మ, మృత్యు పరంపరనుండి కూడా మనిషి విముక్తుడు కాగలడు (శ్లో. 20).

**గుణాతీతుడెలా ఉంటాడు**

గుణాతీతుడనగా గుణాలబంధం నుండి బయటపడినవాడు. ఇక్కడ అర్జునుడి ప్రశ్న రెండు భాగాలుగా ఉంది. అ) ఎలాంటి చిహ్నాలవల్ల / లక్షణాలవల్ల గుణాతీతుణ్ణి గ్రహించగలం? ఆ) ఎలాంటి ప్రవర్తన ఉన్నవాడు ఈ గుణాలను అతిక్రమించ గలుగుతాడు? (శ్లో. 21).

అధ్యాయం చివరి వరకూ గుణాతీతుని లక్షణాలు చెప్పబడ్డాయి. లక్షణాలేవో అవే సాధన మార్గాలని రెండవ అధ్యాయంనుండి గమనిస్తూ వచ్చాం. గుణాతీతుడన్నా, స్థితప్రజ్ఞుడన్నా, జ్ఞానిభక్తుడన్నా, జీవన్ముక్తుడన్నా ఒకే అర్థం. వీరికి చెప్పిన లక్షణాలన్నీ ఒకేవిధంగా ఉన్నాయి. ఆ లక్షణాలన్నీ నాకు ఉన్నాయా? లేదా? అని సాధకుడు తన్నుతాను పరిశీలించుకోవాలి. ఇది వాడికే తెలిసే విషయం.

గుణాలు వాటి క్రియలైన కామక్రోధాదులన్నీ దృశ్యాలే. అనగా తెలియబడేవే. ఏది తెలియబడుతుందో అది తనకంటే భిన్నంగా తెలియబడుతుంది. కేవలం దృక్ రూపంగా సాక్షిగా ఉండడం, సాక్షిగా ఉంటూ ఉపాధికి సంబంధించిన కర్మను ఆచరించడం, ఇవి ఈ క్రింది శ్లోకాల్లో విషయాలు.

1. గుణాల కార్యాలైన ప్రకాశం, ప్రవృత్తి, మోహం (ఇవి పైన వివరింపబడ్డాయి). ఈ మూడింటిని ప్రేమించడు, ద్వేషించడు. ఆ గుణాల కార్యాలను కోరుకొనడు (శ్లో. 22).
2. ఉదాసీనుడు (ఉత్+ఆసీనః = అన్నింటికంటే పైన ఉన్నవాడు)గా ఉంటాడు. గుణాలు వాటి పనులు అవి చేస్తున్నాయి అని వాటిచేత ప్రభావితుడు కాకుండా ఉంటాడు (శ్లో. 23). (నేను చేయడంలేదు, గుణాలదే బాధ్యత అని చెడుకార్యాల్లో ప్రవర్తిస్తే అతడు కర్తృత్వభావనలో ఉన్నవాడు కావున ఆత్మవంచన, పరవంచన చేసేవాడు అవుతాడు).

3. సుఖం కలిగించే విషయంలో, దుఃఖం కలిగించే విషయంలో ఎలాంటి చలనం లేకుండా స్వస్థుడిగా (స్వరూపంలో) ఉంటాడు. మట్టిగడ్డను, బంగారాన్ని ఒకేవిధంగా చూస్తాడు. ఎవరైనా నిందించినా, స్తుతించినా సమానంగా చూస్తాడు (శ్లో. 24).

4. మానావమానాల్లోనూ, శత్రువులయందు, మిత్రులయందు సమానభావంతో ఉంటాడు. సమస్తకార్యాలను త్యజిస్తాడు (శ్లో. 25). రెండవ అధ్యాయంలో ద్వంద్వాతీతుడని ఇతడికే చెప్పబడింది.

5. చలించని భక్తితో (అవ్యభిచారిణియైన భక్తితో) నన్నే సేవిస్తుంటాడు. అలాంటి వాడు **బ్రహ్మభూయాయ కల్పతే** (శ్లో. 26) – బ్రహ్మ కావడానికి సమర్థుడౌతాడు. **బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి** – బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మయే అవుతాడని సిద్ధాంతం. అనగా ఇదివరకు తాను బ్రహ్మగానే ఉండికూడా జీవభావంతో నేను సుఖి, దుఃఖి అనే భావంలో ఉన్నాడు. ఇప్పుడు జీవభావం తొలగిపోయిన తర్వాత కొత్తగా వచ్చినదేమీ లేదు. బ్రహ్మ కావడమంటే తన రూపాన్ని తాను తెలుసుకోవడమే. సంధ్యావందనంలో **బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి** – బ్రహ్మగానే ఉంటూ బ్రహ్మను పొందుతాడు అనే మంత్రం ఇదే చెబుతుంది. ఉపనిషత్తులు ఈ భావాన్నే మళ్లీ మళ్లీ చెబుతాయి.

చివరి శ్లోకం మామూలుగా రాబోయే అధ్యాయానికి బీజంగా ఉంటుంది. అలాంటి శ్లోకమే ఇక్కడకూడా.

**బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమమృతస్యావ్యయస్య చ ।**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖ స్యైకాన్తికస్య చ ॥ 27**

నాశరహితము, అవ్యయము (మార్పులేనిది), ధర్మరూపమైనది అయిన బ్రహ్మ (హిరణ్యగర్భ బ్రహ్మ, మాయాశక్తితో కూడిన బ్రహ్మ)కు నేనే ప్రతిష్ఠ అనగా పర్యవసానం. బ్రహ్మానందానికి పర్యవసాన స్థానం నేను అని తాత్పర్యం.

బ్రహ్మలో సగుణ, నిర్గుణస్థాయిలు రెండు చూశాం. నిర్గుణబ్రహ్మలో వ్యక్తమయ్యే తత్త్వమే సగుణబ్రహ్మ. ఆ సగుణబ్రహ్మకు పర్యవసానమైన స్థానం నిర్గుణమే. అలాగే ధర్మానికీ పర్యవసానం పరబ్రహ్మయే. బ్రహ్మానందంద్వారా జ్ఞాని అనుభవించే స్థితి అదే అని అర్థం.

❖ ❖ ❖

## పదునైదవ అధ్యాయము

# పురుషోత్తమప్రాప్తి యోగము

భగవద్గీతలోని చివరి ఆరు అధ్యాయాలను 'సాధనషట్కం' అని వ్యవహరిస్తారని తెలుసుకున్నాం. సాధన అంటే నిరంతరం చేయాల్సిన మానసిక అభ్యాసం. ఒక పాత్రనుండి తైలాన్ని మెల్లగా పోస్తున్నప్పుడు అదొక ధారలాగా వస్తుంది. అట్టి ధారలాగా ఆలోచనా ప్రవాహం అవిచ్ఛిన్నంగా బ్రహ్మతత్త్వంపై ఉండడం **(తైలధారావత్ తుల్య ప్రత్యయ సంతతిః)** అంటారు శ్రీశంకరులు. 'త్వం' అయిన జీవుడు 'తత్' అనగా బ్రహ్మగా మారడానికి, బ్రహ్మ లక్షణాలు అలవరచుకోవడానికి సాధనలు ఈ అధ్యాయాల్లో చెప్పబడ్డాయి. వేదాంతంలోని ముఖ్య విషయాలన్నీ మొదటి 12 అధ్యాయాల్లో చెప్పారు. అక్కడక్కడా జ్ఞాని లక్షణాలు (వాటినే సాధనాలని) చెప్పారు. ఈ అధ్యాయంలో విషయం ఇదివరకు చెప్పినదే అయినా ఒక కొత్త దృష్టికోణం, కొత్త ఉపమానంద్వారా చెప్పబడింది.

ఇది 20 శ్లోకాలున్న చిన్న అధ్యాయం. మొదటి మూడు శ్లోకాల్లో సంసారాన్ని ఒక వృక్షంగా వర్ణిస్తారు. ఈ వృక్షానికి పై భాగంలో వ్రేళ్లు, క్రిందివైపుగా కొమ్మలు, ఆకులు, పూవులు లాంటివి ఉంటాయి. 4,5 శ్లోకాలు ఈ వృక్షాన్ని ఎలా ఛేదించాలి అని చెబుతాయి. శ్లో. 6 నుండి 20 వరకు ఇదివరకు అధ్యాయాల్లో చెప్పిన విషయాలను పునశ్చరణ. జగత్తు, దానికి మూలమైన మాయ, మాయకు అతీతమైన బ్రహ్మ. ఇవి ఇందులో విషయాలు. ఈ బ్రహ్మయే పురుషోత్తముడనే పేరిట చెప్పబడింది. దాన్ని పొందడమే పురుషోత్తమప్రాప్తి.

**సంసారవృక్షం**

సంసారాన్ని పలుచోట్ల పలురకాలుగా వర్ణించడం చూస్తాం. సంసారాన్ని సముద్రంగా కొన్నిచోట్ల, ఎడతెగని ప్రవాహంగా కొన్నిచోట్ల, ఎప్పుడూ తిరిగే చక్రంగా కొన్నిచోట్ల ఇలాగ. కఠోపనిషత్తులో ఈ సంసారాన్ని పై భాగంలో వ్రేళ్ళు (అవ్యక్తంగా – కనబడకుండా) శాఖలు క్రిందకు ఉన్న విచిత్రవృక్షంగా వర్ణించారు. ఆ కల్పనే ఇక్కడ చెప్పబడింది. ఈ శ్లోకంలో అర్జునుడి ప్రశ్నలు లేవు. శ్రీకృష్ణుడే నేరుగా విషయాన్ని ప్రస్తావిస్తాడు.

**ఊర్ధ్వమూలమధఃశాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్।**
**ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 1**

**ఊర్ధ్వమూలః** – అంటే వ్రేళ్లు ఆకాశంలోకి కలది. అనగా దీని కారణం పైన ఎక్కడో

ఉంది. అది మాయాశక్తితో కూడిన పరబ్రహ్మ, ఇతడే సృష్టికర్త లేదా హిరణ్యగర్భుడు అని పై అధ్యాయాల్లో చూశాం.

**అధఃశాఖః** – శాఖలు క్రిందికి కలది. పుట్టుక పైనుండి అయినా వ్యాప్తి అంతా క్రిందనే. ఇవన్నీ కనిపిస్తుంటాయి.

**అశ్వత్థం** – ఈ చెట్టు పేరు అశ్వత్థం. వ్యవహారంలో దీనిని రావిచెట్టు అంటారు. కాని ఇక్కడ వ్యుత్పత్తి అర్థాన్ని గ్రహించాలి. శ్వః (రేపు) నతిష్ఠతి (ఉండదు) ఇతి అశ్వత్థః అని దీని వ్యుత్పత్తి. అనగా ప్రస్తుతం కనిపిస్తున్నది మరుక్షణంలో ఉండకపోవచ్చు. జ్ఞానం కలుగనంతవరకూ దృఢంగా, బలంగా కనిపిస్తుంది. జ్ఞానం కలిగినవెంటనే అది ఒక ఇంద్రజాలికుడు సృష్టించిన భవనంలా అదృశ్యమౌతుంది అని అర్థం.

**అవ్యయం** – ఈ చెట్టు అనాదికాలంనుండి వస్తున్నది కావున అవ్యయం అన్నారు. జ్ఞానం కలుగనంతవరకూ అవ్యయం. ఎన్నెన్నో శరీరాలు గ్రహిస్తూ వచ్చిన ప్రతి జీవుడిదీ ఈ సంసారవృక్షం. ప్రతి ఒక్కరికీ ఈ సంసారవృక్షం అనాదిగా ఉండనేవుంది. అంటే చీమకూ, దోమకూ కూడా ఈ అశ్వత్థవృక్షం వుంది. ఎవడి వృక్షం వాడిదే. ఈ చెట్టుకు ఆకులు (చెట్టుకు పోషణనిచ్చేవి) ఏవి అంటే **ఛన్దాంసి** – అనగా వేదాలు అన్నారు. ధర్మం, అధర్మం అనే వాటిని తెలుపుతూ రక్షణనిస్తాయి. దీనిని తెలిసినవాడే పండితుడు. (ఈ శ్లోకం మననానికి, సాధనకు ఉపకరించే శ్లోకం. సంసారవృక్షంపై వైరాగ్యభావన రావడంకోసం ఈ రూపకం (metaphor) అని వ్యాఖ్యాతలు వివరించారు).

రెండవ శ్లోకం ఈ చెట్టునే వర్ణిస్తుంది.

**అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాళాః ।**
**అధశ్చ మూలాన్యనుసంతతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥ 2**

దీని శాఖలు క్రిందికి, పైకీ వ్యాపించి వున్నాయి. మూడు గుణాలచే ఇవి వృద్ధి చెందుతున్నాయి. ఇంద్రియాలు గ్రహించే విషయాలు వీటికి చిగుళ్ళలాంటివి. ఈ విచిత్రమైన వృక్షం యొక్క వ్రేళ్ళు మనిషి చేసే కర్మనుబట్టి మనుష్యలోకంలో కూడా అల్లుకుంటున్నాయి అని శ్లోకార్థం.

ఈ వృక్షం కొమ్మలు సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలవల్ల వృద్ధి చెంది పైకీ, క్రిందికీ వ్యాపించివున్నాయి. సత్త్వగుణంవల్ల పై భాగానికి అనగా తత్త్వచింతనకు దోహదంగా పైకి వ్యాపిస్తాయి. మిగతా రెండు గుణాలవల్ల క్రిందివైపు వ్యాపిస్తాయి ఈ

గుణాల ప్రభావంవల్లనే మంచీ, చెడూ విషయాలను జీవుడు గ్రహిస్తాడు. ఈ విషయాలే చిగుళ్ళు.

కర్మలకు అనుబంధం (అను = తర్వాత, బంధం = బంధం) అనగా ఫలం తప్పక ఉంటుంది. ఈ ఫలాలన్నీ అల్లుకుపోయి ఉంటాయి. మంచీ, చెడూ మిశ్రణంవల్ల అన్నీ వ్రేళ్లలాగా అల్లుకుపోయి ఉంటాయి.

**మనుష్యలోకే** – అంటే మనుష్యలోకంలో అని అర్థం. ఈ పదం ముఖ్యమైనది. కర్మలన్నీ మనుష్యలోకంలోనే. మనుష్యలోకమంటే భూలోకమని కాదు, మనుష్యజన్మలోనే అని అర్థం. మనుష్యజన్మయే కర్మభూమి (కర్మ చేయడానికి స్థానం) అంటారని పైన చూశాం. మిగతావన్నీ (దేవతాస్వరూపాలు కావచ్చు, జంతుశరీరాలు కావచ్చు, క్రిమికీటకాలు కావచ్చు) భోగభూములు, కర్మఫలాన్ని అనుభవించడానికున్న స్థానాలు.

దీనిని ఛేదించే సాధనం మూడవ శ్లోకంలో **అసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా** – అనగా అసంగము, వైరాగ్యము అనే ఆయుధంతో ఛేదించగలం అని అర్థం. ఈ చెట్టుకూ ఆది, అంతం, ఒక ఆధారస్థానం ఫలానా అని చెప్పలేం. ఈ దృఢమైన వ్రేళ్ళున్న అశ్వత్థాన్ని వైరాగ్యమనే శస్త్రమే ఛేదిస్తుంది.

ఆ తర్వాత పరమాత్మను అన్వేషించాలి అని 4వ శ్లోకంతో అన్వయం. ఈ వృక్షానికి ఆది లేదు అంటే జీవుడు అనాది అర్థం. జీవుడు, ప్రకృతి రెండూ అనాదులే. జీవునికి సరైన జ్ఞానం కలిగినవెంటనే ఈ వృక్షం నరికివేయబడుతుంది. ఈ జ్ఞానం కేవలం అసంగం – వైరాగ్యంవల్ల లభిస్తుంది. వైరాగ్యం శ్రవణమననాదులవల్ల లభిస్తుంది.

**పరమపదం ఎలాంటిది?**

ఈ వృక్షాన్ని ఛేదించిన తర్వాత లభించే స్థానం పరమపదం. ఎక్కడికి చేరుకుంటే (ఏది గ్రహిస్తే) మళ్ళీ పునర్జన్మ లేదో ఆ స్థానం (జ్ఞానం). అదే ఆదిపురుషుడు. అక్కడనుండియే ఈ ప్రాచీనమైన సంసారవృక్షం బయలుదేరింది. ఆ స్థానాన్నే మనం శ్రుతివాక్యాలనుబట్టి అన్వేషించాలి అని అర్థం. జ్ఞానంవల్లనే పునరావృత్తి (పునర్జన్మ) ఉండదని వేదాంతసిద్ధాంతం. ఇక్కడ ఆదిపురుషుడు అంటే బ్రహ్మచైతన్యం. పురమునందు (శరీరమునందు) ఉన్నవాడు కనుక పురుషుడు అని నిర్వచనం (**పురి శయనాత్ పురుషః**). అనగా ఘటాకాశంలో ఉన్న ఆకాశంలాగా చైతన్యంయొక్క అంశ అని అర్థం.

పరమపదం అందుకొనేవాళ్లు (5వ శ్లోకంలో ఇలా వర్ణింపబడ్డారు)

**నిర్మానమోహాః** – దేహాత్మభావం లేనివాళ్లు.

**జితసంగదోషాః –** సంగం అంటే ఆసక్తిలేనివాళ్లు. నేను కర్తను అనే అభిమానం లేనివాళ్లు.

**అధ్యాత్మనిత్యాః –** అధ్యాత్మ అంటే ఆత్మయందు అని అర్థం. ఎల్లప్పుడూ ఆ తత్త్వంలో ఉండేవారు.

**వినివృత్త కామాః –** కోరికలను త్యజించినవారు.

**ద్వంద్వైర్విముక్తాః –** ప్రియము, అప్రియము, సుఖము, దుఃఖము ఇలాంటి ద్వంద్వాలకి అతీతంగా ఉన్నవారు.

**అమూఢాః –** మోహం (ఒకదాని మరొకదానిగా భ్రమించడం) లేనివారు.

ఇవన్నీ జ్ఞాని, లేదా స్థితప్రజ్ఞుడి గూర్చి పై అధ్యాయాల్లో చెప్పిన లక్షణాలు.

6వ శ్లోకంలో మరింత వివరణ. ఆ పరమపదాన్ని సూర్యుడు, చంద్రుడు, అగ్ని, భాసింపచేయలేదు. దృశ్యమైన ప్రతి విషయాన్ని వారు ప్రకాశింపచేయగలరు. కానీ ప్రకాశాన్ని గమనించే తెలివిని భాసింపచేయలేరు. రూపం లేనందువల్ల కన్ను గ్రహించలేదు (ఇదే అన్ని ఇంద్రియాలకూ వర్తిస్తుంది). అగ్ని అనగా వాక్కు[1] దీన్ని తెలుసుకోలేదు. అంటే ఇంద్రియాలతో గ్రహించడంగానీ, వాక్కుతో వర్ణించడంగానీ వీలుపడదు అని అర్థం.

ఆ శ్రేష్ఠమైన నివాసం నాది (**తద్ధామ పరమం మమ** – శ్లో. 6) అన్నపుడు నేను వేరు, నివాసం వేరు అనే అర్థమొస్తుంది. అందువల్ల దీన్ని నీలకంఠాచార్యులు ఇలా వివరించారు. ఆ శ్రేష్ఠమైన నివాసం అన్నప్పుడు ఏ వైకుంఠంలోనో, కైలాసంలోనో మరేదో లోకంలో ఈ పరమపురుషుడి నివాసం ఉన్నదని భావించరాదు. జీవుడిలో ఉన్న బుద్ధివృత్తి అనేది సాధారణ తెలివి, ఘటాకాశంలాగా. అన్నిటికంటే శ్రేష్ఠమైనది, శుద్ధచిన్మాత్రం, మహాకాశం. 'అదే నేను' అని అర్థం. అనగా అపరిచ్ఛిన్నమైన (పరిమితిలేని) చైతన్యం. పురాణాల్లో రాహువు యొక్క శిరస్సు అని వింటుంటాం. రాహువుకు శిరస్సు ఒక్కటే మిగిలింది కావున రాహువు అన్నా, శిరస్సు అన్నా ఒక్కటే అని అర్థం. అలాగే నా ధామ (నివాసం) అన్నప్పుడు 'నేనే అది' అని అర్థం. అంటే ఇంద్రియాలతో, వాక్కుతో గ్రహించలేని చైతన్యం అని అర్థం.

---

1. ఐదు ఇంద్రియాలు, ఐదు భూతాల రూపాలు అని పైన చెప్పుకున్నాం. వాక్కు అగ్నియొక్క రూపం. **అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్** అని ఐతరేయ ఉపనిషత్తు. అగ్ని వాక్కురూపంలో నోటియందు ప్రవేశించింది అని అర్థం.

సృష్టిలో జీవుడి స్థానం శ్లో. 7 నుండి 11వరకూ చెప్పబడింది. పూర్వాధ్యాయాల్లో ఉన్న విషయం పునశ్చరణ.

**మమైవాంశః** (శ్లో. 7) జీవుడు నా అంశయే. అంశ అనగా అవయవాలున్న వస్తువులో ఒక చిన్న అవయవం అనే అర్థం వస్తుంది. ఏది అవయవాలున్న వస్తువో అది నాశం కలది. బ్రహ్మ నిరవయవం. అందువల్ల పాత్రలో ఉన్న ఆకాశానికీ, మహాకాశానికీ ఏ సంబంధమో అలాగే జీవచైతన్యం, శుద్ధచైతన్యం అని అర్థం చెప్పారు.

మనస్సు, ఇంద్రియాలు ప్రకృతికి / మాయకు చెందిన అంశాలు. ఇవి జీవుణ్ణి విషయాలవైపు లాగుతుంటాయి (శ్లో. 7).

**సూక్ష్మశరీరం**

గాలి పూవులనుండి సుగంధాన్ని మోసుకెళ్ళినట్లు జీవుడు శరీరంనుండి పైకి వెళ్ళినప్పుడు మనస్సును, ఇంద్రియాలను తీసుకువెళతాడు (శ్లో. 8). ఈ మనస్సు, ఇంద్రియాల సమూహాన్నే లింగశరీరం / సూక్ష్మశరీరం అంటారు. సంసరణం, అంటే ఒక దేహంనుండి మరొక దేహానికి వెళ్ళడం (transmigration) ఈ లింగశరీరానిదే. శరీరేంద్రియాలే తాను అనుకున్నంతవరకూ జీవుడు ఈ లింగశరీరంతో ఉంటాడు. దేహాలు మారుతుంటాడు. జ్ఞాని అయినవాడికి ఈ ఉత్క్రమణం (ఒక శరీరం నుండి మరోదానికి లేచి వెళ్ళడం) వుండదు (శ్లో. 10). అతని శరీరాన్ని చరమశరీరం (చివరి శరీరం) అంటారు. జ్ఞానికి మరణానంతరం ఇంద్రియాలు, మనస్సు వాటికి కారణమైన పంచభూతాల్లో కలుస్తాయని వేదాంత ప్రతిపాదన.

తీవ్రప్రయత్నం చేస్తున్న యోగులు మాత్రమే ఈ ఆత్మను 'నేను' అని తెలుసుకుంటారు. **అకృతాత్మానః** – అంటే ఆత్మను సంస్కరించుకోనివారు, ఆత్మవిచారం చేయనివారు, ఇంద్రియనిగ్రహం, శమం, దమం మొదలైనవి అభ్యాసం చేయనివారు కేవలం శాస్త్రజ్ఞానం ఉన్నప్పటికీ ఈ ఆత్మను చూడలేరు (శ్లో. 11). సిద్ధాంతం తెలుసుకోవడం సరిపోదు. ఆత్మసంస్కరణ ముఖ్యమని భావం.

**పరమాత్మ విభూతులు**

శ్లో. 12 నుండి 15 వరకూ భగవంతుని విభూతులు 9,10 అధ్యాయాల్లో చెప్పినట్లుగా సంగ్రహంగా చెప్పబడ్డాయి. సూర్యుడిలో ఉన్న ప్రకాశన శక్తి, చంద్రుడిలోని, అగ్నిలోని ప్రకాశనశక్తి, తేజస్సు నాకు చెందినదే (శ్లో. 12). ఈ మూడూ ఉదాహరణలు మాత్రమే. వీటిలో చైతన్య ప్రతిఫలనం ఎక్కువగా ఉంది కావున ఈ మూడింటిని చెప్పారు. అన్ని

చేతనాచేతనములైన వస్తువులలోని ప్రకాశనశక్తి పరమాత్ముడే అని వ్యాఖ్యాతలు వివరించారు.

నీలకంఠ పండితులు మరో విషయం వివరించారు. బాహ్యప్రపంచాన్ని ప్రకాశింపచేసేది సూర్యుడు. కంటికి అధిష్ఠానదేవత అన్నారు. ఆ శక్తిని ప్రకాశింపచేసేది బ్రహ్మచైతన్యం. అలాగే మనస్సుకు చంద్రుడు అధిష్ఠానదేవత. లోపలి ప్రపంచాన్ని (మనస్సును) ప్రకాశింపచేసే దేవత. చంద్రుణ్ణి ఓషధులకు (మనం తినే అన్ని పదార్థాలకు) అధిపతి అన్నారు. ఈ ఓషధులవల్లనే మనస్సు పెరుగుతుంది కావున చంద్రుణ్ణి మనసుకు అధిపతి అన్నారు. ఆ చంద్రుణ్ణి ప్రకాశింపచేసే శక్తి బ్రహ్మచైతన్యం. అలాగే అగ్ని అంటే వాక్కు అని 6వ శ్లోకంలో చూశాం.

ఇక్కడొక ప్రసిద్ధ శ్లోకం –

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14**

నేను జఠరాగ్నిగా ప్రాణుల దేహాలను ఆశ్రయించి (ప్రవేశించి) ప్రాణాపాన వాయువులతో నాలుగు విధాల ఆహారపదార్థాలను పచనం (జీర్ణం) చేస్తున్నాను అని భావం. (భోజనానికి పూర్వం ఈ అధ్యాయం మొత్తాన్ని పఠించడం పరిపాటి. అధ్యాయం మొత్తం పఠించనివాళ్ళు ఈ శ్లోకాన్నైనా పఠిస్తారు). మనిషి ఉదరంలో ఉండే అగ్నికి వైశ్వానరాగ్ని అని పేరు. ఈ అగ్ని మనం తినే నాలుగు రకాల పదార్థాలను (భక్ష్యం – కొరికి తినేది, భోజ్యం – మామూలుగా తినగలిగేది, చోష్యం – జుర్రదగినది, లేహ్యం – నాకి తినగలిగేది) జీర్ణం చేస్తుంది.

ఇక్కడ వ్యాఖ్యాతలు ఒక విశేషం తెలిపారు. అగ్నిష్టోమ యాగమని ఒక యాగముంది. అగ్నిలో సోమరసాన్ని ఆహుతివ్వడం. భోజన సమయంలో తినేవాడు (భోక్త) అగ్ని, అన్నం సోముడు (చంద్రునివల్ల కలిగినది, చంద్రుని రూపం), ఈ వైశ్వానరాగ్నిలో సోమాన్ని ఆహుతి చేస్తున్నానని యజ్ఞభావనతో భుజించేవాడు అన్నదోషంవల్ల పాపఫలితం పొందడు అని వివరించారు. అంటే అయోగ్యులైన వారినుండి ఆహారం స్వీకరిస్తే వాళ్ళ పాపం మనకు వస్తుందని ధర్మశాస్త్రం. అలాంటి దోషం రాకుండా యజ్ఞభావనతో జఠరాగ్నిని చల్లార్చడానికై మితంగా భుజించాలని అర్థం.

అన్ని జీవుల బుద్ధులలో ఉన్న తత్త్వం నేనే – **హృదిసన్నివిష్టః**. హృదయమంటే బుద్ధి అని అర్థం చెప్పారు. అన్ని ప్రాణుల్లోని స్మృతి, విస్మృతి, జ్ఞానం అన్నీ నేనే (శ్లో. 15).

వేదాలవల్ల తెలుసుకోగలిగింది నన్నే. వేదవేత్త నా స్వరూపమే అవుతాడు. అనగా వేద్యము (తెలుసుకోవలసినది), వేదకుడు (తెలుసుకొనేవాడు) రెండూ నేనే. దృశ్యం, దృక్ రెండూ నేనే అని భావం. ఇలాగ పరమాత్మ విభూతులు మళ్ళీ సంగ్రహంగా చెప్పబడ్డాయి.

**పురుషోత్తముడు**

ఈ అధ్యాయ శీర్షికలోని విషయం పురుషోత్తముడు. ఇంతవరకూ భగవద్గీతలో ఈ పదం వాడలేదు. ఇది కొత్త విషయంకాదు. 7వ అధ్యాయంనుండీ చెప్తుతున్న పర, అపర, ప్రకృతి, 13వ అధ్యాయంలో చెప్పిన క్షేత్రం, క్షేత్రజ్ఞుడు వీటన్నింటినీ కలిపి సంగ్రహంగా శ్లో. 16 నుండి 20 వరకూ చెప్పబోతున్నాడు.

అపరాప్రకృతి, పరా ప్రకృతి ఈ రెంటినీ క్షేత్రం అన్నారు. ఈ క్షేత్రాన్ని ప్రకాశింపచేసేవాడు దృక్ స్వరూపమైన తత్త్వం. 8వ అధ్యాయంలో **అక్షరం బ్రహ్మపరమం** అనే పాదంలో అక్షరమనే శబ్దానికి పరబ్రహ్మ అని అర్థం చెప్పారు. ఈ అధ్యాయంలో అక్షరం పదానికి మాయాశక్తితో కూడిన బ్రహ్మ, పరిచ్ఛిన్న బ్రహ్మ అని అర్థం చెప్పారు. ఈ భేదాన్ని గమనించాలి.

క్షేత్రం, క్షేత్రజ్ఞుడిని 16, 17 శ్లోకాల్లో వర్ణించారు.

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షరః సర్వాణి భూతాని కూటస్థో౽క్షర ఉచ్యతే ॥ 16**

లోకంలో, అంటే దృశ్యంగా క్షరము, అక్షరము అని రెండు తత్త్వాలున్నాయి. క్షరమంటే జగత్. అందులోని చరాచర ప్రపంచమంతా క్షరం. అంటే నశించేది. మాయాశక్తితో కూడిన హిరణ్యగర్భుణ్ణి ఈ శ్లోకంలో కూటస్థుడు అన్నారు. ఇదే అక్షరం, నశించనిది అని అర్థం.

ఈ అక్షరం – మాయ అనే ఉపాధితో ఉన్న బ్రహ్మ, క్షరం – జగత్ అనే ఉపాధిలో ఉన్న బ్రహ్మచైతన్యం, ఈ రెండూ కాకుండా వీటికి విలక్షణంగా ఉండే తత్త్వం శుద్ధచైతన్యం. ఇదే **ఉత్తమఃపురుషః, పరమాత్మా** అని 17వ శ్లోకంలో చెప్పబడింది. మూడు లోకాలను ధరించే ఈశ్వరుడు, నియామకుడు, నారాయణుడను పేరు కలవాడు అని శ్రీశంకరులు వివరించారు. ఈ తత్త్వాన్నే 18వ శ్లోకంలో పురుషోత్తముడు అని వివరించారు.

## పదునైదవ అధ్యాయం

సంసార వృక్షం అనే వృక్షవర్ణనతో ఈ అధ్యాయం ప్రారంభమైంది. వృక్షం మూలం, అవ్యక్తం, మాయ అన్నారు. అదే ఇక్కడ అక్షరమన్న తత్త్వం. అదే సృష్టికర్తయైన హిరణ్యగర్భుడు. వృక్షమూలం స్థానంలో ఉన్నవాడు. వ్యక్తమైన చెట్టు స్థానంలోనివాడు, దానితో తాదాత్మ్యం ఉన్నవాడు జీవుడు. జీవుడు, సృష్టికర్త ఇద్దరూ వృక్షాన్ని ఆశ్రయించినవారే. ఈ రెంటికీ అతీతమై ఉపాధిరహితమైన తత్త్వం శుద్ధపరబ్రహ్మ.

శ్లో. 19, 20 ఈ జ్ఞానాన్ని స్తుతిస్తాయి. ఎవడు నా తత్త్వాన్ని ఈవిధంగా మోహం లేకుండా తెలుసుకుంటాడో అతడు సర్వాత్మభావంతో నన్నే పొందుతాడు (శ్లో. 19). ఇతడే బ్రహ్మజ్ఞాని. అలాంటివాడు కృతకృత్యుడు (కృత్యం = చేయవలసిన పని, కృతం = చేయబడినది). అట్టివాడికి చేయాల్సిన కర్మలేవీ లేవు. అనగా నేను కర్త అనే భావనలో లేడు. అన్ని కార్యాలు చేసినవాడౌతాడు.

కేవలం గీతార్థమే కాదు, వేదాంతశాస్త్రార్థమంతా ఈ అధ్యాయంలో సంగ్రహంగా చెప్పారని భాష్యకారులు అంటారు. ప్రతి జీవికి (మనిషికి, జంతువులకు) ఉన్న సంసారవృక్షాన్ని ఈ మనుష్యజన్మలోనే విజ్ఞానమనే కత్తితో ఛేదించి పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోవాలని ఈ అధ్యాయం తాత్పర్యం. అపుడే అశ్వత్థం అనే పేరు ఈ వృక్షానికి సార్థకమౌతుంది. జ్ఞానం కలిగినవెంటనే వృక్షం అదృశ్యమౌతుందని భావం.

❖ ❖ ❖

## పదునాఱవ అధ్యాయము

# దైవాసురసంపద్విభాగ యోగము

తొమ్మిదవ అధ్యాయంలోని 12, 13 శ్లోకాల్లో దైవీప్రకృతి, ఆసురీప్రకృతి అని సూక్ష్మంగా చెప్పిన విషయాన్ని ఈ అధ్యాయంలో వివరించారు. మంచికీ, చెడుకూ జరిగే సంఘర్షణ అన్ని సంస్కృతుల్లో, మతగ్రంథాల్లో, సాహిత్యంలో ఇంకా విభిన్నరీతుల్లో వర్ణించడం చూస్తుంటాం. మంచిని దైవీశక్తులని, చెడుని రాక్షస/ఆసురీ శక్తులని పిలవడం పరిపాటి.

ఈ అధ్యాయంలో చెప్పినవన్నీ సాధన విషయాలు. అనగా బ్రహ్మజ్ఞానం కోరేవాడు సంపాదించాల్సిన దైవీసంపత్తు ఎలాంటిది, వర్జించాల్సిన (వదలివేయాల్సిన) ఆసురీ సంపత్తు ఎలాంటిది అని విషయం. బ్రహ్మజ్ఞానం ఆశయంగా కర్మమార్గంలో ఉన్నవారు అలవరచుకోవాల్సిన సద్గుణాలు ఇక్కడ చెప్పబడ్డాయి.

ఈ అధ్యాయంలో కూడా మొత్తం శ్రీకృష్ణుడి వచనాలే. అర్జునుడి ప్రశ్నలు లేవు. 24 శ్లోకాలున్న ఈ అధ్యాయం మొదటి ఐదు శ్లోకాల్లో దైవీసంపత్తు, ఆసురీసంపత్తులను వివరిస్తుంది. శ్లో. 6 నుండి 20 వరకూ ఆసురీసంపత్తు కలవారి ప్రవర్తనను వివరిస్తుంది. శ్లో. 21 నుండి 24 వరకూ సాధకుడు ఎలా ఉండాలి? అని శ్రీకృష్ణుడి సూచన.

### దైవీసంపత్తు

1 నుండి 3 శ్లోకాల్లో చెప్పిన విషయాల్లో వరుసగా

**అభయం –** ఇది వేదాంతశాస్త్రంలో ముఖ్యమైన పారిభాషిక పదం. జ్ఞాని అభయాన్ని పొందుతాడు అని సిద్ధాంతం. జ్ఞాని ఎవరినీ ద్వేషించడు కనుక ఎవరివల్లా భయములేదు అని లౌకిక అర్థం. శాస్త్రీయంగా చెప్పాలంటే బ్రహ్మాత్మభావంలో ఉన్నవాడు అంతటా బ్రహ్మను చూస్తాడు. అందువల్ల భయమనే భావమే ఉండదు.

**సత్త్వసంశుద్ధి –** అంతఃకరణశుద్ధి. వస్తువులపై అపేక్ష లేదు కావున అంతఃకరణంలో నిర్మలత్వం.

**జ్ఞానయోగ వ్యవస్థితిః –** జ్ఞానమనగా శాస్త్రీయంగా తెలుసుకున్న బ్రహ్మజ్ఞానం, పరోక్షజ్ఞానం. దానితో యోగమంటే దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం. అపరోక్షజ్ఞానం పొందడం. దీనిలో వ్యవస్థితి అనగా స్థిరంగా నిలచివుండడం.

**దానం –** పుణ్యంకొరకు కాకుండా కేవలం చిత్తనైర్మల్యంకోసం కర్తవ్యబుద్ధితో చేసే దానం. దానం ఎంతో వినయపూర్వకంగా ఇవ్వాలని శ్రుతి.

**దమః** – ఇంద్రియ నిగ్రహం.

**యజ్ఞం** – 4వ అధ్యాయంలో చెప్పిన విస్తారమైన అర్థం గ్రహించవచ్చు. అలాగే గృహస్థులకు విధించిన పంచమహాయజ్ఞాలు – దేవ, పితృ, మనుష్య, భూత, స్వాధ్యాయ యజ్ఞములు. దేవతలను పూజించడం, పితరులను పూజించడం, అతిథి సత్కారాలు చేయడం, ప్రాణులపట్ల దయ కలిగివుండడం, వేదాధ్యయనం చేయడం. ఈ ఐదూ నిత్యకర్మలు – విధిగా చేయవలసినవి. వీటివల్ల మనిషి సిద్ధి పొందుతాడు. **మహాయజ్ఞైశ్చ, యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః** – ఈ యజ్ఞాలవల్ల వచ్చే అంతఃకరణ సంస్కారంవల్ల బ్రహ్మజ్ఞానానికి అధికారం కలుగుతుంది అని అర్థం.

**స్వాధ్యాయము** – తనకు విధించిన వేదశాఖల్ని అధ్యయనం చేయడం.

**తపః** – దీన్ని గురించి 17వ అధ్యాయంలో వివరించబోతున్నాడు.

**ఆర్జవం** – ఋజుస్వభావం.

**అహింస** – ప్రాణులను పీడించకుండా ఉండడం.

**సత్యం** – త్రికరణశుద్ధి. మనస్సు, వాక్కు, కర్మ మూడింటిలో ఒకే తీరుగా ఉండడం.

**అక్రోధః** – మానావమానములయందు ఓర్పు అని పై అధ్యాయాల్లో చెప్పినది.

**త్యాగః** – దానాన్ని గూర్చి పైన చెప్పారు కావున ఇక్కడ సంన్యాసమని అర్థం చెప్పారు.

**శాంతిః** – శమ అనగా మనోనిగ్రహం. దీనివల్ల కలిగే మానసిక సుఖం.

**అపైశునం** – పైశునం అంటే చాడీలు చెప్పడం. అది లేకపోవడం అపైశునం.

**దయ** – దుఃఖంలో ఉన్న ప్రాణులందు కృప.

**అలోలుప్త్వం** – ఇంద్రియ విషయాలపై ఆసక్తి లేకపోవడం.

**మార్దవం** – మృదుస్వభావం.

**హ్రీః** – లజ్జ. చెడుకర్మలు చేయడానికి భయం, మంచికర్మలు ఆచరించలేకపోయామనే లజ్జ.

**అచాపలం** – చపలస్వభావం లేకపోవడం. మనస్సు స్థిరంగా ఉండడం.

**తేజః** – ప్రగల్భత అనగా ఏదైనా పనిలో చురుకుదనం, బుద్ధిసూక్ష్మత.

**క్షమ** – పై చెప్పిన అక్రోధం, ఎదుటివాడి దురహంకారాన్ని సహించడం.

**ధృతిః** – పట్టుదల, దేహేంద్రియాలను అదుపులో పెట్టుకోగల శక్తి. దేహేంద్రియాలు బలహీనంగా ఉన్న దాన్ని సహించగలిగే స్వభావం.

**శౌచం –** ఇది శారీరం, మానసికం. బాహ్యాభ్యంతర శౌచాలని కూడా అంటారు. బాహ్యశౌచం స్నానాదికంవల్ల, అంతశ్శౌచం పై గుణగణాలను అలవరచుకోవడంవల్ల చిత్తనైర్మల్యం పొందడం. నిత్యకర్మ అయిన సంధ్యావందనంలో **స బాహ్యాభ్యంతర శ్శుచిః** – అని చెబుతుంటాం. నిత్యమేది, అనిత్యమేది అని చింతించడంవల్ల మనోమాలిన్యాన్ని తొలగించుకోవడం మనశ్శౌచం.

**అద్రోహః –** హింసించకపోవడం.

**నాతిమానిత –** తన్నుతాను పూజనీయుడిగా భావించడం అతిమానిత, అది లేకపోవడం.

పై 26 గుణాలు దైవీసంపత్తును అనుసరించి జన్మించినవాడికి ఉంటాయి.

**ఆసురీసంపత్తు**

**దంభః –** ధర్మధ్వజిత్వం అన్నారు. నేను ఇంత పెద్ద ధార్మికుణ్ణి అని ధ్వజం (జెండా) పట్టుకొని చెప్పుకోవడం.

**దర్పః –** విద్యవల్ల, బలంవల్ల, ధనంవల్ల కలిగే పొగరు.

**క్రోధః –** హింసా స్వభావం.

**పారుష్యం –** మాటల్లో పరుషతనం, ఇతరులను నొప్పించే మాటలు మాట్లాడడం.

**అజ్ఞానం –** ఏది చేయదగిది, ఏది చేయకూడనిది అనే విషయంలో మోహం చెంది ఉండడం.

కృష్ణుడు తనను ఏ తరగతికి చెందినవాడిగా భావిస్తున్నాడో అని అర్జునుడికి సందేహం కలుగుతుందేమోనని 'నీవేం చింతించకు. నీవు దైవీసంపత్తులో పుట్టావు' అంటాడు శ్రీకృష్ణుడు (శ్లో. 5).

దైవీసంపత్తు మోహానికి దోహదం చేస్తుంది. ఆసురీసంపత్తు జీవుణ్ణి మరింతగా బంధిస్తుంది. ఈ రెండింటినీ సంపత్తుగా వర్ణించడంవల్ల ఇది జీవుడి ఉన్న నిధిగా గమనించాలి. దైవీసంపత్తు అనే నిధి ఎక్కువగా ఉన్నవాడు జ్ఞానమార్గంలోకి రాగలడు. ఆసురీసంపత్తులో ఉన్నవాడు జ్ఞానమార్గానికి దూరంలోనే ఉంటాడు.

**దేవతలు - అసురులు ఎవరు?**

**ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।**
**దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥ 6**

సృష్టిరెండు రకాలు. దేవతలు, రాక్షసులు అని ఈ శ్లోకార్థం. బృహదారణ్యకోపనిషత్తులో **'ద్వయా హ ప్రాజాపత్యాః'** (1-3-1) అనే మంత్రంలో ప్రజాపతికి రెండు రకాల బిడ్డలు. దేవతలు, అసురులు అన్నారు. శాస్త్రాలను అభ్యసించి ధర్మనియమాలు పాటిస్తూ ప్రకాశించువారు (**ద్యోతనాత్ –** ప్రకాశించడంవల్ల) దేవతలు. అలాకాకుండా ప్రత్యక్షంగా చూచినదే సత్యము, కంటికి కనబడనిది అసత్యము. పుణ్యం, పాపం కనిపించేవి కావు, ఎంతో చిన్నది జీవితం అని ఇంద్రియాలలో రమించువారు (**అసుషు –** ఇంద్రియాలలో, **రమంతే –** రమింతురు) కావున అసురులు. వీరే అప్పుడప్పుడూ క్రూరస్వభావం కలిగితే రాక్షసులనిపించుకుంటారు.

మరి మనుషులెవరు? అదే బృహదారణ్యకోపనిషత్ **'త్రయా హ ప్రాజాపత్యాః.... దేవా మనుష్యా అసురాః** (5-2-1) అని మూడురకాలుగా చెప్పారు. వీరు ముగ్గురూ బ్రహ్మవిద్యకోసం తండ్రియైన ప్రజాపతివద్దకు వెళ్ళారు. ఆయన కేవలం 'ద' అన్నాడట. దేవతలు ద = దమం = ఇంద్రియ నిగ్రహం చెప్పాడు అనుకున్నారు. మనుష్యులు ద = దానం, మనం దానం చేయడంలేదు కావున దానం చేయమన్నాడు అనుకున్నారు. అసురులు ద = దయధ్వం = దయచూపండి, మనం ప్రాణులపట్ల దయచూపడంలేదు కావున ఆయన మనకు భూతదయ గూర్చి చెప్పాడనుకున్నారట. మనిషికి కేవలం దానం మాత్రమే చెప్పారు కదా! అని మనం భావించకుండా వ్యాఖ్యాతలు దీన్ని వివరిస్తూ ఈ ముగ్గురూ వేరువేరు కాదు, మనుష్యులే ఈ మూడూనూ అని వివరించారు. మనుషుల్లోనే ఇంద్రియ నిగ్రహం తక్కువగా ఉండి, మిగతా సద్గుణాలు ఉన్నవారు దేవతలు, లోభం ముఖ్యంగా కలవారు మనుషులు, హింస ప్రధానంగా ఉన్నవారు అసురులు అని వివరించారు. శ్రీ మధుసూదన సరస్వతి మరో విషయం వ్రాశారు. మనుష్యులే శాస్త్రం (ధర్మాధర్మ వివేకం)చే సంస్కరింపబడిన బుద్ధికలవారై దేవతలుగానూ, స్వభావసిద్ధమైన రాగద్వేషాల ప్రాబల్యం ఉన్నప్పుడు అసురులుగానూ ఉంటారు. దానం, దయ, దమం ఈ మూడూ మనుషుల గురించి చెప్పినవే అన్నారు. ఈ అధ్యాయంలో కూడా ఈ మూడు విషయాలు చెప్పబడ్డాయి.

**ఆసురీసంపత్తు**

దైవీసంపత్తును మూడు శ్లోకాల్లో వర్ణించి ఆసురీసంపత్తును 12 శ్లోకాల్లో ఈ అధ్యాయం వర్ణిస్తుంది. వైద్యశాస్త్రంలో ఆరోగ్యవర్ణన తక్కువగా ఉంటుంది. రోగాల వర్ణనే ఎక్కువగా ఉంటుంది. మందు తీసుకోవడం వల్ల స్వస్థత (మళ్ళీ స్వంత స్థితిని పొందడం) లభిస్తుంది. కొత్తగా పొందేదేదీ లేదు. కొత్తగా వచ్చిన రోగాన్ని వదిలించుకోవడమే

స్వస్థత. అందుకే వ్యాఖ్యాతలు వీటిని వదిలించుకోవాల్సిన రోగాలుగా వర్ణించారు. అవి ఈ క్రిందివిధంగా ఉన్నాయి.

ప్రవృత్తి నివృత్తి ఎరుగరు (శ్లో. 7) ధర్మం, అధర్మం ఏమిటి? అని ఎరుగరు.

శౌచం, ఆచారం, సత్యం ఉండవు (శ్లో. 7).

ప్రపంచం యాదృచ్ఛికంగా ఏర్పడినది, దీనికి ఒక నియామక శక్తి లేదు, ధర్మాధర్మ వ్యవస్థ అంటూ ఏమీలేదు అని భావిస్తారు.

కేవలం కామంవల్ల, స్త్రీ పురుష సంయోగంవల్లనే సృష్టి నడుస్తున్నది అని భావిస్తారు (ఇది లోకాయతులు అనబడే చార్వాకుల దృష్టి).

పై దృష్టికోణంవల్ల ఉగ్రకర్మల్లో ప్రవర్తిస్తుంటారు. ప్రపంచ నాశనంకొరకు పనిచేస్తుంటారు (శ్లో. 9).

**కామమాశ్రిత్య దుష్పూరం** – (శ్లో. 10) పూరింపడానికి శక్యంకాని కోరికలతో ఉంటారు.

**దంభమాన మదాన్వితాః** – (శ్లో. 10) దంభం (పైన చెప్పబడింది), మానం, అభిమానం, ఆత్మాతిశయం తనను గొప్పవాడిగా భావించడం, మదం = కొవ్వు, వీటితో కూడినవారు.

పై కారణాలవల్ల సత్యాన్ని చూడలేరు. చెడునే స్వీకరిస్తూ అశుచివ్రతులై ఉంటారు. అశుచివ్రతులు అనే శబ్దానికి దుష్టశక్తుల్ని ఆరాధిస్తూ వామాచారంలో (శ్మశానాల్లో సాధన చేయడం లాంటివి) చేస్తుంటారని ఒక వ్యాఖ్యాత వివరించారు.

తమ యోగక్షేమాల గురించే చచ్చేవరకూ చింత చేస్తుంటారు (శ్లో. 11). కామభోగాలే పురుషార్థం (జీవితంలో పరమలక్ష్యం) అని భావిస్తుంటారు (శ్లో. 11).

ఆశ అనే పాశంచే బంధింపబడి శక్యంకాని లక్ష్యాలకై పాటుపడుతుంటారు (శ్లో. 12). కామభోగాలకొరకై అన్యాయంగా ధనసంచయం చేస్తుంటారు (శ్లో. 12). కామం, క్రోధం ఈ రెండే వీరి ముఖ్యలక్షణాలుగా ఉంటాయి (శ్లో. 12).

ఇది ఈ రోజు నాకు లభించింది. ఈ కోరికను సాధిస్తాను (శ్లో. 13). ఈ శత్రువును ఇప్పుడు హతం చేశాను. ఇతరుల్ని రేపు హతం చేస్తాను, నేనే ప్రభువును, బలవంతుణ్ణి, సుఖమనుభవించేవాణ్ణి అనే భావనలో ఉంటారు (శ్లో. 14).

నేనే ఆఢ్యుడను (గొప్పవాడను), ఆభిజాత్యం (గొప్పవంశంలో పుట్టుక) కలవాణ్ణి, నాతో సమానం ఎవరు? యజ్ఞం చేస్తా, దానం చేస్తా, సంతోషిస్తా అని మోహంలో ఉంటారు (శ్లో. 15).

ఒకదానిపై మనసు నిలకడలేక అనేక విషయాలపై వెంటబడి ఉంటారు. అందువల్ల ఏది యోగ్యం, ఏది అయోగ్యం అనే విషయంలో మోహం చెంది వుంటారు (శ్లో. 16).

మోహం అనే వలలో చిక్కుకొని ఉంటారు, ప్రతి నిమిషం మనస్సులోని కల్మషాన్ని పెంచుకుంటూ కామభోగాల్లో మునిగి వుంటూ నరకాన్ని పొందుతారు (శ్లో. 16).

**ఆత్మసంభావితాః –** (శ్లో. 17) తననుతాను గొప్పగా భావించుకునేవాళ్ళు.

**స్తబ్ధాః –** (శ్లో. 17) వినయం లేనివారు.

ధనం, అభిమానం, మదం ఉన్నాయి కావున దంభంతో కూడినవారై నామయజ్ఞాలు (పేరుకు మాత్రం యజ్ఞాలు, శాస్త్రంలో చెప్పబడనివి, వీడి గొప్పతనం కోసం కల్పించుకొన్నవి) చేస్తారు (శ్లో. 17). ఈ కాలంలోని ఇలాంటి ప్రముఖుల ఆచరణ ఇక్కడ చూడవచ్చు.

అహంకారం (నేను అనే భావన), బలం, దర్పం, కామం, క్రోధం వీటిని ఆశ్రయించి ఉంటారు (శ్లో. 18).

తమలోకాని, ఇతరుల్లోకాని ఉన్న నన్ను (దైవీతత్త్వాన్ని) గమనించలేక మంచివారిపై చెడు ఆరోపణలు చేస్తుంటారు (శ్లో. 18).

ఆత్మశోధన (శోధించడమంటే మలినాన్ని తీసివేయడం) భగవద్గీతలో ముఖ్య విషయమని తెలుసుకున్నాం. కావున పైన చెప్పిన ఆసురీసంపత్తును మనసునుండి తొలగించుకోవడం సాధకుని పని.

**ఆసురీప్రవృత్తి గలవాడికి ఎలాంటి ఫలితముంటుంది?**

శ్లో. 19, 20ల్లో ఇది చెప్పబడింది. ఆసురీ ప్రవృత్తిగలవారు మళ్ళీ ఆసురీ జన్మలనే పొందుతుంటారు (శ్లో. 19). కొందరు ఇదే సుఖంగా ఉందనుకునే అవకాశముంది కావున తర్వాతి శ్లోకంలో “అలాంటి మూఢులు మళ్ళీ మళ్ళీ తప్పులు చేస్తూ నన్ను తెలుసుకొనకనే (జ్ఞానమార్గానికి దూరంగా ఉంటూ) ఇంకా అధమజన్మలు అనగా క్రిమికీటకాది జన్మలు పొందుతారు (శ్లో. 20).

**మన రాతను దిద్దుకోవడం**

ఇక్కడ మధుసూదన సరస్వతి ఒక విషయం వ్రాశారు. భగవంతుడు కేవలం కర్మఫలదాత. మంచిపనులుగానీ, చెడుపనులుగానీ ఎన్నుకోవడానికి మనకు స్వేచ్ఛ ఉంది. మన రాతను దిద్దుకోవడానికి స్వేచ్ఛ వుంది. అలాంటప్పుడు దుర్మార్గంలోనే ఉన్నవాడికి వాడి కర్మఫలంగా ఎలాంటి జన్మ ఇవ్వడం అన్నది ఎలాంటి వైషమ్యం, పక్షపాతం లేకుండా

ఈశ్వరుడు అనే నియామకశక్తి నిర్ణయిస్తుంది. ఈ శ్లోకంలో 'నేను' అనే పదానికి కర్మఫలదాత అని అర్థం చెప్పారు. దేవుడు కర్మఫలాన్ని ఇస్తున్నాడు అనడంకంటే కర్మవాసనలను అనుసరించి జీవుడే ఆ వాసనలకు ఉపయోగించే దేహాన్ని ఎన్నుకుంటున్నాడు అని అర్థం చేసుకోవాలి.

**నేటి వక్రభాష్యాలు**

దైవీసంపత్తు, ఆసురీసంపత్తు అనేవి మూడు గుణాల వివిధ కలయికలవల్ల మనిషిలో ఏర్పడే స్వభావాలని భగవద్గీత స్పష్టంగా చెబుతుంది. ఈ సంపత్తు బ్రాహ్మణవర్ణంలో ఉండవచ్చు మరి ఎవడిలోనైనా వుండవచ్చు. రావణాసురుడు బ్రాహ్మణుడే. వేదాధ్యయనం చేసినవాడు. లంకానగరమంతా వేదఘోషతో ప్రతిధ్వనించేదని రామాయణంలోని సుందరకాండలో ఆంజనేయుడు వర్ణిస్తాడు. అలాగే వృత్రాసురుడు బ్రాహ్మణుడు. ఇంద్రుడు అతణ్ణి చంపినందుకు బ్రహ్మహత్యాదోషమంటూ ప్రాయశ్చిత్తం చేసుకుంటాడు. ఉపనిషత్తులపైగానీ, భగవద్గీతపైగానీ వచ్చిన భాష్యాలు ఈనాటివి కాదు. శంకరులభాష్యం 1300 సంవత్సరాల క్రితం నాటిది. మిగతా భాష్యాలు అదే పరంపరలో వచ్చినవి. శంకరులకంటే ముందున్న భాష్యాలుగానీ, ఇతిహాసాలు, పురాణాలుగానీ దేవాసుర విభజనను పై విధంగానే చేసింది. ఈనాడు సమాజాన్ని విడగొట్టాలనే ఉద్దేశంతో కొంతమంది మేధావులు పై సిద్ధాంతానికి వక్రభాష్యం చెబుతూ దేవతలంటే అగ్రవర్ణాలవారనీ, రాక్షసులు/అసురులు దళితులనీ విద్వేషం రెచ్చగొడుతున్నారు. ఇది చాలా శోచనీయం.

**నరకానికి మూడు ద్వారాలు**

కామం, క్రోధం, లోభం ఈ మూడూ నరకానికి ద్వారాలు (శ్లో. 21). ఈ మూడింటిని ఇదివరకే అక్కడక్కడ వివరించారు. మొత్తం ఆసురీసంపత్తంతా ఈ మూడింటివల్ల పుట్టినదే. కావున ఈ మూడింటినీ త్యజించాలి. ఇక్కడ మధుసూదన సరస్వతి ఒక మంచి శ్లోకాన్ని ఉటంకించారు –

**ఇహైవ నరకవ్యాధేః చికిత్సాం న కరోతి యః ।**
**గత్వా నిరౌషధం స్థానం సరుజః కిం కరిష్యతి ॥ 22**

ఔషధాలు ఉన్న ప్రదేశంలోనే రోగానికి చికిత్స చేసుకోవాలి. ఔషధాలు లేనిచోటికి వెళ్ళి రోగిష్ఠి ఏమి చేయగలడు అని శ్లోకార్థం. మనుష్యం దేహం, కర్మభూమి, ఇక్కడే రోగచికిత్స. ఇతర దేహాల్లో లేదు అని పదే పదే చెప్పబడింది.

పై చెప్పినట్లు పై మూడు ద్వారాలను త్యజించినవాడు తననుతాను శ్రేయోమార్గంలో నిలుపుకున్నవాడౌతాడు. అందువల్ల క్రమేణా జ్ఞానమార్గంలోకి వచ్చి ఉత్తమగతిని (మోక్షాన్ని) పొందగలడు (శ్లో. 22).

శాస్త్రంలో విధించినదానిని వదిలి ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించేవాడు సిద్ధిని పొందడు (శ్లో. 23). అలాంటివాడికి **న సుఖం న పరాంగతిమ్** (శ్లో. 23) అంటే ఈ లోకంలో సుఖంగాని, పరలోకంలో మోక్షంగాని రెండూ లేవు. ఇక్కడ అధర్మమార్గంలో ఉన్నవారు సుఖంగా ఉన్నారు కదా అని సందేహం రావచ్చు. కానీ ఆ సుఖం దుఃఖానికి దారితీసేదే అని పై శ్లోకాల్లోనే శ్రీకృష్ణుడు చెప్పాడు. అవి అధమజన్మలను కలిగిస్తాయి. ధర్మసమ్మతమైన అర్థం, ధర్మసమ్మతమైన కామం మాత్రమే సుఖాన్ని కలిగిస్తాయి. ధర్మానికి అవిరుద్ధమైన కామం నేను (7-11) అని శ్రీకృష్ణుడు పైన చెప్పిన విషయం గుర్తుంచుకోవాలి.

**శాస్త్రమే ప్రమాణం**

"ధర్మాధర్మ విషయాల్లో నీకు శాస్త్రమే ప్రమాణం. దాన్ని గ్రహించి కర్మల్ని ఎన్నుకో" (శ్లో. 24) అని ఆఖరి శ్లోకం. శాస్త్రం అంటే వేదం యొక్క పూర్వభాగంలో వివరించిన కర్మకాండ. అందులో **విధి** – అనగా ఇది చేయాలి, **నిషేధం** – ఇది చేయకూడదు అని స్పష్టంగా చెప్పారు. ఉదా: బ్రాహ్మణుడు యజ్ఞం చేయాలి అనేది విధి. సురాపానం చేయకూడదు అనేది నిషేధం. **శాస్తి ఇతి శాస్త్రం** – అనగా శాసించేది శాస్త్రం. వేదంతోపాటు తదనుబంధంగా వచ్చిన స్మృతులు, పురాణాలు కూడా శాస్త్రమనే శబ్దపరిధిలోకి వస్తాయి. వీటిలో చెప్పిన దానం, దయ, అహింస మొదలైన వాటిని అలవరచుకోవడంవల్ల అంతఃకరణశుద్ధి. చిత్తశుద్ధి కలిగేవరకూ శాసించేది శాస్త్రం. చిత్తశుద్ధి కలిగి వేదాంతవాక్యాల శ్రవణం తర్వాత **శంసతి ఇతి శాస్త్రం** – అనగా ఆత్మ జ్ఞానాన్ని కేవలం సూచించేది శాస్త్రం. బాలుణ్ణి మనం ఆజ్ఞాపిస్తాం, పెద్దవాడికి సూచిస్తాం అలాగే శాస్త్రం కూడా. చిత్తశుద్ధి పొందిన తర్వాత శాస్త్రం 'నీవే ఆ చిత్స్వరూపుడవు', 'చైతన్యస్వరూపుడవు' అని సూచిస్తుంది.

❖ ❖ ❖

## పదిహేడవ అధ్యాయము

# శ్రద్ధాత్రయ విభాగ యోగము

ఈనాటి మనందరికీ వర్తించే అధ్యాయం ఇది. శాస్త్రం, అంటే వేదం ఏదో మనకు తెలియని సంస్కృతభాషలో వ్రాయబడింది. దానిని చదివినవాడు, అర్థం చేసుకున్నవాడు అరుదు. మరి శాస్త్రంలో ఏది విధింపబడింది, ఏది నిషేధింపబడింది అని తెలియక కేవలం శ్రద్ధతో ఏవైనా సత్కర్మలు చేస్తూవుంటే అవి ఏ కోవకు చెందుతాయి అని మన సందేహం.

**తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే –** నీకు శాస్త్రమే ప్రమాణం అంటూ గత అధ్యాయం చివరి శ్లోకంలో చెప్పడంతో అర్జునుడికి ఈ సందేహం కలిగింది. వేదంలోని కర్మకాండలో యజ్ఞాలగూర్చి, కర్మలగూర్చి సూక్ష్మమైన విషయాలు చెప్పబడినవి. వాటిని తెలుసుకోవడానికి పాండిత్యం అవసరం. మరి కేవలం శ్రద్ధతో చేసిన పనులు సాత్త్వికాలా? రాజసాలా? తామసాలా? అని అతడి సందేహం.

ఈ అధ్యాయం పేరు శ్రద్ధాత్రయవిభాగయోగం. ఇందులో 28 శ్లోకాలున్నాయి. ఇందులో విశ్లేషింపబడే విషయాలు శ్రద్ధ, ఆహారం, యజ్ఞం, తపస్సు మరియు దానం. ఇవి 2వ శ్లోకం నుండి 22 వరకు వివరించబడ్డాయి. అన్నింటిలో ముఖ్య విషయం శ్రద్ధయే. శ్లో. 23 నుండి చివరి వరకూ 'ఓం, తత్, సత్' అనే మూడు పదాల వైశిష్ట్యం వివరించి, వాటిని ప్రశంసించాడు శ్రీకృష్ణుడు.

13వ అధ్యాయంలో క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అనే విభాగం తరువాత 14వ అధ్యాయంలో మూడు గుణాల విభాగం. అటు తరువాత దైవీసంపత్తు, ఆసురీసంపత్తు అంటూ విభాగం. ప్రస్తుతం వివిధ విషయాలలో శ్రద్ధ అనే ప్రాతిపదికపై విభాగం. ఇలా అన్నీ విభజించి చూపడం గీతలోని ప్రత్యేకత. ఇదే వేదాంతశాస్త్రంలో చెప్పే 'నిత్యానిత్య వస్తువివేకం'. వివేకం అనగా విడిగా చేసి, విభజించి, పరిశీలించడం. దీనివల్ల మనకు మంచి, చెడు, ఆత్మ, అనాత్మల అవగాహన కలిగించడం ఉద్దేశం. ఇది సాధనలో ముఖ్యం.

శ్రద్ధ, యజ్ఞం, దానం, తపస్సులాంటివన్నీ సత్కర్మలే కదా! మరి వీటిలో మళ్ళీ చెడు ఎక్కడుంది. వీటి విభజన ఎందుకు? అంటే సత్త్వరజస్తమోగుణాలు ఇక్కడకూడా మనల్ని మోసగించడానికే ప్రయత్నిస్తుంటాయి. దానసమయంలో రజోగుణం, తమోగుణం ఉండవచ్చు. అలాగే తపస్సులో తమోగుణం ఉండవచ్చు. యజ్ఞంలో

రాజసం, తామసం ఉండవచ్చు. ఇలా మనం సత్కర్మలు అనుకునేవాటిలో కూడా గుణాల విన్యాసం కనిపిస్తుంది. కాబట్టి ఈ గుణాల ప్రాతిపదికపై విభజన. ఇవి కలిగించే సంస్కారాలు, వాసనలు, వాటివల్ల వచ్చే ప్రవర్తనను బట్టి విభజన. ఈ గుణాల ప్రభావంనుండి తప్పించుకోవడం మనం చేయాల్సిన సాధన.

## శ్రద్ధ

మొదటగా శ్రద్ధ చెప్పబడింది. శ్రద్ధ అంటే శాస్త్రము, ఆచార్యుడు చెప్పిన విషయాలయందు విశ్వాసం. ఇది మూడురకాలు. ఒక్కోవ్యక్తి అంతఃకరణలో ఏ గుణాల ప్రాబల్యముందో దానికి అనుగుణంగా అతని శ్రద్ధ ఉంటుంది (శ్లో. 3).

**సాత్త్వికశ్రద్ధ –** వీళ్ళు సత్త్వగుణప్రధానులు కాబట్టి సత్త్వగుణ ప్రధానులైన దేవతలను ఆరాధిస్తుంటారు (శ్లో. 4).

**రాజసశ్రద్ధ –** వీరు త్వరగా వరాలిచ్చే యక్షులు, రాక్షసులను పూజిస్తారు. (శ్లో. 4)

**తామసశ్రద్ధ –** ప్రేతాలను, భూతగణాలను పూజిస్తారు. (శ్లో. 4) వీరు శాస్త్రం చెప్పని కర్మలను (క్షుద్రపూజలు మొ॥) చేస్తూ దంభం, అహంకారం కలిగి ఘోరతపస్సులు చేస్తారు. కామం, రాగం రెండూ వీరి లక్షణాలు (శ్లో. 5).

ఒక్కోసారి శరీరాన్ని కృశింపచేస్తూ, ఇంద్రియాలను బాధపెడుతూ వివేకంలేనివారై ఆత్మను వదలి క్షుద్రశక్తులగూర్చి ఘోరతపస్సు చేస్తూంటారు. వీళ్ళు నిజంగా అసురులు (శ్లో. 6).

## ఆహారంలో త్రివిధాలు

ఇదొక అద్భుతమైన సిద్ధాంతం. **యదన్నం తన్మనః** – ఎలాంటి ఆహారం తీసుకుంటే అలాంటి బుద్ధి వస్తుంది అని అనుభవపూర్వకంగా గ్రహించిన విషయం.

మనిషిలోనేగాక సృష్టిలోని ప్రతిపదార్థంలోనూ సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు వివిధ నిష్పత్తుల్లో కలిసివుంటాయని తెలుసుకున్నాం. 18వ అధ్యాయంలో ఇంకా స్పష్టంగా **న తదస్తి పృథివ్యాం తత్** (18–40) అనే శ్లోకంలో జగత్తులో ఈ మూడుగుణాల కలయిక లేని స్థావరం (చెట్లు, చేమలు)గానీ, జంగమం (జంతుజాలం) గానీ లేదని చెప్పబోతున్నాడు. స్థావరాలైన చెట్లు అన్నింటిలోకూడా ఈ మూడుగుణాల కలయిక ఉంటుంది. మనం తీసుకునే ఆహారం ఈ స్థావరాల కోవకు చెందినదే. కొన్ని పదార్థాల్లో సత్త్వగుణం, కొన్నింటిలో రజోగుణం, కొన్నింటిలో తమోగుణం ప్రకోపింపచేసే

స్వభావం ఉంటుంది. కావుననే బ్రహ్మజ్ఞాన సాధనలో ఉన్నవాడికి ఆహారనియమాలు చెప్పారు. రాజస, తామస పదార్థాలపై కోరిక ఉన్నప్పటికీ వాటిని వదలి సాత్త్విక పదార్థాలను సేవించాలి. బుద్ధిపూర్వకంగా చేసే పనులతో మన అంతఃకరణను మార్చుకోవడమే సాధన. Conscious habits influence the unconscious mind అని అక్కడక్కడా చెప్పుకున్నాం.

జనులు వీటి విషయంలో ఎలా ప్రవర్తిస్తున్నారో చెబుతున్నాడు.

**సాత్త్వికులు –**

**ఆయుస్సత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః।**

**రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః ॥ 8**

రసవంతములైనవి, చమురు ఉన్నవి (ఎండిపోనివి), దేహానికి పోషకంగా ఉండేవి, మనస్సుకు నచ్చేవి, శరీరపోషణకు స్థిరంగా నిలిచేది అయిన ఆహారాలు సాత్త్విక ఆహారాలు, సాత్త్వికులకు ప్రియమైనవి. (శ్లో. 8)

**రాజసులు –** రజోగుణంలో ఉన్నవారు మితిమీరి చేదు, పులుపు, కారం, మంట కలిగించే ఆహారపదార్థాలను, కాలక్రమేణ బాధకలిగించే పదార్థాలను ఇష్టపడతారు. ఇవి చివరకు దుఃఖాన్ని, రోగాన్ని కలిగించేవి (శ్లో. 9).

**తామసులు –** తమోగుణంలో ఉన్నవారు వండీ వండని పదార్థాలు, పాచిపోయినవి, గత దివసంలో వండినవి, ఇదివరకే తినగా మిగిలినది, యజ్ఞానికి అనర్హమైనవి అయిన వాటిని కోరుకుంటారు (శ్లో. 10).

**యజ్ఞం**

ఇది మూడు విధాలు. 4వ అధ్యాయంలో చెప్పిన విస్తృతమైన అర్థాన్ని కూడా ఇక్కడ అన్వయించుకోవచ్చు.

**సాత్త్విక యజ్ఞం –** ఫలాకాంక్ష లేకుండా విధి (వేదం, శాస్త్రం)లో చెప్పిన ప్రకారం ఇది నా కర్తవ్యం అనే భావనతో చేసే యజ్ఞం సాత్త్వికం (శ్లో. 11). అంతఃకరణశుద్ధియే లక్ష్యంగా చేసే యజ్ఞం.

**రాజసయజ్ఞం –** స్వర్గం మొదలైన లోకాలు, ధనప్రాప్తి, పుత్రప్రాప్తి మొ॥ కోరికలను అనుసంధానం చేసుకుని లేదా తన గొప్పతనం ప్రదర్శించడానికో చేసే యజ్ఞం రాజసం అవుతుంది. దీనిలో అంతఃకరణశుద్ధి ఉద్దేశింపబడలేదు (శ్లో. 12).

**తామసయజ్ఞం –** శాస్త్రంతో సంబంధంలేనిది, అనగా ఎక్కడా శాస్త్రంలో చెప్పబడనిది, యజ్ఞంలో ఉండాల్సిన అన్నదానాలు, దక్షిణలు మొదలైనవి లేనిది, అపస్వరాలతో కూడిన మంత్రాలు కలది, శ్రద్ధ లేకుండా చేసినది అయిన యజ్ఞం తామసయజ్ఞం (శ్లో. 13).

రాజసయజ్ఞంలో జ్ఞానానికి సహకరించే అంతఃకరణశుద్ధి లేకున్నా శాస్త్రవిధి ప్రకారం చేసినందువల్ల కొంత ఫలితముంటుంది. తామసంలో అలాంటి ఫలప్రసక్తి లేదు.

**తపస్సు**

మొదటగా శారీరం (కాయికం), వాచికం, మానసం అనే ప్రాతిపదికపై మూడు విధాలు. తర్వాత గుణాల ప్రాతిపదికపై మూడు విధాలు. మొత్తం ఆరువిధాల తపస్సులు చెప్పబడ్డాయి.

**శారీరం –** శరీరంతో చేసేవి. దేవతలు, ద్విజులు, గురువులు, పండితులు మొదలైనవారిని పూజించడం, శౌచం (శారీరక, మానసిక), ఋజుత్వం, బ్రహ్మచర్యం, అహింస ఇవన్నీ శరీరంతో చేసే తపస్సు (శ్లో. 14).

**వాఙ్మయం తపః –** అనగా వాక్కుకు సంబంధించిన తపస్సు. ఎదుటివాడికి దుఃఖం, ఉద్వేగం కలిగించని వాక్కును ఉపయోగించాలి. అలాగే **సత్యం ప్రియహితం** అయిన వాక్కు. ఇది చాలా దుర్లభమైనది. సత్యమైనది ప్రియం కాకపోవచ్చు, ప్రియమైనది హితం కాకపోవచ్చు. ఇదొక అసిధారావ్రతం (కత్తిమీదసాము) లాంటిది. శిష్యులకు మాత్రం అప్రియమైనా హితం చెప్పాలి. ఇతరులతో పై మూడు అంశాలు సమపాళ్ళలో ఉండేట్లు చెప్పాలి. అలాగే స్వాధ్యాయాన్ని అధ్యయనం చేయడం. అనగా ఆనువంశికంగా (వంశపరంపరలో) వచ్చిన వేదభాగాన్ని సరిగా చదివి దానిని తన తర్వాతి తరానికి అందించడం. దీనినే ఋషిఋణం తీర్చుకోవడమని కూడా అంటారు. ఇవన్నీ వాఙ్మయ (వాక్కుకు సంబంధించిన) తపస్సు (శ్లో. 15).

**మానసయజ్ఞం –** మనఃప్రసాదం, అంటే మనస్సులో రాగద్వేషాలు లేకుండా వుండడం, విషయచింతలు లేకపోవడం, సౌమ్యత్వం, మౌనం (దీనికి రెండు అర్థాలు – 1. **మననాత్ మునిః** అన్నట్లు వేదార్థాన్ని మననం చేయడం; 2. ఎక్కువగా మాట్లాడకపోవడం), **ఆత్మవినిగ్రహః** – మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించడం, భావశుద్ధి – మనస్సు యొక్క నిర్మలత్వం, ఇవన్నీ మనస్సుకు సంబంధించిన తపస్సు (శ్లో. 16).

గుణాలభేదం వల్ల తపస్సు మూడు రకాలు.

తప – ఆలోచనే అనే ధాతువునుండి వచ్చిన శబ్దం తపస్సు. దీనిలో ఆలోచన, చింతనం ప్రధానం. ఒక పనిచేస్తున్నప్పుడు దానిపై చింతనం ఎలా ఉంది అనేది ముఖ్యం. చిత్తం శివునిమీద.... అనే సామెత ఇక్కడ అన్వయించుకోవచ్చు.

**సాత్త్విక తపస్సు –** ఫలాకాంక్షలేకుండా యోగంతో కూడినవారై (ఆత్మవిచారణ చేయువారై) చేసే తపస్సు సాత్త్విక తపస్సు (శ్లో. 17).

**రాజస తపస్సు –** ఇతడు గొప్ప తపశ్శాలి, గొప్ప సాధువు. ఇతనికి సత్కారం చేద్దాం అనిపించుకోవాలనే భావంతో, డాంబికంగా (అందరికీ బాగా ప్రచారమయ్యేలా) చేసే తపస్సు రాజస తపస్సు. దీనివల్ల చాంచల్యమేగాని ఫలం దక్కదు (శ్లో. 18).

**తామస తపస్సు –** మూర్ఖపట్టుదలతో శరీరాన్ని కృశింపచేస్తూ, ఇతరుల నాశనాన్ని కోరుతూ చేసే తపస్సు తామస తపస్సు (శ్లో. 19). రావణుడు, హిరణ్యకశిపుడు మొ॥ వారందరూ తపస్సు చేసినవారే. కానీ వారి తపస్సు ఈ కోవకు చెందుతుంది.

**దానంలో భేదాలు**

**సాత్త్విక దానం –** ఇవ్వడం నా ధర్మం అనే ఉద్దేశంతో మనకు ప్రత్యుపకారం చేస్తాడనే ఆశ లేకుండా, సరైన ప్రదేశంలో (పుణ్యక్షేత్రాలలో), సరైన కాలంలో (సత్కార్యాలకు) సరైన వ్యక్తికి ఇచ్చేదానం సాత్త్వికం. తైత్తిరియోపనిషత్తులో – **శ్రద్ధయా దేయమ్ । అశ్రద్ధయాఽదేయమ్ । శ్రియా దేయం । హ్రియా దేయమ్ । భియా దేయమ్ । సంవిదా దేయమ్ –** అన్నారు. అంటే – శ్రద్ధతో దానాన్ని ఇవ్వాలి, అశ్రద్ధతో ఇవ్వకూడదు, తనకున్న సంపదను అనుసరించి దానం చేయాలి, సిగ్గుతో దానం చేయాలి (అంటే నేనింతకంటే ఎక్కువ ఇవ్వలేకపోతినే అనే భావము). భయంతో ఇవ్వాలి (పరలోకభయంతో అనే అర్థం). మిత్రులు మొదలైనవారికి వివాహాది సమయాల్లో చేసే సహాయం సంవిత్ అనబడుతుంది. ఆవిధంగా దానం చేయాలి అని అర్థం. ఇవన్నీ సాత్త్విక దానాలు.

**రాజసదానం –** ఇతడు మనకు మరలా ఉపకారం చేస్తాడు, లేదా ఈ దానంవల్ల పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి అని, లేదా బాధపడుతూ ఇచ్చిన దానం రాజసమవుతుంది (శ్లో. 21).

**తామసదానం –** తగని ప్రదేశంలో, తగని కాలంలో దానం ఇవ్వడం. అపాత్రుడికి అనగా సత్ప్రవర్తన లేనివాడికి, దుష్కర్మ చేయబోయేవానికి దానమివ్వడం లేదా

అవమానకరంగా మాట్లాడుతూ, దెప్పిపొడుస్తూ ఇవ్వడం తామసదానం. నటవిటాదులకు ఇవ్వడం కూడా తామసదానం అని మధుసూదనులు వ్రాశారు.

**బ్రహ్మభావన**

పై చెప్పిన యజ్ఞం, దానం, తపస్సు మొదలైనవన్నీ అంతఃకరణాన్ని పవిత్రం చేసే పనులు. కానీ ఈ పనులు చేస్తున్న సమయంలో శ్రద్ధ లోపించవచ్చు. యజ్ఞసమయంలో, ధ్యానసమయంలో మనస్సు విక్షేపం (diversion) పొంది శ్రద్ధ కోల్పోవచ్చు. ఆవిధంగా కర్మ విచ్ఛిన్నమైనప్పుడు ఆ కర్మ ఫలం నశించకుండా ఉండడానికై బ్రహ్మభావన చేయాలి అని ఈ అధ్యాయంలో చివరి అంశం.

ఉపనిషత్తుల్లో బ్రహ్మను సూచించే పదాలు ముఖ్యంగా మూడు. 'ఓం' అనేది ప్రసిద్ధి పొందినదే. **'తత్త్వమసి'** మొదలైన వాక్యాల్లో 'తత్' శబ్దం బ్రహ్మను సూచిస్తుంది. అలాగే **'సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్'** లాంటి మంత్రాల్లో 'సత్' శబ్దం బ్రహ్మను సూచిస్తుంది. అందువల్ల ఏదైనా కార్యం మధ్యలోగానీ, చివర్లోగానీ 'ఓం తత్ సత్' అని చెప్పడం ఆ కార్యం సఫలం కావడానికి మార్గంగా చెప్పబడింది.

ఏ సందర్భాల్లో, ఏ శబ్దం చెప్పాలి అన్నప్పుడు ఎలాంటివారైనా యజ్ఞం, దానం, తపస్సు ప్రారంభించే సమయంలో ఓంకార పూర్వకంగా చేయాలి అని నియమం (శ్లో. 24).

మోక్షం కోరుకునేవారు యజ్ఞం, దానం, తపస్సులలో 'తత్' అని చెబుతూ ఫలాకాంక్ష లేకుండా ఆ కర్మలు చేస్తారు (శ్లో. 25). అంటే ముఖ్యంగా దానసమయంలో చెప్పే శబ్దం.

ఒక్కోసారి ఈ కర్మలు చేస్తున్న విధానం సరైనదా కాదా అని శంక కలిగినప్పుడు ఇది సరైనదే అని చెప్పడానికి 'సత్' అనే శబ్దం వాడతారు (శ్లో. 26). సాధు సాధు (శుభం శుభం) అనే శబ్దాలతో మంచిఫలాన్ని ఆశిస్తారు. ఈ పదాలను వివాహం మొదలైన మంగళకార్యాల్లో కూడా వాడుతుంటారు.

శ్రద్ధ అంటే గురువులు, ఆచార్యులు, శాస్త్రం చెప్పిన విషయాలపై విశ్వాసం, ఆస్తిక్యబుద్ధి. శ్రద్ధతో చేసిన యజ్ఞదానాదులు 'సత్' అనిపించుకుంటాయి. శ్రద్ధ లేని కర్మలు 'అసత్' – అనగా ఫలితమివ్వనివి అని పిలవబడతాయి (శ్లో. 27,28).

అంతఃకరణమనే ధర్మక్షేత్రంలో యజ్ఞం, తపస్సు, దానం అనే కర్మబీజాలను నాటినప్పుడు శ్రద్ధ అనే జలంతో ఆ క్షేత్రాన్ని తడపాలని చెబుతారు. శాస్త్రపరిజ్ఞానం

లేకపోయినా కేవలం శ్రద్ధతో, సాత్త్వికశ్రద్ధతో కర్మలు చేస్తే వాటి ఫలం శాస్త్రజ్ఞానంతో చేసిన కర్మఫలానికి సమానంగా ఉంటుందని భావం. మాంసం అమ్ముకునే ధర్మవ్యాధుడు (భారతంలో) మొ॥ వారు పొందే మోక్షానికీ, బ్రాహ్మణుడు, ఋషి పొందే మోక్షానికీ తేడా లేదని మన గ్రంథాలు చెబుతాయి. ముఖ్యంగా సూతసంహితలో ఇవి ఇంకా వివరంగా చెప్పబడ్డాయి. బ్రహ్మసూత్రాల్లోని **ముక్తిఫలాధికరణం** (3-4-52)లో శ్రీశంకరులు భారతంలోని శ్లోకాన్ని ఉటంకించారు. **న హి గతి రధికాస్తి కస్యచిత్ సతి హి గుణే ప్రవదంత్యతుల్యతామ్** (శాంతిపర్వం. 194-60) మోక్షావస్థలో వీని మోక్షం గొప్పది. వీని మోక్షం తక్కువ రకమైనది అని భేదం ఉండదని భావం.

❖ ❖ ❖

## పదునెనిమిదవ అధ్యాయము

# మోక్షసంన్యాస యోగము

పై అధ్యాయంలో శ్రద్ధ, యజ్ఞం, తపస్సు మొ॥ వాటిని సాత్త్విక, రాజస, తామస గుణాల నేపథ్యంలో విచారించారు. ఇంకా కొన్ని ముఖ్యమైన అంశాలు కర్మత్యాగం, కర్మ, జ్ఞానం మొ॥ మిగిలివున్నాయి. ఇవి ఈ అధ్యాయంలో వివరింపబడతాయి.

మహాభారతకాలంలో పై విషయాలగురించి అనేక వాదనలుండేవి. వేదంలో చెప్పిన కర్మలు జీవితాంతం చేస్తూనే ఉండాలని ఆ కాలంలోని కర్మమీమాంసకుల సిద్ధాంతం. అసలు వేదాంతమే పనికిరాదని వీరి భావం. వేదమంతా కర్మలకు సంబంధించినదే, కర్మలతో సంబంధంలేని మాటలన్నీ అర్థంలేని మాటలని వీరి వాదం. వేదాల పూర్వభాగమంతా యజ్ఞాలు, యాగాలు మొ॥ వాటి గురించి చెబుతాయి. తర్వాతి భాగాలు ఉపాసనలు, ధ్యానం మొదలైనవాటి గురించి చెబుతాయి. చివరగా ఉపనిషత్తుల్లో తత్త్వచింతన (ఆత్మవిచారం) చెబుతాయి.

ఆత్మవిచారం వేదాల ముఖ్య ఉద్దేశమని, దానికి కావాల్సిన చిత్తశుద్ధి కలిగించడానికే ముందు చెప్పిన కర్మలనీ వేదాంతుల వాదం. వైదికధర్మాన్ని అనుసరించేవాళ్లలోనే అభిప్రాయభేదాలు తీవ్రంగా ఉండేవి. జ్ఞానమార్గంలో ఉన్నవాడు సంన్యసించాలని వేదాంతులు ఒక శ్రుతిని ఉదహరిస్తే, మీమాంసకులు మరొక శ్రుతి ఉదహరించి దాన్ని ఖండించేవారు. కుంటి, గ్రుడ్డి మొ॥ వారికే సంన్యాసంగానీ, అవయవ పటుత్వమున్నవారు జీవితాంతం యజ్ఞము మొ॥ కర్మలు చేయాలని మీమాంసకుల వాదన.

శంకరులు తత్కాలీన వాదప్రతివాదాలను దృష్టిలో ఉంచుకొని తన వ్యాఖ్యను వ్రాయడంతో ఆధునికులకు కొంత జటిలంగా కనిపిస్తుంది. మనం ఎలాంటి కర్మలు చేయడంలేదు కావున కొంత అసందర్భంగా, అయోమయంగా కనిపిస్తుంది. కానీ గ్రంథాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ వాదప్రతివాదాలను ఆనాటి నేపథ్యంలో గమనించి గ్రహించాలి.

ప్రస్తుత అధ్యాయంలో కర్మ, జ్ఞానం మొ॥వాటి విభాగాలే కాకుండా గీతాశాస్త్రం యొక్క సారాంశం కూడా చెప్పబడింది. అర్జునుడికి శ్రీకృష్ణుడు ఇవ్వాల్సిన చిట్టచివరి ఆదేశం ఇందులో స్పష్టంగా చెప్పబడింది. గీతలో ఇదివరకు చెప్పిన జ్ఞానమార్గం, కర్మమార్గం మొ॥ వాటిని ఒకసారి సింహావలోకనం చేయడం జరిగింది.

ఈ అధ్యాయం పేరు మోక్షసంన్యాసయోగం. 78 శ్లోకాలు కలిగి అన్ని అధ్యాయాలకంటే పెద్దది. మొదటి 11 శ్లోకాల్లో కర్మసంన్యాసం, కర్మఫలత్యాగం గూర్చి, శ్లో. 12 నుండి 17 వరకు జ్ఞానియై కర్మలు చేయువాని గురించి చెప్పబడింది. శ్లో. 18 నుండి 40 వరకూ జ్ఞానం, కర్మ, కర్త మొ॥ వాటిని త్రిగుణాల నేపథ్యంలో మూడు రకాలుగా విభజన, శ్లో. 41 నుండి 49 వరకు నాలుగు వర్ణాలు, వారి ధర్మాలు చెప్పబడ్డాయి. స్వధర్మాన్ని ప్రశంసించడం, తర్వాతి శ్లోకాల్లో జరిగింది. చివరగా శ్రీకృష్ణుడి ఆదేశం, ఉపసంహార వాక్యాలు, సంజయుడు గీతను ప్రశంసించడంతో అధ్యాయం ముగుస్తుంది.

**సంన్యాసం - త్యాగం**

గడచిన అధ్యాయాల్లో అక్కడక్కడ శ్రీకృష్ణుడు సంన్యాసాన్ని ప్రశంసించడం, అక్కడక్కడ కర్మఫలత్యాగాన్ని ప్రశంసించడం చూశాం.

**న చ సంన్యసనాదేవ** (3-4) – కేవలం సంన్యాసంవల్లనే మోక్షం రాదు.

**మయి సర్వాణి కర్మాణి సంన్యస్య** (3-30) – అన్నికర్మలనీ నాయందు సంన్యసించి, ఈశ్వరార్పణబుద్ధితో కర్మలు చేసి.

**త్యక్త్వా కర్మ ఫలాసంగం** (4-20) – కర్మఫలంపై ఆసక్తిని విడిచిపెట్టి.

**యోగ సంన్యస్త కర్మాణం** (4-41) – కర్మయోగంతో ఉండి, కర్మఫల సంన్యాసం చేసినవాడిని.

**స సంన్యాసీ చ యోగీ చ** (6-1) – అతడే సంన్యాసి, యోగి (కర్మయోగి).

**సంన్యాసయోగ యుక్తాత్మా** (9-28) – సంన్యాసంతో కూడినవాడై.

ఈవిధంగా ఒక్కోవిధమైన సంన్యాసాన్ని ఒక్కోవిధమైన కర్మయోగాన్ని ఒక్కొక్క చోట ప్రశంసిస్తూ వచ్చాడు. వీటిని సరిగా అర్థం చేసుకోవాలి.

సంన్యాసం ముఖ్యంగా రెండురకాలు.

1) వేదాంతవాక్యాలను సరిగా అర్థం చేసుకోవడం (శ్రవణం), నిరంతర ధ్యానం (మననం), వాటిలో చెప్పినవిధంగా కర్తృత్వభావన తొలగించుకొని బ్రహ్మాభావనలో ఉండడం (నిదిధ్యాసన), కర్మలను వదలివేయడం. ఇది జ్ఞానంతో కూడిన సంన్యాసం. దీనినే **విద్వత్సంన్యాసం** అంటారు.

2) రెండో పద్ధతి – జ్ఞానం పొందాలనే ఉద్దేశంతో కర్మలను సంన్యసించి శ్రవణ, మననాదులు చేస్తూ, జ్ఞాని లక్షణాలనే సాధనాలుగా చేసికొని శమం, దమం కలిగి

ద్వంద్వాలకు అతీతంగా ఉండడాన్ని అభ్యసిస్తూ ఉండడం. జ్ఞానం పొందాలనే కోరిక ఉంది కావున **వివిదిషా సంన్యాసం** అన్నారు (వివిదిషా = తెలుసుకోవాలనే కోరిక).

పై చెప్పిన ఇద్దరిలో విద్వత్సంన్యాసి సర్వకర్మ సంన్యాసం చేశాడు కావున కర్మ అనుష్ఠానమే లేదు. రెండవవాడికి జ్ఞానమార్గంలో ఉంటూ కర్మలను వదిలేశాడు. కావున పై ఇద్దరికీ కర్మలను వదలడమనే ప్రసక్తి ఉండదు. వేదం పూర్వభాగంలో చెప్పిన కర్మలు వీరికి వర్తించవు. జ్ఞాని కానివాడికి మాత్రమే కర్మలు వర్తిస్తాయి. మరి శ్రీకృష్ణుడు ఎవరి కర్మసంన్యాసం గూర్చి చెప్పాడు? అంటే గృహస్థుడుగా ఉంటూ శ్రవణ, మననాదులవల్ల జ్ఞానం కలిగి కర్మలను వదలివేయాలనుకునేవాడికి.

కానీ గృహస్థుడు కర్మలను వదిలేస్తే మిగతా ఆశ్రమాలన్నీ కుప్పకూలుతాయి. బ్రహ్మచారికి, సంన్యాసికీ ఆశ్రయాన్నిచ్చేది గృహస్థుడే. ఇతడు సిద్ధాంత జ్ఞానాన్ని పొందాడు. కానీ గృహస్థాశ్రమమనే ఉపాధిలో ఉన్నాడు కాబట్టి ఇతని ఉపాధిధర్మాలు (ఒక ఉద్యోగంలో ఉన్నప్పుడు ఆ ఉద్యోగ ధర్మాలు నిర్వహించవలసినట్లు) వదలకూడదని నియమం. ఒక పద్ధతి ప్రకారం సంన్యాసం తీసుకున్న తర్వాతనే కర్మలను వదలివేయడం అనుమతించబడింది.

ఈ అధ్యాయంలో “సంన్యాసం, త్యాగం ఈ రెంటి గురించి నిశ్చయంగా నీ అభిప్రాయమేమిటి?” అన్నది అర్జునుడి ప్రశ్న. సంన్యాసికి (పై చెప్పిన ఇద్దరికీ) ఈ ప్రశ్న వర్తించదు. ఎందుకంటే వాడికి కర్మలు లేవని శాస్త్రమే చెప్పింది. గృహస్థుడిగా ఉండి గుణాలచేత సంన్యాసి స్థాయికి వచ్చినవాడి గూర్చి పై ప్రశ్న. (గుణాలచే వచ్చిన సంన్యాసభావం కావున గౌణసంన్యాసం అన్నారు).

కాబట్టి గృహస్థుడు (ప్రస్తుతం అర్జునుడు) చేయాల్సినదేమిటి? ప్రస్తుతం అర్జునుడి సందేహం తన క్షత్రియధర్మం అనుసరించవలెనా? వద్దా? ఆనాటి సమాజంలో సంన్యాసానికి ఉన్న ప్రాధాన్యతనుబట్టి ప్రజలు కర్మవిముఖులయే ప్రమాదముంది. నాటి సమాజంలో (సిద్ధాంతం ప్రకారం నేటికీ) ఉన్న ఆశ్రమాలు నాలుగు - 1) బ్రహ్మచర్యం 2) గృహస్థాశ్రమం 3) వానప్రస్థం 4) సంన్యాసం. ఏయే ఆశ్రమంలో ఉన్నవాడు ఆయా ఆశ్రమధర్మాలు చేయాలి. గృహస్థుడయినవాడికి జాతిధర్మాలు (అంటే బ్రాహ్మణుడి విషయంలో భిక్షాటనం, వేదాధ్యయనం, క్షత్రియుడి విషయంలో రాజ్యపాలన, వైశ్యుడికి వాణిజ్యం) విధింపబడ్డాయి. గృహస్థాశ్రమం మిగతా ఆశ్రమాలను నిలిపేది. (ఈనాడు కూడా గృహస్థులే దానధర్మాలు చేయడంవల్ల కొన్ని సామాజిక

సేవాకార్యక్రమాలు జరగడం చూస్తున్నాం). గృహస్థుడు కర్మలను మానివేస్తే సమాజం అస్తవ్యస్తమవుతుంది. అందుకని గృహస్థుడు తనకు, తన వర్ణానికి, ఆశ్రమానికి చెప్పిన కర్మలు చేసితీరాలని ఆనాటి ధర్మనిర్ణయం. ఈ విషయంపై ఈ శ్లోకాల్లో చర్చ. శ్రీకృష్ణుడి సమాధానం ఇలా ఉంది –

**కామ్యానాం కర్మణాం న్యాసం సంన్యాసం కవయో విదుః ।**
**సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥ 2**
**త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।**
**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే ॥ 3**

కర్మలు నాలుగు రకాలని పైన తెలుసుకున్నాం. 1) నిత్యకర్మలు – ప్రతినిత్యం చేయాల్సిన సంధ్యావందనం, దేవతాపూజ, అతిథిపూజ, భూతయజ్ఞం (ప్రాణులకు ఆహారమివ్వడం) మొ॥ 2) నైమిత్తిక కర్మలు – ఏదైనా నిమిత్తం అనగా వివాహం, ఉపనయనం, పండుగలు మొ॥ సందర్భాల్లో చేయాల్సిన కర్మలు. 3) కామ్యకర్మలు – ఏదో ఫలం – పుత్రసంతానం, రాజ్యప్రాప్తి, పంటలు పండడం, స్వర్గాదిలోకాలు లాంటి ఫలాలకోసం చేసే కర్మలు. 4) నిషిద్ధకర్మలు – వీటి ప్రసక్తే లేదు కావున మొదటి మూడురకాల కర్మలు ఇక్కడ చర్చలోని విషయం.

పై శ్లోకాల్లో శ్రీకృష్ణుడు ఆనాటి విద్వాంసుల అభిప్రాయాన్ని చెబుతున్నాడు.

- కామ్యకర్మలను వదలివేయడం సంన్యాసమని కొందరు,
- అన్ని కర్మలను (కర్మలు చేస్తూ) ఫలత్యాగం చేయడం త్యాగమని కొందరు
- కర్మలను వదలివేయాల్సిందేనని కొందరు
- యజ్ఞం, దానం మొదలైన కర్మలను వదలకూడదని మరికొందరు చెబుతున్నారు.

నా నిశ్చయాన్ని విను అంటూ శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు.

**యజ్ఞో దానం తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 5**

యజ్ఞం, దానం, తపస్సు అనేవాటిని చేయాల్సిందే. ఎందుకనగా ఇవి అంతఃకరణ శుద్ధికి పనికివచ్చేవి, మనిషిని పవిత్రం చేసేవి అని తాత్పర్యం. **త్రయో ధర్మస్కంధాః, యజ్ఞోఽధ్యయనం దానం** అని ప్రసిద్ధ వాక్యం. ధర్మాన్ని ఒక చెట్టుతో పోలుస్తారు. ఈ చెట్టుకు మూడు శాఖలు – యజ్ఞం, అధ్యయనం, దానం. వీటి నీడనే జనులందరూ

సుఖాన్ని పొందుతారు అని అర్థం.

కామ్యకర్మలు (కోరికతో చేసే కర్మలు) తప్ప మిగిలిన కర్మలన్నీ చేయాల్సిందేనని భావం. వీటిని కూడా ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి అని అర్థం. ఇది నా కర్తవ్యం అనే భావంతో అసక్తబుద్ధితో (సంగం లేకుండా) చేయాలి (శ్లో. 6).

త్యాగాన్ని మిగతా కారణాలవల్ల కూడా చేసేవారున్నారు. కానీ అవి రాజస, తామస త్యాగాలు. శ్రుతుల్లోనూ (వేదంలోనూ), స్మృతుల్లోనూ (మనుస్మృతి, పురాణాలు, భారతం లాంటి గ్రంథాలు) చెప్పిన నిత్యకర్మలను వదలివేయడం ఎట్టిపరిస్థితిలో అంగీకరింపబడదు. జ్ఞాని కానివాడు, అవిరక్తుడైనవాడు, అజ్ఞానంవల్ల అట్టి కర్మలను వదలివేయడం తామసత్యాగం అనిపించుకుంటుంది (శ్లో. 7). అలా కాకుండా శరీరక్లేశమనో, మరొక క్లేశమనో నెపంతో వీటిని వదలివేయడం కూడా తప్పే. ఇది రాజసత్యాగమవుతుంది (శ్లో. 8). నిత్యకర్మలు నా కర్తవ్యం అనే బుద్ధితో కర్మఫలాపేక్ష లేకుండా చేయడం సాత్త్వికత్యాగం (శ్లో. 9). కాబట్టి దేవయజ్ఞం, అతిథియజ్ఞంలాంటి కర్మలు, దానధర్మాలు, గృహస్థుడు తప్పక చేయాలని అర్థం.

నిజానికి దేహమున్న (దేహాభిమానమున్న) ఎవడికైనా కర్మలను వదలివేయడం శక్యంకాదు. కర్మఫలాన్ని త్యాగం చేసేవాడు నిజమైన త్యాగి (శ్లో. 11). అతడే సంన్యాసి. అతడు శ్రద్ధతో కర్మలు చేయడంవల్ల అంతఃకరణశుద్ధి కలుగుతుంది.

**కర్మఫలం**

4వ అధ్యాయంలో కర్మ చాలా సూక్ష్మమైనది. దీన్ని తెలుసుకోవడం కష్టం (శ్లో. 4-17) అన్నాడు. అక్కడ కర్మ, అకర్మ, వికర్మ లాంటి పదాలు చూశాం. కర్మలు చేస్తూ నేను కర్మలు చేస్తున్నాను అని గ్రహించేవాడు సకర్ముడు (కర్మ ఉన్నవాడు). నేను కర్మ చేయడంలేదు అనుకునేవాడు కూడా సకర్ముడే, ఎందుకంటే నేను చేయడంలేదనే భావనలో ఉన్నాడు. వాడికి కర్మలు చేయకపోవడంవల్ల వచ్చే ఫలం (the result of omission) ఉంటుంది. నేను అనే భావన లేకుండా కర్మలు చేసేవాడు అకర్ముడు (కర్మలు లేనివాడు). 'నేను'ను కర్మనుండి తీసివేయడంవల్ల (disconnect) ఇతనికి కర్మఫలం ఉండదు.

ఈ విషయాన్నే ప్రస్తుత అధ్యాయం శ్లో. 12 నుండి చెబుతున్నాడు.

కర్మఫలం మూడు రకాలు. 1) అనిష్టం - పాపకర్మలకు ఫలంగా వచ్చే నరకం, లేదా పశుపక్ష్యాది జన్మ. 2) ఇష్టం - దేవత్వం. 3) మిశ్రం - ఇష్టము, ఇష్టముకానిది

రెండూ ఉండే మనుష్యజన్మ. ఫలం ఎవడికి అంటే సకర్ముడికి. అనగా 'నేను' భావన ఉన్నవాడికి. కర్మఫలత్యాగికి ఇది వర్తించదు (శ్లో. 12).

కర్మ ఏర్పడడానికి ఐదు కారణాలు (శ్లో. 14).

1. **అధిష్ఠానం –** ఇదే దేహం. కర్మలు చేయడానికి గాని కర్మఫలం అనుభవించడానికి గాని స్థానం. అందుకే భోగాయతనం – అనుభవించే స్థానం అన్నారు.
2. **కర్త –** నేను కర్త అనే భావన ఉన్న వ్యక్తి.
3. **కరణం –** ఇంద్రియాలు. ఇవి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అని రెండు రకాలు.
4. **చేష్టలు –** వివిధరకాలైన శరీరచేష్టలు.
5. **దైవం –** ఇంద్రియాలకు అధిదేవతలుగా ఉన్నవారు అందించే సహాయం. ప్రతి ఇంద్రియానికి ఒక అధిదేవత (presiding deity) అనే భావన శ్రుతుల్లో ఉంది. పంచభూతాల పరిణామాలే ఐదు ఇంద్రియాలని పైన గమనించాం. ఐదు ఇంద్రియాల అధిదేవతలు ఈవిధంగా ఉన్నారు. చక్షురింద్రియం – సూర్యుడు; శ్రవణేంద్రియం – దిగ్దేవత; స్పర్శ – వాయువు; ఘ్రాణం – భూమి; వాక్కు – అగ్ని; మనస్సు – చంద్రుడు. ఒక్కో వ్యక్తిలో ఒక్కో అంశ ఎక్కువ తక్కువలు ఉండవచ్చు. కావున పంచభూతాలను దేవతాస్వరూపాలుగా గ్రహించారు.

మనం శరీరం, వాక్కు, మనస్సు అనే త్రికరణాలచే (మూడు సాధనాలు) ఏ పనులు చేసినా (మంచైనా, చెడైనా) ఆ కర్మలకు పై ఐదూ కారణాలు (శ్లో. 15).

ఇలావుండగా తాను కర్త అనుకునేవాడు కేవలం అజ్ఞాని. అతనిది అకృతబుద్ధి – శాస్త్రంచేత, ఉపదేశంచేత సంస్కరింపబడని బుద్ధి. ఆత్మతత్త్వాన్ని సరిగా చూడలేకపోవడంవల్ల తానే కర్త అనుకుంటున్నాడు (శ్లో. 16).

**దేహంలో కర్తృత్వమెవరిది?**

శరీరం, ఇంద్రియాల సమూహం 'నేను' అని తాదాత్మ్యం (identification - అదే నేను అనుకోవడం) ఉన్న జీవుడు కర్త. ఇతన్నే వేదాంతశాస్త్రంలో విజ్ఞానమయకోశం అంటారు. ఈ సందర్భంలో శంకరానందులనే వ్యాఖ్యాత రెండు ఉపనిషద్వాక్యాలను ఉదహరించారు. 1) **విజ్ఞానం యజ్ఞం తనుతే, కర్మాణి తనుతేఽపి చ** 2) **మంతా భోక్తా,**

**కర్తా, విజ్ఞానాత్మా పురుషః** – అని ఈ రెండు వాక్యాలు. విజ్ఞానానాత్మయే శరీరంలో కర్త అని అర్థం.

శరీరాన్ని ఐదు స్థాయిల్లో పరిశీలిస్తారు. కేవలం మాంసం, మజ్జ, ఎముకలు ఉన్న స్థాయి అన్నమయ శరీరం. తర్వాతది ప్రాణమయకోశం. వాయువు శరీరంలో అన్నిపనులనూ చేయిస్తుంది. ఆ తర్వాత ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు కలిసి ఇంద్రియాలద్వారా విషయాలను గ్రహించే స్థాయి మనోమయకోశం. తర్వాతిది విజ్ఞానమయకోశం. ఐదు జ్ఞానేంద్రియాలు, బుద్ధి కలిసి ఫలానా పని చేయవచ్చు, చేయకూడదు అని విమర్శించగలిగే స్థాయి. కావున దీనిదే కర్తృత్వం. దీని తర్వాత మనకు సుషుప్తికాలంలో ఏమీ తెలియని స్థితి. మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు సెలవు తీసుకున్న స్థితి. ఆనందమయకోశం అంటారు. మనస్సు, బుద్ధి నశించవు. వాటికి కారణమైన ఆనందమయ శరీరంలో ఉంటాయి అని వ్యవహరిస్తారు. ఆ స్థితిలో నేను కర్త, భోక్త అనే జ్ఞానమే లేదు.

కావున విజ్ఞానాత్మ, విజ్ఞానమయకోశంలో ఉంటూ నేను అనే భావన ఉన్న జీవుడే కర్త, భోక్త. శరీరం, ఇంద్రియాలు అనే ఉపాధిలో ఉన్న కర్మను ఆత్మకు సంబంధం లేనిదానిగా గ్రహించినవాడు ఎలాంటి కర్మను చేసినా దాని ఫలం అతణ్ణి అంటదు (శ్లో.17). పై చెప్పిన అధిష్ఠానం (దేహం) మొదలైనవాటివల్ల జరిగే కర్మను ఎవడు దృశ్యంగా చూస్తుంటాడో అతడు ఎలాంటి కర్మకూ బద్ధుడుకాడు అని అర్థం.

**సాధకుడు చేయాల్సినదేమిటి?**

మోక్షమార్గంలో ఉన్న సాధకుడు ఎలాంటి జ్ఞానంతో ఉండాలి. ఎలాంటి కర్మ చేయాలి. తాను ఎలాంటి కర్తగా ఉండాలి అనే విషయాన్ని మళ్ళీ త్రిగుణాలభేదాన్ని అనుసరించి చెబుతున్నాడు. రాజస, తామస సంబంధమైనవాటిని వదిలి సాత్త్వికమైన వాటిని గ్రహించినపుడే చిత్తశుద్ధి, తద్వారా క్రమంగా జ్ఞానప్రాప్తి కలుగుతుందని సూచించడానికై క్రింది వివరణ. ఈ విభజన అంతా సాధనకు ఉపకరించేదే. ఎవడి హృదయంలో వాడికి తాను సాత్త్విక స్వభావుడినా, రాజస స్వభావుడినా అని తెలుసు. కాబట్టి నిషిద్ధమైనవాటిని వదులుకోవడానికి ఈ విభజన అంతా చెప్పబడింది.

జ్ఞానవిషయంలో మూడు అంశాలుంటాయి. జ్ఞానం, జ్ఞేయం (తెలుసుకోదగినది), జ్ఞాత (తెలుసుకునేవాడు) అని. అలాగే కర్మకు సంబంధించి కర్మ, కర్త, కరణం అంటూ మూడు అంశాలు (శ్లో.18). వీటిలో గుణాలననుసరించి మళ్ళీ భేదాలు.

**సాత్త్వికజ్ఞానం** – విభక్తంగా (వేర్వేరుగా) కనిపిస్తున్న వివిధభూతాల్లో ఏకత్వం గమనించడం, విభక్తంగాని అఖండమైన ఆత్మతత్త్వాన్ని ఏ జ్ఞానంతో చూడగలడో అలాంటి జ్ఞానం సాత్త్వికం (శ్లో. 20).

**రాజసజ్ఞానం –** ప్రతి శరీరమునందు భిన్నత్వం చూడడం. వేర్వేరు విశేషణాలను చూడడం రాజసజ్ఞానం (శ్లో. 21). సాధనదశలో కూడా **యో యో యాం యాం తనుం** (7–21) అన్నట్లు భగవంతుని తత్త్వంలో భిన్నత్వం చూడడం రాజసజ్ఞానం.

**తామసజ్ఞానం –** ఒకే అల్ప వస్తువునందు అదే సర్వస్వం అంటూ భావించడం, అహేతుకంగా (హేతుబద్ధం కాకుండా) వ్యవహరించడం, తత్త్వాన్ని గమనించకపోవడం తామసజ్ఞానం. ఉదా: దేహపరిమాణమే ఆత్మ, విగ్రహ పరిమాణమే దేవుడు, ఫలానా వాడే దేవుడు అని దానియందే ఆసక్తితో ఉండే అల్పమైన జ్ఞానం (శ్లో. 22).

ఇలాగే కర్మ కూడా మూడువిధాలు.

**సాత్త్విక కర్మ –** నిత్యకర్మను (కర్తవ్యంగా విధింపబడిన) అసంగుడై, రాగద్వేషాలు లేకుండా, ఫలాపేక్ష లేకుండా ఆచరిస్తే ఆ కర్మ సాత్త్వికమనబడుతుంది (శ్లో. 23). ఇదే కర్మయోగం కూడా. దీనివల్ల సాత్త్వికజ్ఞానం కలుగుతుంది.

**రాజసకర్మ –** అహంకారం (నేను అనే భావన)తో, కోరికలతో శ్రమపడుతూ ఆచరించే కర్మ రాజసకర్మ (శ్లో. 24). యజ్ఞయాగాదులు, శాస్త్రీయమైన కర్మలే కానీ కర్తృత్వభావంతో చేయబడేవి రాజసకర్మలు అనిపించుకుంటాయి.

**తామసకర్మ –** కర్మకు ఎలాంటి ఫలముంది, అనిష్టమా, అనిష్టమా అనిగానీ, దీని పర్యవసానం ఎలా ఉంటుందనిగానీ, దానివల్ల జరిగే నష్టంగానీ ఆలోచించక, తన సామర్థ్యాన్ని ఆలోచించక చేసే పని తామసమవుతుంది.

**కర్త మూడు విధాలు**

**సాత్త్విక కర్త –** కర్మలను అహం బుద్ధితో చేయకున్నా, ధృతి (పట్టుదల), ఉత్సాహంతో ఆచరిస్తూ, ఫలితం ఎలాగున్నా వికారం చెందనివాడు, సుఖదుఃఖాలను పొందనివాడు సాత్త్వికకర్త (శ్లో. 26). వైరాగ్యం అంటే నిస్పృహ, ఏడుపు మొహంతో పనిచేయడంకాదు. పట్టుదలతో, నేర్పుతో, ఉత్సాహంతో పనిచేస్తూ విరాగిగా ఉండవచ్చు.

**రాజసకర్త –** కర్మఫలంపై అనురాగంతో, లోభంతో (ఎలాగైనా పొందాలని), అవసరమైతే హింసకు పాల్పడుతూ, ఫలాన్నిబట్టి సుఖదుఃఖాలు పొందేవాడు రాజసకర్త (శ్లో. 27).

**తామసకర్త –** నిలకడలేనివాడు, సంస్కారహీనుడు, మొండిపట్టు, మోసం, ఏడుపు స్వభావం కలవాడు, పనులను దాటవేసేవాడు తామసకర్త (శ్లో. 28).

ఈవిధంగానే గుణాలనుబట్టి బుద్ధిలో మూడువిధాలు. ధృతిలో మూడువిధాలు. సుఖం మూడువిధాలు చెప్పబడ్డాయి. ఈ ప్రకరణాన్ని ముగిస్తూ ఒక ముఖ్యమైన శ్లోకం చెప్పబడింది.

**న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్త్రిభిర్గుణైః ॥ 40**

ఇదొక ముఖ్యమైన ప్రతిపాదన. ప్రకృతిలోని ప్రతి వస్తువూ (ప్రాణం ఉన్నదిగానీ, లేనిదిగానీ) ఈ మూడుగుణాలతో ప్రభావితమై ఉంటుంది. ఈ గుణాలు లేని వస్తువే లేదు అని భావం. రెండవ అధ్యాయంలో **నిస్త్రైగుణ్యో భవార్జున** (2-45) – వేదాలన్నీ (కర్మకాండ) మూడు గుణాలచుట్టూనే తిరుగుతుంటాయి. గుణాలకతీతుడిగా వెళ్లు అని మొదలుపెట్టి తరువాత పలుమార్లు ఇదే భావాన్ని చెప్పడం సాధనకోసం. మూడు గుణాలనూ అతిక్రమించేవాడికే ముక్తి. ఈ గుణాలను జ్ఞానంతోనే అతిక్రమించి, జ్ఞానంతోనే సంసార వృక్షాన్ని ఛేదించాలి. అట్టి జ్ఞానానికి కావాల్సిన పూర్వరంగం చిత్తశుద్ధి. అంటే మనస్సుయొక్క నిర్మలత్వం, నిశ్చలత్వం. ఈ చిత్తశుద్ధికి కారణం కర్మ. కావున ఎవరెవరు ఎలాంటి కర్మలు చేయాలి అనే కర్మవిభజన తర్వాతి శ్లోకాల్లో చెబుతున్నాడు.

**నాలుగు వర్ణాలు**

4వ అధ్యాయంలో **చాతుర్వర్ణ్యం మయాసృష్టం** (4-13) - గుణాలు, కర్మలు విభాగాన్ని బట్టి నాలుగు వర్ణాలను నేనే సృష్టించాను అని శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ అధ్యాయంలో శ్రీకృష్ణుడి మాట ఇలా ఉంది –

**బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥ 41**

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలకు వారి స్వభావంవల్ల పుట్టే గుణాలవల్ల కర్మలు విభజించబడ్డాయి అని తాత్పర్యం. ఏ వర్ణంవాడి

కర్మలు, ఏవిధంగా నిర్ణయింపబడ్డాయి అనే ముఖ్య విషయాన్ని ఈ శ్లోకం ప్రతిపాదిస్తున్నది.

**స్వభావ ప్రభవైః గుణైః** – 'స్వభావంవల్ల పుట్టిన గుణాలచేత' అన్నది ముఖ్యమైన వాక్యం. దీనికి మూడు విధాలుగా శ్రీశంకరులు అర్థం చెప్పారు.

1) **స్వభావం =** ప్రకృతి, మాయ, త్రిగుణాత్మకమైనది. దాని కారణంగా ప్రభవం = పుట్టినది, స్వభావ ప్రభవమైన గుణాలు. ప్రకృతి నుండి పుట్టిన గుణాలు అని అర్థం. స్వభావంవల్ల శౌర్యం, తేజస్సు మొదలైనవి కలవారు క్షత్రియులు. స్వభావంవల్ల శమం, దమం మొ॥ లక్షణాలు కలవారు బ్రాహ్మణులు ఇలా అన్వయించుకోవాలి.

2) **రెండో అర్థం** – వారి వారి స్వభావానికి (ప్రకృతికి) ప్రభవం (కారణం) అయిన గుణాలు. ఇక్కడ స్వభావమంటే ప్రకృతి లేదా మాయ అని అర్థం కాకుండా వ్యవహారంలో ఉన్న అర్థం గ్రహించారు. బ్రాహ్మణుడి స్వభావానికి సత్త్వగుణం ప్రభవం = కారణం. క్షత్రియుడి స్వభావానికి ప్రధానంగా రజస్సు, అప్రధానంగా సత్త్వం, తమస్సు ఇలా అన్వయించుకోవాలి.

3) **స్వభావం =** పూర్వజన్మలో చేసిన కర్మఫలం, ఈ జన్మలో ఫలమివ్వడానికి అభివ్యక్తమైన విధానం, దీనివల్ల పుట్టిన గుణాలు. అనగా ఇక్కడ జాతి ముఖ్యంకాదు, పూర్వజన్మకృత కర్మ ముఖ్యం.

నీలకంఠులు కూడా పై అర్థాలనే చెబుతూ ఈ క్రింద చెప్పిన మరికొన్ని విషయాలు వ్రాశారు.

**ద్రోణాదిషు బ్రాహ్మణేష్వపి శౌర్యాదికం, భరతాదిషు క్షత్రియేష్వపి శమాదికం దృష్టమ్ । తస్మాత్ యస్మిన్ కస్మిన్శ్చిత్ వర్ణే శమాదయో దృశ్యంతే స శూద్రోఽపి ఏతైః లక్షణైః బ్రాహ్మణ ఏవ జ్ఞాతవ్యః । యత్ర చ బ్రాహ్మణేఽపి శూద్ర ధర్మా దృశ్యంతే స శూద్ర ఏవ॥**

"ద్రోణుడు మొదలగువారు బ్రాహ్మణులైనా శౌర్యం మొదలైనవి ఉన్నాయి. భరతుడు (భాగవతంలోని జడభరతుడు) మొదలగువారు క్షత్రియులైనా శమం, దమం మొదలైనవి ఎక్కువ ఉన్నాయి. కావున ఏ వర్ణంలోని వ్యక్తిలో శమాది లక్షణాలు కనిపిస్తే ఆ వ్యక్తిని శూద్రుడైనా బ్రాహ్మణుడిగా పరిగణించాలి. ఎక్కడైతే బ్రాహ్మణుడిలో శూద్రధర్మాలు కనిపిస్తాయో అతడు శూద్రుడే".

నీలకంఠులు ఇంకా ఇలా వ్రాశారు – "అరణ్యపర్వంలో నహుషుడితో ధర్మరాజు చెప్పిన మాటలు – **సత్యం దానం క్షమాశీలం ఆనృశంస్యం తపో ఘృణా । దృశ్యంతే యత్ర నాగేంద్ర స బ్రాహ్మణ ఇతి స్మృతః ॥** (ఓ నాగేంద్రా! సత్యము, దానము, క్షమ,

శీలము, అహింస, తపస్సు, విరక్తి ఎవరిలో కనిపిస్తాయో అతడు బ్రాహ్మణుడు). ఇంకా వివరిస్తూ **యత్రైతత్ లక్ష్యతే సర్ప వృత్తం స బ్రాహ్మణస్స్మృతః । యత్రై తన్న భవేత్ సర్ప తం శూద్రమితి నిర్దిశేత్ ॥** (ఓ సర్పమా! ఈ గుణాలు ఎవనిలో కనిపిస్తాయో అతడే బ్రాహ్మణుడు. ఎక్కడ కనిపించవో అతణ్ణి శూద్రుడని నిర్దేశించాలి). అందువల్ల శమాదులు బ్రాహ్మణుడిలోగానీ, అబ్రాహ్మణుడిలోగానీ ఎవరిలోనైనా కనిపిస్తే అతన్నే బ్రాహ్మణుడని నిర్ధారించాలి".

నీలకంఠులు మరో విశ్లేషణ చేశారు. స్వభావంతో వచ్చిన ధర్మాలు వేరు, జాతిధర్మాలు వేరు. స్వభావంతో వచ్చిన ధర్మాలు వేదంలో, భగవద్గీతలో చెప్పినవి. జాతిధర్మాలు స్మృతులలో చెప్పినవి. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు ఈ ముగ్గురినీ ద్విజులంటారు. ముగ్గురికీ ఉపనయన సంస్కారముంది, ఉపనయనమనేది రెండవ జన్మ కావున ద్విజులన్నారు. వీరికి వేదం చదివే అధికారముంది.[1] పాఠం చెప్పే అధికారం మాత్రం బ్రాహ్మణుడికి. బ్రాహ్మణుడు దొరకని సందర్భంలో ఇతరులనుంచి బ్రాహ్మణుడు కూడా నేర్చుకోవచ్చు అని ఉపనిషత్తుల్లో కన్పిస్తుంది. రాజసూయం మొదలగు యాగాలు క్షత్రియుడే చేయాలి. ఇతరులు చేయకూడదు. ఇవన్నీ జాతిధర్మాలు. సమాజం సృష్టించుకున్నవి. స్వభావధర్మాలే వర్ణాలను నిర్ణయిస్తాయి అని ఒక అత్యాధునిక దృష్టికోణాన్ని ఆవిష్కరించారు నీలకంఠులు.

శ్లోకాలు పరిశీలిద్దాం. బ్రాహ్మణుడి స్వభావం సత్త్వగుణ ప్రధానం. ఇతనికి కర్మలు, శమము (మనోనిగ్రహం), దమము (బాహ్యేంద్రియ నిగ్రహం), తపః (ధ్యానయోగం), శౌచం, ఋజుత్వం, జ్ఞానం (వేదాంత వాక్యాల అర్థజ్ఞానం, బ్రహ్మనుగూర్చి పరోక్షజ్ఞానం), విజ్ఞానం = అదే పరోక్షజ్ఞానాన్ని అపరోక్షం చేసుకోవడం (అనుభవంలోకి తెచ్చుకోవడం), ఆస్తిక్యం = వేదప్రమాణాన్ని అంగీకరించే స్వభావం ఇవన్నీ బ్రాహ్మణుడికి సహజమైన లక్షణాలు, కర్మలు (శ్లో. 42).

క్షత్రియుడికి శౌర్యం, తేజస్సు (పరాక్రమం), ధృతి (ధైర్యం), దాక్ష్యం (దక్షత, నేర్పరితనం), యుద్ధంలో వెనుదిరగకపోవడం, దానం, ఈశ్వరభావం (ఇతరులను శాసించే స్వభావం – leadership qualities) ఇవన్నీ స్వభావంతో వచ్చిన గుణాలు (శ్లో. 43).

---

1. ద్విజులందరికీ (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) ఒకే సంస్కారమే. అందువల్ల పాండవులు ఏకచక్రపురంలో బ్రాహ్మణవేషాల్లో ఉన్నారు. తర్వాత అజ్ఞాతవాసంలో ధర్మరాజు కంకుభట్టు అనే బ్రాహ్మణుడివేషంలో విరాటుని కొలువులో ఉన్నాడు.

కృషి (వ్యవసాయం), గోరక్ష, వాణిజ్యం ఈ మూడూ వైశ్యుడి స్వభావగుణాలు (శ్లో.44). (ఈ రోజు తమనుతాము శూద్రులుగా భావించే వారంతా వైశ్యులు, ద్విజులు, వేదాధ్యయనానికి అర్హత ఉన్నవారు అని ఆనాటి సిద్ధాంతం. నేటి బ్రాహ్మణులు క్రమక్రమంగా వేదాధ్యయనానికి దూరమైనట్లుగా వీరందరూ కాలక్రమంలో తమ ధర్మాన్ని వదలివుంటారు.)

పరిచర్య చేయడం, ఇతరులు చెప్పిన పనులు చేయడం (స్వంతంగా క్రియాశీలత లేకపోవడం) శూద్రుడి స్వభావం.

ఎవరెవరి స్వభావానికి తగినట్లు వారు కర్మలు చేస్తుంటే సమాజశ్రేయస్సు దాన్ని దృష్టిలో ఉంచుకొని గీత స్వధర్మాన్ని ఆచరించడం పరమాత్మను అర్చించినట్లే అంటుంది (శ్లో. 46). తర్వాతి శ్లోకం కూడా స్వధర్మాన్ని గురించే.

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।**
**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47**

బాగా ఆచరింపగలిగే పరధర్మం కంటే కొంత లోపం వున్నా స్వధర్మమే ఆచరింపదగినది. స్వభావంవల్ల వచ్చిన కర్మచే మనిషి పాపాన్ని పొందదు అని తాత్పర్యం.

ఈ శ్లోకంలో స్వధర్మం, స్వభావం అని రెండు మాటలున్నాయి. స్వధర్మమంటే శాస్త్రం తనకు విధించిన ధర్మం. స్వభావం అంటే ప్రకృతి సహజంగా వచ్చిన గుణాలు. శూద్రుడిలో బ్రాహ్మణ, క్షత్రియ గుణాలున్నప్పుడు ఆ గుణాలకనుగుణంగా వర్తించవచ్చు అనే భావన వస్తుంది. ఆనాటి సమాజంలో బహుశా గుణాన్నిబట్టి వ్యక్తి వర్ణాన్ని నిర్దేశించే పద్ధతి ఉండవచ్చని తెలుస్తుంది. అందువల్లే కర్ణుడికి రాజ్యాభిషేకం చేసినపుడు మిగతా రాజులందరూ అంగీకరించారు. ఈ పద్ధతికి వైముఖ్యం కూడా ఉన్నట్లు మరికొన్ని కథలవల్ల తెలుస్తుంది. పై విషయాలవల్ల ఈ చర్చ ఈనాటిది కాదని స్పష్టమవుతుంది.

స్వకర్మలు అన్నపుడు మనుధర్మంలో చెప్పిన వేదాధ్యయనం లాంటివే గ్రహించాలిగానీ శమదమాదులు గ్రహించకూడదని నీలకంఠులు ఇక్కడ మరొక వివరణ ఇచ్చారు. అంటే శమదమాదులు అందరికీ ఉండవచ్చు. వేదాధ్యయనానికి నిషేధం ఉన్నా జ్ఞానప్రాప్తి, మోక్షాధికారం అందరికీ ఉంది. (ఈ పరిస్థితిని నేటి ఉదాహరణలో చెప్పాలంటే ఒక వ్యక్తికి కలెక్టరు కావడానికి అర్హత ఉందిగానీ ఫైల్ తయారుచేసే గుమాస్తా కావడానికి

వీల్లేదు అన్నట్లు ఉంది. కానీ ఈ నిషేధం గొప్ప సాంఘిక సంఘర్షణకు కారణమైంది).

స్వకర్మలు ఆచరించడంద్వారానే సిద్ధి అనే గీతావాక్యం 5000 సంవత్సరాల నాటిది. దీనిపై గుణాలనుబట్టి వర్ణం నిర్ణయించాలి అని ప్రాచీన సంప్రదాయంలో ఉన్న వ్యాఖ్యాతలే వివరించారు. సమాజాన్ని సంఘటితం చేయడమే ధర్మశాస్త్ర ఉద్దేశం. కాబట్టి ఈనాటి విలువలకు అనుగుణంగా పై శ్లోకానికి అర్థం గ్రహించాలి.

పై కర్మలన్నీ మూడు గుణాలవల్ల కలిగినవే. కానీ ఆత్మకు సంబంధించినవి కావు. ఇవి అవిద్యవల్ల ఆత్మకు సంబంధించినవాటిగా ఆరోపించబడుతున్నాయి. దీన్నే అధ్యాస అని పైన చెప్పుకున్నాం. ఈ అధ్యాస చేస్తున్నందువల్లనే క్షణకాలంకూడా కర్మ చేయకుండా మనిషి ఉండలేడు (శ్లో. 3-5). అవిద్య నశించిన తరువాత కర్మను విడువగలుగుతాడు. ఈ కర్మలు గుణాలకు సంబంధించినవే అని గ్రహించిన తరువాత వాటికి అతీతంగా ఉంటాడు అంటూ శ్రీ శంకరులు ఈ ప్రకరణాన్ని ముగించారు.

ఈ అధ్యాయం పరిచయంలో రెండు రకాల సంన్యాసం గూర్చి తెలుసుకున్నాం- జ్ఞాని సంన్యాసం, జ్ఞాని కావాలనే సంన్యాసం. ఇప్పుడు రాబోయే శ్లోకాలలో జ్ఞానియై సంన్యసించినవాని లక్షణాలు అలాంటి జ్ఞానఫలం చెబుతున్నాడు.

జ్ఞాని నైష్కర్మ్యసిద్ధిని పొందుతాడు (శ్లో. 49). కర్మలు లేకపోవడం నైష్కర్మ్యం. ఊరకే కర్మలను వదలడం నైష్కర్మ్యం కాదు. పై వివరించిన విధంగా బ్రహ్మయే తాను అనే జ్ఞానం కలవానికి కర్మలు వాటంతటవే తొలగిపోతాయి. అదే సిద్ధి, దీనినే సద్యోముక్తిలో ఉన్న స్థితి అని శ్రీశంకరులు వివరించారు. ఇది కర్మలవల్ల సిద్ధించేదికాదు, కేవలం ఆత్మజ్ఞానంవల్లనే పొందగలిగేది.

**బ్రహ్మ కావడానికి అర్హుడెవడు?**

సిద్ధిని పొందినవాడు బ్రహ్మను ఎలా పొందుతాడో, శ్రేష్ఠమైన జ్ఞానస్థితి ఏదో సంగ్రహంగా చెబుతాను అని (శ్లో. 50) అంటూ జ్ఞాని లక్షణాలను మళ్ళీ వివరించాడు శ్రీకృష్ణుడు. సిద్ధిని పొందినవాడు మళ్ళీ బ్రహ్మను పొందుతాడు అంటే అర్థమేమిటి? సద్యోముక్తి అనే స్థితికి పైన మరో స్థితి ఉన్నది అనే అర్థమొస్తుంది. అందుకై దీన్ని వ్యాఖ్యాతలు వివరిస్తూ సిద్ధి అనే పదానికి జ్ఞాననిష్ఠకు యోగ్యత అని అర్థం చెప్పారు. ఈ యోగ్యత పొందిన తరువాత పరమాత్మను పొందే ప్రకారాన్ని తెలుసుకొనుము అని అర్థం.

మనం ఏదైనా వస్తువును చూస్తే ఆ వస్తువుయొక్క జ్ఞానం మనకు కలుగుతుంది. అంటే మన జ్ఞానంలో అది విషయమవుతుంది. ఆత్మ అలా ఇంద్రియాలచే తెలియదగింది కాదు. పైగా ఇంద్రియాలనే ప్రకాశింపచేసేది. అది జ్ఞానస్వరూపమే. విషయాన్ని తెలుసుకోవడానికి వెనుకవుండే తెలివే దాని తత్త్వం.

దీన్ని శ్రీశంకరులు ఇంకా ఇలా వివరించారు. ఆత్మ అత్యంత నిర్మలం, స్వచ్ఛమైనది. బుద్ధి కూడా ఆత్మతో సమంగా నిర్మలంగా తయారుచేసుకోవడం శక్యమే (శమదమాది సాధనవల్ల, రాగద్వేషాలను త్యజించడంవల్ల, గుణాల ప్రభావానికి లోనుగాకుండా వుండడంవల్ల) బుద్ధి ఒక అద్దంలాంటిదని వివరిస్తారు. అద్దం స్వంతంగా ప్రకాశించదు. కాంతి పడినప్పుడే ఆ కాంతిని ప్రతిబింబిస్తుంది. అంతఃకరణమలాంటిదే. అలా ప్రతిఫలించినపుడు బుద్ధి ఆ చైతన్యంయొక్క ఆభాసగా కనిపిస్తుంది. బుద్ధిలాగానే కనిపించేది మనస్సు, ఆ మనస్సుతో సమానంగా స్వయంగా జ్ఞానం వున్నవాటిలాగా కనిపించేవి ఇంద్రియాలు. ఇంద్రియాల సంబంధం వల్ల దేహం చైతన్యవంతంగా కనిపిస్తుంది. అందువల్ల లౌకికులు (చార్వాకులు) దేహాన్నే ఆత్మ అని అనుకుంటారు. ఇంద్రియాలే ఆత్మ అని మరికొందరు అనుకుంటారు. మనస్సే ఆత్మ అని కొందరు (తార్కికులు) భావిస్తారు. వీటన్నిటినీ భాసింపచేసేది ఆత్మచైతన్యమే. ఆత్మ స్వయంప్రకాశము, మిగతా వస్తువుల జ్ఞానాలలాగా బుద్ధిచే తెలుసుకోదగింది కాదు. మరెలా తెలుసుకోవాలంటే మనం వేనినైతే ఆత్మకు సంబంధించినవని అనుకుంటామో వాటిని తొలగించుకోవడంవల్ల.

మొదట దేహమే ఆత్మ అనే భావన తొలగించుకోవడం.

ఇంద్రియాలే ఆత్మ అనే భావన తొలగించుకోవడం.

మనస్సు / బుద్ధియే ఆత్మ అనే భావన తొలగించుకోవడం.

ఇవన్నీ తొలగిపోయిన తర్వాత శుద్ధచైతన్యమాత్రంగా, జ్ఞానస్వరూపంగా మిగిలేదే ఆత్మ.

ఈ ఆత్మనిష్ఠను సాధించడమెలా? అని గత అధ్యాయాల్లో చెప్పిన విషయాలనే సంగ్రహంగా చెబుతున్నాడు (శ్లో. 51 నుండి 53).

- విశుద్ధమైన అంతఃకరణం కలిగివుండాలి (వేదాంత శ్రవణాదులవల్ల పరోక్షజ్ఞానం కలిగివుండాలి).

- **యుక్తః** – యోగంతో కూడివుండాలి.
- ఆత్మనియంత్రణ – దేహేంద్రియాదులను వశంలో కలిగివుండాలి.
- ఇంద్రియ విషయాలపై వైరాగ్యం – యోగశాస్త్రంలో చెప్పిన ప్రత్యాహారం, అనగా ఇంద్రియాలను వస్తువులనుండి వెనక్కు మళ్ళించడం.
- రాగద్వేషాలు వదలివేయడం (శ్లో. 51)
- **వివిక్తసేవీ** – నిర్జనప్రదేశంలో ఈ అభ్యాసం చేసేవాడు.
- **లఘ్వాశీ** – తక్కువ ఆహారాన్ని గ్రహించేవాడు. మితాహారం.
- వాక్కు, మనస్సు, శరీరం ఈ మూడింటినీ అదుపులో ఉంచుకోవాలి.
- ధ్యానయోగంలో నిరంతరం ఉండాలి.
- వైరాగ్యం కలిగివుండాలి (శ్లో. 52).
- చిత్తవృత్తులైన అహంకారం, బలం (జ్ఞానబలం), దర్పం (నేనింత సామర్థ్యంగల యోగిని అనే దర్పం), కోరిక, క్రోధం, ధనసంచయం, మమకారం లేకుండా శాంతుడిగా ఉండాలి (శ్లో. 53).

పైవిధంగా ఉన్నవాడు **బ్రహ్మభూయాయ కల్పతే** – బ్రహ్మకావడానికి అర్హుడు.

"అలాంటివాడు జ్ఞానరూపమైన భక్తితో నన్ను తెలుసుకొని, నా తత్త్వాన్ని గ్రహించి నాలోనే ప్రవేశిస్తాడు" (శ్లో. 55). దేహపతనం తర్వాత కేవలం శుద్ధచైతన్యంగా ఉంటాడు. పాత్ర అనే ఉపాధి తొలగిన తర్వాత పాత్రలోని ఆకాశం మహాకాశంగా మిగిలినట్లు అని అర్థం.

మొత్తం భగవద్గీతా ప్రసంగమంతా అర్జునుడు తన క్షత్రియధర్మాన్ని వదలివేయడంతో వచ్చింది. అర్జునుడిని నిమిత్తంగా తీసుకొని అనేక విషయాలను శ్రీకృష్ణుడు చెప్పాడు. మళ్ళీ నేరుగా అర్జునుడితో ఇలా అన్నాడు – "నేను యుద్ధం చేయను అని ఒకవేళ నీవనుకున్నా నీ ప్రయత్నం వృథా అవుతుంది. ఎందుకంటే నీ ప్రకృతి నిన్ను నీ పనిలో నియోగిస్తుంది". క్షత్రియుడు రజోగుణ స్వభావుడు. అతనికి కర్మయోగం తర్వాతనే జ్ఞానయోగానికి అవకాశముంది. అందువల్ల ప్రకృతియే అతణ్ణి బలవంతంగా ఆ పని చేయిస్తుంది అని శ్రీకృష్ణుడి భావన. అదే ప్రకృతిలోని నియామకశక్తి. ఆ నియామకశక్తినే వర్ణిస్తూ ఒక ప్రసిద్ధ శ్లోకం.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽ ర్జున తిష్ఠతి ।**
**భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥ 61**

జగత్తును నియమించే ఈశ్వరుడు అన్నిప్రాణుల హృదయాల్లో ఉన్నాడు. అన్ని ప్రాణులను కొయ్యయంత్రంపై బొమ్మలవలె త్రిప్పుతుంటాడు అని అర్థం. **మాయయా** = మాయచేత, ప్రకృతిలోని గుణాలచేత ఆవిధంగా మనిషిని భ్రమింపచేస్తుంటాడు అని అర్థం. అర్జున అనే పదానికి శుద్ధమైన అంతఃకరణం కలవాడు అని ఆ కాలంలో ప్రసిద్ధమైన అర్థం. ఈ శ్లోకంలో 'ఓ శుద్ధమైన అంతఃకరణం గలవాడా!' అనడంలో నీవు అహంకారాన్ని ఎన్నడూ పొందవు, ఈశ్వరార్పణబుద్ధితో స్వకర్మను చేస్తావు అని గుర్తు చేయడమైనది.

ఇదంతా కర్మయోగం, ఈశ్వరార్పణ బుద్ధితో కర్మచేయడం. దీనివల్ల ఫలమేమిటి? అని ఒక ప్రసిద్ధమైన శ్లోకంలో చెబుతున్నాడు –

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 66**

సమస్తమైన ధర్మాలను వదలివేసి నన్ను శరణుజొచ్చుము. నేను నిన్ను అన్ని పాపాలనుండి విముక్తుణ్ణి చేస్తాను అని తాత్పర్యం.

ఇది శ్రీకృష్ణుడనే అవతారమూర్తి అర్జునుడనే వ్యక్తికి చెప్పిన మాట కాదు. నేను అనేది శుద్ధపరబ్రహ్మ. అన్ని ధర్మాలను వదలడం అంటే మనిషికి విధింపబడిన వర్ణాశ్రమ ధర్మాలు (ఈనాడు మనం అర్థం చేసుకునేట్లుగా నీ మతం వదలి, నా మతంలోకి రా! అని భావం కాదు). ధర్మమంటే ఆ కాలంలో వర్ణాన్ని బట్టి, బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం మొ॥ ఆశ్రమాలనుబట్టి వ్యక్తికి విధింపబడిన ధర్మాలు. వీటిని వదలడమంటే మూడు గుణాలవల్ల తన స్వభావంతో ఏయే కర్మలు చేస్తున్నాడో వాటికన్నింటికీ అతీతంగా వెళ్ళి, గుణాతీతుడిగా ఉండి కర్మలను కేవలం దృశ్యంగా చూస్తూ లేదా అన్ని కర్మల ఫలాలను సంన్యసించి అని అర్థం.

**మాం =** నన్ను అంటే శ్రీకృష్ణుడి మతం పుచ్చుకొమ్మని కాదు. అందరికీ ఒకే ఆత్మగా అన్ని భూతాలలో ఉండే పరబ్రహ్మను తెలుసుకో! అని అర్థం.

శరణుజొచ్చుము అంటే అలాంటి పరబ్రహ్మజ్ఞానమే నాకు పరమలక్ష్యము. అదే నాకు అన్ని బంధాలనుండి ముక్తినిస్తుంది అని తెలుసుకో అని అర్థం.

**మోక్షయిష్యామి –** ముక్తినిస్తాను. అంటే వైకుంఠానికో, కైలాసానికో పంపుతాను అని అర్థం కాదు. జ్ఞానంవల్లనే ధర్మం, అధర్మం (అన్నిరకాల కర్మలఫలం) నుండి విముక్తి అని గత అధ్యాయాల్లో చూశాం. **యోగః కర్మసు కౌశలమ్ –** కర్మఫలం అంటకుండా కర్మలు చేయడమే కౌశలం అనే అర్థం చాలాచోట్ల చెప్పుకున్నాం.

5వ అధ్యాయంలో **నాదత్తే కస్యచిత్ పాపం –** (5–15) ఎవరి పాపాలను స్వీకరించడు, ఎవరి పుణ్యాన్ని స్వీకరించడు అని చెప్పబడింది కదా! ఇక్కడ 'అన్ని పాపాలూ తొలగిస్తాను' అంటున్నాడేమిటి? 18వ అధ్యాయం వరకూ చదివిన తర్వాత మనకీ సందేహం రాకూడదు. పరమాత్మ అక్కడా, ఇక్కడా కూడా కర్మలకు, కర్మఫలాలకు సంబంధంలేనివాడు. ఇక్కడకూడా జ్ఞానం కలిగించడంద్వారా నీకు కర్మఫలం అంటకుండా చేస్తాను అంటున్నాడేగానీ నీవు పాపాలు చేస్తూండు, నేను వాటిని క్షమిస్తూంటాను, అని అర్థం కాదు. అందుకే **మోక్షయిష్యామి = స్వాత్మభావ ప్రకాశీకరణేన –** 'నీ యథార్థ స్వరూపాన్ని నీకు ప్రకాశింపచేయడంద్వారా' అని శ్రీశంకరులు అర్థం వ్రాశారు. మనల్ని మనం తెలుసుకోవడమే మోక్షం అని అర్థం.

**రెండే మార్గాలు**

భగవద్గీత ప్రారంభం నుండి జ్ఞాననిష్ఠ, కర్మనిష్ఠ అని రెండు మార్గాలు తెలుపుతూ వచ్చారు. **లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా** (3–3) – లోకంలో రెండే మార్గాలు, జ్ఞానయోగం, కర్మయోగం అని శ్రీకృష్ణుడు చెప్పాడు. ప్రవృత్తి ధర్మంలో ఉండేవారికి కర్మయోగం, నివృత్తి ధర్మం (సంన్యాసధర్మం)లో ఉండేవారికి జ్ఞానయోగం. మిగతా చెప్పిన మార్గాలన్నీ (ధ్యానయోగం, భక్తియోగం మొ॥) కర్మయోగంలో అంతర్భావమయ్యేవే. అనగా కర్మయోగంలోకి వచ్చేవే. మనుష్యునిచేత ఆచరించదగినవన్నీ కర్మలకోవకే చెందుతాయి. ధ్యానం నేను చేస్తున్నాను అనే భావనతో బుద్ధిపూర్వకంగా ఆచరించే కర్మ. అలాగే భక్తియోగం. భగవంతుణ్ణి నేను ఆరాధిస్తున్నాను అని చేసే కర్మ. ఇలా రెండే మార్గాలు చెప్పబడ్డాయి. ఈ రెండు మార్గాలను అనుసరించేవారు జ్ఞానయోగులు, కర్మయోగులు. వీరినే men of action and men of contemplation అని వేదాంతశాస్త్రం అధ్యయనం చేసిన W.B. Yeats అనే ఆంగ్లకవి అన్నాడు.

కర్మయోగం, జ్ఞానయోగం ఈ రెంటినీ కలపవచ్చా అని ఆ రోజుల్లో పెద్ద చర్చ వుండేది. అది ప్రస్తుత పాఠకుడికి అనవసరమే. అయినా భగవద్గీతలో శ్రీశంకరులు అక్కడక్కడా విస్తారమైన చర్చ చేశారు. 18వ అధ్యాయంలో **సర్వధర్మాన్ పరిత్యజ్య** అనే శ్లోకానికి అనుబంధంగా విపులంగా చర్చించారు. దాని సారాంశమిది –

- కర్మయోగం – చిత్తశుద్ధిని కలిగిస్తుంది. అంటే నిర్మలత్వం ఫలం. సాక్షాత్తుగా జ్ఞానాన్నివ్వదు (అద్దాన్ని శుభ్రపరిచినట్లు).
- ధ్యానయోగం – పతంజలియోగం మొ॥ మనస్సుకు నిశ్చలత్వమిస్తుంది. దీనివల్ల కూడా సాక్షాత్తూ జ్ఞానం కలగదు.
- శ్రవణ, మనన, నిధిధ్యాసనలు – మనస్సులో నిశ్చలత్వం, నిర్మలత్వం (అంటే కర్మయోగం, ధ్యానయోగాల ఫలితంగా) ఉన్నప్పుడు జ్ఞానం కలిగిస్తాయి.
- జ్ఞానం కలగడమంటే కొత్తగా ఏదో వచ్చేది కాదు. ఉన్న అజ్ఞానం తొలగిపోవడమే. మన స్వరూపం మనకు తెలియడం. నేను కర్త, క్రియ, ఫలాలు లేని కేవలుడు, అద్వితీయమైన చైతన్యం అని తెలియడం.
- జ్ఞానం సంన్యాసికే కాదు సంసారికి కూడా. మనుష్యమాత్రుడైన ఎవరికైనా (జాతి, వర్ణ భేదం లేకుండా) కలగవచ్చు.
- సంసారి / గృహస్థుడు జ్ఞాని యైనపుడు ఆ గృహస్థాశ్రమానికి విధించిన కర్మలు చేయాలి. అతనికి కర్మఫలం ఉండదు. అయినా లోకసంగ్రహం కోసం, లోకానికి ఆదర్శప్రాయంగా ఉండడంకోసం చేస్తాడు. అతని కర్మ కేవలం చేష్టామాత్రం. కర్మాభాసమంటారు. జనకమహారాజు మిగతా రాజర్షులు ఇందుకు ఉదాహరణలు.
- ఈ ఉదాహరణలో జ్ఞానం, కర్మ రెండూ కలిసి ఉన్నాయి కదా అనే సందేహం రావచ్చు. కానీ అది సరికాదు. ఇక్కడ కర్మ ఉందిగానీ కర్త లేడు. కోరిక లేదు, కర్తృత్వభావన లేదు. కావున కర్మాభాసయే. కర్మ అంటే కర్త ఉండాలి. కర్త ఉంటే ఫలముంటుంది. ఫలమంటే పునర్జన్మ.
- అన్ని కర్మలూ గుణాలకు సంబంధించినవి. గుణాలు అనగా ప్రకృతి. దీనికి అతీతమైనది బ్రహ్మ. కాబట్టి జ్ఞానమార్గం, కర్మమార్గం రెండూ కలిపి చేయడానికి వీల్లేదు. జ్ఞానం కలిగి కర్మఫలం లేకుండా కర్మలు చేస్తూండవచ్చు.

### కర్మయోగం సాధనం, జ్ఞానం సాధ్యం

జ్ఞానం కర్మతో సాధించబడేది కాదని ఒకవైపు అంటూనే కర్మను సాధనమని ఎలా అంటున్నాం. అంటే కర్మ కేవలం మొదటిమెట్టు. ఇదొక ఉపకారకం. వట్టి కర్మవల్ల జ్ఞానంరాదు. ఆత్మవిచారంవల్లనే జ్ఞానం. భూమి దున్నినవెంటనే పంట పండదు. విత్తనం నాటితేనే పంట పండుతుంది. అద్దం శుభ్రం చేయగానే ప్రకాశించదు. దానిపై

కాంతి పడాలి. ఆత్మవిచారమే జ్ఞానదీపం. ఈ వాదం విస్తారంగా అక్కడక్కడా మన భాష్యాల్లో కన్పిస్తుంది.

**జ్ఞానయజ్ఞం**

భగవద్గీతలో ధర్మాన్ని గూర్చి, భగవత్స్వరూపాన్ని గూర్చి, ఆత్మస్వరూపాన్ని గూర్చి చెప్పదలచిన సిద్ధాంత విషయాలు ముగిశాయి. శాస్త్ర సంప్రదాయం ప్రకారం ఫలశ్రుతి, అనగా ఇది చదవడంవల్ల వచ్చే లాభం గూర్చి చివరి శ్లోకాలు.

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥ 67**

ఈ శాస్త్రాన్ని **అతపస్కాయ** – తపస్సు లేనివాడికిగానీ, **అభక్తాయ** – భక్తి లేనివాడికి గానీ, తెలుసుకోవాలనే శ్రద్ధ లేనివాడికిగానీ, దేవుణ్ణి ద్వేషించేవాడికిగానీ ఎప్పుడేగాని చెప్పకూడదు అని భావం. తపస్సు అంటే వేదాంతవాక్యాల విచారణ చేయడం అని పైన గ్రహించాం. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు ఈ శాస్త్రం వ్యర్థమని భావం.

ఇంకా చెబుతూ "మన ఇద్దరియొక్క ధర్మసమ్మతమైన ఈ సంవాదాన్ని ఎవడు అధ్యయనం చేస్తాడో (శ్రద్ధతో తెలుసుకుంటాడో) అతడు నా గురించి, జ్ఞానయజ్ఞం చేసినవాడని నా నిశ్చితాభిప్రాయం" అంటాడు. గీతను తెలుసుకోవడం జ్ఞానయజ్ఞం.

వేదంలో చెప్పిన రెండురకాల ధర్మాలను చెప్పడం గీత ఉద్దేశం. శంకరుల భాష్యం ప్రారంభంలో వైదికధర్మం రెండువిధాలు. ప్రవృత్తిధర్మం, నివృత్తిధర్మం అని చెప్పారు. జ్ఞాని, కర్మయోగి వీరిద్దరూ లోకానికి అవసరమే. ఒకరిది అత్యున్నతమైన జ్ఞానమార్గం, ఏ కొద్దిమందికో లభించేది. సమాజంలో మిగతా అందరికీ ఆదర్శప్రాయమైంది రెండోమార్గం. ధర్మం ప్రకారం కర్మలు ఆచరించడం, కర్మయోగంగా కర్మను ఆచరించటం.

అర్జునుడికికూడా తన స్వభావసిద్ధమైన క్షత్రియధర్మాన్ని అనుసరించడంలో కలిగిన మోహం తొలగిపోవడం, సంజయుడు కృష్ణార్జునుల సంవాదాన్ని ప్రశంసించడంతో గీతాశాస్త్రం ముగుస్తుంది.

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥ 78**

"యోగేశ్వరుడైన కృష్ణుడు (అన్ని యోగాలకు ఈశ్వరుడు, గీతలో ఉదహరించిన అన్ని యోగాలను సిద్ధింపచేయగల శక్తిగలవాడు) ఎక్కడ ఉంటాడో, ధనుర్ధరుడైన పార్థుడు ఎక్కడ ఉంటాడో అక్కడ విజయం, ఐశ్వర్యం, ధర్మం ఉంటాయి అని నా

అభిప్రాయం” అంటూ సంజయుడు చక్రవర్తియైన ధృతరాష్ట్రుడితో అతనికి అప్రియమైన మాటను ధైర్యంగా చెబుతున్నాడు. పార్థుడు అనగా పృథివీ తనయుడు. ఇతడే నరుడు. ‘అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని’ అని ప్రారంభంలో చెప్పినట్లు మనందరం అర్జునుడి స్థానంలోనివారమే. అవివేకంచేత మోహంలో ఉన్న అర్జునుడికి ఆత్మ, అనాత్మ వివేకం చేసి జీవబ్రహ్మల స్వరూపం నిరూపించి, బ్రహ్మ తప్ప మరొకటి లేదని తెలపడం, తన తత్త్వం బ్రహ్మతత్త్వమే అనే జ్ఞానం కలిగించి కర్మయోగిగా మార్చడం శ్రీకృష్ణుడు చేసిన పని. కర్మయోగమే ప్రవృత్తిధర్మంలో ఉన్న మనందరికీ ఆదర్శం.

**ఇమం రాజర్షయో విదుః –** అని 4వ అధ్యాయ ప్రారంభంలో చెప్పినట్లు ఇది రాజులకు, ఋషులకు, సమానంగా చెప్పిన ధర్మం. రాజులు, ఋషులు, ఇద్దరూ ఇప్పుడు లేరుగానీ, వాటికి సమాన వ్యవస్థలు ప్రతి సమాజంలో ఎప్పటికీ ఉంటాయి. రాజ్యవ్యవస్థ, దాన్ని సరైన మార్గంలో నడపాల్సిన యంత్రాంగం, లౌకికస్థాయిలో ఈ రెండూ ఎప్పటికీ ఉండేవే. ధర్మం తెలిసిన పాలకులు, రాగద్వేషాలు లేని శమదమాదులు కలిగిన మేధావులు, సదాలోచన చెప్పి సన్మార్గంలో ప్రవర్తింపచేసే మంత్రి / గురువు ఉండడం సమాజంలోని ప్రజల అదృష్టం.

పరమార్థస్థాయిలో బ్రహ్మ అనే నిత్యపదార్థం కోసం అన్వేషించే సాధకులు మనదేశంలోనే కాదు ప్రపంచమంతా కనిపిస్తారు. వారెంతో ప్రీతితో భగవద్గీతను చదువుతున్నారు. భగవద్గీతలో చెప్పిన సిద్ధాంతం మనకేగాక జగత్తులోని మానవమాత్రులందరికీ అన్వయించేది. నిష్కామకర్మ, భగవదర్పణబుద్ధితో చేసే కర్మయోగం అనేవి అన్ని దేశాల్లో అన్ని కాలాలకూ అన్వయించేవే. సాధనమార్గంలో ఉన్నవాళ్లకు సాధనారహస్యాల్ని తెలపడం, కర్మమార్గంలో ఉన్నవారికి కర్మలు ఎలా ఆచరించాలో తెలపడం, సాధకుడైనా, కర్మయోగి అయినా అతని అంతఃకరణంలో మార్పు తేవడం, మనస్సులోని మాలిన్యాన్ని కడిగి చిత్తశుద్ధిని కలిగించడం తదనంతరం ప్రవృత్తి, నివృత్తి మార్గాలను బోధించడం, ఈ గ్రంథం లక్ష్యం. గ్రంథాన్ని చదవడంవల్ల ఆ లక్ష్యాన్ని పొందడమే ఫలం.

॥ ఓం తత్ సత్ ॥

॥ సర్వం శ్రీకృష్ణార్పణమస్తు ॥

❖ ❖ ❖